ఈనాడు

విజయవాడ 12-5-2025 సోమవారం సిటీ సంపుటి 51 . సంచిక 272 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



కుమారుడి భౌతికకాయం వద్ద విలపిస్తున్న తండ్రి శ్రీరామ్‌నాయక్, తల్లి జ్యోతిబాయి

అమరవీరుడికి కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో జవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు
- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ నివాళులు
- ప్రభుత్వం తరఫున 5 ఎకరాల పొలం, రూ.50 లక్షలు, ఇంటి స్థలం, తండ్రికి ఉద్యోగం
- వ్యక్తిగతంగా పవన్ కల్యాణ్ రూ.25 లక్షల సాయం ప్రకటన

ఈనాడు, అనంతపురం - న్యూస్‌టుడే, గోరంట్ల

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని కశ్మీర్‌లో వీరమరణం పొందిన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన అగ్నివీర్ మురళీనాయక్‌కు ప్రజలు కన్నీటితో వీడ్కోలు పలికారు. తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థుల శోకసంద్రం మధ్య సైనిక లాంఛనాలతో ఆదివారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కళ్లితండాకు చేరుకుని మురళీనాయక్‌కు నివాళులు అర్పించారు. ఆయన తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మురళీనాయక్ చిన్నప్పటి నుంచే సైన్యంలో చేరతానని చెప్పేవాడని, జాతీయ జెండా కప్పుకొనే చనిపోతానని పదేపదే పేర్కొనేవాడని స్నేహితులు గుర్తు చేసుకున్నారు. అమరవీరుడికి నివాళి (మిగతా 8లో)



మురళీనాయక్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, ఎంపీ పార్థసారథి

సైనిక సత్తా చాటాం

- సరిహద్దుల్లోనే కాదు.. రావల్పిండి వరకు వినిపించాం
- సిందూరం తుడిచేసినవారిని శిక్షించాం
- ఆపరేషన్ సిందూర్‌పై రాజ్‌నాథ్
- యూపీలో బ్రహ్మోస్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించిన రక్షణమంత్రి
- అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించాం: వాయుసేన
- పాక్ యుద్ధ విమానాలను నేలకూల్చాం
- కీలక యుద్ధ స్థావరాలను పేల్చేశాం
- కరాచీ రేవుపైనా గురిపెట్టాం
- రక్షణ శాఖ వెల్లడి
- సరిహద్దుల్లో ప్రశాంతత.. నేడు డీజీఎంవోల చర్చలు





వహా సే గోలీ చలేగీ తో.. యహా సే గోలా చలేగా

వహా సే గోలీ చలేగీ తో.. యహా సే గోలా చలేగా. ఇది మన ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన మాట. ఆపరేషన్ సిందూర్‌లో ప్రధాని నరేంద్రమోదీ ఈ మేరకు సైన్యానికి ఆదేశమిచ్చారు. పాకిస్థాన్ తూటాలకు ఫిరంగులతో సమాధానం ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. పాకిస్థాన్ ప్రతీ చర్యకు భారత్ నుంచి బలమైన ప్రతిస్పందన ఉండాలని సాయుధ దళాలకు సూచించారు. 'పాక్‌లో ఏ ప్రాంతం కూడా ఉగ్రవాదులకు సురక్షితం కాదని తెలిసేలా చేయాలి. నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు, అణ్వాయుధాల ముప్పు వంటివి వారిని రక్షించలేవని చెప్పాలి. పాక్‌కు జవాబు భారీగా, గట్టిగా ఉండాలి' అని ఆయన ఒకదశలో స్పష్టంగా చెప్పారు.

దిల్లీ: ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం తన పరాక్రమాన్ని ప్రదర్శించిందని, పాక్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండిలోనూ గర్జించిందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి ద్వారా అనేక కుటుంబాల సిందూరాన్ని తుడిచేసినవారిని సైన్యం తగిన రీతిలో శిక్షించిందని చెప్పారు. ఇది కేవలం సైనిక చర్యే కాదని, ఉగ్రవాదంపై పోరులో భారత రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి నిదర్శనమని చెప్పారు. ఉగ్రవాదులతోపాటు భారత వ్యతిరేక శక్తులపై మన సైన్యం ప్రతీకారం తీర్చుకుందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో సూపర్‌సోనిక్ బ్రహ్మోస్ ఉత్పత్తి, పరీక్షా కేంద్రాన్ని ఆదివారం ఆయన దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించి ప్రసంగించారు. మరోవైపు సైనికాధికారులు, వైమానిక దళాధికారులు విలేకరులతో మాట్లాడుతూ- పోరులో పాక్‌కు చావుదెబ్బ కొట్టామని, భారీనష్టం కలిగించామని విడిగా ప్రకటించారు. సరిహద్దుల్లో శాంతి నెలకొనడం ఆదివారం పెద్ద ఊరట.



విలేకరులతో మాట్లాడుతున్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘయ్. చిత్రంలో ఎయిర్ మార్షల్ ఎ.కె.భారతి, వైస్ అడ్మిరల్ ఎ.ఎన్.ప్రమోద్

పాక్ స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నాం

"ఉగ్రశక్తులకు భారత్ దీటుగా బదులిస్తుంది. ఉగ్రవాదంపై పోరులో మనకున్న దృఢ సంకల్పంతోపాటు మన సైనిక శక్తిసామర్థ్యాలను ఈ ఆపరేషన్ చాటిచెప్పింది. పహల్గాం బాధితులకు న్యాయం చేకూరింది. పాక్ ప్రజలపై భారత్ దాడి చేయలేదు. అక్కడి ఉగ్ర స్థావరాలను నాశనం చేయడమే ధ్యేయంగా ఆపరేషన్‌ను చేపట్టాం. దాయాది మాత్రం భారత (మిగతా 13లో)

ఉపాధ్యాయుల బదిలీలకు సర్వం సిద్ధం

- ఈ నెల 15 నుంచి ప్రక్రియ చేపట్టేందుకు ప్రణాళిక
- సర్వీసుకు ప్రామాణిక తేదీ మే 31
- హైకోర్టు ఆదేశాలతో అంధ టీచర్లకు మినహాయింపు



ఈనాడు - అమరావతి

ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణ, బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. రాష్ట్రంలో బదిలీల చట్టం ప్రకారం మొదటిసారి ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ కొంతమంది అంధ ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించగా, స్టేటస్‌కో విధించింది. దీంతో ఆ పోస్టులను మినహాయించి, బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. ఐచ్ఛికాలు పెట్టుకునేందుకు మాత్రం వారికి అవకాశం కల్పిస్తారు. కోర్టు తీర్పునకు లోబడి ఆ తర్వాత అంధ ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించనుంది. విడాకులు తీసుకున్న వారికి బదిలీల్లో ప్రాధాన్య పాయింట్లు ఇవ్వలేదని మరికొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై ఇంతవరకు ఎలాంటి ఆదేశాలూ రాలేదు. మొత్తంగా బదిలీల ప్రక్రియ ఈ నెల 15 నుంచి చేపట్టాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. మొదట ప్రధానోపాధ్యాయులకు బదిలీలు చేస్తారు. దాంతో ఖాళీ అయిన స్థానాలు, కొత్తగా అవసరమయ్యే వాటిల్లో స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తారు. తర్వాత మిగతా ప్రక్రియ ఉంటుంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల అవసరాల మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు (మిగతా 13లో)

ఖాళీల నోటిఫికేషన్ ఇలా..

- మే 31 నాటికి పదవీ విరమణ చేసిన పోస్టులతో సహా ఖాళీలను భర్తీకి తీసుకుంటారు.
- తప్పనిసరిగా బదిలీ అయ్యే స్థానాలు.
- రేషనలైజేషన్‌తో వచ్చే ఖాళీలు.
- ఏడాది అంతకుమించి అనధికారికంగా గైర్హాజరు అయిన టీచర్ల స్థానాలు.
- ఉన్నత చదువుల కోసం టీచర్లు సెలవులు తీసుకుంటే వాటిని ఖాళీగా చూపుతారు.
- బదిలీల కౌన్సెలింగ్ వల్ల వచ్చే వాటిని ఖాళీగా చూపుతారు.
- ఆయా జిల్లాల్లోని మొత్తం ఖాళీలను అవసరాల మేరకు మండలాలకు సర్దుబాటు చేస్తారు. ఉదాహరణకు ఒక జిల్లాలో 5 వేల పోస్టులు ఉండి.. 4,500 మంది పనిచేస్తుంటే బదిలీల్లో 4,500, దీనికి అదనంగా డీఎస్సీ పోస్టులు కలిపి చూపుతారు.

నామినేటెడ్ పోస్టుల నజరానా

- 22 కార్పొరేషన్లు, సంస్థలకు ఛైర్మన్ల నియామకం
- తెదేపాకు 16, జనసేనకు 3, భాజపాకు 1, అమరావతి ఐకాసకు 2
- టికెట్లు త్యాగం చేసిన వారికి, పార్టీ విధేయులకు ప్రాధాన్యం



రాయపాటి శైలజ
మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్



ఎం.సుగుణమ్మ
గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్



కేఎస్ జవహర్
ఎస్సీ కమిషన్ ఛైర్మన్



ఆలపాటి సురేశ్
ప్రెస్ అకాడమీ ఛైర్మన్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం మరో విడత నామినేటెడ్ పదవులను ఆదివారం భర్తీ చేసింది. ఎస్సీ కమిషన్, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్, ఏపీ ప్రెస్ అకాడమీ, నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్, ఏపీ ఎన్‌ఆర్‌టీ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సహకార సంస్థ సహా మొత్తం 22 కార్పొరేషన్లు, కమిషన్‌లకు ఛైర్మన్‌లను నియమించింది. తెదేపా నుంచి 16 మందికి, జనసేన నుంచి ముగ్గురికి, భాజపా నుంచి ఒకరికి, అమరావతి ఐకాస నుంచి ఇద్దరికి అవకాశం కల్పించింది. వివిధ రాజకీయ సమీకరణాల రీత్యా గత సార్వత్రిక ఎన్నికల్లో టికెట్లు ఇవ్వలేని వారికి, కూటమి పొత్తులో భాగంగా (మిగతా 8లో)

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

ఇంజినీరింగ్‌లో 1, 2, 3, 5 ర్యాంకులు మన రాష్ట్ర విద్యార్థులవే

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్-ఎప్‌సెట్) ఇంజినీరింగ్ విభాగంలో 73.26%... అగ్రికల్చర్-ఫార్మా విభాగంలో 87.82% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండు విభాగాల్లో అబ్బాయిలే టాప్ ర్యాంకు సాధించారు. ఇంజినీరింగ్‌లో తొలి పది ర్యాంకులు, అగ్రికల్చర్ విభాగంలో మొదటి పదిలో తొమ్మిది ర్యాంకులను అబ్బాయిలే కైవసం చేసుకున్నారు. ఇంజినీరింగ్‌లో అబ్బాయిలు 72.79%, అమ్మాయిలు 73.88% ఉత్తీర్ణులుకాగా... అగ్రికల్చర్‌లో అబ్బాయిలు 86.29%, అమ్మాయిలు 88.32% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండింటిలోనూ అమ్మాయిల అర్హత శాతం అధికంగా (మిగతా 8లో)



భరత్‌చంద్ర (1వ ర్యాంకు)



రామచరణ్‌రెడ్డి (2వ ర్యాంకు)



హేమసాయి (3వ ర్యాంకు)




వెంకటగణేశ్ (5వ ర్యాంకు)

నోటీసులు బేఖాతరు

- సిట్ విచారణకు మద్యం కుంభకోణం నిందితులు గైర్హాజరు
- ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప కోసం గాలిస్తున్న బృందాలు
- ఇప్పటికే లుక్ అవుట్ సర్క్యులర్లు జారీ



ధనుంజయరెడ్డి



కృష్ణమోహన్‌రెడ్డి



గోవిందప్ప

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో కీలక నిందితులైన సీఎంవో మాజీ కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ రెడ్డి, మాజీ సీఎం జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తి కాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలు సిట్ విచారణకు గైర్హాజరయ్యారు. ఈ ముగ్గురినీ విజయవాడ కమిషనరేట్‌లోని సిట్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ వారి కుటుంబ సభ్యులకు అధికారులు రెండు రోజుల క్రితం నోటీసులిచ్చారు. ఈ ముగ్గురు నిందితులూ వాటిని బేఖాతరు చేస్తూ విచారణకు హాజరు కాలేదు. ఇప్పటికే వీరి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. మద్యం కుంభకోణం కేసు వెనుకఉన్న కుట్ర కోణాన్ని బయటకు వెలికితీయాలంటే వీరిని కస్టడీకి తీసుకుని విచారించాల్సిన అవసరముందని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు సైతం అరెస్టు నుంచి వీరికి మధ్యంతర రక్షణ ఇవ్వడానికి నిరాకరించింది. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు నిందితులూ సిట్ విచారణకు గైర్హాజరవడం గమనార్హం. (మిగతా 8లో)

తీరంలో పోటెత్తుతున్న పెట్టుబడులు!



- రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు విదేశీ దిగ్గజ సంస్థల ఆసక్తి
- 21 కంపెనీల నుంచి అందిన ప్రతిపాదనలు

ఈనాడు - అమరావతి

విదేశీ దిగ్గజ కంపెనీలు సహా పలు దేశీయ సంస్థలు రాష్ట్రంలో పోర్టు ఆధారిత పారిశ్రామిక రంగం(మారిటైం)లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తంచేశాయి. ఆయా సంస్థల ప్రతినిధులతో ఏపీ మారిటైం బోర్డు అధికారులు సంప్రదింపులు సాగిస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 974 కి.మీ. సముద్ర తీరం ఉంది. దీనికి అనుసంధానంగా పోర్టు ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మారిటైం రంగం అభివృద్ధికి అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు షిప్ బిల్డింగ్, బ్రేకింగ్ యూనిట్ల ఏర్పాటు, అనుబంధ రంగాల్లో పరిశ్రమల (మిగతా 13లో)

ఆసక్తి వ్యక్తం చేసిన సంస్థల్లో ముఖ్యమైనవి..

- ఇమాబరి షిప్ బిల్డింగ్ కంపెనీ లిమిటెడ్... భారీ షిప్‌ల తయారీ సంస్థ(జపాన్)
- హన్వా ఓషియాన్... కమర్షియల్ షిప్‌ల నిర్మాణ సంస్థ(దక్షిణ కొరియా)
- మొల్లెర్ మెర్క్స్... కంటెయినర్ షిప్, లాజిస్టిక్ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు కలిగిన సంస్థ(నెదర్లాండ్స్)
- పీ అండ్ పీ... మారిటైం రంగంలో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న సంస్థ(గ్రీస్)
- హుందాయ్ హెచ్‌డీ షిప్ బిల్డింగ్... భారీ షిప్‌ల నిర్మాణ సంస్థ(దక్షిణ కొరియా)

ప్రకృతిని ఆస్వాదించే చోటే ఆతిథ్యం!

- ప్రయోగాత్మకంగా 'హోం స్టే'
- అరకు, కోనసీమ, విశాఖ, విజయవాడ, తిరుపతిలో 729 ఇళ్ల గుర్తింపు
- సందర్శనీయ ప్రాంతాల్లోనే పర్యాటకులకు అందుబాటు ధరల్లో వసతులు

ఈనాడు - అమరావతి

పర్యాటకులకు సొంతింట్లో ఉన్న అనుభూతి కలిగేలా రాష్ట్రంలో 'హోం స్టే'ను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తేనున్నారు. అరకు, కోనసీమ, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో గిరిజన, వారసత్వ (హెరిటేజ్), గ్రామీణ, పట్టణ విభాగాలుగా హోం స్టే అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. 729 ఆవాసాలను (ఇళ్లు) ఇప్పటికే గుర్తించారు. వాటిని నవీకరించి, ప్రైవేట్ ఆతిథ్య సంస్థలతో ఒప్పందం చేసుకోనున్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి వచ్చే నెలలో హోం స్టే అందుబాటులోకి వచ్చేలా రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు సందర్శనీయ స్థలాల్లో అన్ని సౌకర్యాలతో అందుబాటు ధరల్లో వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పర్యాటకులు అత్యధికంగా సందర్శిస్తున్న ఉత్తరాఖండ్‌లో విజయవంతంగా అమలవుతున్న హోం స్టే విధానాన్ని రాష్ట్రంలోనూ తేవాలని పర్యాటకాభివృద్ధి సంస్థ చేసిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు తాజాగా ఆమోదించారు.

మూడు విభాగాల్లో ఇలా...

- విశాఖపట్నం వెళ్లే పర్యాటకుల్లో అత్యధికులు అరకు, లంబసింగిని విధిగా సందర్శించి అక్కడి ప్రకృతి అందాలను తిలకిస్తుంటారు. అలాంటి వారి కోసం అరకుతోపాటు (మిగతా 13లో)



హోం స్టే కోసం కోనసీమలోని అప్పనపల్లిలో గుర్తించిన ఇల్లు



బలంగా పుంజుకునే సామర్థ్యం కావాలి!

తమకు ఎదురుదెబ్బలేవీ తగలొద్దని చాలామంది కోరుకుంటుంటారు. అందుకోసం అతిజాగ్రత్తగా వ్యవహరిస్తారు. కానీ జీవితంలో ఎదురుదెబ్బలను పూర్తిగా తప్పించుకోవడం దాదాపు అసాధ్యం! దానికి బదులు- కింద పడినా, ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా తిరిగి బలంగా పుంజుకోగల సామర్థ్యాన్ని సముపార్జించుకోవడంపై దృష్టి పెట్టండి. అది దీర్ఘకాలంలో మీకెంతో మేలు చేస్తుంది.

– షేన్ పారిష్, రచయిత

గ్రహం అనుగ్రహం

12–5–2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, శుక్లపక్షం

పూర్ణిమ: రా. 9-01 తదుపరి బహుళపక్ష పాడ్యమి

విశాఖ: పూర్తి

వర్జ్యం: ఉ. 11-38 నుంచి 1-25 వరకు

అమృత ఘడియలు: రా. 10-17 నుంచి 12-04 వరకు

దుర్ముహూర్తం: మ. 12-21 నుంచి 1-12 వరకు తిరిగి 2-54 నుంచి 3-45 వరకు

రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ.5.33; సూర్యాస్తమయం: సా.6.19

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	42.0	26.5
ఖమ్మం	41.4	26.0
నెల్లూరు	40.7	29.5
నిజామాబాద్	40.3	27.3
కర్నూలు	40.2	28.9
గుంటూరు	40.0	29.0
కడప	40.0	29.0
మహబూబ్‌నగర్	40.0	28.5
విజయవాడ	40.0	27.4
విజయనగరం	40.0	27.0
రామగుండం	40.0	27.0
ఆదిలాబాద్	40.0	26.7
కరీంనగర్	40.0	26.0
ఒంగోలు	39.2	28.6
అనంతపురం	39.2	27.4
తిరుపతి	39.0	28.0
హనుమకొండ	39.0	24.5
హైదరాబాద్	38.9	27.3
తాడేపల్లిగూడెం	38.7	27.9
శ్రీకాకుళం	37.0	27.0
నరసాపురం	36.0	27.2
విశాఖపట్నం	36.0	27.0

ఎండల్లో సెల్‌ఫోన్‌తో తస్మాత్ జాగ్రత్త!

హైదరాబాద్‌కు చెందిన ఓ ఉద్యోగి.. రోజూ ఎండలోనూ డెలివరీలు ఇస్తుంటాడు. అతడి బైక్ హ్యాండిల్‌కు మొబైల్ ఫోన్‌ని పెట్టి అందులో లొకేషన్ చూసుకుంటూ వెళుతుంటాడు. తరచుగా బ్యాటరీ డ్రెయిన్ అవుతుండడంతో బైక్ నుంచే ఛార్జింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నాడు. ఒకరోజు ఉన్నట్టుండి ఒక్కసారిగా సెల్‌ఫోన్ నుంచి మంటలు వచ్చాయి. ఎండాకాలంలో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతుంటాయి. సెల్‌ఫోన్ వినియోగించడంలో చేసే లోపాలతో తీవ్ర ప్రమాదాలకు ఆస్కారం ఉంది.



మరి ఇలా జరగకూడదంటే మనమేం చేయాలి...

సెల్‌ఫోన్‌ను గతంలో ఫోన్ మాట్లాడటానికి మాత్రమే వినియోగించేవారు. ఇప్పుడు ఏ పని కావాలన్నా సెల్‌ఫోన్ కావాల్సిందే. దాదాపు 95 శాతం మంది మిడ్ రేంజి ఫోన్‌లే వాడుతున్నారు. ఐఫోన్‌లు, ఇతర హైఎండ్ ఫోన్లతో పోల్చితే వీటికి త్వరగా వేడెక్కే స్వభావం ఉంటుంది. అందుకే వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఫోన్ పేలిపోకుండా నివారించవచ్చని చెబుతున్నారు.

దిండు కింద పెట్టుకుంటున్నారా?



- చాలామంది రీల్స్ చూసి అలాగే నిద్రకు ఉపక్రమిస్తూ, సెల్‌ఫోన్లను దిండు కింద పెడుతుంటారు. ఇది ప్రమాదకరం.
- మన శరీర బరువు సెల్‌ఫోన్‌పై పడితే బ్యాటరీ ఒత్తిడికి గురవుతుంది. దీంతో పేలిపోయే ప్రమాదముంది.
- బిగుతుగా ఉండే జీన్స్ జేబులో సెల్‌ఫోన్లు పెట్టకపోవడం ఉత్తమం.

బ్యాక్‌గ్రౌండ్ యాప్స్ ప్రభావం...

- మన ఫోన్‌లో పదుల సంఖ్యలో యాప్స్ ఉంటాయి. అందులో మనం వాడేవి 4, 5 మాత్రమే. అవసరం లేని యాప్‌లు బ్యాటరీని ఎక్కువగా వాడుకుంటాయి. అందుకే అవసరంలేని యాప్‌లను డిసేబుల్ చేసుకోవాలి.
- ఫోన్‌లోని సెట్టింగ్స్‌లోకి వెళితే అందులో యాప్ మేనేజ్‌మెంట్ ఉంటుంది. మనకు అవసరం లేని యాప్ క్లిక్ చేసి, అన్‌ఇన్‌స్టాల్ లేదా ఫోర్స్ స్టాప్ చేసుకోవాలి. తద్వారా అనవసర యాప్‌లతో ఛార్జింగ్ త్వరగా అయిపోకుండా నివారించవచ్చు.

ఏ ఛార్జర్ వాడుతున్నారు?

- ప్రస్తుతం చాలా ఫోన్లకు కొన్నప్పుడు ఛార్జర్ రావడం లేదు. దీంతో దొరికిన ఛార్జర్లు తీసుకుని వాడేస్తున్నారు. ఇది బ్యాటరీ లైఫ్‌ను దెబ్బతీస్తుంది. ఫోన్‌కు సంబంధించిన కంపెనీ ఛార్జర్లనే వాడడం ఉత్తమం.
- బ్యాటరీ పాడైతే తక్కువ ధరకు వచ్చిందని ఇతర బ్యాటరీలను ఇన్‌స్టాల్ చేయించకూడదు. కాస్త ఖర్చు ఎక్కువైనా నాణ్యమైన, కంపెనీ బ్యాటరీలనే వినియోగించాలి.
- రాత్రంతా ఛార్జింగ్ పెట్టి పడుకోవద్దు. దీనివల్ల బ్యాటరీ లైఫ్ దెబ్బతింటుంది.
- ప్రస్తుతం దాదాపు అన్ని ఫోన్లలో బ్యాటరీ ఫుల్ అవ్వగానే ఛార్జ్ కాకుండా నిరోధించే మెకానిజం ఉంది.



ఛార్జింగ్ పూర్తి కాగానే స్విచ్ఛాఫ్ చేయకుండా అలాగే వదిలేసి వెళుతుంటారు. ఇలా వేలాడే ఛార్జర్‌లను చిన్నపిల్లలు తెలియక తాకితే ముప్పు వాటిల్లే ఆస్కారం ఉంది.

నేరుగా ఎండ పడకుండా..

- ప్రస్తుతం ఎక్కడికి వెళ్లాలన్నా గూగుల్ మ్యాప్స్‌నే ఆశ్రయిస్తున్నాం. చాలామంది ఫోన్‌ని బైక్ పెట్రోల్ ట్యాంక్ కవర్‌లోనో, హ్యాండిల్ స్టాండ్‌కో పెట్టి నడుపుతున్నారు.
- సూర్య కిరణాలు నేరుగా ఫోన్‌పై పడితే అది త్వరగా వేడెక్కుతుంది. ఇంటర్‌నెట్‌తో పాటు గూగుల్ మ్యాప్స్ వాడుతుండడం వల్ల మరింత ఎక్కువగా వేడెక్కుతుంది.
- నేరుగా ఎండ పడకుండా ఏర్పాట్లు చేసుకోవాలి. పెట్రోల్ ట్యాంక్ కవర్‌లో సెల్ పెడుతుంటే మరింత అప్రమత్తంగా ఉండాలి.

ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు



- ఫోన్ వేడెక్కినప్పుడు.. వాడకుండా కాసేపు పక్కన పెట్టాలి.
- ఛార్జింగ్ పెట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు.
- ఎండలో ఫోన్ వాడుతున్నప్పుడు కేస్‌లను తీసివేయాలి. బ్రీతబుల్ కేసులు వాడితే ఉత్తమం.
- విపరీతంగా వేడిగా ఉంటే కాసేపు స్విచ్ఛాఫ్ చేయాలి.

వాటర్ రెసిస్టెంట్ మాత్రమే..



ఇప్పుడున్న అన్ని ఫోన్లూ ఐపీ68/ ఐపీ69 వాటర్ రెసిస్టెంట్‌తో వస్తున్నాయి. అంటే.. ప్రమాదవశాత్తూ సెల్‌ఫోన్ నీటిలో పడిపోతే త్వరగా తీస్తే పాడవకుండా ఉంటుంది. ఫోన్ హీట్ అయిందని నీటిలోనో, రిఫ్రిజిరేటర్‌లో పెట్టకూడదు. ఉద్దేశపూర్వకంగా ఇలా చేస్తే సర్వీస్ సెంటర్లు వారంటీ సౌకర్యం కల్పించవని చెబుతున్నారు.

ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి

– సాయి సతీశ్, సాంకేతిక నిపుణుడు, సీఈవో, ఇండియన్ సర్వర్స్




ఫోన్ కొన్నప్పుడు కొన్ని సంవత్సరాల వరకు సాఫ్ట్‌వేర్ అప్డేట్‌లు వస్తుంటాయి. ఎప్పటికప్పుడు వాటిని అప్‌డేట్ చేసుకోవాలి. దీనివల్ల ఫోన్‌లో ఏమైనా ప్రమాదకర బగ్స్ ఉంటే పోయి. సెల్‌ఫోన్ ఓవర్‌హీట్ కాకుండా ఉంటుంది. స్క్రీన్ బ్రైట్‌నెస్‌ని 'ఆటో' మోడ్‌లో పెట్టుకోవాలి. పవర్ వినియోగాన్ని తగ్గించడానికి బ్యాటరీ సేవర్ మోడ్‌ను ఉపయోగించుకోవాలి. నేరుగా సూర్యరశ్మి పడే ప్రదేశాల్లో ఛార్జింగ్ చేయకూడదు. అవసరం లేకుంటే.. వైఫై, జీపీఎస్, మొబైల్ డేటాను ఆఫ్ చేసుకోవాలి.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

శాస్త్ర, సాంకేతికతతోనే సమగ్ర అభివృద్ధి

ముఖ్యమంత్రి చంద్రబాబు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో శాస్త్ర, సాంకేతికతతో సమగ్ర, సుస్థిర భవిష్యత్తు నిర్మించేందుకు కట్టుబడి ఉన్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ పరివర్తనకు క్వాంటమ్ వ్యాలీ కేంద్రంగా ఉండనుందన్నారు. ఆదివారం జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. "అభివృద్ధికి ఆవిష్కరణ ఇంజిన్ లాంటిది, సాంకేతికత ఇంధనం వంటిది. ఆవిష్కరణల స్ఫూర్తి, సాంకేతిక శక్తితో మెరుగైన పాలన అందిస్తున్నాం. వ్యవసాయ రంగం మొదలు కృత్రిమ మేధ వరకు సాంకేతికత ప్రజా జీవితాల్లో విప్లవాత్మక మార్పు తెస్తోంది. ఉత్పాదకతనూ పెంచుతోంది. మానవాళికి ఎదురవుతున్న ఎన్నో సవాళ్లకు పరిష్కారాలు అందిస్తోంది" అని పేర్కొన్నారు.

ఏపీలో విభిన్న సామాజిక పరిస్థితులు

వితంతు, విడాకులు, విడిగా ఉంటున్న వాళ్లలో మూడోస్థానం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని సామాజిక పరిస్థితులు విభిన్నంగా ఉన్నాయి. ఒకవైపు వివాహం అయిన జనాభాలో దేశంలో మొదటి స్థానంలో నిలిచిన రాష్ట్రం మరోవైపు వితంతు/విడాకులు తీసుకున్న/విడిగా ఉంటున్న వారిలో మూడో స్థానం (5%)లో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ పురుషులు వివాహాల్లోనే కాకుండా, వితంతు/విడాకులు/విడిగా ఉంటున్న వారి విభాగంలోనూ దేశంలో మొదటిస్థానంలో ఉన్నారు. మరోవైపు వివాహం అయిన మహిళల్లో అత్యధికంగా కేరళ (55.3%), హిమాచల్ ప్రదేశ్ (54.4%) తర్వాత మూడో స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ (54.2%) అతివలు వితంతు/విడాకులు/విడిగా ఉంటున్న వారి విభాగంలో నాలుగోస్థానంలో ఉన్నారు. కేంద్రంతాజాగా విడుదల చేసిన శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టం నివేదిక ఈ వివరాలను తెలియజేస్తోంది. దీని ప్రకారం పెళ్లయినవారిలో ఆంధ్రప్రదేశ్‌ది (51.7%) దేశంలో మొదటి స్థానం కాగా బిహార్ (39.4%) చివరి స్థానంలో నిలిచింది. జాతీయస్థాయిలో పెళ్లికానివారు 51.2%, పెళ్లయినవారు 45.5%, వితంతు/విడాకులు/విడిగా ఉంటున్న వారు 3.3% మంది ఉన్నారు.

వితంతు/విడాకులు/విడిగా ఉంటున్న వారి వివరాలు శాతాల్లో

రాష్ట్రం	మొత్తం	మహిళలు	పురుషులు
తమిళనాడు	5.9	9.4	2.3
కేరళ	5.5	9.3	1.3
ఆంధ్రప్రదేశ్	5.0	7.8	2.3
కర్ణాటక	4.8	8.3	1.4
తెలంగాణ	4.3	7.0	1.7
జాతీయ సగటు	3.3	5.2	1.5

నేటి నుంచి అందుబాటులో ఈఏపీసెట్ హాల్‌టికెట్లు

కాకినాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: ఏపీ-ఈఏపీసెట్-2025కు సంబంధించిన హాల్‌టికెట్లను సోమవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆ సెట్ ఛైర్మన్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు కలిపి మొత్తం 3,61,299 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలు ఈ నెల 19 నుంచి ప్రారంభంకానున్నట్లు తెలిపారు. సెట్ వెబ్‌సైట్ లేదా రాష్ట్ర ప్రభుత్వ వాట్సప్ గవర్నెన్స్ నం.95523 00009 ద్వారా హాల్‌టికెట్లు పొందొచ్చని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం తెలుసుకునేలా హాల్‌టికెట్‌లో రూట్‌మ్యాప్ ఇచ్చినట్లు చెప్పారు. సందేహాలకు 0884-2359599, 2342499 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఈ-కేవైసీ నమోదులో ఏపీ అగ్రస్థానం: మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రేషన్ కార్డుల్లోని సభ్యుల ఈ-కేవైసీ నమోదులో దేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 95% ఈ-కేవైసీ పూర్తయినట్లు వెల్లడించారు. తెనాలిలో ఆదివారం మంత్రి విలేకర్లతో మాట్లాడారు. 'రాష్ట్రంలో 1,46,21,223 బియ్యం కార్డులు, 4,24,59,028 మంది సభ్యులు ఉన్నారు. ఈ నెల 8 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో బియ్యం కార్డుల్లో మార్పులు, చేర్పులు, నూతన కార్డులకు దరఖాస్తుల స్వీకరణ వంటి 6 రకాల సేవలు అందించే ప్రక్రియ మొదలైంది. ఈ నెల 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఇంటి నుంచే ఈ సేవలు పొందే సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నాం. ప్రజలు 95523 00009 నంబరుకు 'హాలో' అన్న సందేశం పంపడం ద్వారా ఈ సేవలను పొందవచ్చు. జూన్ నుంచి రేషన్ కార్డుల స్థానంలో ఆధునిక స్మార్ట్ కార్డులను అందించే ప్రక్రియ ప్రారంభిస్తాం. తొలిసారిగా ఒంటరి వారికీ కార్డు ఇవ్వనున్నాం. కళాకారులుగా పింఛను అందుకుంటున్న వారికి, గిరిజన బృందాలకు ప్రత్యేకంగా అంత్యోదయ కార్డుల ద్వారా నెలకు 35 కిలోల బియ్యం అందిస్తాం. లింగ మార్పిడి జరిగిన వారికీ కార్డులు ఇస్తాం' అని మంత్రి వివరించారు.



స్మార్ట్ కార్డును చూపుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కల్తీ నెయ్యి కేసులో 15 మంది నిందితులు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ దాఖలు చేసిన మొదటి ఛార్జ్‌షీట్‌లో 15 మందిని నిందితులుగా పేర్కొంది. అందులో ఆరుగురిని ఇప్పటికే అరెస్టు చేసి, ఆధారాలు సేకరించింది. మిగతా వారిలో నెయ్యి సరఫరా చేసిన డెయిరీల నిర్వాహకులు, ఉద్యోగులు, ఓ వ్యాపారి ఉన్నారు. ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీ, భోలేబాబా డెయిరీతోపాటు హర్ష్ ఫ్రెష్ డెయిరీల నిర్వాహకులు, కొందరు ఉద్యోగులనూ నిందితులుగా చేర్చారు. అరెస్టయిన వారిలో ఇద్దరు తితిదే ఉద్యోగులు ఉన్నారు. వీరిని విచారించాక అవినీతి ఎలా జరిగిందో గుర్తించగలిగారు. ఈ ఛార్జ్‌షీట్‌లో 20 మంది తితిదే ఉద్యోగులను సాక్షులుగా చేర్చారు.

క్రీడల వర్గీకరణతో నిరాశ

- క్యాటగిరీ-ఏ, బీ గా చేయడంతో నష్టపోయే అవకాశం
- కొత్త విధానాన్ని మార్చాలని డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్

విజయవాడకు చెందిన సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారిణి అనూష 2022లో చైనాలో నిర్వహించిన ఏషియన్ గేమ్స్‌లో పాల్గొన్నారు. జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో విశాఖకు చెందిన శ్రీనివాస్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వీరు రాణించి పతకాలు సాధించినా.. క్రీడాంశాలను రెండు క్యాటగిరీలుగా విభజించడంతో డీఎస్సీలో క్రీడా కోటాలో ఎంపికయ్యే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో అనేక మంది క్రీడాకారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈనాడు, అమరావతి: డీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో క్రీడా కోటా అమల్లో క్రీడలను రెండుగా విభజించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్యాటగిరీ-ఏకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి.. క్యాటగిరీ-బీని ఆ తర్వాత పరిశీలించాలని నిర్ణయించడం క్రీడాకారులను ఆందోళనకు గురి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యమిస్తోంది. క్రీడా రిజర్వేషన్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచింది. దీన్ని తాజాగా ప్రకటించిన ఉపాధ్యాయ నియామకాలకూ (డీఎస్సీ) వర్తింపజేస్తూ క్రీడాకారులకు 421 పోస్టులు కేటాయించారు. ఇలాంటి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న క్రీడాకారులను రెండు క్యాటగిరీల విధానం ఆందోళనకు గురి చేస్తోంది. రాష్ట్రంలో మొత్తం 65 క్రీడలను రెండు క్యాటగిరీలుగా విభజించారు. క్యాటగిరీ-ఏలో 36, బీ-లో 29 క్రీడాంశాలను చేర్చారు. ఉద్యోగ నియామకాల్లో క్యాటగిరీ-ఏలోని క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మొదట ప్రాధాన్యమిచ్చి, ఆ తర్వాతే క్యాటగిరీ-బీలోని క్రీడాకారులను పరిశీలనకు తీసుకుంటామని ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో డీఎస్సీలో కేటాయించిన పోస్టులన్నీ క్యాటగిరీ-ఏలోని క్రీడాంశాలతో భర్తీ అయ్యే అవకాశం ఉందని, క్యాటగిరీ-బీలోని క్రీడల్లో పతకాలు సాధించినా ప్రయోజనం లేకుండాపోయే అవకాశం ఉందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఏ రాష్ట్రంలోనూ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఉద్యోగ నియామకాల్లోనూ క్రీడల విభజన లేదని క్రీడాకారులు పేర్కొంటున్నారు.

◆ కరాటే క్రీడను బీ-క్యాటగిరీలో పెట్టిన అధికారులు జూడోను ఏ క్యాటగిరీ పరిధిలోకి చేర్చారు. ఈ రెండింటికీ సారుప్యత ఉన్నా వేర్వేరుగా పెట్టారు. క్రికెట్‌ను బీకి పరిమితం చేసి .. బేస్‌బాల్‌ను క్యాటగిరీ-ఏలో పెట్టారు.

వివిధ క్రీడలను క్యాటగిరీల వారీగా విభజించిన జాబితా....

క్యాటగిరీ ఏ లోని క్రీడాంశాలు

◆ ఆక్వాటిక్స్ ◆ అథ్లెటిక్స్ ◆ ఆర్చరీ ◆ బ్యాడ్మింటన్ ◆ బాల్ బ్యాడ్మింటన్ ◆ బాస్కెట్ బాల్ ◆ బాక్సింగ్ ◆ చెస్ ◆ సైక్లింగ్ ◆ ఫుట్‌బాల్ ◆ ఫెన్సింగ్ ◆ గోల్ఫ్ ◆ జిమ్నాస్టిక్స్ ◆ హాకీ ◆ హ్యాండ్‌బాల్ ◆ జూడో ◆ కయాకింగ్, కనోయింగ్ ◆ కబడ్డీ ◆ ఖోఖో ◆ మోడర్న్ పెంటథ్లాన్ ◆ రోయింగ్ ◆ రోలర్ స్కేటింగ్ ◆ రగ్బీ ◆ షూటింగ్ ◆ సాఫ్ట్‌బాల్ ◆ స్క్వాష్ ◆ ట్రయథ్లాన్ ◆ తైక్వాండో ◆ టెన్నిస్ ◆ టేబుల్ టెన్నిస్ ◆ వాలీబాల్, బీచ్‌వాలీబాల్ ◆ వెయిట్ లిఫ్టింగ్ ◆ రెజ్లింగ్ ◆ సెయిలింగ్ ◆ పారా స్పోర్ట్స్

సమస్యను సీఎం దృష్టికి తీసుకెళతాం

'డీఎస్సీకి స్పోర్ట్స్ కోటా కింద ఎంపిక కోసం క్రీడల విభజనతో అన్యాయం జరుగుతుందన్న క్రీడాకారుల ఆందోళనను, క్రీడా సంఘాల అభ్యంతరాలను సీఎం దృష్టికి తీసుకెళతాం. ఉన్నతాధికారులతోనూ మాట్లాడుతున్నాం. ఎవరికీ అన్యాయం జరగదు'

– రవినాయుడు, శాప్ ఛైర్మన్

క్యాటగిరీ బీ– క్రీడాంశాలు

◆ అత్యా, పత్యా ◆ బిలియర్డ్స్, స్నూకర్ ◆ బాడీ బిల్డింగ్ ◆ బ్రిడ్జ్ ◆ క్యారమ్స్ ◆ సైకిల్ పోలో ◆ ఐస్‌హాకీ ◆ ఐస్ స్కేటింగ్ ◆ ఐస్ స్కీయింగ్ ◆ కరాటే ◆ మల్లఖంబ ◆ మోటార్ స్పోర్ట్స్ ◆ నెట్ బాల్ ◆ పెన్‌కాట్ సైలాట్ ◆ పోలో◆ పవర్ లిఫ్టింగ్ ◆ షూటింగ్ బాల్ ◆ రోల్ బాల్ ◆ సెపక్ తక్రా ◆ సాఫ్ట్ టెన్నిస్ ◆ టెన్ని కాయిట్ ◆ టెన్నిస్ బాల్ క్రికెట్ ◆ టెన్‌పిన్ బౌలింగ్ ◆ టగ్ ఆఫ్ వార్ ◆ వుషు ◆ యాచింగ్ ◆ యోగాసన ◆ డెఫ్ స్పోర్ట్స్ ◆ క్రికెట్





ఉత్సవమూర్తులు

ప్రధాన రహదారిపై ఊరేగింపుగా వెళ్తున్న రథం

కమనీయం.. సత్యదేవుడి రథోత్సవం

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి రథోత్సవం ఆదివారం కమనీయంగా జరిగింది. సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. 34.1 అడుగుల ఎత్తులోని రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ఆశీనులను చేశారు. వైదిక బృందం ప్రత్యేక పూజలు చేసింది. ఆలయ ఛైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావులు కొబ్బరికాయ కొట్టి రథాన్ని ముందుకు లాగారు. గ్రామంలోని ప్రధాన రహదారి మీదుగా సాగిన రథోత్సవంలో వేలమంది భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం, పోలీస్, ఎస్డీఆర్ఎఫ్, ఇతర శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.



తొలి అడుగు వేయించేది నమ్మకమే

మీపై మీకుండే విశ్వాసం ఒక అద్భుత శక్తి! నడవడానికి దారి కనిపించనప్పుడు.. అది మీతో ధైర్యంగా తొలి అడుగు వేయిస్తుంది. 'నేను చేయలేను' అన్న మీలోని ప్రతికూల భావనను.. 'నేను చేయగలను' అన్న సానుకూల భావనగా మార్చేస్తుంది. లక్ష్యాలను సాధించేందుకు, మీరు కలలు కనే జీవితం గడిపేందుకు.. మీపై, మీ సామర్థ్యాలపై మీకుండే నమ్మకమే పునాదిగా పనిచేస్తుంది.

– కోరీ విల్సన్, మైండ్ కోచ్



'నేషనల్ ఇంటిగ్రిటీ' స్ఫూర్తితో తయారుచేసిన జైహింద్ చక్ర

ఇనుప వ్యర్థాలతో జైహింద్ చక్ర

పార్లమెంట్ సమీపంలో ఏర్పాటు



శ్రీనివాస్ పడకండ్ల

ఇనుప వ్యర్థాలకో అర్థం ఇస్తూ విజయవాడకు చెందిన ప్రముఖ కళాకారుడు శ్రీనివాస్ పడకండ్ల తయారు చేసిన 'జైహింద్ చక్ర' శిల్పం దేశ రాజధాని దిల్లీలో కొలువు దీరింది. 'నేషనల్ ఇంటిగ్రిటీ' స్ఫూర్తితో రూపొందించిన ఈ శిల్పాన్ని పార్లమెంట్‌కు వెళ్లే దారిలో రఫీ మార్గ్ చౌరస్తాలో ఇటీవల నెలకొల్పారు. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగం అధ్యాపకులుగా పనిచేస్తున్న శ్రీనివాస్.. ఈ శిల్పం కోసం 1.5 టన్నుల ఆటోమొబైల్ ఇనుప వ్యర్థాలను వినియోగించారు. నెవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్) ఆధ్వర్యంలో 10 అడుగుల ఎత్తు, వెడల్పు ఉన్న ఈ శిల్పాన్ని రూపొందించారు.

– ఈనాడు, అమరావతి

కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ హిందీ సలహా సంఘం సభ్యుడిగా యార్లగడ్డ

ఈనాడు, దిల్లీ: కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ హిందీ సలహా సంఘం సభ్యుడిగా మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగుతారు. మంత్రిత్వశాఖ వ్యవహారాల్లో హిందీ వినియోగానికి పది మంది సభ్యులతో కూడిన ఈ సంఘం సలహాలు ఇస్తుంది.



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాక్షి రూపానంద్ స్వామి, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్. చిత్రంలో ప్రోగ్రాం డైరెక్టర్ జ్యోత్స్న, ఏబీవీ నిర్వాహక ట్రస్టీ నందకుమార్, గాయని శోభారాజు, ప్రొఫెసర్ ముళ్లపూడి సత్యనారాయణ

సత్యం.. ధర్మం ఉద్బోధించే అన్నమాచార్య కీర్తనలు

- మార్గదర్శి చిట్‌ఫండ్ ఎండీ శైలజా కిరణ్
- 'తందనాన' అన్నమాచార్య అంతర్జాతీయ సంగీత పోటీలు ప్రారంభం

హైదరాబాద్, న్యూస్‌టుడే: సత్యం, ధర్మం, న్యాయం, ఆధ్యాత్మికతను తాళ్లపాక అన్నమాచార్య కీర్తనలు ఉద్బోధిస్తాయని మార్గదర్శి చిట్‌ఫండ్ ఎండీ శైలజా కిరణ్ పేర్కొన్నారు. అన్నమాచార్య 617వ జయంతిని పురస్కరించుకొని అన్నమాచార్య భావనా వాహిని(ఏబీవీ) ఆధ్వర్యంలో 'తందనాన' పేరుతో అన్నమాచార్య అంతర్జాతీయ సంగీత పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలను ఆదివారం హైదరాబాద్ మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శైలజా కిరణ్ ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించారు. అన్నమయ్య 30 వేలకుపైగా శ్రీనివాసుని సంకీర్తనలు రాశారని, వాటిలో 12 వేలు మాత్రమే లభ్యమయ్యాయని అన్నారు. 19వ శతాబ్దంలో తిరుమల తిరుపతి దేవస్థానం వాటిని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఏబీవీ వ్యవస్థాపక అధ్యక్షురాలు శోభారాజు అన్నమయ్య సంకీర్తనలకే తన జీవితాన్ని అంకితం చేశారని, వాటిని ప్రజల్లోకి తీసుకురావడంలో ఆమె కృషి ప్రశంసనీయమన్నారు. అన్నమయ్య కీర్తనల్లో మన సంస్కృతి ఔన్నత్యం, వారసత్వం ఇమిడి ఉంటాయని చెప్పారు. సంగీతం, శాస్త్రీయ నృత్యాలను నేర్చుకుని విదేశాల్లోనూ మన సంస్కృతి గొప్పతనాన్ని మనవారు చాటుతున్నారని, ఈ ఘనత అన్నమయ్య సంకీర్తనలకే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ పోటీలకు తమ వంతు సహకారం అందిస్తామని, ఈటీవీలో ప్రసారం చేస్తామని అన్నారు. చిన్మయ మిషన్‌కు చెందిన సాక్షి రూపానంద్ స్వామీజీ మాట్లాడుతూ.. జీవుడు, జగత్తు, పరమాత్మ ఒకరేనని, బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే అనే సంకీర్తనతో అన్నమాచార్య ఇదే విషయాన్ని చెప్పారని అన్నారు. శోభారాజు మాట్లాడుతూ.. తందనాన అన్నమాచార్య అంతర్జాతీయ సంగీత పోటీలను ఆరేళ్లలోపు వారికి సబ్-జూనియర్స్, 7-15 ఏళ్ల వారికి జూనియర్, 16 ఏళ్లు, ఆపై వారికి సీనియర్ విభాగంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐదు నిమిషాల నిడివితో పాట వీడియోను తమకు పంపించాలని సూచించారు. అక్టోబరు 8న జరిగే గ్రాండ్ ఫినాలేకు ఏపీ సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏబీవీ నిర్వాహక ట్రస్టీ డాక్టర్ నందకుమార్, ప్రోగ్రాం డైరెక్టర్ జ్యోత్స్న కొంపల్లి, ప్రొఫెసర్ ముళ్లపూడి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. గాయకుడు శ్రీకృష్ణతోపాటు శోభారాజు శిష్య బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి.

మృత్యువులోనూ వీడని బంధం

మినీ లారీని ఢీకొన్న కారు ● ముగ్గురు అన్నదమ్ముల దుర్మరణం



కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలు



చలపతి



జయచంద్ర



నాగేంద్రుడు

కదిరి, నల్లచెరువు, న్యూస్‌టుడే: బంధువు అంత్యక్రియలకు హాజరై తిరిగొస్తున్న అన్నదమ్ములకు అదే చివరి ప్రయాణమైంది. ఆగి ఉన్న వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ముగ్గురు మరణించారు. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి వద్ద ఆదివారం చోటు చేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన చలపతి(74), జయచంద్ర(72), నాగేంద్రుడు(65) అన్నదమ్ములు. ఒకే తల్లిబిడ్డలు. వారి చిన్నాన్న కుమారుడి అంత్యక్రియల కోసం ఆ ముగ్గురూ కారులో అనంతపురానికి బయలుదేరారు. వీరితో పాటు వారి చిన్నాన్న మరో కుమారుడు నెల్లూరుకు చెందిన వేణుగోపాల్ ఉన్నారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని నలుగురూ తిరుగు ప్రయాణమయ్యారు. పెద్దయల్లంపల్లి వద్ద మలుపులో ఆగి ఉన్న మినీ లారీని వారు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు చలపతి, జయచంద్ర, నాగేంద్రుడు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన వేణుగోపాల్‌ను కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చలపతి, జయచంద్ర విశ్రాంత ఏఎస్సైలు కాగా, నాగేంద్రుడు విశ్రాంత లెక్చరర్. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏపీ భవన్‌కు చేరిన 350 మంది విద్యార్థులు

ఈనాడు, దిల్లీ: భారత సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా దిల్లీలోని ఏపీ భవన్‌కు చేరుకున్న విద్యార్థుల సంఖ్య 350కి చేరింది. జమ్మూకశ్మీర్, పంజాబ్‌లోని పలు విద్యాసంస్థల్లో చదువుకుంటున్న వీరంతా ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో స్వస్థలాలకు తిరుగుపయనమయ్యారు. దిల్లీ చేరుకున్న వీరికి ఏపీ భవన్ అధికారులు తాత్కాలిక వసతి, భోజన సౌకర్యం ఏర్పాటుచేశారు. శనివారం రాత్రి 91 మంది విద్యార్థులు ఉండగా, ఆదివారం నాటికి ఆ సంఖ్య 350కి చేరింది. ఇక్కడి సిబ్బంది వారికి రైలు టికెట్ కన్ఫర్మేషన్ చేయించడంతోపాటు, ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్లకు వెళ్లడానికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ సమయంలో దేశ సరిహద్దుల్లోని రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న ఏపీ వాసులు ఎలాంటి ఇబ్బందుల్లో ఉన్నా సాయం కోసం 011-23387089, మొబైల్ నంబర్లు 98719 99430, 98719 99053లలో సంప్రదించవచ్చని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ తెలిపారు. ఏదైనా అదనపు సమాచారం, సహాయం కావాలంటే ఏపీ భవన్ డిప్యూటీ కమిషనర్ ఎంవీఎస్ రామారావు 98719 90081, లైజన్ ఆఫీసర్ వి.సురేష్‌బాబు 98183 95787లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఈనాడు

పాకిస్థాన్‌ను నమ్మలేం!

ఇంటా బయటా అనేక సమస్యలతో కునారిల్లుతున్న పాకిస్థాన్‌కు నిజంగా యుద్ధాన్ని భరించే శక్తి లేదు. ఇప్పటికే ఇంధనం, ఆహార కొరతతో అది అల్లాడిపోతోంది. అప్పులకోసం జోలె పట్టుకుని తిరుగుతున్న దాయాది దేశం- ఐఎంఎఫ్ దయతో కాస్తంత ఊపిరి పీల్చుకోగలుగుతోంది. ఇండియా విదేశీ మారక ద్రవ్య నిల్వలు దాదాపు 68,800 కోట్ల డాలర్లు అయితే, పాక్ ఖజానాలో ఉన్నది కేవలం 1,500 కోట్ల డాలర్లే. మూడు నెలల దిగుమతులకే అవి సరిపోతాయి! ఆర్థిక పరిస్థితి అంత దుర్భరంగా ఉన్నప్పటికీ పాకిస్థాన్ తన దుస్సాహసాలను మానుకోలేదు. దాని డ్రోన్ దాడులకు దీటుగా బదులిస్తూనే, భారత్ అత్యంత సంయమనం పాటిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే కాల్పుల విరమణకు ఇండియా, పాకిస్థాన్ అంగీకరించాయంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా ప్రకటించారు. ఆపై భారత విదేశాంగ శాఖ కార్యదర్శి దాన్ని ధ్రువీకరించారు. కానీ, తన కుక్కతోక వంకర బుద్ధిని పోనిచ్చుకోని పాకిస్థాన్- కాల్పుల విరమణ ప్రకటన తర్వాతా కవ్వింపు చర్యలకు పాల్పడింది. చేసిన బాసలకు, కుదిరిన ఒప్పందాలకు కట్టుబడి ఉండే అలవాటు లేని పాక్‌ను ఎన్నటికీ పూర్తిగా విశ్వసించలేం. కాబట్టి ప్రాదేశిక సమగ్రత, భద్రతల సంరక్షణ నిమిత్తం ఇండియా సదా అప్రమత్తంగా ఉండాల్సిందే!

భారతావనిపై అంతులేని విద్వేషంతో ఉగ్రమూకలను ఉసిగొల్పుతూ, పాక్ తరచూ కశ్మీర్‌లో రక్తపాతం సృష్టిస్తోంది. పహల్గాం నరమేధంతో దాని పైశాచికత్వం పరాకాష్ఠకు చేరింది. ఆ పాశవిక ముష్కర దాడికి బదులు తీర్చుకొనేందుకు 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన ఇండియా- పీఓకేతో పాటు పాక్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై విరుచుకుపడింది. కాందహార్ విమాన హైజాక్ నిందితుడితో పాటు పదుల సంఖ్యలో ముష్కరులను మట్టుబెట్టింది. దాయాది దేశంలోని పలు సైనిక స్థావరాలనూ భారత్ ధ్వంసం చేసింది. అందుకు ప్రతిగా భారతీయ నగరాలపై పాక్ చేసిన దాడియత్నాలను మన బలగాలు తుత్తునియలు చేశాయి. పాకిస్థానీ నేతాగణాలు, మతఛాందస ఉన్మాదులు ఆరంభించిన తప్పుడు సమాచార యుద్ధాన్ని సైతం భారత అధికారవర్గాలు ఎప్పటికప్పుడు ఆధారాలతో తిప్పికొట్టాయి. శాంతికోసం ఇండియా నాలుగడుగులు ముందుకేసిన ప్రతిసారీ పాక్ నుంచి వెన్నుపోటే ఎదురైంది. ఇకనుంచైనా ఆ కుటిల నాటకాలను అది మానుకుంటుందా? ఉగ్ర మూకలను ఇకపై యుద్ధ చర్యలుగా భావిస్తామన్న భారత హెచ్చరికలోని తీవ్రతను అర్థం చేసుకుంటుందా? లేదా ముష్కరులను ముద్దుచేస్తూ ఆత్మవినాశనాన్ని కొనితెచ్చుకుంటుందా అన్నది కాలమే నిర్ణయిస్తుంది!

ప్రత్యేక దేశంగా ఆవిర్భవించింది మొదలు ఇండియాను కల్లోలపరచడమే పాక్ లక్ష్యమైంది. ఆ క్రమంలో రాజకీయ అస్థిరత్వం, వ్యవసాయ, పారిశ్రామిక ప్రగతి దెబ్బతినడం, ఎగుమతులు సన్నగిల్లడం, రుణభారం గుదిబండ కావడం, స్వదేశంలో ఉగ్రవాదుల స్వైరవిహారం వంటివి పాక్‌ను కుంగదీస్తున్నాయి. కట్టు తప్పిన ద్రవ్యోల్బణంతో అక్కడి జనజీవితాలు కష్టాల సుడిగుండంలో చిక్కుకున్నాయి. పాక్ జీడీపీలో అప్పులు 75శాతానికి చేరాయి. చైనాతో పాటు పశ్చిమాసియా దేశాలనూ రుణాలకోసం ఇస్లామాబాద్ నిరంతరం దేబిరిస్తోంది. ఆర్థిక అగచాట్లతో అది ఇప్పటికి పాతికసార్లు ఐఎంఎఫ్ ముందు చెయ్యి చాచింది. తాజాగా పాక్‌కు వంద కోట్ల డాలర్ల నిధుల విడుదలకు ఐఎంఎఫ్ పచ్చ జెండా ఊపింది. ఇప్పటికైనా ముష్కర మిన్నాగులకు పాలుపోయడం మానేసి సొంతింటిని చక్కదిద్దుకోవడంపై పాక్ దృష్టిపెడితేనే ఉద్రిక్తతలు ఉపశమిస్తాయి. మరోవైపు, కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం వహిస్తానన్న ట్రంప్ వ్యాఖ్యలు అర్థరహితమైనవి. జమ్మూకశ్మీర్ భారత్‌లో విడదీయలేని అంతర్భాగం. ఇండియా ఇప్పటికే తేల్చిచెప్పినట్లు, కశ్మీర్ విషయంలో మూడో పక్షం జోక్యం అనవసరం!



నృత్యం, సంగీతం, చిత్రలేఖనం... ఏ కళారూపమైనా సరే, కళాకారుడు అందులో మమేకమవుతాడు. కళాప్రదర్శన ద్వారా తనలోని ఉద్వేగాలన్నిటినీ బహిర్గతపరుస్తాడు. అందుకే కళ ఒత్తిడిని తగ్గిస్తుందనేది.

– మృణాళినీ సారాభాయ్

విశ్వానికి వెలుగు

పెద్ద సమస్య ఏంటంటే మనకు చాలా సమయం ఉందనుకుంటాం. కానీ ఎవరికి ఎంత సమయం ఉందో ఎవరికి తెలుసు? కోపం ప్రదర్శించడం వల్ల మనకు శిక్ష పడుతుందనుకుంటాం. కానీ కోపమే మనల్ని శిక్షిస్తోందని తెలుసుకోం. ఆలోచనలను నియంత్రించకపోతే మనసు చేసే విధ్వంసం ఏ కరడుగట్టిన శత్రువు కూడా చేయలేడు. గతమెంత భయంకరంగా ఉన్నా, ఎన్ని అవరోధాలు అడ్డుపడినా మన ప్రయత్నం మాత్రం మానకూడదు. మనసును మన ఆధీనంలో ఉంచుకోవాలి. దేన్నీ గుడ్డిగా నమ్మొద్దు. శాస్త్రీయ, తార్కిక దృక్పథంతో నిర్ధారించుకుని ముందుకెళ్లాలి. వేల దీపాలు ఒక్క దీపంతో వెలుగుతాయి. దానివల్ల ఆ దీపానికి వచ్చిన నష్టమేమీ లేదు. సంతోషమూ అంతే. అందరితో పంచుకున్నప్పుడే అది పెరిగి నిజమైన ఆనందంగా మారుతుంది. ఇలా ఎన్నో బోధించిన బుద్ధుడు... ఆధ్యాత్మిక శాస్త్రవేత్త.



అంతర్యామి

బుద్ధుడి ధ్యానయానమే విశ్వానికి దారి చూపింది. బుద్ధుడు అసామాన్యుడిగా జన్మించి, సామాన్యుడిగా జీవనయాత్ర గడిపాడు. సర్వభోగాలను తృణప్రాయంగా విడిచిపెట్టి ఆధ్యాత్మిక యాత్ర చేశాడు.. అనుకున్నది సాధించాడు.

బౌద్ధ ధర్మ సంస్థాపకుడు బుద్ధుడు. ఆయన గురువునని చెప్పుకోలేదు. వ్యక్తి ఆరాధనను నిరాకరించాడు. అష్టాంగ మార్గాన్ని ప్రతిపాదించాడు. నిర్వాణం పరమ ఉత్కృష్టమైన గమ్యమని బోధించాడు. ఈ సాధనా మార్గాన్ని బుద్ధుడు తెలుసుకుని, ఆచరించి, అనుభూతి పొంది ఇతరులకు తెలియజేశాడు. ఆయన బోధనల్లో 'నాలుగు సత్యాలు' ప్రముఖమైనవి... దుఃఖం లక్షణం, దాని కారణం, దుఃఖ నివారణ, నివారణా మార్గం. దుఃఖాన్ని నివారించే మార్గం 'అష్టాంగ మార్గం'. బుద్ధుడి తరవాత బౌద్ధాన్ని అనుసరించేవారిలో అనేక విభాగాలు ఏర్పడ్డాయి. వారి ఆచరణ, సిద్ధాంతం, సంస్కృతుల్లో నెలకొన్న వైవిధ్యమే దానికి కారణం.

బుద్ధుడు అంటే ఎవరు? ధర్మం అంటే ఏంటి? సంఘం అంటే ఏంటి? అనే వాటికి చాలా స్పష్టమైన నిర్వచనాలు ఇచ్చాడు గౌతముడు. జ్ఞానోదయమైన, ధర్మమార్గాన్ని ఎరిగిన, యోగ్యమైన స్థితిని ఆచరించేవాడు 'బుద్ధుడు'. ఆయన తెలిపిన మార్గం సత్యానికి, అసత్యానికీ ఉన్న భేదం. దాన్నే 'ధర్మం' అంటారు. బౌద్ధ భిక్షువుల సమూహం లేదా సత్యాన్వేషణలో పురోగమించే వారి సహవాసమే 'సంఘం'. బుద్ధుడు తాను కనుగొన్న మార్గాన్ని గుడ్డిగా ఆచరించమని ఇతరులకు చెప్పలేదు. శ్రద్ధతో, యుక్తాయుక్తాలు విచారించి సత్యాన్ని తెలుసుకుని జ్ఞానోదయం పొందమన్నాడు. ఆయన ఒక వ్యక్తి కాదు. అనంతమైన ధర్మరూపం.

వైశాఖ పౌర్ణమి రోజున జన్మించిన గౌతమబుద్ధుడు.. అదే రోజున జ్ఞానోదయం, మహా పరినిర్వాణం పొందాడు. తెలుగునాట బుద్ధుడి అడుగుజాడలకు చరిత్ర చాలా ఉంది. అమరావతి స్తూపంలో బుద్ధుడి ధాతువులను నిక్షిప్తం చేసినట్లు 'మంజుశ్రీ మూల కల్పం' గ్రంథం చెప్పింది. భారతీయ తత్వవేత్త, సంస్కర్త అయిన బుద్ధుడి జీవితం విశ్వానికి వెలుగైంది. ఎందరికో ఆత్మోద్ధరణకి దారి చూపింది. అందుకే ఈనాటి వైశాఖ పూర్ణిమను బుద్ధ పూర్ణిమ అంటారు.

– ఆనందసాయి స్వామి

స్వచ్ఛ ఇంధనం... ఏఐతో అపారం!

భూతాపానికి కారణమవుతున్న కర్బన ఉద్గారాలను సమూలంగా పరిహరించాలని ప్రపంచ దేశాలు లక్షిస్తున్నాయి. దీనికి గ్రీన్ హైడ్రోజన్ శక్తిమంతమైన సాధనం. దాని ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగపడుతుంది. గ్రీన్ హైడ్రోజన్ నిల్వకు, సమర్థ వినియోగానికి కూడా ఏఐ మార్గదర్శకత్వం వహిస్తోంది.

ప్రస్తుతం ఉక్కు, సిమెంటు ఉత్పత్తికీ, రవాణాకూ, విమానయానానికీ శిలాజ ఇంధనాలను వాడుతుండటంతో వాతావరణంలోకి పెద్దయెత్తున కార్బన్ డై ఆక్సైడ్ విడుదలవుతోంది. నీటిని విద్యుద్విశ్లేషణ (ఎలక్ట్రాలసిస్) ప్రక్రియతో విభజిస్తే హైడ్రోజన్, ఆక్సిజన్ ఉత్పన్నమవుతాయి. ఈ ప్రక్రియ బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాల మాదిరిగా ఉద్గారాలను వెలువరించదు. సహజవాయువు, బొగ్గు, చమురులను మండించగా వచ్చే విద్యుచ్ఛక్తితో నీటిని విభజిస్తే బ్లూ, గ్రే హైడ్రోజన్‌లు ఉత్పన్నమవుతాయి. ఈ ప్రక్రియ కూడా ఉద్గార కారకమే. దీనికి భిన్నంగా సౌర, పవన తదితర పునరుత్పాదక ఇంధన వనరులతో తయారైన విద్యుత్తుతో నీటిని విభజిస్తే వచ్చేదే గ్రీన్ హైడ్రోజన్. ఇది ఉద్గారాలకు తావివ్వని స్వచ్ఛమైన ఇంధనం.



అయితే, దీని ఉత్పత్తిలో ఆర్థిక, సాంకేతిక, నిర్వహణ సంబంధ సమస్యలు ఉన్నాయి. విద్యుద్విశ్లేషణ వ్యయభరితమైనది. తక్కువ ధరకు లభ్యమయ్యే ఉత్ప్రేరకాలను ఉపయోగించి ఆ ఖర్చును తగ్గించడానికీ, తక్కువ కరెంటుతో సమర్థంగా విద్యుద్విశ్లేషణ సాధించడానికీ ఏఐ, మెషీన్ లెర్నింగ్ సాంకేతికతలు కీలకమవుతున్నాయి.

తక్కువ ఖర్చులో...

గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఉష్ణోగ్రత, పీడనం, సాంద్రత వంటి అంశాలను సమర్థంగా నియంత్రించి, ఇంధన వృథాను తగ్గించి ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచడంలో ఏఐ సఫలమవుతోంది. జర్మన్ సంస్థ సీమెన్స్ ఎనర్జీ- ఎలక్ట్రాలసిస్ ప్రక్రియను మరింత సునిశితం చేసి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదన సామర్థ్యాన్ని పది శాతం పెంచడానికి ఏఐని నియోగించింది. ఉత్పత్తి ప్రక్రియలో ఎదురుకాగల సమస్యలను ముందే గుర్తించి సరిదిద్దడానికీ ఏఐ ఉపకరిస్తోంది. సీమెన్స్ నియోగించిన ఏఐ సిస్టమ్స్ విద్యుద్విశ్లేషక పరికరాల నిర్వహణ ఖర్చును 25శాతం తగ్గించింది. ప్రస్తుతం కిలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి నాలుగు డాలర్ల చొప్పున ఖర్చవుతోంది. ఇరిడియం, ప్లాటినం వంటి ఖరీదైన ఉత్ప్రేరకాలతో విద్యుద్విశ్లేషణ చేయాల్సి రావడమే దీనికి కారణం. ఇంతకన్నా తక్కువ ఖర్చుతో ఫలితాలు సాధించగల ఉత్ప్రేరకాల కోసం కెనడాలోని టొరంటో విశ్వవిద్యాలయ పరిశోధకులు నడుంకట్టారు. ఏఐ సాయంతో 36వేల లోహ ఆక్సైడ్ మిశ్రమాలను పరిశీలించి రుథేనియం-క్రోమియం-టైటానియం మిశ్రమంతో విద్యుద్విశ్లేషణ ఖర్చును తగ్గించి, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదన సామర్థ్యాన్ని పెంచవచ్చని కనుగొన్నారు. ఐఐటీ-మద్రాసు పరిశోధకులు కూడా 16వేల డేటా పాయింట్లను ఏఐ సాయంతో విశ్లేషించి బైమెటాలిక్ ఉత్ప్రేరకాలను రూపొందించారు. ప్రయోగశాలలో చేసే పరిశోధనల్లో కొన్నే సఫలమవుతాయి. ఇది ఎంతో సమయం, వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. ఏఐ దీన్ని వేగవంతం చేసి తక్కువ ఖర్చులో ఆశించిన ఫలితాన్ని ఇచ్చింది.

సౌర, పవన, జలవిద్యుత్తులతో విద్యుద్విశ్లేషణే గ్రీన్ హైడ్రోజన్‌కు కీలకం. అయితే ఈ పునరుత్పాదక ఇంధనాలు ఎల్లవేళలా లభ్యం కావు. ఎండా కాలం జలవిద్యుదుత్పాదన కుంటుపడుతుంది. రాత్రివేళ సౌర విద్యుదుత్పాదన కుదరదు. రోజంతా పవన విద్యుత్తుకు కావాల్సిన గాలులు వీయవు. ఇలాంటి అంశాలన్నింటినీ కృత్రిమ మేధ పరిగణనలోకి తీసుకుని ఏయే సమయాలలో గరిష్ఠంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సాధించవచ్చునో సూచించగలదు. ఉత్పాదనలో అంతరాయాలు లేకుండా చూడగలదు. అందుకే విద్యుత్ గ్రిడ్లను, గ్రీన్ హైడ్రోజన్ కర్మాగారాలను ఏఐ చోదిత ఇంధన నిర్వహణ వ్యవస్థ(ఈఎంఎస్)లతో అనుసంధానిస్తున్నారు. గ్రీన్ హైడ్రోజన్ మార్కెట్ ధరలను, వాతావరణ అంచనాలను, నిల్వలు, ఉత్పత్తి లక్ష్యాలను ఈఎంఎస్‌లు ఎప్పటికప్పుడు విశ్లేషిస్తాయి. తక్కువ వృథాతో గరిష్ఠంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదనకు అవి తోడ్పడుతున్నాయి. జీరోఏవియా సంస్థ నియోగించిన ఈఎంఎస్ సాఫ్ట్‌వేర్ ఏఐ సాయంతో ఉత్పత్తి వ్యయాన్ని 20శాతం తగ్గించింది. తక్కువ కర్బన ఉద్గారాలకు కారణమవుతూ అమెరికా, ఈయూ ప్రభుత్వాల నుంచి సబ్సిడీలు పొందడానికి కారణమైంది.

నిల్వ సామర్థ్యం ముఖ్యం

హైడ్రోజన్ తేలిగ్గా మండిపోతుంది. చెల్లాచెదురవుతుంది. స్మార్ట్ సెన్సర్లను ఉపయోగించి హైడ్రోజన్ లీక్‌ల గురించి హెచ్చరించే సత్తా ఏఐకి ఉంది. దీనితోపాటు నిల్వలో పీడనాన్ని గమనించి ముమ్ముందు రాగల ప్రమాదాలనూ తెలుపుతుంది. వివిధ ఉష్ణోగ్రత, పీడన స్థాయులలో మెగ్నీషియం ఆధారిత మిశ్రమ లోహాలను, 2డి వ్యవస్థలనూ ఉపయోగించి గ్రీన్ హైడ్రోజన్‌ను భద్రంగా నిల్వచేయడానికి ఏఐ తోడ్పడుతుంది. హైడ్రోజన్‌ను ట్యాంకర్లలో నింపి వేగంగా రవాణా చేయడానికి అనువైన మార్గాలను తెలుపుతుంది. పంపిణీ వ్యవస్థలో లోడ్‌లను సమతౌల్యపరుస్తుంది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఎంత పరిమాణంలో ఎలక్ట్రోలైజర్లు కావాలి, ఎంత నిల్వ సామర్థ్యం అవసరం అనే అంశాలపై ప్రభుత్వాలకు ఏఐ సరైన సలహాలు ఇస్తుంది. తద్వారా పెట్టుబడులకు భరోసా కల్పించి, ప్రాజెక్టులు వేగంగా కార్యరూపంలోకి ధరించడానికి తోడ్పడుతుంది.

భారతదేశం 2030కల్లా ఏటా 50 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్షిస్తోంది. దీన్ని సుసాధ్యం చేయడానికి ఏఐ తప్పనిసరి. దక్షిణ కొరియా నుంచి ఆస్ట్రేలియా వరకు ఏఐ సాయంతో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అనుసరిస్తున్న విధానాల నుంచి భారత్ నేర్చుకోగలిగింది ఎంతో ఉంది. అమెరికాలో హనీవెల్ సంస్థ నియోగించిన ఏఐ ఆధారిత ప్రోటోనియం టూల్- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని సమర్థవంతం చేస్తోంది. ఈ ఏఐ టూల్‌ను అమెరికా తూర్పుతీరంలోని శుద్ధ హైడ్రోజన్ ప్రాజెక్టులో తొలిసారి నియోగిస్తున్నారు. చాట్ జీపీటీ తదితర ఏఐ టూల్స్ పెద్దయెత్తున విద్యుత్తును ఉపయోగిస్తాయి. ఏఐ అభివృద్ధి చెందే కొద్దీ విద్యుత్ వినియోగమూ పెరిగిపోతుంది. గ్రీన్ హైడ్రోజన్ ద్వారా ఆ గిరాకీని తీర్చాలి. ఈ స్వచ్ఛ ఇంధన ఉత్పత్తిని అపారంగా పెంచడం ద్వారా దేశాల ఆర్థికాభివృద్ధికీ ఏఐ ఊతమివ్వనుంది.

హరికృష్ణ నిబానుపూడి
సీనియర్ యూఎన్ క్లైమేట్ ఎమర్జెన్సీ అడ్వైజర్



ఆ స్థానం కావాలా?

'ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతా నాన్నా' అంది సౌజన్య. 'మంచిదమ్మా!' నవ్వుతూ అన్నాడు నాన్న. 'ఎందుకు నవ్వుతున్నారు?' 'ఎందుకా? మూడేళ్ల కోర్సు నువ్వెప్పుడు పూర్తిచేయాలీ అని. ఇంటర్ రెండేళ్లు చదివి రెండు నెలల్లో పరీక్షలనగా కాలేజీ మానేశావ్ మరి!' అన్నాడు నాన్న. 'సరే, డిగ్రీ పూర్తి చేస్తా చూడు' ఛాలెంజింగ్‌గా అంది సౌజన్య.

ఎంట్రన్స్ రాసి పాసై డిగ్రీలో చేరింది. మొదటి ఏడాది పూర్తిచేసి రెండో ఏడాది ఫీజు కట్టింది. అంతే, చదువు మీద ఆసక్తి పోయింది. అయిదారు నెలల తరవాత 'కంప్యూటర్ కోర్స్ చేస్తా నాన్నా' అంది. 'సరే' అన్నాడు నాన్న. అదీ మధ్యలోనే ఆపేసింది. 'ఇలాగైతే ఎలాగమ్మా? ఇష్టమో కష్టమో ప్రారంభించిన పని పూర్తిచేయాలి' అన్నాడు. 'మీరు మాత్రం ఏది పూర్తిచేశారు కనుక? కండక్టర్ ఉద్యోగం నచ్చక రాజీనామా చేశారు. వ్యవసాయం మొదలెట్టారు. రెండేళ్లు చేశాక మెడికల్ షాప్ అన్నారు. తరువాత రియల్ ఎస్టేట్ బిజినెస్ అన్నారు. మీ లక్షణాలే వచ్చాయి అమ్మాయికి కూడా' అంది భార్య సూర్యప్రభ. ఏమంటాడు... ఆమె అన్నది నిజమే మరి!

ఆనంద్ రెండు నవలలు రాశాడు. మంచి రచయితగా గుర్తింపు వచ్చింది. ఆ ఉత్సాహంతో కొత్త నవల మొదలుపెట్టాడు. కొంత రాసి ఆ సబ్జెక్ట్ వర్కవుట్ కాదని, పత్రిక వాళ్లు వేసుకోరని పక్కన పడేశాడు. అలా నాలుగైదు నవలలు మొదలుపెట్టడం, అసంపూర్తిగా వదిలేయడం... నెలల తరబడి సమయం వృథా. ఆదాయం లేదు. ఈలోగా పాఠకులూ అతణ్ని మర్చిపోయారు.

భాస్కర్ సినిమా వ్యామోహంతో నిర్మాత కావాలనుకున్నాడు. ఉన్నదంతా తెగనమ్మి ఆ డబ్బుతో భాగ్యనగరం చేరాడు. అట్టహాసంగా ఒకేసారి రెండు సినిమాలు ప్రారంభించాడు. రెండూ సగం సగం పూర్తయ్యాయి.. ఇంతలో ఏదో అవాంతరం వచ్చి పని ఆగిపోయింది. రోజులు గడుస్తున్నకొద్దీ డబ్బంతా అయిపోయింది. అతడికి పూట గడవడమే కష్టంగా ఉంది, ఇక సినిమాలకి డబ్బు ఎక్కడినుంచి తెస్తాడు. ఆర్భాటాలకు పోకుండా ఒక్క సినిమా తక్కువ బడ్జెట్‌లో ప్లాన్ చేసి చక్కగా పూర్తి చేస్తే భవిష్యత్తుకు మంచి పునాది వేసుకున్నట్లయ్యేది. ఇలా పనుల్ని సగంలో ఆపేసే ఆరంభశూరులు అన్ని రంగాల్లోనూ ఉంటారు. ఒక పనిని మొదలు పెట్టడానికి ముందు దానికి సంబంధించిన మంచి చెడులు, లాభనష్టాలు, ఉన్న వనరులు, కలిగే ఆటంకాలు... లాంటివన్నీ ఒకటికి నాలుగు సార్లు విశ్లేషించుకోవాలి. పూర్తిగా స్పష్టత వచ్చాకే పని ప్రారంభించాలి. అప్పుడే అవాంతరాలను అధిగమించి లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు. ఆలోచనలు అందరికీ వస్తాయి. వాటిని ఆచరణలో పెట్టగలవారు కొందరే. ఆ కొందరిలోనూ అతి కొద్దిమందే పూర్తి చేస్తారు. వాళ్లే విజేతలుగా నిలుస్తారు. పట్టుదల సడలకుండా, దృష్టి మరలకుండా లక్ష్యం దిశగా సాగేవారే విజేత స్థానాన్ని అందుకోగలరు.

– మొలకలపల్లి కోటేశ్వరరావు

పరిశ్రమల్లో రోబోలు

తయారీ రంగంలో క్లిష్టమైన పనులను వేగంగా, పక్కాగా పూర్తి చేయడానికి రోబోలు తోడ్పడతాయి. అందుకే పరిశ్రమలు వాటిని విరివిగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. 2023లో ఇండియాలోని పరిశ్రమల్లో అలా 8510 రోబోలు కొలువుతీరాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇవి 59శాతం అధికం. అయితే, తయారీ రంగంలో రోబోల వినియోగంలో చైనా రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. 2019లోనే చైనాలో 1.48 లక్షల రోబోలు పరిశ్రమల్లో పనిచేస్తుండేవి. ఆ తరవాత మూడేళ్లలో వాటి సంఖ్య దాదాపు వంద శాతం పెరిగింది. 2023లో పారిశ్రామిక రోబోలు అత్యధికంగా ఉన్న అయిదు దేశాలు, వాటిలో రోబోల సంఖ్య...



చైనా	2,76,000
జపాన్	46,000
అమెరికా	38,000
దక్షిణ కొరియా	31,000
జర్మనీ	28,000

(ఆధారం: ఏఐ ఇండెక్స్ రిపోర్ట్-2025)

'హరి యవతార మీతడు అన్నమయ్య'

భక్తికవిత్వాన్ని, సమాజాభ్యుదయాన్ని సమన్వయపరచిన సంకీర్తనాచార్యుడు తాళ్లపాక అన్నమయ్య. ఈ అనుభవ సముద్రుడి కీర్తనలు శ్రీవేంకటేశ్వర ముద్రాంకితాలు. తెలుగు తియ్యదనానికి, భక్తి పరిమళానికి మణితోరణాలు! పదకవితా పితామహుడు అన్నమయ్య జయంతి సందర్భంగా...

సంకీర్తనా సుమాలతో తిరుమల శ్రీనివాసుణ్ని అర్చించి తరించిన అసామాన్య భక్తుడు తాళ్లపాక అన్నమయ్య. 'వెన్నతో నాకు కలిగె వేంకటేశు మంత్రము' అంటూ బాల్యం నుంచే ఆ బ్రహ్మాండనాయకుడికి అంకితమైన భాగవతోత్తముడు. క్రీ.శ.1408లో వైశాఖ పూర్ణిమనాడు జన్మించాడీ ధన్యాత్ముడు. అన్నమాచార్య దార్శనికుడైన కవి, సాధకుడైన భావుకుడు. భక్తి కవిత్వాన్ని, వ్యక్తి సంస్కరణను సమన్వయ పరచిన సంకీర్తనాచార్యుడు.



అచ్చతెలుగులో మధుర కీర్తనలు

అన్నమాచార్యుల పదాలు భావప్రధానాలు. ఆయన కీర్తనలు భక్తిరసప్రవాహాలే కాదు జ్ఞానామృతధారలు కూడా! అలతి పదాల్లో అనల్ప భావాల్ని ఒలికించిన కవికుల తిలకుడు అన్నమయ్య. సహజసుందరమైన జాతీయాలతో సంకీర్తనలను సుసంపన్నం చేసిన సరస్వతీపుత్రుడు. 'అన్నమాచార్యుల పదకవిత సారస్వత క్షీరసాగరం. శైలిలో, భావవైవిధ్యంలో ఆయన రచనను మించింది తెలుగు వాఙ్మయంలో లేదు' అని కొనియాడారు అన్నమయ్య సంకీర్తనలపై విస్తృతంగా పరిశోధించి, ఆ పదాలకు స్వరాలను సమకూర్చిన 'సంగీత కళానిధి' రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ. అమిత భక్తితో అన్నమయ్య 'జో అచ్యుతానంద జోజో ముకుంద...' అని అంతర్యామిని లాలించినా, 'జయలక్ష్మి వరలక్ష్మి సంగ్రామ వీరలక్ష్మి' అంటూ అమ్మవారిని అభివర్ణించినా అవి ఆచంద్రార్కం నిలిచిపోయేవే!

సాహిత్య ప్రయోజనం సామాన్యుడికి సైతం అందాలని తపించిన భాషాభిమాని అన్నమయ్య. ఇతర కవులు సంస్కృత పదాలు వాడేచోట ఆయన ప్రయత్నపూర్వకంగా దేశ్య పదాలను ప్రయోగించాడు. వ్యావహారిక భాషలో కీర్తనలు రాయటమే ప్రధాన కవితా వ్యాసంగంగా పెట్టుకున్నాడు. అచ్చ తెలుగుకు, మాండలికానికి, గ్రామీణ పదజాలానికి పట్టం కట్టాడు. పల్లెపదాలను పరిమళింపజేశాడు. క్షీరాన్నం, పరమాన్నం, పాయసం అనే పదార్థాన్ని పాలకూడు, పాల పొంగలి అనీ; అయస్కాంతాన్ని సూదిరాయి, అంటురాయి... అనీ అన్నాడు అన్నమయ్య. శుభవార్తను మేలుసుద్ది అనీ, దీపావళిని దివ్వెలపండుగ అనీ వ్యవహరించాడు. ఈనాడు వాడుకలో ఉన్న ఆంగ్లపదాలకు కూడా ఆనాడే ఆ పదకవితా పితామహుడు చక్కటి తెలుగు పదాలు కనిపెట్టాడు. ఉదాహరణకు డబుల్ కాట్‌ని ఆయన 'జమలిపాన్పు' అని పేర్కొన్నాడు. అగ్రిమెంట్‌కి 'బాసపత్రిక' అని, రిప్లై కార్డ్‌కి 'మారుగమ్మ' అని ప్రత్యామ్నాయ పదాల్ని ప్రయోగించాడు. ఆదాయపు పన్నును 'కలిమి దండుగ' అన్నాడు. ప్రజలు నిత్య జీవితంలో వ్యవహరించుకునే మాండలిక పదాల ప్రాముఖ్యాన్ని గుర్తించి, కీర్తనల్లో వాటికి స్థానం కల్పించి తెలుగుదనాన్ని పెంచిపోషించాడు. అందుకే 'అన్నమయ్యను చదవనివాడు తెలుగు చదివినట్లే కాదు' అన్నారు ఆయన కీర్తనలపై పరిశోధనలు చేసిన వేటూరి ప్రభాకరశాస్త్రి. తెలుగు కవిత్వంలో భక్తిని శృంగారంతో జోడించిన తొలి పదకర్త అన్నమాచార్యే అని చెబుతారు. ఆయన కీర్తనల్లో జోలపాటలు, సువ్విపాటలు, సంవాద పదాలు, దోబూచి పదాలు వంటి తెలుగు జానపదగేయ స్వరూపాలు కోకొల్లలు. అలాగే తెలుగు పల్లెల్లో తొలిపొద్దు నుంచి వినిపించే మేలుకొలుపులు, గొబ్బిపదాలు, దంపుళ్ళు, కోలాటాలు, తుమ్మెదపదాలు, తత్వాలు వంటివాటికే కాక పెళ్లిపేరంటాళ్లలో వినిపించే మంగళహారతులు, ఊయలపాటలకు కూడా తన పదకవితలతో శాశ్వతత్వం కల్పించాడు.

ఇంటి నుంచే సంస్కరణ

మతమౌఢ్యాన్ని, ఆచారాల ముసుగులో జరుగుతున్న అమానుషత్వాన్ని నిరసించి, నైతిక నియమావళిని నిర్దేశించాడు అన్నమయ్య. పారమార్థిక సత్యాలనే కాదు ప్రాపంచిక పోకడలను కూడా తన పదాల్లో ప్రస్తావించి, పరివర్తన కోసం పాటుపడ్డాడు. 'అన్నమయ్య అనుభవ సముద్రుడు' అన్నారు ఆరుద్ర. పురందరదాసు, వెంగమాంబ లాంటి వాగ్గేయకారులపై పదకవితా పితామహుడి ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సంస్కరణను తన ఇంటి నుంచే ఆరంభించిన సంస్కారి. అర్ధాంగి తాళ్లపాక తిమ్మక్కకి విద్య నేర్పి విద్వాంసురాలిగా తీర్చిదిద్దాడు. 'సుభద్రా కల్యాణము' కావ్యాన్ని రచించేలా ప్రోత్సహించి, తెలుగు సాహితీలోకానికి తొలి కవయిత్రిని పరిచయం చేశాడు. ఆత్మగౌరవం, ఆత్మాభిమానమే భక్తుల అర్హతలు, అసలైన ఆభరణాలని అన్నమయ్య నిరూపించాడు. రాజులు, వారి అనుగ్రహాలు, అగ్రహారాలూ శాశ్వతం కాదు. భగవంతుణ్ని వదిలి భౌతిక సుఖాల కోసం ఆరాటపడటం అల్పత్వం. మన పాలకుడు, పోషకుడు ఆ పరమాత్మేనన్న నియమానికి ఆజన్మాంతమూ కట్టుబడి ఉన్నాడు. సమ్మోహపరిచే తన కవితాశక్తిని సప్తగిరీశుడి వరప్రసాదంగానే భావించాడు. 'దాచుకో నీ పాదాలకు తగనే జేసిన పూజలివి...' అంటూ తన 32 వేల సంకీర్తనల సంపదను శ్రీనివాసుడి శ్రీచరణాలకు సమర్పించాడు. తుదిశ్వాస వరకూ ఆ తిరుమలవాసుడి స్మరణలోనే లీనమై తుదకు ఆయనలోనే ఐక్యమైపోయాడు. భక్తుడు, భగవంతుడు అభిన్నులని అశేష భక్తావళికి చాటి చెప్పాడు. అందుకే 'హరి యవతార మీతడు అన్నమయ్య' అని అతని పుత్రపౌత్రులు కీర్తించటంలో అతిశయోక్తి లేదు.

– బి. సైదులు

హాయ్! బుజ్జీ

గమ్యాన్ని చేరాలంటే...

ఆ వనానికి సింహం మృగరాజు. మంత్రి సుబుద్ధి అనే కుందేలు. ఒకరోజు మృగరాజుతో.. 'రాజా! వయసు పైబడటంతో.. పనులు చేయలేకపోతున్నాను. నా స్థానంలో వేరొక మంత్రిని ఎంపిక చేయడం మంచిది' అంది సుబుద్ధి. దాంతో.. 'మంత్రి పదవి కోసం పోటీ నిర్వహిస్తున్నాం. ఆసక్తి ఉన్నవాళ్లు పాల్గొనవచ్చు' అని దండోరా వేయించింది సింహం. చివరి పోటీకి మంత్రి సుబుద్ధి బిడ్డ ఆకర్ష, ఎలుగుబంటి చేరుకున్నాయి. సుబుద్ధి వచ్చి.. 'అదిగో ఆ దూరంగా కనిపించే కొండ మీద ఒక పువ్వు పెట్టాం. దాన్ని ఎవరైతే ముందుగా తీసుకొస్తారో వాళ్లే గెలిచినట్లు' అని చెప్పింది. పోటీ ప్రారంభమైంది. మృగరాజుతో సహా మిగతా అన్ని జంతువులు.. చురుగ్గా ఉండే సుబుద్ధి బిడ్డే విజేతగా నిలుస్తుందనుకున్నాయి. కానీ.. సుబుద్ధి మాత్రం ఎలుగుబంటే గెలుస్తుందని చెప్పింది. అది అలా ఎందుకు చెబుతుందో ఎవరికీ అర్థంకాలేదు. సుబుద్ధి చెప్పినట్లుగానే.. ఎలుగే పువ్వు పట్టుకొచ్చింది.



అప్పుడు మృగరాజు.. 'ఎలుగుబంటి విజయం సాధిస్తుందని ఎలా చెప్పగలిగావు?' అని అడిగింది. 'ఆకర్ష, ఎలుగు కొండను చేరుకునే దారిలో వాటికి ఇష్టమైన ఆహారపదార్థాలు పెట్టించాను. ఎలుగు వాటిని పట్టించుకోకుండా పువ్వు ఉన్న వైపే నడుస్తూ ఉంది. కానీ ఆకర్ష మాత్రం.. ఎదురుపడిన ప్రతీ ఆహారం దగ్గర ఆగి.. వాటిని తింటూ సమయం వృథా చేసింది. మన గమ్యాన్ని చేరుకునే మార్గంలో చాలా అడ్డంకులు వస్తాయి. అందులో కొన్ని మనకు చాలా నచ్చినవి కూడా అయి ఉండొచ్చు. కానీ అవేమీ పట్టించుకోకుండా లక్ష్యం మీదే దృష్టి పెట్టాలి. అప్పుడే ఎందులోనైనా విజయం సాధించగలం. అందుకే అది పాటించిన ఎలుగు విజయం సాధించింది' అని చెప్పింది సుబుద్ధి.

– కొమ్ముల వెంకట సూర్యనారాయణ

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ప్రారంభమయ్యే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవీ కలిసిపోయాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం.

జింక	వెన్న	బాతు
తాళంచెవి	నిమ్మకాయ	పాచికలు
గొడుగు	వజ్రాలు	గాడిద

సిరిగల నేత.. సొగసుల కలబోత





అనన్య

మంగళగిరి, న్యూస్‌టుడే: మాతృ దినోత్సవం సందర్భంగా మంగళగిరి చేనేత వస్త్రాలు, ఐటీశాఖ మంత్రి లోకేశ్ ఏర్పాటు చేసిన వీవర్‌శాలలో రూపొందించిన డిజైన్ వస్త్రాలను తెలియజేసేందుకు విజయవాడకు చెందిన 'వీ వైజ్' సంస్థ ఆదివారం సాయంత్రం మంగళగిరిలోని ఎన్‌ఆర్‌ఐ జంక్షన్ వద్ద 'శారీ వాక్' పేరుతో ఫ్యాషన్ షో నిర్వహించింది. ఇందులో భాగంగా మంగళగిరి మగ్గాలపై తయారు చేసిన దుస్తులతో మోడళ్లు మెరిశారు. చేనేత కళాకారుల్లో నైపుణ్యం, భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా రూపొందించిన వస్త్రాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక అతిథిగా హాజరైన సినీనటి అనన్య చేనేత వస్త్రాల్లో కనిపించడంతో అభిమానులు కేరింతలు కొట్టారు. తొలుత నిర్వహించిన 3కే రన్‌లో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

తెలంగాణ ఎప్‌సెట్‌లో విజయవాడ విద్యార్థికి పదో ర్యాంకు



'మా స్వస్థలం విజయవాడ. ప్రస్తుతం కేపీహెచ్‌బీలో నివాసం ఉంటున్నాం. అమ్మ, నాన్న ఇద్దరూ వైద్యులు. చిన్నప్పటి నుంచి ప్రోత్సహించారు. జేఈఈ మెయిన్‌లో 256 ర్యాంకు, ఇంటర్మీడియట్‌లో 983 మార్కులు సాధించాను. ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగంలో పదో ర్యాంకు సాధించాను. ఐఐటీ బొంబాయిలో సీటు సాధించాలని కష్టపడుతున్నాను. మంచి ర్యాంకు సాధిస్తానని నమ్మకం ఉంది. భవిష్యత్తులో ఐటీ సంస్థను స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను' - కొమ్మ శ్రీకార్తిక్

– న్యూస్‌టుడే, హైదరాబాద్

పెంచుడు.. పంచుడు.. గుంజుడు!

- తాళ్లాయపాలెం ఉపకేంద్రం రీరూటింగ్ పనుల్లో దోపిడీ
- వైకాపా హయాంలో ఏకంగా ఏడు రెట్లు పెంచి దందా

ఈనాడు – అమరావతి

అడిగే వారు లేరని.. కిలోమీటరు విద్యుత్తు లైన్ కోసం రెండేళ్ల వ్యవధిలో ఏకంగా 7 రెట్లు అధికంగా అంచనాలు పెంచేసి అడ్డగోలుగా దోచుకున్నారు. వైకాపా హయాంలో అప్పటి విద్యుత్తు శాఖ మంత్రి పెద్దిరెడ్డి బంధువు ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించారు. అప్పట్లో ట్రాన్స్‌కోలో ఈ అధికారి చక్రం తిప్పారు. రాజధానిలోని తాళ్లాయపాలెం జీఐఎస్ ఉపకేంద్రం లైన్ దారి మార్చడంతోపాటు ఇన్‌కమింగ్ కనెక్షన్ ఇచ్చే పనుల్లో జరిగిన దందా ఇది.. ఓ గుత్తేదారుకు పని ఇచ్చేందుకు ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారు.

లెక్కగట్టిందే అధికం...

రాజధాని ప్రాంత అవసరాలు తీర్చేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం తాళ్లాయపాలెంలో 400 కె.వి జీఐఎస్ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు నిర్ణయించింది. రూ.375 కోట్లకు పరిపాలనా ఆమోదం ఇచ్చింది. పనులు ప్రారంభమైన తర్వాత ప్రభుత్వం మారి... వైకాపా అధికారంలోకి వచ్చింది. ఉపకేంద్రం స్థలం మధ్యలో నుంచి పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌కు చెందిన 400 కె.వి లైన్ వెళ్తోంది. దీనిని అర కి.మీ మేర దారి మార్చాలని గత ప్రభుత్వం హయాంలో 2020లో ట్రాన్స్‌కో అధికారులు నిర్ణయించారు. దీంతోపాటు ఈ

400 కె.వి లైన్ అడ్డగోలు ధరలు (రూ.లలో)ఇలా..

సరఫరా..	2020	2022
ఎలక్ట్రికల్	4,08,04,662.39	13,01,49,641.00
టెలికామ్	3,04,386.46	32,55,698.00
ఏర్పాటు..		
ఎలక్ట్రికల్	83,99,567.81	6,35,87,541.00
టెలికామ్	1,16,124.54	
సివిల్	1,83,75,956.00	23,44,15,873.00



జీఐఎస్ ఉపకేంద్రం

రెండేళ్లకే అమాంతం పెంచేసి...

అంచనా వ్యయానికి ఆమోదం తెలిపాక ఈ పనులకు టెండర్లు పిలవలేదు. తర్వాత రెండేళ్లకు 2022 సెప్టెంబరులో అంచనా వ్యయాన్ని అమాంతం పెంచేసి ఉత్తర్వులు ఇచ్చారు. రెండేళ్ల కిందట కిలోమీటరు దూరం అని పేర్కొన్నారు. ఆతర్వాత దూరాన్ని అర కిలోమీటరు పెంచారు. వ్యయాన్ని పెంచేందుకు దీనిని సాకుగా చూపించారు. దూరం 0.5 కి.మీ పెరిగిందనుకున్నా.. రూ.10 కోట్లు కావాల్సి ఉంది. కానీ ఏడు రెట్లు పెంచి రూ.43 కోట్లుగా నిర్ణయించారు. ధరలు పెంచేసిన తర్వాత ట్రాన్స్‌కో అధికారులు టెండర్లు పిలిచారు. టెండర్లలో రింగ్ అయి ఇద్దరే పాల్గొన్నారు. తమకు కావాల్సిన వ్యక్తికి దక్కేలా చక్రం తిప్పి గుత్తేదారుకు కట్టబెట్టారు.

ఉపకేంద్రానికి సమీపం నుంచి వెళ్తున్న 400 కేవీ వీటీపీఎస్ - సత్తెనపల్లి లైన్ నుంచి సరఫరా పని కూడా దానినీ కలిపి టెండర్లు పిలిచారు. అర కిలోమీటరు దూరంలోని ఈ లైన్ నుంచి ఇన్‌కమింగ్ కనెక్షన్ ఇవ్వాలి. రెండు పనులకు కలిపి 1 కి.మీ మేర లైన్ వేసేందుకు రూ. 6.80 కోట్లు వ్యయంగా లెక్కగట్టారు.

ఎస్ఎస్ఆర్‌కూ అందనంతగా..

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్ రేట్) ప్రకారం ఇదే పనికి కిలోమీటరు విద్యుత్తు లైన్ వ్యయం రూ.1.41 కోట్లు. దీనిని కూడా అధిగమించి తాళ్లాయపాలెం సబ్‌స్టేషన్‌కు కి.మీకు రూ.6.80 కోట్లుగా ట్రాన్స్‌కో అధికారులు తేల్చారు. ఇదే ఎక్కువ అనుకుంటే.. రెండేళ్ల తర్వాత టెండర్లు పిలిచే సమయానికి ఏడు రెట్లు పెంచారు. ట్రాన్స్‌కో ఎస్ఎస్ఆర్ ప్రకారమే.. రెండేళ్లకు 8 శాతం పెరగాలి. కానీ 700 శాతం పెంచారు. అడ్డగోలు ధరల ప్రకారం పనులు చేసి, వాటాలు వేసి పంచుకున్నారు. గత ఏడాది ఈ ఉపకేంద్రాన్ని చార్జి చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటికీ దీనికి ఔట్ గోయింగ్ లేదు. నేలపాడు పరిధిలో ప్రతిపాదించిన 220 కేవీ ఉపకేంద్రం ఇంకా టెండర్ల దశలోనే ఉంది. మరో ఏడాదిన్నరకు కానీ ఇది పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చే అవకాశాలు లేవు. కానీ ఇందుకు 2023లోనే దారి మార్చే పనులు చేశారు. ఇదంతా కేవలం పనుల పేరుతో దోచుకునేందుకే అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఘంటసాలలో బుద్ధ జయంతి నేడు

ఘంటసాల, న్యూస్‌టుడే: ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని బుద్ధ జయంతి వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పలువురు మంత్రులు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటలకు బౌద్ధ మహాస్తూపం వద్ద బౌద్ధ గురువు బంతేజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సాయంత్రం బహిరంగ సభ జరుగుతుంది. అనంతరం స్థానిక జడ్పీ పాఠశాల సమీపంలోని 'బుద్ధ విహార్' వద్ద పలువురు బౌద్ధ ప్రముఖులచే 'బౌద్ధ సాహితి- చారిత్రక ప్రాధాన్యం' అంశంపై సదస్సులు జరుగుతాయి.

ఈనాడు ఈప్రతిభ & వీవీఐటీ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈఏపీసెట్ 2025 ఆన్‌లైన్ మాక్‌టెస్ట్

Eenadu Epratibha

ఈనాడు, అమరావతి: ఏపీలో ఈఏపీసెట్ 2025 (ఇంజినీరింగ్)కు హాజరుకానున్న అభ్యర్థుల కోసం ఈనాడు ఈప్రతిభ - వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ మాక్‌టెస్ట్ విజయవంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ మాక్‌టెస్ట్‌లో మొదటి పది ర్యాంకర్లకు ముందుగా ప్రకటించిన విధంగా త్వరలో బహుమతులు అందించనున్నారు.

VVIT UNIVERSITY VASIREDDY VENKATADRI INTERNATIONAL TECHNOLOGICAL UNIVERSITY

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

జిల్లాలో 73 కేంద్రాలు

మాచవరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి(డీఐఈవో) బి.ప్రభాకరరావు తెలిపారు. ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి ఏడాది 28,999, రెండో ఏడాది 5,565 మంది హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షలు పూర్తిగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. 73 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని, 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 73 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు విధులు నిర్వహిస్తారు. పరీక్షల పర్యవేక్షణకు నాలుగు ఫ్లైయింగ్, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్స్ నియమించామన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లో ఒక డిప్యూటీ తహసీల్దారు, ఒక ఏఎస్ఐ, ఒక పీడీ/జేఎల్ ఉంటారన్నారు. సిట్టింగ్ స్క్వాడ్‌లో ఇద్దరు అధ్యాపకులు విధులు నిర్వహిస్తారన్నారు. పరీక్షల కేంద్రాల్లో మంచినీటి సదుపాయం, టాయిలెట్లు, నిరంతర విద్యుత్తు సదుపాయంతోపాటు వైద్య బృందం విధుల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, డీఐఈవో బి.ప్రభాకరరావు పేర్కొన్నారు. ఈ పరిధిలో జిరాక్స్ షాపులు మూసివేయాల్సి ఉంటుందన్నారు. వేసవి, ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అర్ధ గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ నంబరు 0866-2442362ను సంప్రదించాలని ఆయన సూచించారు.



కాలనీ వైపు అడ్డంగా పగిలి ఒరిగిన గోడ

మేలుకుంటారా.. ఊరుకుంటారా?

సింహాచలం దేవాలయంలో ఇటీవల గోడ కూలి ఏడుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవాలయం ప్రహరీని 'న్యూస్‌టుడే' పరిశీలించగా పలు చోట్ల నిలువునా పగుళ్లిచ్చి స్వల్పంగా ఒరిగి ప్రమాదకరంగా కనిపిస్తోంది. దేవాలయానికి చుట్టూ 18 ఏళ్ల కిందట 10 అడుగుల ఎత్తుతో ప్రహరీ నిర్మించారు. ప్రస్తుతం గోడ ప్రమాదకరంగా కనిపిస్తోంది. పక్కనే ఉన్న బంగారు కాలనీలో సుమారు వంద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీలో ఒక వీధి మొత్తం గోడ పక్కనే ఉంటున్నారు. 'గోడ ఎప్పుడు కూలుతుందోనని భయంగా ఉంది. నాలుగు చోట్ల నిలువునా పగుళ్లిచ్చాయి. కాలనీ వైపు గోడ ఒరిగింది.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది' అని కాలనీ వాసులు వాపోతున్నారు. దీనిపై ఆలయ ఈఈ రమ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా వెంటనే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు



పలు చోట్ల చీలిన గోడ

సోదరి కోసం వచ్చి.. మృత్యు ఒడికి..!

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సోదరిని ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన దుర్ఘటన అశ్వారావుపేటలో చోటు చేసుకుంది. ఎస్సై యయాతిరాజు కథనం ప్రకారం... ఏపీలోని విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన నామాల బాబ్జీ(31) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో అశ్వారావుపేట నందమూరినగర్‌లో ఉంటున్న తన సోదరి జాలాది క్రాంతిరేఖను తమ ఇంటికి తీసుకెళ్లేందుకు శనివారం వచ్చాడు. ఆదివారం సాయంత్రం సోదరి భర్త పవన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయటకువెళ్లి తిరిగి నందమూరినగర్ వస్తున్న క్రమంలో అశ్వారావుపేట ఆర్టీఏ చెక్‌పోస్టు సమీపంలో బస్సును అధిగమించే క్రమంలో లారీ ఢీకొంది. ఈ క్రమంలో బాబ్జీ వెనుక చక్రం కింద పడటంతో అతని నడుం మీదుగా ఎక్కి వెళ్లింది. క్షతగాత్రులిద్దరినీ అశ్వారావుపేట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా బాబ్జీ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పవన్‌ను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి కాంతారావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధేయతను వరించిన పదవి

కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఈశ్వర్



పటమట, విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : విజయవాడ తూర్పు నియోజకవర్గానికి చెందిన పేరేపి ఈశ్వర్‌ను రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన తెదేపా బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, తూర్పు నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. గతంలో విజయవాడ అర్బన్ బీసీ విభాగం అధ్యక్షుడిగా, 13వ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2009 నుంచి తెదేపాలో ఉన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అనుచరుడిగా, పార్టీకి విధేయుడిగా ఉండడం వల్లే ఈ పదవి వరించింది. మరోవైపు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం కలిసొచ్చింది. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ పార్టీకి అంకిత భావం, ఎమ్మెల్యే రామ్మోహన్ ఆశీస్సుల వల్లే తనకు పదవి లభించిందన్నారు. ఎంతో నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని తెలిపారు. కుమ్మరి శాలివాహనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

నేటి నుంచి విధుల్లోకి సీపీ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా పోలీస్ కమిషనర్‌గా రాజశేఖర్‌బాబు సోమవారం తిరిగి విధుల్లోకి చేరనున్నారు. వ్యక్తిగత పనులపై గత నెల 25న ఆయన 17 రోజులు సెలవు పెట్టి అమెరికా వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి సీపీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ప్రభుత్వం నియమించింది. మే 11తో ఆయన సెలవులు ముగిశాయి.

ఒడిశాలో కొనుగోలు.. విజయవాడలో అమ్మకం

అయిదుగురు గంజాయి విక్రేతల అరెస్టు

మధురానగర్, న్యూస్‌టుడే: ఎం.ఏడుకొండల గుణశేఖర్(25).. విజయవాడ గుణదలలో ఉండే ఇతను వివిధ రకాల పనులు చేసుకుంటూ గంజాయికి అలవాటు పడ్డాడు. సంపాదించిన సొమ్ముతో గంజాయి కొనుక్కుని తాగేవాడు. ఆ డబ్బు సరిపోక తానే గంజాయి వ్యాపారిగా మారాడు. అమ్మేవారి నుంచి గంజాయి ఎక్కడ దొరుకుతుందో తెలుసుకున్నాడు. ఒడిశాలోని మారుమూల ప్రాంతాలకు వెళ్లి గంజాయి తీసుకురావడం ప్రారంభించాడు. కిలోల కొద్దీ తెచ్చి అమ్మడంతో పెద్ద మొత్తంలో డబ్బులు వచ్చాయి. ఇదే అదనుగా గంజాయి వ్యాపారం ప్రారంభించాడు. ఒడిశా నుంచి తెస్తూ విజయవాడలో విక్రయించేవాడు. రెండుసార్లు దొరికిపోయి జైలుకు కూడా వెళ్లి వచ్చాడు.

స్నేహితులతో కలిసి...

జైలు నుంచి విడుదలైనా గంజాయి వ్యాపారం మానలేదు. స్నేహితులు కె.సాయినితిన్(20), కొత్తపల్లి వసంతకుమార్(22), వల్లపు మణికంఠ(21), కట్టా గోపి(26)లతో కలసి మధురానగర్‌లో ఒక గది అద్దెకు తీసుకుని ఉండేవాడు. కావాల్సినపుడల్లా ఒడిశా వెళ్లి గంజాయి తెచ్చి విజయవాడలో విక్రయించేవారు. వీరి కదలికలపై అనుమానం రావడంతో గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ వీరిపై నిఘా ఉంచారు. ఆదివారం ఉదయం గుణదల రైల్వేస్టేషన్ వద్ద వీరు ఉన్నారని సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడులు చేసి అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని తనిఖీ చేయగా మొత్తం 10 కిలోల గంజాయి పట్టుబడింది. వీరిని అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారు.

పదేళ్లుగా పద్మవ్యూహమే..!

పండ్ల మార్కెట్ తరలింపులో జాప్యం

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరంలోనే అత్యంత రద్దీగా ఉండి, తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడే ప్రాంతం.. కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్. ఇక్కడి నుంచి మార్కెట్‌ను తరలించాలనే ప్రతిపాదన దశాబ్దాల కిందటి నుంచే ఉన్నా అధికారుల్లో చిత్తశుద్ధి లేక కార్యరూపం దాల్చడం లేదు. ప్రధాన రహదారి ఆక్రమించి వ్యాపార లావాదేవీలు జరుపుతారు. ఆ పద్మవ్యూహాన్ని ఛేదించుకుని రాకపోకలు సాగించడం వాహనదారులకు నిత్యం నరకమే. తెల్లవారుజామున 6గంటల నుంచి రోడ్డు మీద వాహనాలను అడ్డంగా ఆపేస్తుంటారు. ఎంత పెద్ద ప్రముఖుడు వచ్చినా ట్రాఫిక్ వలయంలో చిక్కుకోవాల్సిందే. నున్నలో మార్కెట్ కోసం 22 ఎకరాలు సిద్ధం చేసినా అక్కడికి తరలించడంలో పదేళ్లుగా అధికారులు విఫలమవుతున్నారు. కేదారేశ్వరపేట మార్కెట్‌లోని పండ్ల వ్యాపారుల్లో అధిక శాతం మంది విశాలమైన నున్న మార్కెట్‌కు వెళ్లిపోయేందుకు సిద్ధంగా ఉన్నామంటూ సంతకాలు చేశారు. కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తున్నారు. విద్యా సంస్థలు, రైల్వేస్టేషన్ సహా రద్దీగా ఉండే ప్రాంతాలకు వేలాదిగా తిరిగే వాహనదారులకు ట్రాఫిక్ అవస్థలు తప్పించాలనే భావనలో అధికారులు ఉన్నారు. మార్కెట్‌ను తరలించమంటూ కేదారేశ్వరపేట రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధికారులను కలిసి వినతిపత్రాలు ఇస్తోంది. వ్యాపారులు, అధికారులు, ప్రజలంతా సుముఖంగా ఉండి, నున్నలో 22 ఎకరాల స్థలం సిద్ధంగా ఉన్నా ఎందుకు తరలించడం లేదనేది ప్రశ్నార్థకం.



రోడ్డుపైనే వాహనం ఆపి సరకు దించుతూ..

అప్పట్లో 20 మందే..

ఐదు దశాబ్దాల కిందట 20 మంది వ్యాపారులతో మార్కెట్ ఆరంభమైంది. ఆ తర్వాత 5.5 ఎకరాలు కొనుగోలు చేశారు. ఇప్పుడు 250మందికి పైగా ఉన్నారు. ఈ మార్కెట్ వ్యాపార లావాదేవీలకు ఏమాత్రం అనువుగా లేదు. ఆటోలు, డీసీఎంలు, భారీ కంటైనర్ లారీలను రోడ్డుపైనే ఆపేస్తున్నారు. నిత్యం కనీసం 200 నుంచి 300 లారీల పండ్ల లోడింగ్, అన్‌లోడింగ్ జరుగుతోంది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలు సహా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి వ్యాపారులొచ్చి ఇక్కడ పండ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తారు. పెరిగిన అవసరాలకు ఇది అనువుగా లేదు.

కొంత మంది వెళ్లినా.. 1998లోనే నున్నలో సకల సౌకర్యాలతో మార్కెట్ ఏర్పాటు చేశారు. 2001లోనే కొందరు వ్యాపారులు ఇక్కడి నుంచి నున్న మార్కెట్‌కు వెళ్లిపోయారు. కానీ కేదారేశ్వరపేట నుంచి పూర్తిగా మార్కెట్‌ను అధికారులు తరలించకపోవడంతో ఇక్కడ కొందరు ఉండిపోరు. దీంతో వెళ్లినవారూ వెనక్కి వచ్చేశారు. మామిడి సీజన్‌లో మూడు నెలలే అక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

✦ మార్కెట్‌ను వీలైనంత త్వరగా ఇక్కడి నుంచి తరలించాలంటూ తాజాగా వంద మందికి పైగా వ్యాపారులు సంతకాలు చేసి మరీ వినతిపత్రాలను సిద్ధం చేశారు. నున్న మార్కెట్ విజయవాడ బైపాస్‌కు దగ్గరగా ఉండడంతో లారీల రాకపోకలు, సరకు దించి, తీసుకెళ్లడానికి అనువుగా ఉంటుంది.



కేదారేశ్వరపేట మార్కెట్ వద్ద ప్రధాన రహదారిపై ఇదీ పరిస్థితి

కలెక్టరేట్‌లో మాక్‌డ్రిల్ నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదాలు సంభవిస్తే రక్షణ పొందడం ఎలా?, భూకంపాలు, భారీ వర్షాలు వంటి ప్రకృతి విపత్తుల తరుణంలో భవనాలు కూలితే ఏమి చేయాలి? తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు నగరంలోని కలెక్టరేట్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు కార్యక్రమాన్ని తిలకించి, అవగాహన కల్పించుకోవాలని సూచించారు.

అంచుల్లో ఆర్తనాదాలు

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

✦ గుంటుపల్లి జాతీయ రహదారి(65)పై మార్జిన్‌లో ఉన్న ట్రక్‌ను వెనుక నుంచి వచ్చిన కారు ఈ నెల 1న తెల్లవారుజామున ఢీకొట్టింది. అయితే కారు ముందు భాగం నుజ్జు అవ్వగా అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి.

✦ గతేడాది డిసెంబర్‌లో ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌కు వెళ్లేందుకు రహదారి పక్కన నిలిపి ఉంచిన బూడిద రవాణా లారీని మరో ట్రక్ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రక్ డ్రైవర్ కాళ్లు విరిగాయి. సహాయకుడి తలకు గాయమైంది.

✦ జాతీయ రహదారి కొండపల్లి శ్రామికనగర్ వద్ద ఫ్లైయాష్ కోసం రహదారి పక్కనే నిలిచి ఉన్న కంటైనర్‌ను ద్విచక్ర వాహనదారుడు ఢీ కొన్న సంఘటన ఫిబ్రవరి 22న చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలవడంతో అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూనే ఉన్నాడు. రహదారి పక్కనే ఉన్న మార్జిన్లలో నిలిపిన వాహనాలతో నిత్యం అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూల మలుపుల్లో, వ్యాపార కూడళ్ల వద్ద దూరం ప్రయాణించే వాహనాలు మార్జిన్ దిగి నిలిపేస్తున్నారు. ఆ క్రమంలో అటుగా వచ్చే వాహనాలకు ఈ విషయం అర్థం కాక వెనుక నుంచి ఢీ కొట్టేస్తున్నాయి. గడిచిన ఆరు నెలల్లో రెండు జాతీయ రహదార్ల పరిధిలో అనేక ప్రమాదాలు జరిగినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.



రహదారి మార్జిన్‌లో ఆగి ఉన్న లారీని ఢీ కొన్న కారు (పాత చిత్రం)

జాతీయ రహదారులు	6 నెలల్లో ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
గొల్లపూడి–కంచికచర్ల (ఎన్‌హెచ్65)	23	6	28
ఇబ్రహీంపట్నం–కొండూరు(ఎన్‌హెచ్30)	8	2	11

తెల్లవారుజామునే అధికం

జరిగిన ప్రమాదాల్లో తెల్లవారుజామున, అర్ధరాత్రి సమయంలోనే అధికంగా జరుగుతున్నాయి. దూరం ప్రయాణం చేసి వచ్చిన వాహనదారులు మార్జిన్ ఉండడంతో సేదతీరేందుకు వాహనాలను అక్కడే నిలిపి వాటిల్లోనే నిద్ర పోతున్నారు. మరి కొందరు దగ్గర్లో ఉన్న దాబాలు, హోటళ్లలో పడుకుంటున్నారు. అయితే అదే సమయంలో మత్తులో ప్రయాణం సాగిస్తున్న ఇతర వాహనాలు ఎదుట మార్జిన్‌లో నిలిచిన వాహనాలు ప్రయాణిస్తున్నాయనే భ్రమతో ఢీ కొట్టేస్తున్నాయి.

జరిమానాలు విధిస్తున్నాం

- రామచంద్రరావు, ఒన్ ట్రాఫిక్ ఏసీపీ

జాతీయ రహదార్లు (65), (30) గొల్లపూడి-కంచికచర్ల, ఇబ్రహీంపట్నం-మైలవరం పారిశ్రామికంగా, వ్యాపారపరంగా అభివృద్ధి చెందాయి. వివిధ ఎగుమతులతో లారీలు, కంటైనర్లు పారిశ్రామికవాడలకు రాకపోకలు పెరిగాయి. ఈ క్రమంలో రెండు జాతీయ రహదారులు ఉండడంతో లారీలు, ట్రక్‌లు, కంటైనర్లు రహదారుల పక్కన మార్జిన్‌ల వద్ద నిలుపుతున్నారు. వీటి వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలా నిలిపిన వారికి హెచ్చరిక చేసి అనంతరం రూ.1035 జరిమానాలు విధిస్తున్నాం. మూలపాడు ట్రక్ బే, ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌లో వాహనాలను నిలిపితే ఎటువంటి ఇబ్బంది ఉండదు. ట్రక్ టెర్మినల్ ప్రాంతంపై వాహనదారులకు అవగాహన కలిగిస్తే రాత్రి సమయంలో నిలిపే వాహనాలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

కళాదర్శిని.. సుమధుర వర్షిణి

సాంస్కృతిక కళలపై వేసవి శిక్షణ

న్యూస్‌టుడే, కరెన్సీనగర్



ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో చిన్నారులు టీవీలు, చరవాణులకు బానిసలవుతున్నారు. వాటి నుంచి పిల్లల దృష్టిని మరల్చేలా విజయవాడ ఆంధ్రా లయోల కళాశాలలో భాగమైన 'కళాదర్శిని' ఏటా వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తోంది. చిన్నారులకు వయోలిన్, కీబోర్డు, వెస్ట్రన్, భరతనాట్యం, కూచిపూడి, గిటార్, చిత్రలేఖనం, జానపద నృత్యం, ప్యాడ్స్, తబలా తదితర కళల్లో అభిరుచి ఉన్న వారికి నామమాత్రపు ఫీజుతో నెల రోజుల శిక్షణ ఇస్తున్నారు. ఇందులో రాణిస్తున్న వారికి వారి ఆసక్తినిబట్టి మూడేళ్ల లాంగ్‌టర్మ్ శిక్షణ కూడా అందిస్తున్నారు. ఆధ్యాత్మిక, శాస్త్రీయ, జానపద, సినీ గీతాలకు అనుగుణంగా వాయిద్య సంగీతం కూడా నేర్పిస్తున్నారు. విద్యార్థులు కూడా ఆసక్తితో నేర్చుకుంటున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందిస్తారు. ఇక్కడ నేర్చుకున్నవారు గురువులుగా రాణించడం కళాదర్శిని ప్రత్యేకత.


గిటార్ వాయిస్తూ..


కీబోర్డు సాధనలో చిన్నారులు

శాస్త్రీయ నృత్యాల్లో రాణించడమే లక్ష్యం



మాది మచిలీపట్నం. వేసవి శిక్షణకు విజయవాడ వచ్చాను. శాస్త్రీయ నృత్యమంటే ఇష్టం. వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా కళాదర్శినికి వచ్చి భరత నాట్యం, కూచిపూడి నేర్చుకుంటున్నాను. శాస్త్రీయ నృత్యాల్లో రాణించాలనేది నా కల.

– మెర్సీ, మచిలీపట్నం

నైపుణ్యాలు పెంచుకోవాలి



వేసవి సెలవుల్ని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చాం. భరత నాట్యమంటే ఇష్టం. గత ఏడాది నృత్యంలో ప్రాథమిక అంశాలు నేర్చుకున్నాను. నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే మనలోని ఆలోచనలు బయటకొస్తాయని నమ్ముతాను. భారత సంస్కృతికి పట్టుగొమ్మలైన నృత్యాలు నేర్చుకోవడం అదృష్టంగా భావిస్తున్నా.

– జన్య, తుని

రిథమ్ ప్యాడ్స్ నేర్చుకుంటున్నా



మాది మార్కాపురం. ఇక్కడ బంధువుల ఇంట్లో ఉండి రిథమ్ ప్యాడ్స్ నేర్చుకుంటున్నాను. సంగీతంలో రిథమ్ ప్యాడ్స్‌కు ఎక్కువ అవకాశాలున్నాయి. అన్ని పాటల్లోనూ ప్యాడ్స్ విని యోగిస్తున్నారు. కార్డ్స్, స్కేల్స్ నేర్చుకుంటున్నాను. ఆధ్యాత్మిక పాటలకు వాయించడం ఇష్టం. దీని ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించుకోవచ్చు.

– కృపా ప్రజ్వల, మార్కాపురం

43 ఏళ్లుగా..



కళాదర్శిని ద్వారా 43 ఏళ్లుగా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఏటా 500 మందికి పైగా లాంగ్, షార్ట్ టర్మ్ శిక్షణ తీసుకుంటున్నారు. నిపుణులను తీసుకొచ్చి విద్యార్థులకు నైపుణ్యాన్ని మెరుగుపర్చుకునే విధంగా చేస్తున్నాం. వారు నేర్చుకున్న దాన్ని వారాంతంలో ఒక రోజున ప్రదర్శించేలా ఏర్పాట్లు చేశాం.

– ఫాదర్ జి.రాయప్ప, కళాదర్శిని డైరెక్టర్

అధికారుల నిర్లక్ష్యం.. చోదకులకు శాపం

- ✦ ఆగిన అండర్‌పాస్ వంతెన పనులు
- ✦ రెండు రాష్ట్రాల ప్రజలకు తప్పని అవస్థలు

నందిగామ, న్యూస్‌టుడే

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి నందిగామ వద్ద ప్రమాదకరంగా ఉంది. నేషనల్ హైవే అథారిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల నందిగామ వై జంక్షన్ వద్ద వాహనాల అండర్ పాస్ వంతెనకు అనుసంధానంగా, వంతెనపై రోడ్ల నిర్మాణ పనులు తుది దశలో నిలిచిపోయాయి. గుత్తేదారుడు నాలుగు నెలలుగా ఈ పనులు నిలిపివేసినా అధికారుల్లో చలనం లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.


నందిగామ వై జంక్షన్ వద్ద అసంపూర్తి ఫ్లైఓవర్‌పై కంకర గుట్టలు

బిల్లులు చెల్లించక నిలిచిన పనులు

నందిగామ వై జంక్షన్ వద్ద నాలుగేళ్ల కిందట అండర్ పాస్ వంతెన నిర్మించారు. అనంతరం ఏడు కిలోమీటర్ల పొడవున వై జంక్షన్ నుంచి అనాసాగరం వరకు హైవే బైపాస్ రోడ్డు నిర్మించారు. రెండేళ్ల కిందటే ఈ రోడ్డుపై వాహనాల రాకపోకల్ని పూర్తి స్థాయిలో అనుమతించారు. అండర్ పాస్ వంతెనకు అనుసంధానంగా రోడ్డు నిర్మించకపోవడంతో సర్వీస్ రోడ్డుపైనే వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. అప్పట్లో భూ సేకరణ సమస్యల వల్ల సర్వీస్ రోడ్లు నిర్మించలేదు. అనంతరం భూసేకరణ చేసి జాతీయ రహదారుల సంస్థకు అప్పగించడంతో ఇరువైపులా అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. గుత్తేదారుడికి బిల్లులు ఇవ్వకపోవడంతో చివరి దశలో పనులు ఆపేశారు.


రహదారిపై ప్రమాదకరంగా నిర్మాణ సామగ్రి

దారంతా గుంతలు..

వై జంక్షన్ వద్ద కిలోమీటరు వరకు ప్రయాణం ప్రమాదకరంగా తయారైంది. అండర్ పాస్ వంతెనపై బీటీ రోడ్డు వేయాలి. సెంటర్ డివైడర్, లైటింగ్ ఏర్పాటు ఇతర పనులూ చేయాల్సి ఉంది. దీంతో వంతెన నిరుపయోగంగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో విజయవాడ- హైదరాబాద్ హైవేలో సర్వీస్ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ మార్గంలో గుంతలు పడి డొంక రోడ్డుకన్నా అధ్వానంగా ఉంది. గుంతల్లో రాకపోకలకు వీలుకాక వాహన చోదకులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అత్యంత కీలకమైన హైవేపై పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతల దారిలో వాహనాలు దెబ్బతింటున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అడగరు తవ్వేయ్.. ఆపరు తోలేయ్

చెరువులో మట్టి ఇటుక బట్టీలకు అక్రమంగా తరలింపు

కనుమూరు (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కనుమూరు కాశీపతి చెరువులో (ఎర్ర చెరువు) మట్టిని గత మూడు రోజుల నుంచి ఇటుక బట్టీల నిర్వాహకులు అక్రమంగా తరలిస్తున్నారు. రేయింబవళ్లు యథేచ్ఛగా చెరువులో మట్టిని యంత్రాలు, ట్రాక్టర్లతో అక్రమార్కులు తరలిస్తుంటే అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కొందరు నాయకుల అండదండలతో ఇటుక బట్టీ వ్యాపారులు చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. శుక్రవారం నుంచి మట్టి అక్రమ తోలకం ప్రారంభమైంది. కనుమూరు గ్రామస్థులు మైనర్ ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి కూడా యంత్రాలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి మట్టిని తరలించారు. దీనిపై డీఈఈ కిషోర్‌ను సంప్రదించగా శుక్రవారం ఫిర్యాదు అందగా చర్యలు తీసుకున్నామని, శనివారం రాత్రి మట్టి తోలకం జరిగిందని మళ్లీ ఫిర్యాదు అందడంతో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సై శ్రీను సంప్రదించగా గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కాశీపతి చెరువు నుంచి అక్రమంగా మట్టి తీసుకెళుతున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు చెప్పారు. ట్రాక్టర్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కనుమూరు చెరువులో మట్టి ఇటుక బట్టీలకు తరలించడంపై సోమవారం తిరువూరులో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు తెలిపారు.


కనుమూరు కాశీపతి చెరువులో మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్న యంత్రం, ట్రాక్టర్లు

ప్రకృతి ఒడిలో ఉత్సాహంగా అమ్మతో ఈత

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మాతృ దినోత్సవం సందర్భంగా అవార (అమరావతి వాకర్స్, రన్నర్స్ అసోసియేషన్) ఈత శిక్షణ-ప్రాణ రక్షణ అకాడమీ, ఫస్ట్ రెస్పాండర్స్ ఇండియా సంస్థ సంయుక్తంగా ఆదివారం ఉదయం తాడేపల్లి వారధి కింద కృష్ణానది తీరాన ప్రకృతి ఒడిలో జరిగిన 'అమ్మతో ఈత' ఉత్సాహంగా సాగింది. పలువురు చిన్నారులు వారి తల్లిదండ్రులతో కలిసి ఈత శిక్షణలో పాల్గొన్నారు. ఇసుక తిన్నెలపై జరిగిన పరుగు పోటీలను కేఎల్‌యూ భౌతికశాస్త్ర విభాగాధిపతి సృష్టి కౌశిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి-పర్యావరణ నదీ సంరక్షణపై బాల బాలికలకు అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. చిన్నారులతో పరుగు-పాట, పద్యం-గద్యం వంటి పలు విద్యలతో సాగి ఈత అభ్యాసం, జల క్రీడలతో ముగిసింది. పిల్లల పోటీల్లో విజేత కార్తీక్, లేఖ్య పోటీల్లో అధికారి బహుమతులు ప్రదానం చేశారు. ఈత శిక్షకులు సౌజన్య వెన్నెల, గౌరి బసవ, లైఫ్ గార్డ్ పంకజ్‌కుమార్ పాల్గొన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 5.30 గంటలకు ప్రారంభమయ్యే 'ప్రకృతిలో పిల్లల' కార్యక్రమంలో పాల్గొనే ఆసక్తిగల వారు ఫోన్ 94941 26812 నంబరులో నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.


నదిలో ఈత సాధనలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు

భూములిచ్చిన రైతుల పేర్లతో స్తూపం నిర్మించాలి


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న నగ్నముని, పక్కన చక్రధర్, అమూల్య చందు తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: రాజధానికి భూములిచ్చిన రైతుల పేర్లతో ఓ స్తూపం నిర్మించాలని ప్రముఖ కవి నగ్నముని ప్రభుత్వానికి సూచించారు. రాధాకృష్ణ కర్రి, అమూల్య చందు 'లైఫ్ డ్రామా', 'భూమి నవ్వడం చూశాను' కవితా సంకలనాల పుస్తకాలను బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ-ఆంధ్రగా విడిపోయినందున తెలంగాణ రాష్ట్రం అని పేరు పెట్టుకున్నారు. మనం ఆంధ్ర రాష్ట్రం లేదా నవ్యాంధ్ర రాష్ట్రం పిలుచుకోవాల్సింది సూచించారు. పుస్తక కవులకు కవిత్వం దిగంబర ఉద్యమానికి కొనసాగింపు అన్నారు. విరసం ఆవిర్భావం తరువాత కవిత్వంలో పలు మార్పులు చోటుచేసుకున్నాయని, అందులో భాగంగా దళిత, మైనార్టీ, మహిళా ఉద్యమాల ప్రభావంతో మంచి కవిత్వం వచ్చిందన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన వసీరా మాట్లాడుతూ అమూల్య చందు కవిత్వంలో ఆవేశం ఉందని, రాధాకృష్ణ కవిత్వంలో ఆలోచన ఉందన్నారు. ఇద్దరి కవితలను చదివి వినిపించారు. కథకుడు ముక్కామల చక్రధర్ అధ్యక్షత వహించగా సుధా మురళి, శాంతి శ్రీ, వాణిశ్రీ నైనాల పాల్గొన్నారు.

'జగన్‌ను రక్షించేందుకే మాజీ ఎంపీ నాటకాలు'


మాట్లాడుతున్న బుద్దా వెంకన్న

విద్యాధరపురం, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణంలో వైకాపా అధినేత జగన్‌ను రక్షించేందుకు మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు(నాని) నాటకాలు ఆడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పేర్కొన్నారు. మల్లికార్జునపేటలోని తెదేపా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకన్న మాట్లాడుతూ రాజ్ కెసిరెడ్డి సూత్రధారిగా నడిచిన మద్యం అమ్మకాల వ్యవహారంలో అక్రమార్జన తాడేపల్లి ప్యాలెస్‌లోని జగన్ మోహన్‌రెడ్డికి చేరిందన్నది వాస్తవాలు వెలుగు చూస్తున్న తరుణంలో మాజీ ఎంపీ నాని ఉద్దేశ పూర్వకంగా వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రస్తుత ఎంపీ కేశినేని శివనాథ్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. విజయవాడలోని పెద్ద హోటల్ కడతామని రూ.8.50కోట్ల బ్యాంకు నుంచి నాని అతని భార్యతో కలిసి అప్పు తీసుకున్నారన్నారు. కేశినేని హోటల్స్ పేరుతో డైరెక్టర్లు నాని, పావని, హేమాచౌదరి ఉన్నారని ఇప్పుడు దానిపైన వచ్చే ఆదాయం మొత్తం నాని తీసుకుంటున్నారన్నారు. ప్రస్తుతం బ్యాంకు రుణం ఎగవేసేందుకు కుటుంబ సభ్యులు బయటకు వెళ్లి జీతగాళ్లను మాత్రమే డైరెక్టర్లుగా చూపుతున్నారని ఆరోపించారు. దీనికి సంబంధించిన ఆధారాలు అన్నీ తమ వద్ద ఉన్నాయని చెప్పారు.

గిరిప్రదక్షిణ నేడు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ ఈనెల 12న ఉదయం 5.55 గంటలకు ప్రారంభమవుతుందని దేవస్థానం ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గగుడి టోల్‌గేటు సమీపంలోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరిప్రదక్షిణ ఊరేగింపు ప్రారంభమై కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, కబేళా, చిట్టినగర్, కొత్తపేట, రథం సెంటర్ మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుతుందని పేర్కొన్నారు. గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తుల్లో కాళ్లకు పాదరక్షలు లేకుండా పాల్గొనాలని సూచించారు.

ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల పాత్ర కీలకం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర కీలకమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ పేర్కొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ స్మారక పురస్కారాలను ఆదివారం అందజేశారు. ముందుగా జ్యోతి వెలిగించిన యూనియన్ నాయకులు మాజీ రాష్ట్రపతి జైల్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన షరీఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టే పథకాలను అర్హులకు అందించడం, అక్రమాలను వెలికి తీసి ప్రభుత్వ దృష్టికి తీసుకు రావడంలో జర్నలిస్టులు పాత్ర కీలకమన్నారు. ఏపీజేయూ నాయకుడు వేణు మాట్లాడుతూ.. దేశం కోసం వివిధ హోదాల్లో పనిచేసిన మహోన్నత వ్యక్తులను నేటి తరానికి పరిచయం చేసేందుకు ఏపీజేయూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 82 మందికి అవార్డులు ఇవ్వాలని.. విపత్కర పరిస్థితుల దృష్ట్యా అతిథులు, అవార్డు గ్రహీతలు రాలేకపోయారన్నారు. యూనియన్ నాయకులు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న ప్రభుత్వ సలహాదారు షరీఫ్, ఏపీజేయూ నాయకులు తదితరులు

అర్ధశతాబ్దపు ఆనందోత్సాహాలు


పెనుగంచిప్రోలు జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: వారంతా యాభై సంవత్సరాల కిందట కలిసి చదువుకున్నారు. అర్ధ శతబ్దం తర్వాత ఆదివారం అంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాలతో గడిపారు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకుని తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఇందుకు ఖమ్మం నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల వేదికైంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలులోని కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1970 నుంచి చదువుకుని 1974లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఖమ్మం న్యూవిజన్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌జీకే ప్రసాద్ సైతం ఇదే బ్యాచ్ విద్యార్థి కావడం విశేషం. మాతృ దినోత్సవం సందర్భంగా ప్రసాద్ మాతృమూర్తి హైమావతిని సన్మానించారు.

కిడ్నీ వ్యాధితో వ్యవసాయ కూలీ మృతి


బాణావతు నాగు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని సీతారాంపురం తండాకు చెందిన బాణావతు నాగు (53) కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆదివారం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మధుమేహ వ్యాధి బాధితుడైన అతడికి నాలుగేళ్ల నుంచి కిడ్నీ సంబంధిత ఇబ్బందులు మొదలవడంతో మందులు వాడుతున్నారు. వ్యాధి తీవ్రమై మూడు నెలలుగా తిరువూరు, ఎ.కొండూరు డయాలసిస్ కేంద్రాల్లో చికిత్స చేయించుకుంటున్నాడు. ఇటీవల వ్యాధి ముదిరి ఆదివారం మరణించినట్లు పేర్కొన్నారు. తనకున్న కొద్దిపాటి వ్యవసాయంతో పాటు, కూలి పనులు చేసుకునే అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మల్టీపర్పస్ సూపర్‌వైజర్లుగా ఉద్యోగోన్నతి కల్పించండి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో 28 ఏళ్ల నుంచి ఆరోగ్య శాఖలో ఒకే క్యాడర్‌లో పనిచేస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్స్‌కు తక్షణమే మల్టీపర్పస్ సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించాలని ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకేఎన్ జయలక్ష్మి కోరారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఏపీఎన్జీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ మహిళ, హెల్త్ సూపర్‌వైజర్లకు గత ఐదేళ్లుగా ఏవిధమైన రవాణా భత్యం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రీడ్ రీప్లేస్‌మెంట్ పేరుతో ఏఎన్ఎంలను రద్దు చేసిన వెంటనే బదిలీలు ఇవ్వాలని, ఫీల్డ్ స్టాఫ్‌కు ఎఫ్ఆర్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు సీనియర్ నర్సులను సత్కరించారు. అసోసియేషన్ నాయకులు ఆర్.వి.రత్నం, ఎం.నాగమణి, కె.కృష్ణ, ఎస్‌వీ మహాలక్ష్మి, బి.విమల, కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జయలక్ష్మి, వేదికపై మహాలక్ష్మి, విమల తదితరులు

కిందపడిన వ్యక్తిపై నుంచి వెళ్లిన ఆటో

తీవ్రగాయాలతో అక్కడికక్కడే రైతు దుర్మరణం

మైలవరం, న్యూస్‌టుడే: రోడ్డుపై పడిపోయిన వ్యక్తిపై నుంచి ఆటో వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సేకరించి సమాచారం మేరకు..స్థానిక హాజీపేటకు చెందిన పజ్జూరు శివన్నారాయణ (62) ఇంటి వద్ద నుంచి పశువులకు మేత నిమిత్తం టీవీఎస్‌పై బైపాస్‌కు చేరుకున్నాడు. ఈ క్రమంలో రహదారిపై వెళ్తున్న పశువులు అతడి వాహనాన్ని ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి కూరగాయల లోడుతో వస్తున్న ట్రక్ ఆటో అతడి పైనుంచి వెళ్లగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న ఎస్సై కె.సుధాకర్ ఘటనాస్థలికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. శివన్నారాయణకు భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఉద్యోగులు బాధ్యతాయుతంగా ఉండాలి


టికెట్ కౌంటర్లను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, ఏఈవో రమేష్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భక్తులను దృష్టిలో ఉంచుకొని దేవస్థానం ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ సూచించారు. ఇంద్రకీలాద్రిపై ప్రధాన కేంద్రాలను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆదివారం పరిశీలించారు. టికెట్ కౌంటర్ల వద్ద ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునే విధానాన్ని తెలుసుకున్నారు. దర్శనం ఎంత సమయం పడుతుందని భక్తులను అడిగి తెలుసుకున్నారు. మైక్ ప్రచారం కేంద్రం, దేవస్థానం ఆరోగ్య కేంద్రం, పోలీసు ఔట్ పోస్టు, డ్యూటీ చార్టులు పరిశీలించారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని దేవస్థానం ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో మెరిసిన రాష్ట్ర లిఫ్టర్లు

విజయవాడ క్రీడలు: ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో ఈ నెల 5 నుంచి 12 వరకు కొనసాగుతున్న ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ క్లాసిక్, ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్, ఏషియన్ యూనివర్సిటీ క్లాసిక్, ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ కప్‌లో రాష్ట్ర లిఫ్టర్లు సత్తా చాటారు. ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్‌లో క్లాసిక్‌లో ఎం.షానూన్ 47 కిలోల ఓపెన్ కేటగిరీలో ఓవరాల్ పసిడి, నాగం జ్ఞానదివ్య 84+ జూనియర్ మహిళల కేటగిరీలో ఓవరాల్ పసిడి, ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ కప్‌లో షేక్ షబీనా 84 కిలోల మహిళల కేటగిరీలో ఓవరాల్ పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. ఏషియన్ జూనియర్ మహిళల క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఎం.షానూన్ 47 కిలోల కేటగిరీలో ఓవరాల్ కాంస్యం, నాగం జ్ఞానదివ్య 84+ జూనియర్ మహిళల కేటగిరీలో ఓవరాల్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఏషియన్ జూనియర్ మహిళల ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్‌లో షేక్ షబీనా 84 కిలోల కేటగిరీలో ఓవరాల్ పసిడి, ఎస్‌కే సాదియా అల్మాస్ 57కిలోల జూనియర్ మహిళల కేటగిరీలో ఓవరాల్ నాలుగో స్థానంలో నిలిచిందని భారత జట్టు కోచ్ సకల కోటేశ్వరరావు తెలిపారు.


పతకాలు సాధించిన ఎం.షానూన్, షేక్ షబీనా, జ్ఞానదివ్య, సాదియా అల్మాస్‌లతో భారత జట్టు కోచ్ కోటేశ్వరరావు

బ్రాయిలర్ ధరలు
(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -119 రిటైల్ ధర 141 చికెన్ విత్ స్కిన్ - 204, చికెన్ స్కిన్‌లెస్ - 233.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 500 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.



దారి కనిపించని విధంగా లేచిన దుమ్ము

ఎన్నాళ్లీ జాప్యం.. తీర్చరా శోకం

మండలంలోని వెల్వడం దుమ్ముతోపాటు చంద్రాల రహదారి పొడవునా ప్రమాదకరమైన గోతులతో ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతూనే ఉన్నారు. ఐదేళ్ల వైకాపా హయాంలో గోతుల పూడ్చే ప్రయత్నం కూడా చేయకపోవడంతో ప్రయాణాలు ప్రమాదంలో పడ్డాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు నెలల కిందట అభివృద్ధి పనులు ప్రారంభించిన గుత్తేదారు వెల్వడం గ్రామం వరకు రహదారిని తవ్వి వెట్‌మిక్స్ పరిచి వదిలేశారు. అప్పటి నుంచి పనుల్లో నెలకొన్న జాప్యంతో ఈదురుగాలుల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై అడపాదడపా ట్యాంకర్లతో నీటితో తడుపుతున్నా శాశ్వత పరిష్కారం లేక ప్రయాణం అంటేనే భయాందోళనకు గురవుతున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? మండలంలోని గంగినేనిపాలేనికి శాశ్వత లైన్‌మాన్ లేక ఇబ్బందిగా ఉంది. విద్యుత్తు సమస్యలు వచ్చినపుడు రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వేరే గ్రామం నుంచి అదనపు లైన్‌మాన్ బదులు, రెగ్యులర్ వ్యక్తిని నియమించాలి. లేకుంటే ఇబ్బందులు తప్పేలా లేవు. **- రత్నాకర్, గంగినేనిపాలెం**

✔ బదిలీల్లోనే రెగ్యులర్ లైన్‌మాన్ వచ్చే అవకాశం ఉంటుంది. విద్యుత్తు సమస్య ఉన్నప్పుడు ప్రస్తుతం ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్తే తక్షణం స్పందిస్తారు.
- సుధాకర్, ఏడీఈ, మైలవరం - న్యూస్‌టుడే, జి.కొండూరు

? కాచవరం గ్రామ పరిధిలోని జాతీయ రహదారి వెంట ఇరుపక్కలా ఉన్న మురుగు కాలువల్లో పూడికలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దీనికి తోడు దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నాం. **- షేక్ రహీమాన్, స్థానికుడు**

✔ ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- మురళీ, గ్రామ కార్యదర్శి**

? చిలుకూరులో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. పూడికలు తీసి మురుగునీరు పారుదలకు చర్యలు తీసుకోండి. సమస్య పరిష్కరించండి. **- సుబ్బారావు, స్థానికుడు**

✔ సర్పంచితో సంప్రదించి మురుగు కాల్వల్లో పూడికలు తీయిస్తాం **- మురళీ మోహన్, గ్రామ కార్యదర్శి**
- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

● స్థానిక బి.కాలనీ నుంచి వెంకటేశ్వర థియేటర్ వరకూ రేషన్ సరుకులు ఇవ్వడం లేదని మేమున్నాం..మీకు తోడుగాకు స్థానికులు తెలిపిన సమస్యను ప్రచురించగా తహసీల్దారు వెంకటేశ్వర్లు స్పందించారు. ఆదివారం ఆ ప్రాంతాలకు రేషన్ బియ్యం వాహనాన్ని పంపి సరకులు పంపిణీ చేయించారు. అయితే అదే ప్రాంతంలోని మరి కొన్ని చోట్ల కూడా పంపిణీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కొండపల్లి**



తిరువూరు ప్రధాన రహదారిపై చెత్త లేకుండా శుభ్రం చేస్తున్న కార్మికులు

● పట్టణంలోని 6వ సచివాలయం పరిధిలో 10వ వార్డులో ప్రధాన రహదారిపై చెత్తతో అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి రహదారిపై చెత్తలేకుండా కార్మికులతో ఊడ్పించారు.

● పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలో 6వ వార్డులో బాలికోన్నత పాఠశాల ఎదురు రోడ్డులోని డ్రెయిన్‌లో మురుగు పారడంలేదని స్థానికులు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి స్పందించి కార్మికులతో పూడిక తొలగింపజేశారు.

● పట్టణంలోని 5వ సచివాలయం పరిధిలో 8వ వార్డులో ప్రధాన రహదారిలో డివైడర్‌కు ఇరువైపులా ఇసుక, మట్టి ఉండడంతో ఇబ్బందిగా ఉందని వాహనదారులు చేస్తున్న ఫిర్యాదును శానిటరీ అధికారికి తెలుపగా ఆయన కార్మికులతో శుభ్రం చేయించారు.

● పట్టణంలోని 2వ సచివాలయం పరిధిలో 4వ వార్డులో కుందా రైస్ మిల్లు ఏరియాలో రహదారి వెంట పిచ్చిమొక్కలు ఉన్నాయని, మురుగు కాల్వలో పూడిక ఉందని స్థానికులు చేస్తున్న ఫిర్యాదులపై పారిశుద్ధ్య అధికారులు స్పందించి కార్మికులతో శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**



మైలవరం: ఎన్నుకున్న నాయకులు వీరే..

తెదేపా గ్రామ కమిటీల ఎన్నిక

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కీర్తిరాయునిగూడెం తెదేపా గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జడ్పీటీసీ మాజీ సభ్యుడు దొండపాటి రాము తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా చనమోలు శ్రీనివాసరావు, నాగులపాటి నాగబాబు, ఉపాధ్యక్షుడిగా మల్లాది జేమ్స్, కోశాధికారిగా రామకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా కే. శ్రీనివాసరావులతో పాటు అనుబంధ కమిటీలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి కందుల నాగేశ్వరరావు, నాయకులు విజయ్, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని పుల్లూరు తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అప్పిడి రాఘవరెడ్డి ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం ఏఎంసీ మాజీ ఛైర్మన్ వజ్రాల కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రాజులపాటి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా వింజమూరు రవి, ఇతర పదవులు, అనుబంధ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా మూలపాడు గ్రామశాఖ అధ్యక్షుడిగా కాకి నాగరాజు ఎన్నికయ్యారు. మండల శాఖ అధ్యక్షుడు రామినేని రాజశేఖర్ అధ్యక్షతన ఆదివారం రాత్రి గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా నిమ్మగడ్డ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా రమేష్‌లతోపాటు మరో ఏడు మంది సభ్యులను ఎన్నుకున్నారు. పార్టీ నాయకులు గరికపాటి శ్రీనివాసరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

98 మందికి ఉచిత వైద్య పరీక్షలు

జి.కొండూరు: మండలంలోని కవులూరులో ఆదివారం ధన్వంతరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 98 మందికి పరీక్షలు చేశారు. రక్తపోటు, మధుమేహ పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందజేశారు. వైద్యులు యు. ఉమేష్ బాబు, పి.శ్రీవాణి సేవలందించారు.

అమ్మకు గ్రీటింగ్ కార్డులు

పెనుగొలను (గంపలగూడెం): మండలంలోని పెనుగొలను గ్రంథాలయంలో ఆదివారం మాతృదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకురాలు జె.శ్రీలత ఆధ్వర్యంలో బాలబాలికలు అమ్మకు శుభాకాంక్షలు తెలిపే గ్రీటింగ్ కార్డులను కాగితం, పుష్పాలతో తయారు చేశారు.

బాలబాలికలకు వక్తృత్వ పోటీలు

తిరువూరు, న్యూస్‌టుడే: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం తిరువూరు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో మాతృ దినోత్సవం సందర్భంగా బాలబాలికలకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మాతృత్వం మాధుర్యాన్ని పిల్లలు చక్కగా వివరించారు. నృత్యం, ఆటలు, కథలు పుస్తకాలు చదివిస్తున్నట్లు గ్రంథ పాలకురాలు కె.పద్మావతి తెలిపారు.

మజ్జిగ పంపిణీ

గంపలగూడెం: శ్రీరామ భజన మందిరం వద్ద ఆదివారం మండు వేసవిలో ప్రయాణిస్తున్న బాటసారుల దాహం తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేశారు. వి.విష్ణువర్ధనరావు, నాగలక్ష్మి, పి.కిరణ్‌కుమార్, గిరాకుమరన్, ప్రణవి శృతి ఆర్థిక సౌజన్యంతో అందించిన మజ్జిగను డ్వాక్రా మహిళలు, ఎ.నాగేశ్వరరావు సేవా ఫౌండేషన్ నిర్వాహకులు కె.కృష్ణమూర్తి మారి, టీడీపీ ఆధ్వర్యంలో అందించారు.

వృద్ధులకు అన్నదానం

రెడ్డిగూడెం: ప్రపంచ మాతృ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం రెడ్డిగూడెం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు సిహెచ్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

తిరువూరులో ఎంపీ చిన్ని పర్యటన నేడు

గంపలగూడెం: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) సోమవారం తిరువూరు పర్యటనకు వస్తున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి తిరువూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం మైలవరం, నందిగామ నియోజకవర్గాల్లో పర్యటిస్తారని వివరించారు.

అండగా బీమా.. అందరికీ ధీమా

☛ ఉపాధి కూలీలకు ఆసరాగా ప్రభుత్వం

☛ ప్రమాదాలు జరిగినప్పుడు ఆర్థిక భరోసా

గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, న్యూస్‌టుడే



గంపలగూడెం: గోసవీడులో నమోదుకు బ్యాంకు వద్ద బారులు తీరిన శ్రామికులు

ఉపాధి పనుల్లో శ్రామికులకు ప్రమాదాలు సంభవించినపుడు ఆర్థిక ఆసరా కల్పించేందుకు ప్రభుత్వం రెండు బీమా పథకాలు అమలు చేస్తోంది. ఉపాధి పనులకు వెళ్లిన కూలీలు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోవడం, వైకల్యానికి గురవ్వడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వడదెబ్బకు గురైన సందర్భాల్లో మృత్యువాత పడుతున్నారు. ఇప్పటి వరకు అనారోగ్యం, పనుల వద్ద ప్రమాదాలకు గురైన వారికి శాఖాపరంగా అందించే పరిహారం రూ.50 వేలు మాత్రమే. దీంతో ప్రమాద బాధితులకు అత్యధిక మొత్తంలో బీమా కల్పించేందుకు ప్రభుత్వం రెండు పథకాలు వర్తింపజేస్తోంది. జిల్లాలో 3,77,233 శ్రామికులు బీమా నమోదుకు లక్ష్యంగా ఉండగా పీఎంఎస్‌వైలో 3,06,010, పీఎంజేజేవైలో 22,826 మంది అర్హులుగా గుర్తించారు. వీరికి బీమాను అమలు చేయడం ద్వారా కుటుంబాలకు భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. నెలాఖరు నాటికి బ్యాంకులు, పోస్టు ఆఫీసుల్లో బీమా నమోదు పూర్తి చేయాల్సి ఉంది. ప్రీమియం సొమ్ము కూలీలు చెల్లించాల్సి ఉంది.

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో బీమా నమోదు లక్ష్యంగా ఉన్న శ్రామికులు, రెండు బీమా పథకాలకు అర్హుల వివరాలు ఇలా..

మండలం	గ్రామ పంచాయతీలు	శ్రామికులు	పీఎంఎస్‌బీవై	పీఎంజేజేవై
గంపలగూడెం	24	32,750	31,248	53
ఎ.కొండూరు	21	25,905	20,834	1582
రెడ్డిగూడెం	12	23,667	20,348	5
తిరువూరు	20	22,573	19,129	53
విస్సన్నపేట	12	23,591	18,354	1725

రూ.4 లక్షల పరిహారం

శ్రామికులు దురదృష్టవశాత్తు మరణించినా, ప్రమాదంలో వైకల్యం సంభవించినా బీమా పథకాల ద్వారా రక్షణ పొందవచ్చు. ఇందుకోసం ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన అమలు చేస్తున్నారు. సురక్ష పథకం ప్రతి శ్రామికుడికి వర్తింపజేస్తారు. జీవన జ్యోతి పథకం కుటుంబంలో పెద్దకు మాత్రమే వర్తిస్తుంది. కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోతే శ్రామికుడి పరంగా, కుటుంబ పెద్దగా రెండు పథకాల కింద రూ.4 లక్షల ప్రయోజనం లభిస్తుంది. పథకంలో నమోదైన శ్రామికుల కుటుంబ పెద్దలందరికీ బీమా అమలు చేయనున్నారు.

ప్రీమియం చెల్లించాలి

సురక్ష బీమా యోజనతో 18-70 మధ్య వయస్కులు అర్హులు. ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాలి. ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి వైకల్యం చెందినా రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష చెల్లిస్తారు. జీవన జ్యోతి బీమా యోజనలో 10-50 మధ్య వయస్కులు అర్హులు. రూ.436 ప్రీమియం ఏటా చెల్లించాలి. మరణిస్తే రూ.2 లక్షల పరిహారం అందిస్తారు. గతంలో బీమా పథకాలను డీఆర్‌డీఏ ద్వారా అమలు చేయగా కొందరు మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. అత్యధికులు బీమా పథకాలు వినియోగించడం లేదని ప్రభుత్వం గుర్తించింది. అందరికీ బీమా అమలయ్యేలా ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. తపాలశాఖ కార్యాలయం, బ్యాంకుల్లో ఖాతాలు ప్రారంభించి వారి ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసుకునేలా శాఖా పరంగా కూడా చర్యలు తీసుకున్నారు.

వైభవం.. చందన అలంకరణ



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్లు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌ను ఆదివారం చందనంతో అలంకరించారు. స్వామివారి జయంతి సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. చెంచులక్ష్మి, రాజ్యలక్ష్మి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులకు శంఖ, చక్ర, సహస్ర ధార ద్వారా పంచామృతాలు, నవ ఫలరసాలతో అభిషేకాలు చేశారు. మూలవిరాట్‌ను ఉసిరి నూనె, చందనంతో అలంకరించగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. గుడి కమిటీ అధ్యక్షుడు పి.హరినాధరావు గుప్తా ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, దద్దోజనం ప్రసాదం పంపిణీ చేశారు.

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని దాసాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం నరసింహస్వామి జయంతి సందర్భంగా అర్చకులు పార్థసారథాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. నృసింహావతార ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అర్చనలు, అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పెండ్లికుమారుడిగా శ్రీరంగనాయకస్వామి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీరంగనాయకస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అర్చకులు తూమాటి యోగానందాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారిని పెండ్లికుమారుడిగా అలంకరించి ఉత్సవాలు ప్రారంభించారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, గరుడపట ప్రతిష్ఠ నిర్వహించారు. సోమవారం రాత్రి 8 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయకస్వామి కల్యాణం జరిపిస్తారు. మంగళవారం ఉదయం గ్రామోత్సవం, రాత్రికి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ముగిస్తారు.

కోలాహలంగా జలబిందెల కార్యక్రమం

చందర్లపాడు, న్యూస్‌టుడే: చందర్లపాడు గ్రామ దేవత అలివేలమ్మ తిరునాళ్ల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జలబిందెల కార్యక్రమం నిర్వహించారు. నీళ్ల బిందెలతో గ్రామంలో ప్రదర్శనగా తిరిగారు. సోమవారం భక్తులు దేవతకు బోనాలు చెల్లించి మొక్కుబడులు తీర్చుకోనున్నారు.

అప్రోచ్‌లకు మోక్షం

ఈనాడు కథనాలకు స్పందన

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పట్టణ శివారు శాంతిగనర్, ఈలప్రోలుల వద్ద బుడమేరు డైవర్షన్ ఛానల్‌పై నిర్మాణమైన వంతెనలకు త్వరలో మోక్షం రానుంది. అప్రోచ్‌లకు మోక్షమెప్పుడు అని ఈనాడు కథనాల రూపంలో అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చింది. వాస్తవానికి శాంతినగర్, ఈలప్రోలుల వద్ద 2018లో రూ.22 కోట్లతో పాత వంతెనల స్థానంలో కొత్త వంతెనల నిర్మాణం జరిగింది. ఆ తరువాత ఆ వంతెనలకు అప్రోచ్‌లకు ఏర్పాటు చేయడకపోవడంతో కొండపల్లి నుంచి ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు పాత బ్రిడ్జిలపై నుంచే గమ్యస్థానాలకు చేరుకునేవారు. ఇదిలా ఉంటే బుడమేరు కట్ట పటిష్ఠతకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను గుత్తేదారులకు అప్పగించింది. గతవారం గుత్తేదారుడి ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభమవగా భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా అప్రోచ్‌లను నిర్మించాల్సి వచ్చింది. దీంతో శాంతినగర్, ఈలప్రోలు వంతెనల వద్ద అప్రోచ్ పనులు ప్రారంభమయ్యాయి. త్వరలో వాటిని పూర్తి చేయనున్నట్లు గుత్తేదారు సిబ్బంది చెబుతున్నారు.



కొండపల్లి శాంతినగర్ కొత్త వంతెనకు ఏర్పాటైన అప్రోచ్

అపూర్వం.. ఆత్మీయ సమావేశం

గంపలగూడెం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 2000-01లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం బడి ఆవరణలో ఉత్సాహంగా జరిగింది. పాతికేళ్లకు కలిసిన వాళ్లంతా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తమకు విద్య చెప్పిన పలువురు గురువులను సత్కరించిన జ్ఞాపికలు అందజేశారు.

తిరువూరు, న్యూస్‌టుడే: మండలంలోని పీటీ కొత్తూరుకు సమీప పోస్టు బేసిక్ స్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 1959-2001 మధ్య పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సమావేశంలో పాల్గొన్నారు. పూర్వ విద్యార్థి పి.గోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆనాటి గురువులు ఎం.వెంకటేశ్వరరావు, పూర్ణచంద్రరావు, మల్లికార్జునరావు, ఎన్.వి.రామారావు, సుబ్బారావు, విమలాదేవి, హనుమంతరావు, మూర్తి తదితరులను సత్కరించారు. బడి ప్రారంభించిన వై. బుచ్చిరాజు, దమయంతి, లీలావతి కృషిని స్మరించుకున్నారు.



సమావేశంలో పూర్వ విద్యార్థులు

'దేశంలో మతోన్మాదం పెరిగింది'

విస్సన్నపేట, న్యూస్‌టుడే: దేశంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చాక మతోన్మాదం పెరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ విమర్శించారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సీపీఐ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదలు కొనుగోలు చేసే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, ఆ మేరకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. అర్హులకు స్థలాలు, కాలనీ గృహాలు మంజూరు చేయాలని, నియోజకవర్గానికి కృష్ణా జలాల సరఫరాకు పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో మండల కమిటీ కార్యదర్శిగా మర్సకట్ల త్యాగరాజు, సహాయ కార్యదర్శిగా జె.దానయ్య మరో 11 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా, నియోజకవర్గ నాయకులు టి.కృష్ణయ్య, ఎస్‌కె.నాగుల్‌మీరా, సీహెచ్.వెంకటేశ్వరరావు, మండల పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, నాంచారయ్య, రాజేష్, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జవాన్ మురళీ నాయక్‌కు నివాళి

చైతన్యనగర్ తండా(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: దేశం కోసం ప్రాణాలర్పించిన జవాన్ మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఎ.కొండూరు మండలం చైతన్యనగర్ తండాలో యువత ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. కుమార్‌నాయక్, రఘునాయక్, చిరంజీవి, బాలకృష్ణ, శివ, మణికంఠ, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.నాగేశ్వరరెడ్డి

తెదేపా శ్రేణులంతా ఐక్యంగా ఉండాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తెదేపా శ్రేణులంతా ఐక్యంగా ఉండాలని పార్టీ మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం రుద్రవరం గ్రామంలో తెదేపా గ్రామ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పాలన ఎలా ఉంటుందో చూశాం. ఆయన మార్గాన్ని కొనసాగించడమే మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా శామ్యూల్ జవహర్

గానుగపాడులో అభిమానుల సందడి



సీఎం చంద్రబాబుతో శామ్యూల్ జవహర్

గానుగపాడు(తిరువూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా మాజీ మంత్రి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌ను నియమించడంతో ఆయన స్వస్థలమైన గానుగపాడులో ఆదివారం రాత్రి సందడి నెలకొంది. గత కొన్ని రోజులుగా జవహర్ కుటుంబ సభ్యులతో కలిసి గానుగపాడులోనే ఉంటున్నారు. దీంతో ఆయన అభిమానులు, అనుచరులు ఆయన నివాసానికి చేరుకుని జవహర్‌కు అభినందనలు తెలిపారు. పలువురు కేకులు కోసి సంబరాలు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మతల్లి తిరునాళ్ల



ప్రభబండికి పూజలు చేస్తున్న భక్తులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన రెడ్డిగూడెం గ్రామంలో వేంచేసి ఉన్న అంకమ్మతల్లి దేవాలయంలో ఆదివారం అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ప్రభ బండి ఊరేగింపు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

వివాహిత ఆత్మహత్య

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం. . గ్రామానికి చెందిన మానుకొండ తిరుపతమ్మ(30)కు ఏపీ ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన శ్రీనివాసరావుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడేళ్ల కుమార్తె ఉంది. చిన్నచిన్న కలహాలు తలెత్తటంతో తిరుపతమ్మ మూడు రోజుల క్రితం తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు గ్రామీణ ఎస్సై లక్ష్మీభార్గవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు.. టిప్పరు ఢీ.. తప్పిన ప్రాణాపాయం



దెబ్బతిన్న వాహనాలను పక్కకు తీస్తున్న జేసీబీ

మైలవరం న్యూస్‌టుడే: జాతీయ రహదారి 30పై ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇటీవల పుల్లూరు పంచాయతీ పరిధిలోనే మూడు ప్రమాదాలు సంభవించగా శనివారం అర్ధరాత్రి పుల్లూరు ప్రధాన కూడలిలో కారు టిప్పరు ఢీకొట్టుకున్నాయి. సేకరించిన వివరాలు ప్రకారం..తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతం నుంచి శనివారం రాత్రి విజయవాడ వైపు వస్తున్న కారు. .ఇబ్రహీంపట్నం నుంచి బూడిదలోడుతో తిరువూరు వైపు వెళ్తున్న టిప్పర్ పుల్లూరు కూడలి వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వేగ నియంత్రిక డ్రమ్ములను తప్పించే క్రమంలో ఢీకొట్టుకున్నాయి. ఈ క్రమంలో కారు ముందు భాగం నుజ్జయినా కారు లోపల ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్సై కె. సుధాకర్ వెల్లడించారు. ఇటీవల బాడవ వద్ద కారు ఢీకొట్టగా ముగ్గురికి గాయాలయ్యాయి. మూడు రోజుల కిందట జరిగిన మరో ప్రమాదంలో నాలుగు గేదెలు మృతి చెందాయి. ఈ ప్రమాదాలన్నింటికీ టిప్పర్లే కారణం కావడం గమనార్హం.

ద్విచక్ర వాహనాల చోరీపై కేసు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలిక ఇబ్రహీంపట్నం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఆదివారం కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. ఫెర్రీకి చెందిన లంక మారుతి తన ద్విచక్ర వాహనం యాక్టివాను ఈ నెల 9న ఇబ్రహీంపట్నం బస్టాప్ వద్ద నిలిపి వ్యక్తిగత పనులు ముగించుకొని అక్కడికి వచ్చి చూడగా తన వాహనం కనిపించలేదు. పరిసర ప్రాంతంలో వెతికి చూసినా ప్రయోజనం లేకపోవడంతో ఇబ్రహీంపట్నం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. గుంటూరుకు చెందిన తోట రామిరెడ్డి ఇబ్రహీంపట్నం ఏ.కాలనీ వద్ద డోర్ పాలిష్ వర్క్స్ చేస్తున్నాడు. ఈ నెల 3న తన ద్విచక్ర వాహనం అక్కడ పెట్టి గృహాల్లో పనులు చేసుకొన్నాడు. సాయంత్రం వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. బాధితుని ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరవీరుడికి కన్నీటి వీడ్కోలు



జవాన్ తల్లిదండ్రులను ఓదారుస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్. చిత్రంలో మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్

(మొదటి పేజీ తరువాయి)
అర్పించేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వేల మంది తరలివచ్చారు.

అన్ని విధాలుగా ఆదుకుంటాం

మురళీనాయక్ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. తల్లిదండ్రులకు మురళీనాయక్ ఏకైక సంతానం. ఆయన మరణంతో వారు ఒంటరిగా మిగిలిపోయారు. వారి కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.50 లక్షలు ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రకటించారు. 5 ఎకరాల పొలం, 300 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతోపాటు వ్యక్తిగతంగా తాను రూ.25 లక్షలు అందిస్తానని పవన్‌కల్యాణ్ ప్రకటించారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ మురళీనాయక్ తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు. జిల్లా కేంద్రంలో జవాన్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు కళ్లితండాను మురళీనాయక్ తండాగా మారుస్తామని పేర్కొన్నారు. అంత్యక్రియలు నిర్వహించిన స్థలాన్ని స్మారకంగా తీర్చిదిద్దుతామన్నారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన లోకేశ్

ఆదివారం ఉదయం 8.30 గంటలకు మురళీనాయక్ స్వగ్రామం కళ్లి తండాకు చేరుకున్న మంత్రి లోకేశ్ అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. జవాన్ తల్లిదండ్రులు, బంధువులకు ధైర్యం చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు మురళీనాయక్.. స్నేహితుడు రాజశేఖర్‌తో జరిపిన వాట్సప్ సందేశాలను మంత్రి పరిశీలించారు. అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మురళీనాయక్ భౌతికకాయాన్ని స్వయంగా మోశారు. అంత్యక్రియల వద్ద వీరుడి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎం.ఎస్.రాజు, కందికుంట వెంకటప్రసాద్, దగ్గుబాటి ప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మురళీనాయక్ భౌతికకాయం ఉన్న పేటిక మోస్తున్న మంత్రి లోకేశ్



కడసారి చూపునకు బారులు తీరిన జనం



మురళీనాయక్ అంతిమయాత్రలో పాల్గొన్న అశేష జనం

నా గుండె బరువెక్కింది: సీఎం

మురళీనాయక్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఒక్కగానొక్క కుమారుడిని పోగొట్టుకున్న ఆ తల్లిదండ్రుల శోకంతో తన గుండె బరువెక్కిందని ఎక్స్ వేదికగా విచారం వ్యక్తం చేశారు. 'దేశం కోసం ఆయన ప్రాణత్యాగం ఎప్పుడూ స్ఫూర్తి రగిలిస్తూనే ఉంటుంది' అని చంద్రబాబు నివాళి అర్పించారు.

రేపు పరామర్శించనున్న జగన్: మురళీనాయక్ కుటుంబాన్ని వైకాపా అధినేత జగన్ మంగళవారం పరామర్శించనున్నారని పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.



నెక్లెస్‌రోడ్డులోని నీరా కేఫ్‌లో చీర్స్ చెబుతూ నీరా తాగుతున్న మిస్‌వరల్డ్ పోటీదారులు

నీరా.. సుందరీమణుల ఫిదా

హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్ పోటీదారుల సందడి

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచ దేశాల సుందరీమణులు తెలంగాణ సంప్రదాయ పానీయం నీరా రుచి చూశారు. ప్రకృతి ప్రసాదించిన పోషకాల పానీయాన్ని ఇష్టంగా తాగారు. కొబ్బరినీళ్లలా భలేగా ఉన్నాయంటూ కితాబిచ్చారు. అలాగే డొన్నెల్లో అందించిన తాటి ముంజలను ఎలా ఒలవాలో ఆసక్తిగా తెలుసుకుని ఆరగించారు. మిస్ వరల్డ్ 2025 పోటీలకు వచ్చిన అందగత్తెలు ఆదివారం నెక్లెస్‌రోడ్డులోని నీరా కేఫ్‌ను సందర్శించారు. గీత కార్మికులు తాటి డొన్నెల్లో, ప్రత్యేక టిన్నుల్లో వారికి నీరా అందించారు.

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)
ఉండటం విశేషం. ఎప్‌సెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగాల ర్యాంకులను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో విడుదల చేశారు.

ఇంజినీరింగ్ విభాగంలో తొలి 5 ర్యాంకర్లు..

ర్యాంకు	విద్యార్థి పేరు	సొంతూరు
1	పల్లా భరత్‌చంద్ర	పార్వతీపురం మన్యం, ఏపీ
2	ఉడగండ్ల రామచరణ్‌రెడ్డి	మాదాపూర్, హైదరాబాద్
3	పమ్మిన హేమసాయి సూర్యకార్తీక్	విజయనగరం, ఏపీ
4	లక్ష్మీభార్గవ్ మెండె	నాచారం, హైదరాబాద్
5	మంత్రిరెడ్డి వెంకటగణేశ్ రాయల్	మాదాపూర్, హైదరాబాద్

వరుసగా రెండేళ్లూ ఉత్తరాంధ్ర విద్యార్థులదే తొలి ర్యాంకు: ఇంజినీరింగ్‌లో ఏపీలోని పార్వతీపురం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్‌చంద్ర 160 మార్కులకు 150.058 సాధించి ప్రథమ ర్యాంకు పొందాడు. ఈ విద్యార్థి ఇంటర్‌మీడియట్‌ను హైదరాబాద్‌లోనే చదివాడు. ఈ విభాగంలో 138.25 మార్కులకు పదో ర్యాంకు దక్కింది. గత ఏడాది ఎప్‌సెట్‌లో కూడా శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన సతివాడ జ్యోతిరాదిత్య 160కి 155.63 మార్కులు సాధించి ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. వరుసగా రెండేళ్లపాటు ఇంజినీరింగ్‌లో ఉత్తరాంధ్ర విద్యార్థులే తొలి ర్యాంకు సాధించడం విశేషం.

టాప్ ర్యాంకర్లు ఏమన్నారంటే..

ఐఐటీ బాంబేలో సీటే లక్ష్యం

– పల్లా భరత్‌చంద్ర(1వ ర్యాంకు)

మాది ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గుణానపురం. ప్రస్తుతం శ్రీకాకుళం పట్టణంలో ఉంటున్నాం. నాన్న హెడ్ కానిస్టేబుల్. అమ్మ పంచాయతీ కార్యదర్శి. ఇంటర్ హైదరాబాద్‌లో చదివి 961 మార్కులు సాధించా. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్‌లో ఆల్ ఇండియా 120వ ర్యాంకు వచ్చింది. త్వరలో జరగనున్న అడ్వాన్స్‌డ్‌కు సాధన చేస్తున్నా. ఐఐటీ బాంబేలో సీఎస్ఈ చేయడమే నా లక్ష్యం. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదివి ఉన్నతంగా స్థిరపడతా.

గణితంపై ఇష్టం పెరిగి

– యు.రామచరణ్‌రెడ్డి(2వ ర్యాంకు)

మాది ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉంటూ పరీక్షలకు సన్నద్ధమయ్యా. నాన్న కృష్ణారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు కావడంతో చిన్నప్పటి నుంచి ఏ సందేహం వచ్చినా తీర్చేవారు. దీంతో గణితంపై ఇష్టం పెరిగింది. అమ్మ రాణి రుద్రమదేవి వెన్నంటే ఉండి ప్రోత్సహించారు. ఇంటర్మీడియట్‌లో 995 మార్కులు, జేఈఈలో మెయిన్‌లో ఆల్ ఇండియా 53వ ర్యాంకు సాధించా. ఐఐటీలో ఇంజినీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని నా కోరిక.

ఇంజినీరింగ్ తర్వాత సివిల్స్‌కు వెళ్తా

– పమ్మిన హేమసాయి సూర్య కార్తీక్(మూడో ర్యాంకు)

మాది ఏపీలోని విజయనగరం. ఎన్టీఆర్ జిల్లా కానూరులో పదో తరగతి చదివా. ఇంటర్ విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదివి 988 మార్కులు సాధించా. అమ్మానాన్న దీపిక, జగన్మోహన్‌రావు ఉపాధ్యాయులు. జేఈఈ మెయిన్ పరీక్షలో ఆల్ ఇండియా 75వ ర్యాంకు సాధించా. ఐఐటీ బాంబేలో సీఎస్ఈ సీటు సాధించడమే లక్ష్యం. అనంతరం సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమవుతా.

అమ్మ ప్రోత్సాహం మరువలేనిది

– మంత్రిరెడ్డి వెంకటగణేశ్ రాయల్(5వ ర్యాంకు)

మా స్వస్థలం ఏపీలోని అన్నమయ్య జిల్లా రాయచోటి. మాదాపూర్‌లో ఉంటూ చదువుకున్నా. అమ్మ శ్రీకాంత, నాన్న రెడ్డయ్య ప్రోత్సాహంతో అన్నయ్య, అక్కయ్యతో పాటు నేనూ చదువులో ముందుండేవాణ్ని. ఎలాంటి సందేహం వచ్చినా అమ్మ తీర్చేది. జేఈఈ మెయిన్‌లో 262 ర్యాంకు, ఇంటర్మీడియట్‌లో 960 మార్కులు సాధించా. అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకుతో ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం.

– న్యూస్‌టుడే, కొమరాడ, విజయనగరం విద్యావిభాగం

టాప్ ర్యాంకర్లయినా.. స్థానికేతరులైతే సీట్లు రావు!

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగంలో పలువురు ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగిన విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించారు. అయితే విభజన చట్టంలో పేర్కొన్న పదేళ్ల గడువు పూర్తయిన నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచి అమలులోకి వస్తున్న కొత్త ఉత్తర్వుల ప్రకారం.. వీరు తెలంగాణలో కన్వీనర్ కోటాలో 15% సీట్లు పొందే అవకాశం లేదు. కన్వీనర్ కోటాలో 85 శాతం సీట్లను యథాతథంగా స్థానికులకే కేటాయిస్తుండగా... మిగిలిన 15 శాతం స్థానికేతర కోటా సీట్లను కూడా తెలంగాణ మూలాలున్న కుటుంబాల్లోని విద్యార్థులకు మాత్రమే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అంటే తెలంగాణకు చెంది ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటున్నవారు, ఇతర రాష్ట్రాల వారై ఉండి... తెలంగాణలో 'స్థానిక' అర్హత లేకపోయినా.. వారి తల్లి లేదా తండ్రి ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నట్లయితే.. ఆ విద్యార్థులు 15 శాతం నాన్‌లోకల్ కోటా కింద సీట్లు పొందటానికి అర్హులు.

★ గత పదేళ్లలో ఏటా 15 శాతం కోటాలో 3,500 నుంచి 4 వేల సీట్లలో ఏపీ విద్యార్థులు చేరేవారు. ఈసారి ఆ అవకాశం లేకపోవడంతో తెలంగాణ విద్యార్థులకు ఆ మేరకు ప్రయోజనం కలగనుంది. దానివల్ల ఈసారి ప్రముఖ కళాశాలల్లో కటాఫ్ ర్యాంకు కొంత పెరగవచ్చని భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో ఇంటర్ చదివినా.. చేరలేరు.. రాష్ట్రంలో స్థానిక కన్వీనర్ కోటాలో సీటు పొందాలంటే 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు... అంటే ఏడేళ్లలో నాలుగేళ్లు తెలంగాణలో చదివి ఉండాలి. ఉదాహరణకు ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు (లేదా) 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివిన వారిని స్థానికులుగా పరిగణిస్తారు. అయితే హైదరాబాద్‌లో పలు కార్పొరేట్ కళాశాలలు ఉండటంతో అనేక మంది ఏపీ విద్యార్థులు సొంత రాష్ట్రంలో పదో తరగతి వరకూ చదివి... ఇంటర్‌మీడియట్‌ను నగరంలో చదువుతున్నారు. ఇక్కడ వారు రెండేళ్లు మాత్రమే చదివినందున వారిని స్థానికేతరులుగానే పరిగణిస్తారు. వారు టాప్ ర్యాంకులు సాధించినా తెలంగాణలో కన్వీనర్ కోటా సీటు పొందలేరని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. విజయవాడలోని కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న వందల మంది విద్యార్థులు సైతం సమీపంలోని కోదాడ, సత్తుపల్లిలో తెలంగాణ ఎప్‌సెట్ రాశారు. ఇతర బోర్డుల నుంచి అని దరఖాస్తు చేసి... పరీక్ష రాశారు. వారిలో అనేక మందికి ఉత్తమ ర్యాంకులు దక్కాయి. అయినా వారు ప్రవేశాలు పొందటానికి అర్హులు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వీరంతా ప్రాక్టీస్ కోసమే ఈ పరీక్షలు రాస్తుంటారని నిపుణులు చెబుతున్నారు.

నామినేటెడ్ పోస్టుల నజరానా

(మొదటి పేజీ తరువాయి)
టికెట్లు త్యాగం చేసిన వారికి, పొత్తు ధర్మాన్ని పాటించి అభ్యర్థుల విజయానికి కృషిచేసిన వారికి తాజాగా ఇచ్చిన నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రాధాన్యం కల్పించింది. పార్టీ పట్ల విధేయత, అంకితభావం, చిత్తశుద్ధి, కష్టకాలంలోనూ పార్టీని అంటిపెట్టుకుని ఉన్నవారికీ అవకాశమిచ్చింది. ఈ పోస్టుల భర్తీలో సామాజిక న్యాయానికీ పెద్దపీట వేశారు. బీసీలకు 8, ఎస్సీలకు 2, ఎస్టీలకు ఒక పదవి దక్కాయి. మొత్తం పదవుల్లో 36 శాతం బీసీలకు లభించాయి.



పీతల సుజాత



సోళ్ల బొజ్జిరెడ్డి



సి.దివాకర్‌రెడ్డి

టికెట్లు త్యాగం చేసిన వారికి..

పొత్తులో భాగంగా మొన్నటి ఎన్నికల్లో నిడదవోలు, తిరుపతి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలను మిత్రపక్షమైన జనసేనకు కేటాయించారు. దీంతో ఆయా స్థానాల నుంచి పోటీ చేయాలని ఆశించిన మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, సుగుణమ్మ, తాడేపల్లిగూడెం తెదేపా ఇన్‌ఛార్జి వలవల బాబ్జీకి అవకాశం లభించలేదు. అయినా వారు కూటమి అభ్యర్థుల విజయం కోసం పనిచేశారు. ఇప్పుడు వారు ముగ్గురినీ కీలకమైన పదవులు వరించాయి. శేషారావును నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా, సుగుణమ్మను గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా, వలవల బాబ్జీని భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు ఛైర్మన్‌గా నియమించారు.

విధేయంగా ఉన్న వారికి

■ తెదేపా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీమంత్రి కేఎస్ జవహర్ మొన్నటి ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించారు. వివిధ రాజకీయ సమీకరణాల రీత్యా ఆయనకు అవకాశమివ్వలేకపోయారు. అయినా పార్టీని నమ్ముకుని విధేయంగా ఉన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ గట్టిగా మాట్లాడారు. ఆయనను కీలకమైన ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా నియమించారు.

■ తెదేపా కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గతంలో వ్యవహరించిన మలేపాటి సుబ్బానాయుడు.. టికెట్ కోసం చివరి నిమిషం వరకూ ప్రయత్నించారు. వివిధ సమీకరణాల్లో భాగంగా ఇక్కడి నుంచి కావ్య కృష్ణారెడ్డికి పార్టీ అవకాశం కల్పించింది. సుబ్బానాయుడికి ఇప్పుడు ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశం దక్కింది.

■ మాజీమంత్రి పీతల సుజాత.. తొలి నుంచి పార్టీకి విధేయురాలు. 2019, 2024 ఎన్నికల్లో టికెట్ దక్కకపోయినా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆమెను మొదటి విడత నామినేటెడ్ పోస్టుల భర్తీలోనే వినియోగదారుల రక్షణ మండలి ఛైర్మన్‌గా నియమించారు. సాంకేతిక సమస్యల వల్ల ఆమె ఆ బాధ్యతలు చేపట్టలేకపోయారు. ఇప్పుడు ఆమెను కీలకమైన మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా నియమించారు.

■ తెదేపా అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వెంకట శివుడు యాదవ్.. ఎన్నికల్లో గుంతకల్లు నియోజకవర్గం నుంచి తెదేపా టికెట్ ఆశించారు. అక్కడి నుంచి మాజీమంత్రి జయరామ్ పోటీ చేయడంతో ఆయనకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు వెంకట శివుడు యాదవ్ కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

■ తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న దివాకర్‌రెడ్డి.. మొన్నటి ఎన్నికల్లో చంద్రగిరి నుంచి తెదేపా తరపున పోటీ చేయాలని భావించారు. అయినా అవకాశం దక్కలేదు. ఆయనను తుడా ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది.

జనసేన, భాజపాల నుంచీ..

■ మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ 2019లో ఆ స్థానం నుంచే పోటీ చేశారు. జనసేనలో చాలా క్రియాశీలకంగా ఉన్నారు. ఆయనను నీటిపారుదల అభివృద్ధి సహకార సంస్థ ఛైర్మన్‌గా నియమించారు.

■ ఒంగోలుకు చెందిన రియాజ్ ప్రస్తుతం జనసేన పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. 2014 నుంచి జనసేనలో క్రియాశీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2019లో ఒంగోలు నుంచి జనసేన తరపున పోటీ చేశారు. ఆయన్ను లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఛైర్మన్‌గా నియమించారు.

■ డా.పసుపులేటి హరిప్రసాద్ జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు. గతంలో తితిదే బోర్డు సభ్యుడిగానూ పనిచేశారు. 2014 నుంచి పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. ఆయన ఇప్పుడు హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

■ రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన సొల్ల బొజ్జిరెడ్డి విశ్రాంత ఉపాధ్యాయుడు. పదవీ విరమణ అనంతరం ఐదేళ్లుగా ఆయన భాజపాలో చురుగ్గా పనిచేస్తున్నారు. ఆయనకు అత్యంత కీలకమైన ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పదవి లభించింది.

మహిళల హక్కులు పరిరక్షించే అవకాశం రాయపాటి శైలజకు

■ అమరావతి ఐకాసలో చురుగ్గా పనిచేసినవారికీ నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం కల్పించారు. రాజధాని పరిరక్షణ ఉద్యమంలో, రైతులు చేపట్టిన పాదయాత్రలో రాయపాటి శైలజ క్రియాశీలక పాత్ర పోషించారు. జగన్ ప్రభుత్వ హయాంలో వైకాపా నాయకులు, ఆ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలు కొనసాగించిన అసభ్య దూషణలు, దాడులకు ఆమె బాధితురాలు. వాటిని లెక్క చేయకుండా ఆమె రాజధాని ఉద్యమంలో గట్టిగా పోరాడారు. ఇలాంటి నేపథ్యం ఉన్న శైలజను మహిళల హక్కులను పరిరక్షించే ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమించారు.

■ 2019-2024 మధ్య వైకాపా హయాంలో జరిగిన అరాచకాలపై 'విధ్వంసం' పేరిట పుస్తకం రాసిన పాత్రికేయుడు ఆలపాటి సురేశ్‌కుమార్‌కు ప్రెస్ అకాడమీ ఛైర్మన్ బాధ్యతలు అప్పగించారు.

పార్టీని నమ్ముకున్న వారికీ

■ ఏపీఎన్‌ఆర్టీ సొసైటీ ఛైర్మన్‌గా నియమితులైన డా.రవి వేమూరి 2014-19 మధ్య ఇదే పోస్టులో పనిచేశారు. ప్రవాసాంధ్రుల్లో పార్టీకి మద్దతు కూడగట్టడం, రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా కృషి చేయడంలో కీలకంగా వ్యవహరించారు. పార్టీకి తొలి నుంచి పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నారు.

■ కుమ్మరి శాలివాహన సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన పేరేపి ఈశ్వర్.. ప్రస్తుతం తెదేపా బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, విజయవాడ 13వ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో పార్టీకి విజయవాడ అర్బన్ బీసీ సెల్ అధ్యక్షుడిగా చేశారు.

■ ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా నియమితులైన పెద్దిబోయిన వాణి వెంకట శివప్రసాద్.. ఏలూరు పట్టణ తెదేపా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణకు ప్రధాన అనుచరుడు.

రెరా ఛైర్మన్‌గా శివారెడ్డి?

ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) ఛైర్మన్‌గా అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ శివారెడ్డి నియమితులయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఆయన్ను ఈ పోస్టులో నియమించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

■ కుప్పం నియోజకవర్గానికి చెందిన ఎస్.రాజశేఖర్‌కు పార్టీలో కుప్పం రాజశేఖర్‌గా గుర్తింపు ఉంది. ఆయన్ను విద్యా, సంక్షేమ మౌలిక వసతులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించారు.

■ నెల్లూరుకు చెందిన జడ్.శివప్రసాద్.. తొలి నుంచి తెదేపాలో ఉన్నారు. పార్టీ తరపున వైద్య శిబిరాల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తుంటారు. ఆ పార్టీ డాక్టర్స్ సెల్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన ఇప్పుడు ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు ఛైర్మన్‌గా పదవి పొందారు.

■ గుంటూరుకు చెందిన మల్లెల ఈశ్వరరావు వడ్డెర సేవా సహకార సంస్థ ఎన్టీఆర్ జిల్లా కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. తెదేపా బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

■ తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి చెందిన ఆకాశపు స్వామి.. తెదేపాలో తొలి నుంచి ఉన్నారు. ప్రస్తుతం టైలర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆయన్ను ఆంధ్రప్రదేశ్ టైలర్ అభివృద్ధి సహకార సమాఖ్య ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. గతంలోనూ ఆయనే పోస్టులో పనిచేశారు.

■ నరసాపురం నియోజకవర్గానికి చెందిన కొల్లు పెద్దిరాజు.. నరసాపురం పట్టణ తెదేపా ప్రధాన కార్యదర్శి. ఆయనకు రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్‌గా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.

పేరు	బోర్డు	పార్టీ/ అమరావతి జేఏసీ	అసెంబ్లీ నియోజకవర్గం	జిల్లా	సామాజిక వర్గం
పీతల సుజాత	మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్	తెదేపా	భీమవరం	పశ్చిమగోదావరి	మాల (ఎస్సీ)
కేఎస్ జవహర్	ఎస్సీ కమిషన్	తెదేపా	కొవ్వూరు	తూర్పుగోదావరి	మాదిగ(ఎస్సీ)
సోళ్ల బొజ్జిరెడ్డి	ఎస్టీ కమిషన్	భాజపా	రంపచోడవరం	అల్లూరి సీతారామరాజు	కొండరెడ్డి(ఎస్టీ)
డా. రాయపాటి శైలజ	మహిళా కమిషన్	అమరావతి జేఏసీ	గుంటూరు	గుంటూరు	ఓసీ
ఆలపాటి సురేశ్	ప్రెస్ అకాడమీ	అమరావతి జేఏసీ	తాడికొండ	గుంటూరు	ఓసీ
డా.జడ్.శివప్రసాద్	ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు	తెదేపా	నెల్లూరు నగరం	నెల్లూరు	చేనేత (బీసీ)
ఎస్.రాజశేఖర్	విద్య, సంక్షేమ వసతుల కార్పొరేషన్	తెదేపా	కుప్పం	చిత్తూరు	మొదలియార్(బీసీ)
సుగుణమ్మ	గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్	తెదేపా	తిరుపతి	తిరుపతి	ఓసీ
వెంకటశివుడు యాదవ్	కార్మిక సంక్షేమ బోర్డు	తెదేపా	గుంతకల్లు	అనంతపురం	యాదవ (బీసీ)
వలవల బాబ్జీ	భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు	తెదేపా	తాడేపల్లిగూడెం	పశ్చిమగోదావరి	ఓసీ
బురుగుపల్లి శేషారావు	నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్	తెదేపా	నిడదవోలు	తూర్పుగోదావరి	ఓసీ
ఆకాశపు స్వామి	టైలర్ అభివృద్ధి సహకార సమాఖ్య	తెదేపా	తాడేపల్లిగూడెం	పశ్చిమగోదావరి	దేవాంగ (బీసీ)
దివాకర్‌రెడ్డి	తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ	తెదేపా	తిరుపతి	తిరుపతి	ఓసీ
పి.వాణివెంకట శివప్రసాద్	ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ	తెదేపా	ఏలూరు	ఏలూరు	యాదవ(బీసీ)
డా.వేమూరి రవి	ఏపీఎన్నార్టీ సొసైటీ	తెదేపా	తెనాలి	గుంటూరు	ఓసీ
మలేపాటి సుబ్బానాయుడు	ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్	తెదేపా	కావలి	నెల్లూరు	ఓసీ
కొల్లు పెద్దిరాజు	మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య	తెదేపా	నరసాపురం	పశ్చిమగోదావరి	మత్స్యకార(బీసీ)
పేరేపి ఈశ్వర్	కుమ్మరి, శాలివాహన సంక్షేమ కార్పొరేషన్	తెదేపా	విజయవాడ తూర్పు	ఎన్టీఆర్	కుమ్మరి(బీసీ)
మల్లెల ఈశ్వరరావు	వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్	తెదేపా	గుంటూరు పశ్చిమ	గుంటూరు	వడ్డెర (బీసీ)
వి.లీలాకృష్ణ	నీటిపారుదల అభివృద్ధి సహకార సంస్థ	జనసేన	మండపేట	అంబేడ్కర్ కోనసీమ	ఓసీ
రియాజ్	లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ	జనసేన	ఒంగోలు	ప్రకాశం	ముస్లిం
డా.పసుపులేటి హరిప్రసాద్	హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్	జనసేన	తిరుపతి	తిరుపతి	ఓసీ

నోటీసులు బేఖాతరు

(మొదటి పేజీ తరువాయి)
మద్యం కుంభకోణం కేసులో కె.ధనుంజయరెడ్డి ఏ31, కృష్ణమోహన్‌రెడ్డి ఏ32, గోవిందప్ప ఏ33గా ఉన్నారు. వీరు ముగ్గురూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు. 'మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి ముడుపులు వసూలు చేయడం, ఆ సొమ్మును డొల్ల కంపెనీలకు మళ్లించడంలో కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలతో పాటు ధనుంజయరెడ్డి పాత్ర ఉంది. ముడుపులుగా ఎంత మొత్తం చెల్లించాలనేదానిపై ఈ ముగ్గురూ తరచూ హైదరాబాద్, తాడేపల్లిలో మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల యజమానులతో సమావేశమయ్యేవారు' అని సిట్ ఇప్పటికే తేల్చింది. మద్యం ముడుపుల సొమ్మును రాజ్ కసిరెడ్డి వీరికి చేరవేస్తే.. వీరు దాన్ని జగన్‌కు అందజేసేవారని ఇప్పటివరకూ అరెస్టైన నిందితులకు సంబంధించిన రిమాండ్ రిపోర్టుల్లో ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో వీరిని విచారించడం ద్వారా కీలక వివరాలు రాబట్టాలని భావించింది. అయితే వీరు గైర్హాజరయ్యారు.

ఇప్పటికే లుక్‌అవుట్ సర్క్యులర్లు: 17 రోజుల కిందటే అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన ఈ ముగ్గురు నిందితుల కోసం సిట్ బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. వీరు విదేశాలకు పారిపోకుండా.. సిట్ అధికారులు అంతకుముందే లుక్‌అవుట్ సర్క్యులర్లు (ఎల్‌వోసీ) జారీ చేశారు. మరోవైపు వీరు తలదాచుకునేందుకు అవకాశం ఉన్న అన్ని రహస్య ప్రాంతాల్లోనూ సోదాలు చేస్తోంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతో పాటు మరికొన్ని ప్రాంతాల్లోనూ సిట్ బృందాలు నిఘా పెట్టాయి. మరోవైపు నిందితుల కుటుంబ సభ్యులు, వారి బంధువులకూ సిట్ అధికారులు ఆదివారం నోటీసులిచ్చారు. వారి సమాచారం, ఆచూకీ తెలియజేయాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

ఆప్కాబ్ ఛైర్మన్‌గా గన్ని వీరాంజనేయులు



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఉమ్మడి ప్రకాశం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లు, సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లకు ఛైర్మన్‌లను ప్రభుత్వం నియమించింది. పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల డీసీసీబీలు, ప్రకాశం, తూర్పుగోదావరి జిల్లాల డీసీఎంఎస్‌లకు ఛైర్మన్‌లుగా తెదేపా వారికి అవకాశం కల్పించగా.. మిత్రపక్షం జనసేనకు తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ, పశ్చిమగోదావరి జిల్లా డీసీఎంఎస్‌లను కేటాయించింది. ఏలూరు జిల్లా తెదేపా ఇన్‌ఛార్జిగా ఉన్న గన్ని వీరాంజనేయులను ఏలూరు డీసీసీబీతోపాటు ఆప్కాబ్ ఛైర్మన్ పదవి వరించింది. గతంలో పది ఉమ్మడి జిల్లాలకు డీసీసీబీ, డీసీఎంఎస్ ఛైర్మన్‌లను నియమించగా.. తాజాగా విడుదల చేసిన వాటితో కలిపి 13 ఉమ్మడి జిల్లాల డీసీసీబీ, డీసీఎంఎస్‌ల పదవుల భర్తీ పూర్తయింది. ఈ పదవుల కేటాయింపులో ముఖ్యమంత్రి చంద్రబాబు సామాజికవర్గాల వారీగా సమతూకం పాటించారు. పార్టీ విధేయులకు ప్రాధాన్యం ఇచ్చారు.

జిల్లా	డీసీసీబీ ఛైర్మన్	డీసీఎంఎస్ ఛైర్మన్
పశ్చిమగోదావరి	గన్ని వీరాంజనేయులు	చాగంటి మురళీకృష్ణ (జనసేన)
ప్రకాశం	కామేపల్లి సీతారామయ్య	శ్యామల కసిరెడ్డి
తూర్పుగోదావరి	తుమ్మల రామస్వామి (జనసేన)	పి. చంద్రమౌళి

వసుంధర

vasundhara@eenadu.in

ఎండల్లో పట్టించుకుంటున్నారా?



బయటికి వెళ్తోంటే సన్‌స్క్రీన్, చెమట నుంచి తప్పించుకోవడానికి కాటన్ దుస్తులు, ట్యాన్ పట్టొద్దని ముఖానికి మాస్క్... ఇలా చర్మానికి సంబంధించి ఎన్నెన్నో జాగ్రత్తలు తీసుకుంటాం. మరి కురుల మాటేంటి?

- కాస్త ఫ్యాను గాలి తగ్గినా చాలు... తలలోంచి చెమట కారుతూ వచ్చేస్తుంది కదూ! దానికితోడు జిడ్డు. జుట్టంతా అలా మాడుకు అతుక్కుపోయినట్లు చిరాకే. అందుకే తాజాగా ఉండాలని మాటిమాటికీ తలస్నానాలు చేసేస్తుంటాం. కానీ వారానికి 2-3సార్లకు మించనీయకండి. లేదంటే సహజ నూనెలు తొలగిపోయి జుట్టు గడ్డిలా మారుతుంది. కావాలంటే డ్రై షాంపూని వాడండి. లేదా నీళ్లు, యాపిల్ సిడర్ వినిగర్ సమపాళ్లలో తీసుకుని వాటితో మాడును శుభ్రం చేసుకున్నా మంచిదే.
- అసలే ఎండ వేడి... దీనికితోడు బ్లో డ్రయర్లు, స్ట్రెయిట్‌నర్లు, కర్లర్లు వాడుతున్నారా? చిట్లడమే కాదు... కురులు బలహీనమై ఊడే అవకాశాలూ ఎక్కువ. వీలైనంత వరకూ సహజంగానే ఆరనివ్వండి. మరీ తప్పనిసరి అయితే హీట్ సెట్టింగ్‌లైనా తగ్గించండి లేదా థర్మల్ ప్రొటెక్టెంట్ స్ప్రే అయినా వాడండి.
- కండిషనింగ్ చేస్తున్నారా? వాతావరణ మార్పుల కారణంగా ఈ కాలం కురులు పొడిబారతాయి. అందుకే, చిరాకుగా తోచినా డీప్ కండిషనింగ్ తప్పనిసరి. హైలురోనిక్ యాసిడ్, గ్లిజరిన్, సహజ నూనెలున్న షాంపూలు, కండిషనర్లు వాడటం, 'హెయిర్ ప్యాక్‌'లు వేయడం మంచిది.
- చర్మానికి సన్‌స్క్రీన్ రాస్తాం కదా! కురులకీ ఆ సంరక్షణ కావాలి. యూవీ కిరణాలు కురుల్లోని ప్రొటీన్‌ని దెబ్బతీస్తాయి. నిర్జీవంగా తయారవ్వడమే కాదు, చిట్లడానికీ కారణమవుతాయి. ఎస్పీఎఫ్ ఉన్న కండిషనర్, సీరమ్‌లు వాడండి. లేదా బయటికి వెళ్లేటప్పుడు టోపీ, స్కార్ఫ్ వగైరా ఉపయోగించినా మంచిదే!

ఇకనైనా శ్రమిద్దాం!

ఇరవై ఏళ్లకి థైరాయిడ్, పీసీఓడీ... ముప్పైలకే కీళ్ల నొప్పులు... అంతేనా, యాభైల్లో రావాల్సిన మెనోపాజ్... నలభైల్లోనే పలకరిస్తుంది... ఆపై ఆస్టియోపోరోసిస్, అల్జీమర్స్, క్యాన్సర్లు.... ఒకటేమిటి, ఈ తరం మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యలు చాలానే. శరీరానికి తగిన కదలికలు లేకపోవడమే దీనికి మూలం అంటోంది ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక.



'ఏమంత లావుగా ఉన్నావని వ్యాయామం చేస్తా నంటున్నావ్' అంటారు ఇరవైల్లో! ఇక, ఆ తరవాత చూడాలి... గంటలకొద్దీ కూర్చుని చేసే ఉద్యోగం, పెళ్లి, పిల్లలు... ఒత్తిళ్లతో నలభై కేజీల బరువున్న అమ్మాయి కాస్తా అరవైలకు చేరుకుంటుంది. ఆపై ఏటికేడు వద్దన్నా పెరుగుతూనే ఉంటుంది. అప్పటికే మారిన జీవనశైలి, పెరుగుతోన్న వయసు తాలూకు ప్రభావాలు ఒక్కొక్కటిగా జూలు విదుల్చుతాయి. దీంతో థైరాయిడ్, పీసీఓడీ, అధికరక్తపోటు... ఒకటేమిటి ఎన్నెన్నో బయటపడుతుంటాయి. దీంతో ఏ డాక్టరు దగ్గరికి వెళ్లినా వాకింగ్ చేస్తున్నారా? జిమ్‌కి వెళ్లండి... యోగా చేయండి అన్న సలహాలే. వారు చెప్పింది నిజమే! కదలికలు తగ్గితే కండరాల సామర్థ్యం తగ్గుతుంది. జీర్ణవ్యవస్థ పనిచేయనని మొరాయిస్తుంది. రక్తప్రసరణలో లోపాలు, గర్భాశయ పనితీరులో మార్పులు... మరెన్నో సమస్యలూ మొదలవుతాయి.

మరేం చేయాలి?

ఇంటినీ, వృత్తినీ సమన్వయం చేసుకోవాలన్నా, ఒత్తిడిని అదుపులో ఉంచుకోవాలన్నా, అనారోగ్యాల బారిన పడకూడదన్నా... మహిళలకు తగిన శారీరక సామర్థ్యం అవసరం. ఇందుకోసం పోషకాహారం తీసుకోవడంతోపాటు వ్యాయామాలూ చేయడం తప్పనిసరి. వయసుకి తగ్గట్లుగా మహిళలు చేయాల్సిన కసరత్తులు ఎంచుకుంటే ఆరోగ్యమే కాదు... ఆత్మవిశ్వాసమూ మీ సొంతమవుతుంది.

20-30 ఏళ్లలోపు.. ఈ దశలో మహిళలు శారీరకంగా దృఢంగా ఉంటారు. అందుకు తగ్గట్టే శక్తిని పెంపొందించే వ్యాయామాలను ఎంచుకోవాలి. ముఖ్యంగా రోజూ కనీసం 30 నిమిషాల జాగింగ్, సైక్లింగ్, డాన్స్, జుంబా వంటి కార్డియో వ్యాయామాలను చేయండి. ఇవన్నీ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అలానే, వారంలో 2-3 రోజులు డంబెల్స్, 'రెసిస్టెన్స్ బ్యాండ్స్' ఉపయోగించి వెయిట్ లిఫ్టింగ్ వంటి స్ట్రెంత్ ట్రైనింగ్‌పై దృష్టిపెట్టండి. ఇవి కండరాల బలాన్ని పెంచుతాయి. సూర్యనమస్కారాలు, ప్రాణాయామం వంటివి ఒత్తిడిని తగ్గించి, శరీర సౌష్ఠవాన్ని మెరుగుపరుస్తాయి.

30-40 ఏళ్లలోపువారు... ఈ వయసులో లైఫ్‌స్టైల్ స్ట్రెస్, గర్భం దాల్చడంలో సమస్యలు, హార్మోనుల్లో మార్పులు.... వంటివి ఎక్కువగా ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి. బ్యాలెన్స్డ్ వర్కవుట్లను ఎంచుకోవాలి. ముఖ్యంగా రోజుకి 30-40 నిమిషాలు వేగంగా నడవాలి. కోర్ కండరాలను బలోపేతం చేయడానికి పిలాటీస్ ఎంచుకోవాలి. భుజంగాసనం, ధనురాసనం వంటివి వెన్ను బలాన్ని పెంచుతాయి. మానసిక ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. వారంలో మూడు రోజులు స్ట్రెంత్ ట్రెయినింగ్‌కి, రెండు రోజులు కార్డియో, మరో రెండు రోజులు యోగాకి కేటాయించుకుంటే మీకు వీటివల్ల కలిగే ప్రయోజనాలు సరిపోతాయి.

చైర్ ఎక్సర్‌సైజ్‌లు: కూర్చొని చేసే వ్యాయామాలు కీళ్ల నొప్పులు ఉన్న వారికి అనుకూలం. అయితే, వర్కవుట్లు ప్రారంభించడానికి ముందు తప్పనిసరిగా మీ శారీరక స్థితి, అనారోగ్యాల గురించి వైద్యుడికి చెప్పాలి. వారి సూచనల మేరకే చేయాలి.

40-50 మధ్య వయస్కులు... మెనోపాజ్ సమీపిస్తున్న ఈ దశలో ఎముకల ఆరోగ్యం, శరీర సౌష్ఠవం ముఖ్యం. తక్కువ ఒత్తిడి ఉండే వ్యాయామాలు ఎంచుకోవాలి. స్విమ్మింగ్, ఏరోబిక్స్ లాంటివి ఎంచుకుంటే కీళ్లపై ఒత్తిడి లేకుండా శరీరాన్ని ఫిట్‌గా ఉంచుతాయి. లైట్ డంబెల్స్ బాడీ వెయిట్ ఎక్సర్‌సైజ్‌లు ఎముకల సాంద్రతను పెంచుతాయి. రోజూ తప్పనిసరిగా 10-15 నిమిషాల స్ట్రెచింగ్ అవసరం. ఇది శరీరాన్ని ఫ్లెక్సిబుల్‌గా మార్చడమే కాదు... కీళ్ల ఆరోగ్యాన్నీ కాపాడుతుంది. ఏం చేసినా రోజులో కనీసం అరగంటైనా వ్యాయామాలు చేయగలిగితేనే శారీరకంగా దృఢంగా ఉండగలరు.

50 ఏళ్లు-ఆపైన... ఈ వయసులో ఆరోగ్య సమస్యలు, కీళ్ల నొప్పులు సాధారణం. కానీ, అనారోగ్యాలు దరిచేరకూడదంటే మాత్రం తేలికైన, సురక్షితమైన వ్యాయామాలు ఎంచుకోవాలి. ముఖ్యంగా తాయ్‌చి, యోగా వంటివి శరీరాన్ని సౌకర్యంగా ఉంచడంతోపాటు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయి. యోగాలో అర్ధమత్స్యేంద్రాసనం, వృక్షాసనం వంటివి సాధన చేయడం వల్ల తగిన ఫలితాలు ఉంటాయి. రోజూ కనీసం 20-30 నిమిషాలు ఒత్తిడి లేని నడక గుండె ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది.

ఏ వ్యాయామం అయినా 5-10 నిమిషాల వార్మప్‌తో మొదలుపెట్టి, కూల్‌డౌన్‌తో ముగించాలి. వర్కవుట్లు చేయడమేకాదు... కాల్షియం, ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. రోజుకు 2-3 లీటర్ల నీళ్లు తాగి శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి.

వడదెబ్బ నుంచి రక్షించే కీరా!



ఈ వేసవి ఎండలకు బయటకు వెళ్తేనే కాదు... ఇంట్లో ఉన్నా డీహైడ్రేషన్ తప్పడం లేదు. దీని బారిన పడకూడదన్నా, శరీరానికి మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు అందించాలన్నా కీరదోస తినడం ఎంతో మేలంటారు పోషకాహార నిపుణులు.

- కీరదోసలో 95 శాతం నీరు ఉంటుంది. ఇది ఒంట్లో వేడిని తగ్గించి శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. ఫలితంగా తలనొప్పి, నిద్రలేమి వంటి సమస్యలు దరిచేరవు.
- కీరలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి, కె, వంటి పోషకాలు హార్మోన్ల సమతుల్యతకు సాయపడతాయి. ఫలితంగా పీసీఓడీ/పీసీఓఎస్ సమస్యలు అదుపులోకి వస్తాయి.
- తక్కువ క్యాలరీలు, ఎక్కువ నీరు ఉన్న కీరను భోజనంలో భాగం చేసుకుంటే అధికంగా ఆహారం తీసుకునే అవసరాన్ని తగ్గిస్తుంది. మసాలా పదార్థాలు తిన్నప్పుడు జీర్ణవ్యవస్థ సరిగా పనిచేసేలా చేస్తుంది. బరువుని అదుపులో ఉంచుతుంది. అంతేకాదు, ఈ కాలంలో ఎక్కువగా ఇబ్బంది పడే యూరినరీట్రాక్ ఇన్ఫెక్షన్లూ తగ్గుతాయి.

“ మీకోసం, మీ హక్కుల కోసం పోరాడండి. ఎప్పుడూ వెనకడుగు వేయొద్దు. అది మీకు మీరు సాయం చేసుకోవడమే కాదు, ఎంతోమంది ఆడవాళ్లకు అండగా నిలిచినట్లు కూడా.



- అదితి గుప్తా, వ్యవస్థాపకురాలు, మెన్‌స్ట్రుపీడియా

యుక్త నడకే ఆకర్షణ..!

'అందాల కిరీటం అందుకోవాలంటే ఆత్మవిశ్వాసమే కాదు... ఇతరులకు మంచి చేయగలిగే మానవత్వమూ ఉండాలి' అంటారు 49వ మిస్‌వరల్డ్ విజేతగా నిలిచిన యుక్తాముఖి.

అది 1999 డిసెంబర్ 4... లండన్‌లోని ఒలింపియా వేదికపై 49వ మిస్‌వరల్డ్ పోటీలు జరుగుతున్నాయి. సుమారు 94దేశాల నుంచి వచ్చిన అందగత్తెలను వెనక్కునెట్టి మన యుక్త మిస్‌వరల్డ్‌గా ఎంపికయ్యారు. తుది రౌండ్‌లో 'ప్రపంచంలో ఎవరిలా అయినా మారాల్సి వస్తే... మీరు ఎవరిని ఎంచుకుంటారు' అని న్యాయనిర్ణేతలు యుక్తను అడిగారు. అందుకు ఆమె యునిసెఫ్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా పనిచేసిన బ్రిటిష్ నటి ఆడ్రి హెప్‌బర్న్ పేరు చెప్పారు. అద్భుతమైన నటనతోపాటు మానవతావాదిగానూ పేరుతెచ్చుకున్న ఆమే తనకు స్ఫూర్తి అని యుక్త చెప్పిన సమాధానం జడ్జిలను సంతృప్తిపరిచింది. ఆమె విజయంలో కీలకపాత్ర పోషించింది.

ఈ పోటీలకు ముందు ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో టైటిల్‌తోపాటు మిస్ ఫొటోజెనిక్ సబ్‌టైటిల్‌నీ గెలుచుకున్నారు. దీంతో మిస్ వరల్డ్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఏడాది పూర్తయ్యాక వెంటనే అంటే... 2000 సంవత్సరానికిగానూ ప్రియాంక చోప్రాకు మిస్‌వరల్డ్ కిరీటం అలంకరించారు. ఇలా ఒకే దేశానికి చెందిన ఇద్దరి మధ్య ఈ మార్పిడి జరగడం మిస్‌వరల్డ్ చరిత్రలో అదే తొలిసారట. 5 అడుగుల 11 అంగుళాల పొడవున్న యుక్త... ఈ పోటీల్లో ర్యాంప్ వాక్ చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'బ్యూటీ విత్ ఎ పర్పస్' టైటిల్ గెలుచుకున్న అనంతరం హెచ్‌ఐవీ/ఎయిడ్స్, బ్రెస్ట్ క్యాన్సర్, తలసీమియా వంటి వాటిపై పనిచేశారు. అవయవదాన అంగీకార పత్రాలపై తాను సంతకం చేయడమే కాదు... పెద్ద ఎత్తున అవగాహన కల్పించారు. బాలకార్మికులు, దివ్యాంగ చిన్నారుల సంక్షేమం కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మురికివాడల్లోని యువతుల శారీరక, మానసిక ఆరోగ్యాల కోసం ఓ ఎన్‌జీవోతో కలిసి పనిచేశారు. వినికిడిలోపం ఉన్నవారితో పనిచేసేందుకు సంజ్ఞల భాషనూ నేర్చుకున్నారు. పర్యావరణ కార్యకర్తగా అనేక ఉద్యమాల్లో తన గళం వినిపించారు.



తల్లి ప్రోత్సాహంతో...

మిస్‌వరల్డ్ టైటిల్ గెలుచుకున్న నాలుగో భారతీయరాలు యుక్తాముఖి. మహారాష్ట్రలోని ములుంద్‌లో సింధీ కుటుంబంలో జన్మించారీమె. మొదటి ఏడేళ్లు దుబాయిలో పెరిగారు. తర్వాత ఆమె కుటుంబం ముంబయికి తిరిగి వచ్చేసింది. తండ్రి వ్యాపారవేత్త కాగా, తల్లి అరుణ ఓ గ్రూమింగ్ సెలూన్ నడిపేవారు. తనకో తమ్ముడు కన్వాల్. యుక్త జువాలజీలో డిగ్రీ చేశారు. ఆపై కంప్యూటర్ సైన్సెస్‌లో డిప్లొమా చేశారు. మూడేళ్లు హిందుస్థానీ సంగీతంతోపాటు ఫైన్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ పొందారు. నిజానికి యుక్తకు మొదటి నుంచీ అందాల కిరీటం సాధించాలన్న ఆలోచనలేం లేవు. తల్లి ప్రోత్సాహంతో ఎటువంటి మోడలింగ్ అనుభవం లేకపోయినా ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్నారు. ప్రపంచ సుందరి కిరీటం అందుకునే వరకూ ప్రతి దశలోనూ తనదైన ముద్రవేశారు.

మీకు తెలుసా



మాడెలిన్ హార్టోగ్- బెల్... పెరూ దేశం తరఫున 1967లో మొదటి మిస్ వరల్డ్ కిరీటం అందుకుంది. ఆ తరవాత మళ్లీ ఆ దేశానికి రెండో మిస్ వరల్డ్ టైటిల్ దక్కింది 2004లోనే. అంటే... 37ఏళ్ల తరవాత. మరియా జూలియా మాంటిల్లా గార్సియా... ఆ ఘనత సాధించింది. రెండు మిస్ వరల్డ్ విజయాల మధ్య ఎక్కువ ఏళ్లు గ్యాప్ ఉన్న దేశం ఇదేనట.

పని అమ్మాయితో అన్నీ చెప్పేస్తోంది!

నాకు పెళ్లై పదేళ్లు. మా అత్తగారు ఇంటి విషయాలను పని అమ్మాయితో పంచుకుంటూ ఉంటారు. నా జీతం, మా వారికీ, నాకూ మధ్య జరిగిన గొడవలు, ఆస్తుల వివరాలు... ఇలా సున్నితమైనవీ చెబుతారు. నేను రెండు మూడు సార్లు విన్నాను. ఆవిడకు అర్థమయ్యేలా చెప్పేదెలా? - ఓ సోదరి

పెళ్లై పదేళ్లు అయ్యింది కాబట్టి, మీ అత్త వ్యక్తిత్వం ఎలా ఉంటుందో మీరు ఇప్పటికే అర్థం చేసుకుని ఉంటారు. ఇంట్లో విషయాలు ఎవరితో ఎంత వరకూ మాట్లాడాలి అన్న విచక్షణ ఆమెకు అంతగా ఉన్నట్లు అనిపించడం లేదు. కొంతమంది గొప్పల కోసం కూడా చెప్పుకొంటుంటారు. మీ అత్త పెరిగిన వాతావరణం, నేపథ్యాలను బట్టి కూడా ఆమె ప్రవర్తన ఆధారపడి ఉంటుంది. సున్నితమైన విషయాల గురించీ పనివాళ్లతో చెబుతున్నారంటే... వారి దగ్గర చులకనయ్యే అవకాశం ఉంటుంది. పనివాళ్ల ద్వారా ఇంటి విషయాలు పక్కింటి వాళ్లు కూడా తెలుసుకుంటారు. తద్వారా వాళ్ల దృష్టిలోనూ అలుసైపోతారు. కాబట్టి, ఇంటి విషయాలు బయటకు చెప్పడం వల్ల జరిగే నష్టాలను మీ అత్తకి నెమ్మదిగా చెప్పాలి. బయటివాళ్లను కాస్త దూరంగా ఉంచమనండి. అప్పుడే కదా ఆవిడ పెద్దరికం నిలిచేది. ఇదంతా తల్లిలాగా చనువుతో చెబుతున్నట్లు చెప్పండి. మీ భర్తతోనూ చెప్పించండి.

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

బంధువులనీ పలకరించదు!

మా అక్క కూతురికి 19ఏళ్లు. చాలా సిగ్గరి. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడదు. బంధువులు ఇంటికి వచ్చినా పలకరించకుండానే వెళ్లిపోతుంది. మేం నచ్చ చెప్పినా తన ప్రవర్తనలో మార్పు రావటం లేదు. త్వరలో డిగ్రీలో చేరబోతోంది. ఇలానే ఉంటే ఇబ్బందులు ఎదుర్కొంటుందేమో అనిపిస్తుంది. తనను మార్చేదెలా? - ఓ సోదరి

పిల్లల ఆలోచనా దృక్పథం, మాట్లాడేతీరు, ఇతరులతో కలిసే పద్ధతి, భావోద్వేగాలను వ్యక్తీకరించడం... వంటివి తల్లిదండ్రుల నుంచి వస్తాయి. కొంతమంది వ్యక్తిత్వం సహజంగా ఇలానే ఉంటుంది. వీళ్లను ఇంట్రావర్ట్స్ అంటారు. ఇవే లక్షణాలు కొందరిలో తీవ్రంగా ఉంటాయి. అటువంటి వాళ్లను 'స్కిజాయిడ్ పర్సనాలిటీ' గా పిలుస్తారు. వీళ్లు ఎవరితోనూ కలవరు, ప్రేమగా మాట్లాడరు, భావోద్వేగాలు పంచుకోరు. ఇంట్లో వాళ్లు, బయటి వాళ్లు ఎవరితో అయినా ఇలానే ఉంటారు. వీరిని మార్చడం కాస్త కష్టమే. కొంతమంది ఆత్మన్యూనతాభావం వల్ల నలుగురిలో కలవడానికి అసహనంగా, అసౌకర్యంగా ఫీలవుతారు. దీన్ని 'సోషల్ యాంగ్జయిటీ డిజార్డర్' అంటారు. టీనేజ్ పిల్లల్లో మీరు చెప్పిన లక్షణాలు ఉంటే 'డిప్రెషన్ లేదా మేజర్ సైకోసిస్' లాంటివి ఉన్నాయేమో పరీక్షించాల్సి ఉంటుంది. ముందు పాపను సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్తే వాళ్లు పరీక్షించి అవసరమైన థెరపీ ఇస్తారు.

నీట్‌కి సిద్ధమై... ఎంసెట్ రాశా!

తాజాగా విడుదలైన తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగం (ఈఏపీసీఈటీ)లో ఐదో ర్యాంకు సాధించింది బ్రాహ్మణి రెండ్ల. తన విజయగాథను పంచుకుందిలా...



మాది కడప జిల్లా. అమ్మ బీరం హిమ బిందు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. నాన్న రెండ్ల వేణుగోపాల్ రెడ్డి వ్యాపారం చేస్తారు. మేం ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాం. నా కజిన్స్, అత్తవాళ్లు డాక్టర్లు. వాళ్ల స్ఫూర్తితో నేనూ మెడిసిన్ చదువుదామని నిర్ణయించుకున్నా. నీట్ పరీక్షకు ఎలాగూ ప్రిపేర్ అయ్యా కదా అని ఎంసెట్‌కీ ప్రయత్నించా. రోజుకి పది గంటలు చదివేదాన్ని. కాలేజీలో ఇచ్చే మెటీరియల్స్, క్లాస్ నోట్స్ మీదనే పూర్తిగా ఆధారపడ్డా. బయాలజీ సబ్జెక్టు... జ్ఞాపకశక్తి మీదనే ఎక్కువ ఆధారపడి ఉంటుంది. కెమిస్ట్రీకి క్లాస్ నోట్స్‌ను ఫాలో అయ్యా. సబ్జెక్టు ఏదైనా విషయాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేదాన్ని. కాన్సెప్ట్ తెలిస్తేనే ప్రశ్నలు కఠినంగా ఉన్నా తేలిగ్గా ఉన్నా జవాబులు రాయగలం. అందుకే పాఠాలు చెప్పేటప్పుడే శ్రద్ధగా వినేదాన్ని. ఆ తరవాత ప్రశ్నలు సాధన చేసుకుంటూ వెళ్లేదాన్ని. రాస్తూ, బొమ్మలు గీస్తూ పాఠ్యాంశాలు సాధన చేయడం వల్ల ఒత్తిడికి గురికాకుండా ఉన్నా. ఎక్కువగా మోడల్ పేపర్లు, డైలీ, వీక్లీ పరీక్షలు రాయటం వల్ల భిన్న రకాల ప్రశ్నలు సాధన చేసే అవకాశం దక్కింది. దానివల్ల సమయపాలన తెలిసింది. అంతేకాదు, ప్రశ్నకు జవాబు ఇస్తున్న సమయంలోనే ఒకటికి రెండుసార్లు ఆలోచించుకున్నా. తిరిగి చెక్ చేసుకోవచ్చు అన్న మైండ్‌సెట్ ఉండకూడదు. అప్పుడే తప్పులు దొర్లకుండా ఉంటాయి. ఈ విజయంలో అమ్మానాన్నలు, టీచర్ల ప్రోత్సాహం ఎంతో. నాకు మూడ్ బాగోలేకపోయినా, నిరుత్సాహంగా ఉన్నా వెన్నుతట్టేవాళ్లు. సాధన సమయంలో టీచర్లు ఇచ్చే గైడెన్స్ కూడా ఎంతగానో సాయపడింది. ప్రస్తుతం నీట్ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నా.



ఆమె కళ్లతో ర్యాంకర్ అయ్యాడు!

భర్త దూరమయ్యాడు. అప్పట్నుంచీ కొడుకే లోకంగా బతికారు వందన. ఈమెది జైపూర్. 'అమ్మా నేను సివిల్స్ సాధిస్తా'నంటే ఆనందంగా సరేనన్నారు. అతనికి ముందునుంచీ కాస్త దృష్టిలోపముండేది. అయినా అదేమీ నీకు అడ్డుకాదంటూ కొడుకును ప్రోత్సహించేవారామె. తీరా ఆ బాబు ఎనిమిదో తరగతికొచ్చేసరికి అక్షరాలు కనిపించడం మానేశాయి. లోకమంతా మసకగా మారింది. కానీ అతనేం భయపడలేదు. కారణం తిరిగి అమ్మే! వందన అప్పుడూ కొడుక్కి అండగా నిలిచారు. నేనే నీ కళ్లు అంటూ ప్రోత్సహించారు. పుస్తకాలు, కథలు, వార్తలు ఏవైనా కొడుక్కి పెద్దగా చదివి వినిపించేవారు. అందమైన లోకాన్ని తన మాటల్లో ఊహాచిత్రం గీసి చూపేవారు. పాఠ్యాంశాలైనా అతను తిరిగి నేర్చుకునేవారకూ ఓపికగా పెద్ద గొంతుతో చదివేవారు. అతను ఏ ఊళ్లో, ఏ కళాశాలలో చదవాలని ఉందన్నా వెంట వెళ్లేవారు. మొత్తానికి కొడుక్కి తనే ప్రపంచమయ్యారు. సివిల్స్ రాస్తానన్నప్పుడూ కావాల్సిన సపోర్టునిచ్చారు. తీరా తొలి ప్రయత్నం విఫలమైంది. అప్పుడు కొడుకు నిరాశపడితే తిరిగి ఉత్సాహం నింపారామె. ఈసారి ఆ కుర్రాడు ప్రిపరేషన్ ప్లాన్‌ని మార్చాడు. టెక్నాలజీ సాయంతో, అమ్మ అండతో మళ్లీ ప్రయత్నించాడు. విజయం సాధించాడు. అతనే అఖిల భారత స్థాయిలో 91వ ర్యాంకు సాధించిన మను గార్గ్. అందుకే... 'ప్రతి అంశం అర్థమయ్యేదాకా అమ్మ ఓపికగా మళ్లీ మళ్లీ చదివి వినిపించేది. నేను ఇంటర్‌లో కంప్యూటర్స్ తీసుకుంటా అన్నప్పుడూ ప్రోత్సహించింది. సివిల్స్ సమయంలోనూ తన కృషి ఎంతో. అవసరమైన సూచనలూ చేసేది. అందుకే నా విజయంలో సగానికిపైగా వాటా తనదే. అమ్మ నాకు చేసినదానిలో 10 శాతం చేసినా జీవితంలో నేను సక్సెస్ అయినట్లే' అంటారు మను.

గోడకి ప్రాణం పోస్తే...

స్వీట్ హోమ్






ఇంటి లోపల గోడలను అందమైన డెకార్లు, పెయింటింగులు, వాల్ హ్యాంగింగ్‌లతో అందంగా అలంకరిస్తాం. మరి ఇంటి బయటి గోడల సంగతేంటి? వాటిని కూడా సృజనాత్మకంగా తీర్చిదిద్దాలి కదా! అందుకోసం వచ్చిందే ఈ 'ఫ్లవర్ వాల్ మురల్ ఆర్ట్'. కళ, పూలు... రెండింటి కలబోతగా ఉండే ఈ పెయింటింగ్ ఇంటికి ప్రత్యేక అందాన్ని తీసుకొస్తుంది. ఇంటి బయట గోడకు ఆనుకుని పెరిగిన రంగురంగుల పూల మొక్కలను ఓ ఆకారంలో కత్తిరించి, దానికి తగినట్లుగా గోడ మీద పెయింటింగ్ వేస్తారు ఆర్టిస్టులు. సృజనాత్మకత ఉట్టిపడేట్టు ఉండే ఈ వాల్ ఆర్ట్‌ను చూసిన వాళ్లు అద్భుతమని పొగడక మానరు. ఇలాంటి పెయింటింగ్ ఒక్కటి వేయిస్తే చాలు... మన ఇల్లే ఓ ల్యాండ్‌మార్క్ అయిపోతుందనడంలో ఆశ్చర్యం లేదు. అంతగా మెప్పిస్తాయివి. మీరూ ప్రయత్నించండి.






పాక్‌పై ప్రయోగించినవి స్వదేశీ ఆయుధాలే

- ఆత్మనిర్భరత వల్లే ఇది సాధ్యమైంది
- కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

దిల్లీ: గత 11 ఏళ్లలో సాంకేతిక రంగంలో భారత్ సాధించిన పురోగతి పాక్‌తో తాజా పోరు సందర్భంగా ప్రపంచానికి తెలిసిందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. ఆదివారం జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. "పాకిస్థాన్‌తో పోరులో గత నాలుగు రోజులుగా అనేక కొత్త సాంకేతికతలను, ఆయుధాలను ఉపయోగించాం. వీటిల్లో డ్రోన్లు, క్షిపణులు ఇలా అనేకం ఉన్నాయి. ఇవన్నీ ప్రధాని మోదీ ప్రోత్సహించిన ఆత్మనిర్భరత విధానం కింద దేశంలో తయారైనవే. పాక్‌తో పోరు వల్ల సాంకేతిక రంగంలోనూ భారత్ అత్యున్నతంగా ఉందని ప్రపంచ దేశాలకు అర్థమైంది" అని ఆయన పేర్కొన్నారు. దేశంలో శాస్త్ర, సాంకేతిక మేధస్సుకు కొరత లేదని, రాజకీయంగా ప్రోత్సాహం ఉంటే అద్భుతాలు సృష్టించవచ్చని కేంద్రమంత్రి అభిప్రాయపడ్డారు. గత 11 ఏళ్ల పాలనలో కేంద్రప్రభుత్వం ఈ విషయంలో విజయం సాధించిందని పేర్కొన్నారు.

సరిహద్దు రాష్ట్రాల్లో ప్రశాంతత

పంజాబ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్‌లో ఆగిన కాల్పులు

చండీగఢ్/ఫిరోజ్‌పుర్/శ్రీనగర్: కాల్పుల మోత మోగిన సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రశాంతత కొనసాగుతోంది. కాల్పుల విరమణ జరిగినా శనివారం రాత్రి డ్రోన్లు, పేలుళ్లు, సైరన్ల మోతతో దద్దరిల్లిన జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో బ్లాక్ అవుట్ ఎత్తివేశారు. జమ్మూ నగరంలోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి తర్వాత పాక్ నుంచి డ్రోన్లు, కాల్పులు, బాంబు దాడులు నమోదు కాలేదు. అఖ్నూర్, రాజౌరి, పూంచ్ జిల్లాల్లోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి తర్వాత డ్రోన్లు, కాల్పులు, బాంబు దాడులు జరగలేదు. భద్రతా బలగాలు మాత్రం పూర్తిస్థాయి అప్రమత్తతతో ఉన్నాయి. పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పంజాబ్‌లోని పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, అమృత్‌సర్‌లోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి తర్వాత నుంచి డ్రోన్లు, కాల్పులు, బాంబు దాడులు జరగలేదు. కాల్పుల విరమణకు అంగీకరించిన పాక్ గంటల్లోనే డ్రోన్లు పంపడం వల్ల రాత్రి అమృత్‌సర్‌లో బ్లాక్‌అవుట్ అమలు చేశారు. ఆదివారం ఉదయం ఎత్తివేశారు. అనుమానం ఉన్న వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. పాక్‌తో విస్తృత సరిహద్దు ఉన్న రాజస్థాన్ జిల్లాల్లోనూ ప్రస్తుతం పరిస్థితి సాధారణంగానే ఉంది. జైసల్మేర్ నగరంలో ఎలాంటి కాల్పులు, సైరన్ల మోతలు వినిపించడంలేదు. అయితే ముందు జాగ్రత్తగా సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు బ్లాక్‌అవుట్ విధించారు.



పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో రహదారి పక్కనున్న రెస్టారెంట్‌లో సందడి

ఇళ్లకు అప్పుడే రావొద్దు

- స్వస్థలాలకు అప్పుడే వెళ్లొద్దని పాకిస్థాన్ షెల్లింగ్ కారణంగా సురక్షిత ప్రాంతాల్లో ఉన్న సరిహద్దు గ్రామప్రజలను జమ్మూకశ్మీర్ యంత్రాంగం హెచ్చరించింది. పేలని షెల్స్ ఇంకా ఉంటాయని, వాటిని గుర్తించాల్సి ఉందని పేర్కొంది.
- భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నేపథ్యంలో ఆదివారం ఒక్కరోజే దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే దాదాపు 100 విమాన సర్వీసులు రద్దయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.



బారాముల్లా జిల్లాలో సరిహద్దుకు సమీపంలోని తమ ఇళ్లకు వెళ్లేందుకు వేచిచూస్తున్న గ్రామస్థులు

పుల్వామా దాడి మా పనే

- అంగీకరించిన పాక్ వాయుసేనాధికారి

ఇంటర్నెట్‌డెస్క్: కశ్మీర్‌లోని పుల్వామాలో 40 మంది పారామిలిటరీ సిబ్బంది మరణానికి కారణమైన బాంబు దాడి వెనుక తమ హస్తం ఉందని పాకిస్థాన్ అంగీకరించింది. ఈ విషయాన్ని ఆ దేశ వాయుసేన ఎయిర్ వైస్ మార్షల్ ఔరంగజేబ్ అహ్మద్ విలేకరుల సమావేశంలో అంగీకరించారు. "పాక్ ప్రజల కీర్తి మొత్తం దళాల్లోనే ఇమిడి ఉండటంతో.. మేము ఎప్పుడూ దానిని నిలబెట్టుకుంటాం. పుల్వామాలో మా అద్భుతమైన ఎత్తుగడలను చూపించాం. మా కార్యదక్షత.. వ్యూహాత్మక చతురతను ఇప్పటికే ప్రదర్శించాం" అని వ్యాఖ్యానించారు. ఔరంగజేబ్ అహ్మద్ వ్యాఖ్యలతో పాక్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందన్న విషయం మరోసారి స్పష్టమైంది. నాడు పుల్వామా దాడితో తమకు సంబంధం లేదని పాకిస్థాన్ ఎంత బుకాయించినా తాజాగా వాయుసేనాధికారి వ్యాఖ్యలతో వాస్తవం బయటకొచ్చింది.

దాడి చేస్తే వారికి వినాశమే

- పాక్ దుందుడుకుతనంపై జేడీ వాన్స్‌తో మోదీ

ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ ఒకవేళ భారత్‌పై దాడి చేస్తే ప్రతిస్పందన అత్యంత దారుణంగా, వినాశకరంగా ఉంటుందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చితే పూర్తిస్థాయి యుద్ధానికి దారితీస్తుందని మోదీని వాన్స్ హెచ్చరించిన సందర్భంగా ప్రధాని బదులిస్తూ.. పాకిస్థాన్ ఎటువంటి దాడులు చేయకుంటే తాము కూడా సంయమనం పాటిస్తామని చెప్పినట్లు సమాచారం. "ఒకవేళ పాకిస్థాన్ దుందుడుకు చర్యలకు దిగితే.. ప్రతిస్పందన అత్యంత దారుణంగా, వినాశకరంగా ఉంటుంది" అని జేడీ వాన్స్‌కు ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు అమెరికా మీడియా కథనం వెల్లడించింది. భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ.. ప్రధాని మోదీతో జేడీ వాన్స్ ఇటీవల జరిపిన సంప్రదింపుల్లో ఈ ప్రస్తావన వచ్చినట్లు ఆ కథనం వివరించింది. అయితే బుధవారం రాత్రి భారత్‌లోని 26 ప్రదేశాలపై పాకిస్థాన్ దాడులు చేయగా.. వాటన్నింటినీ మన బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయి. అనంతరం పాక్ వైమానిక కేంద్రాలపైనా మనదేశం విరుచుకుపడింది. దీంతో కాల్పుల విరమణకు సిద్ధమంటూ పాక్ సైన్యం కోరడంతో తాత్కాలిక విరమణకు మనదేశం అంగీకరించింది.





ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధం

- రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటన
- తాము సిద్ధమేనన్న జెలెన్‌స్కీ

మాస్కో: ఉక్రెయిన్‌తో మూడేళ్లకు పైగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకడానికి కీవ్‌తో ప్రత్యక్ష చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ఈ చర్చలు ఇరుదేశాల్లో శాశ్వత శాంతిని నెలకొల్పేలా ఉండాలన్నారు. ఈ మేరకు గురువారం ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల చర్చలకు ఆయన ప్రతిపాదించారు. ఎటువంటి ముందస్తు షరతులు లేకుండా కీవ్ ప్రత్యక్ష చర్చలను తిరిగి ప్రారంభించాలని తాము కోరుతున్నట్లు పుతిన్ ఆదివారం ప్రకటించారు. ఈ విషయంపై తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో మాట్లాడతానని అన్నారు. ఈ చర్చల ద్వారా పూర్తిస్థాయి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తాము మానవతా దృక్పథంతో ఉక్రెయిన్‌కు చెందిన ఇంధన వనరులపై దాడులను ఆపేశామని చెప్పారు.

'మొదటి అడుగు కాల్పుల విరమణే'

మరోవైపు రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. రష్యాతో సోమవారం నుంచి పూర్తిస్థాయి, పాక్షిక కాల్పుల విరమణపై ఆశాభావం వ్యక్తం చేశారు. పుతిన్‌తో చర్చల కోసం తుర్కియేలో సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. ప్రత్యక్ష చర్చల కోసం రష్యా చేసిన తాజా ప్రతిపాదనకు అంగీకరించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించిన నేపథ్యంలో జెలెన్‌స్కీ నుంచి తాజా ప్రకటన వెలువడింది.

దాడుల తర్వాతే దారికొచ్చిన పాక్

- 7నే సందేశం పంపినా ఉలుకూపలుకు లేదు
- సైనిక చర్య ముమ్మరమయ్యాకే స్పందన

దిల్లీ: ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడులు మొదలుపెట్టి క్రమంగా తీవ్రత పెంచడంతో చివరకు పాకిస్థాన్ కాల్పుల విరమణను కోరుకుంది. మొదట్లోనే ఇలాంటి ప్రతిపాదన వెళ్లినా కాస్త బెట్టుచేసి, ఆ తర్వాత భారత సైన్యం ధాటికి, అమెరికా జోక్యానికి దిగివచ్చింది. భారత సైనిక వర్గాల కథనం ప్రకారం శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున పాకిస్థాన్‌లోని సైనిక స్థావరాలపై భారత్ మెరుపు దాడులు చేసింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో రంగంలోకి దిగి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో ఫోన్లో మాట్లాడారు. తర్వాత భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌కు రూబియో ఫోన్ చేశారు. భారత్‌తో చర్చలకు పాకిస్థాన్ సిద్ధంగా ఉందని జైశంకర్‌కు రూబియో సమాచారం ఇచ్చారు. కేవలం డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) స్థాయిలో చర్చలు జరుగుతాయని భారత్ స్పష్టంచేసింది. శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకి ఫోన్‌కాల్ మాట్లాడేందుకు సమయం కేటాయించాలని భారత డీజీఎంవోను పాకిస్థాన్ డీజీఎంవో కోరారు. ఆ ప్రకారం ఇరువురు చర్చించుకొని కాల్పుల విరమణపై అంగీకారానికి వచ్చారు. వాస్తవానికి ఈ నెల 7నే 'ఆపరేషన్ సిందూర్'ను పూర్తిచేశాక, పాక్ డీజీఎంవోకు మన డీజీఎంవో ఒక సందేశం పంపారు. ఆ రోజు వారినుంచి స్పందన రాలేదు. పాకిస్థాన్‌పై మూడ్రోజుల సైనిక చర్య తర్వాత పరిస్థితులు సంపూర్ణంగా మారిపోయాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రధాన సైనిక స్థావరాలపై విజయవంతంగా దాడులు చేసి పాక్ మనోబలాన్ని దెబ్బతీశామని పేర్కొన్నాయి. వైమానిక స్థావరాలపై దాడులతో పాక్‌కు వాస్తవ పరిస్థితి అవగతమైందని, భారత్‌తో పోటీపడే పరిస్థితులు లేవన్న విషయం తెలిసొచ్చిందని వివరించాయి. ఉగ్రస్థావరాలపై దాడిచేసి పాక్‌కు భారత్ స్పష్టమైన సందేశం ఇచ్చిందని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. భారత నిఘా నేత్రాల నుంచి పాకిస్థాన్ తప్పించుకోలేదని స్పష్టంచేసినట్టు పేర్కొన్నాయి. ఉగ్రవాద ప్రధాన స్థావరాలపై భారత్ కచ్చితమైన దాడులుచేసి చూపించిందని, చొరబాటుదారులు-బాధితుల మధ్య ఒకే వేదికపై చర్చలు సాధ్యం కాదని ప్రపంచానికి చెప్పిందని వివరించాయి.

కాల్పుల విరమణను స్వాగతించిన ఐరాస

కాల్పులు, సైనిక చర్యల నిలిపివేతకు భారత్-పాకిస్థాన్ మధ్య కుదిరిన అవగాహనను ఐక్యరాజ్య సమితి (ఐరాస) స్వాగతించింది. ప్రస్తుత శత్రుత్వాలు, ఉద్రిక్తతల నివారణకు ఇది అర్థవంతమైన, సానుకూల చర్య అని అభివర్ణించింది. తాజా పరిణామాన్ని ఐరాస జనరల్ అసెంబ్లీ 79వ అధ్యక్షుడు ఫిలెమన్ యాంగ్ స్వాగతిస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. విభేదాల పరిష్కారానికి, శాంతి, సుస్థిరత నెలకొనేందుకు ఇరు దేశాలు దౌత్యపరమైన చర్యలను కొనసాగించాలని సూచించారు.

శ్రీలంక హర్షం

కాల్పుల విరమణపై శ్రీలంక హర్షం వ్యక్తం చేసింది. శాంతి దిశగా ఇది ఒక కీలక అడుగు అని పేర్కొంది. తమ దేశం తరపున, ప్రజల తరపున ఈ పరిణామాన్ని అభినందిస్తున్నట్లు అధ్యక్షుడు దిసనాయకే ఒక ప్రకటనలో తెలిపారు.

అమెరికాకు ముందే సమాచారమిచ్చిన జైశంకర్

పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులపై దాడిచేసి తీరుతామని, దానిపై ఎలాంటి సందేహమూ అక్కర్లేదని ఈ నెల 1న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. 'ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదులతో పాకిస్థాన్‌కు ఉన్న సంబంధాలపై సరికొత్త ఆధారాలతో ఒక బృందాన్ని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి భారత్ పంపనుంది. వచ్చేవారం ఐరాసలోని ఆంక్షల కమిటీ సమావేశమై ఈ ఆధారాలను పరిశీలించనుంది' అని వెల్లడించాయి.

శిమ్లా ఒప్పందం నుంచి విరమించుకున్నారా!

- కేంద్రాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్
- పార్లమెంటును సమావేశపరచండి
- ప్రధానికి రాహుల్, ఖర్గే లేఖలు





దిల్లీ: భారత్-పాక్ కాల్పుల విరమణలో అమెరికా పాత్రపై కేంద్రం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కశ్మీర్ అంశంపై శిమ్లా ఒప్పందాన్ని విస్మరించి మధ్యవర్తిత్వానికి మూడో పక్షాన్ని అనుమతించారా అని ప్రశ్నించింది. ఆపరేషన్ సిందూర్ వివరాలను తెలియజేయాలని డిమాండ్ చేసింది. ఈ అంశాలపై తక్షణం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరచాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీలు ప్రధానికి వేర్వేరుగా లేఖలు రాశారు. కశ్మీర్ అంశాన్ని కేంద్రం అంతర్జాతీయం చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ మండిపడ్డారు. "ఏ షరతులపై కాల్పుల విరమణను ప్రకటించారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతమవ్వవని హామీ ఏమిటి" అని ఆయన ప్రశ్నించారు. "శిమ్లా ఒప్పందాన్ని విరమించుకున్నామా? మూడో పక్షం మధ్యవర్తిత్వానికి అవకాశం ఇచ్చామా?. భారత్, పాక్ మధ్య దౌత్య మార్గాలు తిరిగి ప్రారంభమవుతాయా" అని కేంద్ర ప్రభుత్వంపై 'ఎక్స్'లో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ప్రశ్నలు సంధించారు. అఖిలపక్ష సమావేశానికి విపక్షాలిచ్చిన పిలుపును రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ సమర్థించారు. అయితే సమావేశానికి ప్రధాని హాజరైతేనే విపక్షాలు పాల్గొనాలని అన్నారు.

మోదీ చాణక్యనీతిని ప్రదర్శించారు: భాజపా

ప్రధాని మోదీ చాణక్యనీతిని ప్రదర్శించి దౌత్యపరంగా పాకిస్థాన్‌ను ఒంటరి చేశారని భాజపా పేర్కొంది. సింధూ జలాల నిలిపివేతతో పాకిస్థాన్‌ను ఆర్థికంగా దెబ్బకొట్టారని తెలిపింది. "భారీ నష్టాలను చవిచూసిన తర్వాత పాకిస్థాన్ చర్చల కోసం భారత్‌కు విజ్ఞప్తి చేసింది. కేవలం 72 గంటల్లోనే మోదీ నిర్ణయాత్మక నాయకత్వం.. పాకిస్థాన్‌ను ఒంటరి చేసింది" అని భాజపా జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి పేర్కొన్నారు.

రాజ్యాంగమే సర్వోన్నతం

- పదవీ విరమణ అనంతర కొలువుకు విముఖత
- దేశం సంక్షోభంలో ఉంటే సుప్రీంకోర్టు ఉదాసీనంగా ఉండలేదు
- విలేకరులతో ఇష్టాగోష్ఠిలో జస్టిస్ బి.ఆర్.గవాయ్ వెల్లడి



దిల్లీ: న్యాయమూర్తులు కూడా బాధ్యతాయుతమైన పౌరులేనని, దేశం సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటుంటే వాటిని పట్టించుకోకుండా ఉండలేరని కాబోయే భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ తెలిపారు. పహల్గాం దాడి గురించి తెలిసి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నిర్ఘాంతపోయారన్నారు. వెంటనే పూర్తి ధర్మాసనాన్ని సమావేశపరిచి పర్యాటకుల మృతికి సంతాపం తెలిపామని, ఉగ్రవాదుల దుశ్చర్యపై ఆవేదన వ్యక్తం చేశామని ఆయన వెల్లడించారు. ఈ నెల 14న సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఆదివారం దిల్లీలోని తన నివాసంలో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పలు అంశాలపై అభిప్రాయాలను వెల్లడించారు. పార్లమెంటు, న్యాయ వ్యవస్థలలో ఏది సుప్రీం అనే వివాదంపై స్పందిస్తూ....దేశంలో రాజ్యాంగమే సర్వోన్నతమైనదని స్పష్టం చేశారు. కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు పూర్తి ధర్మాసనం ఇదే విషయం చెప్పిందన్నారు. సీజేఐగా పదవీ విరమణ అనంతరం ఎలాంటి కొలువునూ చేపట్టబోనని, తనకు ఎలాంటి రాజకీయ ఆకాంక్షలు లేవని తెలిపారు. ఓ మాజీ సీజేఐ... గవర్నర్ పదవిని చేపట్టడంపై...'వారి గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయబోన'ని చెప్పారు. ప్రొటోకాల్ ప్రకారం గవర్నర్ పదవి సీజేఐ కన్నా దిగువనే ఉంటుందన్నారు. రాజకీయ నాయకులు, ప్రజలను న్యాయమూర్తులు కలుసుకోవడంపై... 'ఒంటరిగా, అందరికీ దూరంగా ఉంటే వివిధ వర్గాల ప్రజల బాధలు ఎలా అర్థమవుతాయి' అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. 33 మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో 22 మంది మాత్రమే ఆస్తులను బహిర్గతం చేయడంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ...'మిగతా న్యాయమూర్తులూ త్వరలోనే ఆ వివరాలు అందజేస్తారు' అని పేర్కొన్నారు. నివాసంలో భారీ నగదు లభించిన వివాదంలో చిక్కుకున్న జస్టిస్ యశ్వంత్ వర్మపై తీసుకోవాల్సిన చర్యల గురించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీకి నివేదించామన్నారు. న్యాయవ్యవస్థలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన ప్రాతినిధ్యం లభించకపోవడంపై స్పందిస్తూ...'రాజ్యాంగ పదవుల నియామకాలకు రిజర్వేషన్లు లేవ'ని చెప్పారు. మహిళా న్యాయమూర్తుల సంఖ్యను పెంచడానికి అర్హత గలవారు లభించడం కష్టంగా ఉందన్నారు.

సామాజిక మాధ్యమాలను తాను చూడడం లేదని, అందువల్ల వాటిలోని అంశాలు తనను కలవరపెట్టే అవకాశం లేదని పేర్కొన్నారు.

పాక్ వెన్నువిరిచిన బ్రహ్మోస్



బ్రహ్మోస్ క్షిపణి ప్రత్యేకతలు

వేగం: 2.8 మ్యాక్ (సెకనుకు 900మీటర్లు)	శ్రేణి: సూపర్ సోనిక్
ప్రయాణించే దూరం: 300 నుంచి 800 కి.మీ.	కచ్చితత్వం: నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించగలగడం
	ప్రాజెక్టు: భారత్, రష్యా సంయుక్త భాగస్వామ్యంలో అభివృద్ధి

దిల్లీ: పాకిస్థాన్‌తో ఘర్షణ తీవ్రమవుతున్న పరిస్థితుల్లో భారత్ తీసుకున్న ఓ కీలక నిర్ణయం శత్రువు వెన్నువిరిచేలా చేసింది. తన అమ్ముల పొదిలోని బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణులను వ్యూహాత్మకంగా వినియోగించడంతో...అప్పటి వరకూ అణ్వాయుధాలున్నాయంటూ ప్రగల్భాలు పలికిన దాయాది దేశం వెన్నులో వణుకుపుట్టింది. మొత్తం పరిస్థితే మారిపోయింది. పాకిస్థాన్ అధికారిక రాజధాని ఇస్లామాబాద్ అయినా.. పాలన మొత్తం జరిగేది రావల్పిండి నుంచే. ఇక్కడ చక్లాలాలోని ఆ దేశ ఆర్మీ చీఫ్ కార్యాలయం నుంచే సైన్యానికి ఆదేశాలు వెళుతుంటాయి. శనివారం తెల్లవారుజామున భారత్ లక్ష్యంగా ఎంచుకున్న పాక్‌లోని కీలక ప్రాంతాల్లో రావల్పిండి సమీప నూర్ ఖాన్ వైమానిక స్థావరం అత్యంత ప్రధానమైనది. ఇక్కడ గగనతల రీఫ్యూయలర్ ట్యాంకర్ విమానాలు, భారీ రవాణా విమానాలు ఉన్నాయి. అప్పటికే పాకిస్థాన్ సైన్యం దిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్-11 బాలిస్టిక్ క్షిపణులను భారత బలగాలు... గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400తో మధ్యలోనే పేల్చివేసింది. శుక్రవారం అర్ధరాత్రి శ్రీనగర్ నుంచి నలియా వరకు 26 లక్ష్యాలపైకి పాక్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించగా వాటన్నింటినీ భారత రక్షణ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయని అధికారులు వెల్లడించిన విషయం తెలిసిందే.

ప్రతిగా భారత్ శనివారం తెల్లవారుజామున అత్యాధునిక క్షిపణులు, గైడెడ్ మ్యూనిషన్, లాయిటరింగ్ మ్యూనిషన్‌ను వాడినట్లు తెలుస్తోంది. వీటిలో బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూజ్ క్షిపణులు అత్యంత కీలక పాత్ర పోషించాయి. సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయని వివిధ వర్గాల నుంచి అందుతున్న సమాచారం తెలియజేస్తోంది. ధ్వంసమైన వైమానిక స్థావరాల్లో... రఫీకీ, మురీద్, నూర్‌ఖాన్, రహీంయార్ ఖాన్, సుక్కుర్, చునియన్. పర్సూర్, సియాల్‌కోట్ ఉన్నాయి.


పంజాబ్ ప్రావిన్స్‌లోని రఫీకీ వైమానిక స్థావరం అత్యాధునిక విమానాలకు కేంద్రం. 10,000 అడుగుల రన్‌వే ఇక్కడి ప్రత్యేకత. అత్యవసర ల్యాండింగ్ స్ట్రిప్‌లు ఉన్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని చక్వాల్‌లో మురీద్ ఉంది. ఇక్కడ కీలక వైమానిక స్థావరం ఉంది. మానవరహిత సాయుధ డ్రోన్లను ఇక్కడ నిల్వ చేస్తుంటారు. ఇస్లామాబాద్‌కు అత్యంత సమీపంలోని రావల్పిండిలో నూర్ ఖాన్ (చక్లాలా) వైమానిక స్థావరం ఉంది. పాక్ ఉన్నతస్థాయి జనరల్స్ ఇక్కడ భేటీ అవుతారు. ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ కార్యాలయం కూడా చక్లాలాలోనే ఉంది. ముఖ్యమైన ఈ వైమానిక స్థావరాలను భారత్ దెబ్బతీయడంతో పాకిస్థాన్‌కు ఎటూపాలుపోని పరిస్థితి ఏర్పడింది. అంతకుముందే ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలనూ పేల్చివేయడంతో భారత క్షిపణులను శత్రు సైన్యం గుర్తించలేకపోయింది. ఈ పరిస్థితుల్లో తమ వద్ద ఉన్న అణ్వాయుధాలను వినియోగించటం ఏమోగాని, వాటిని కాపాడుకోవటమూ కష్టమని స్పష్టం కావడంతో పాక్ నాయకత్వం చేతులెత్తేసింది. శనివారం మధ్యాహ్నానికి కాల్పుల విరమణకు సిద్ధమైందని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

రాజ్‌నాథ్ సింగ్ మాటల్లో...

పాకిస్థాన్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేయడానికి బ్రహ్మోస్ క్షిపణులను వినియోగించినట్లు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాటల ద్వారా స్పష్టమవుతోంది. యుద్ధ రంగంలో వీటిని ఉపయోగించడం ఇదే తొలిసారి. భారత్ నిమిషాల వ్యవధిలో పాక్‌కు చెందిన కీలక వైమానిక స్థావరాలను ధ్వంసం చేయడం ఆ దేశంలో గుబులు రేపింది.

నువ్వు బెదరవు.. మడమ తిప్పవు

భారత సేనకు అమితాబ్ కితాబు



దిల్లీ: "తూ నా థమేగా కభీ, తూ నా ముడేగా కభీ, తూ నా ఝుకేగా కభీ.. కర్ శపథ్, కర్ శపథ్, కర్ శపథ్.. అగ్నిపథ్, అగ్నిపథ్, అగ్నిపథ్' (నువ్వు ఎప్పుడూ బెదరవు.. నువ్వు ఎప్పుడూ మడమ తిప్పవు.. నువ్వు ఎప్పుడూ లొంగవు.. శపథం చెయ్యి, శపథం చెయ్యి, శపథం చెయ్యి.. అగ్నిపథ్, అగ్నిపథ్, అగ్నిపథ్).. పహల్గాం ఉగ్రదాడికి జవాబుగా ప్రత్యర్థులపై విరుచుకుపడిన భారత సేనను ఉద్దేశించి బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ (82) ఆదివారం ఉదయం సామాజిక మాధ్యమాల్లో స్పందించిన తీరు ఇది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయక పౌరుల ఊచకోత తర్వాత తీవ్రంగా కలత చెందిన ఈ పద్మవిభూషణుడు నాటి నుంచీ తన 'ఎక్స్' ఖాతాలో, పర్సనల్ బ్లాగులో వరుసగా ఖాళీ పేజీలను పోస్టు చేస్తూ వచ్చారు. తన ప్రతి పోస్టుకు ఆయన సీరియల్ నంబరు పెడతారు. తమ అభిమాన నటుడికి ఏమైందోనని నెటిజన్లు ఆందోళన చెందారు. ఇన్నాళ్లకు మళ్లీ ఓ సుదీర్ఘ పోస్టుతో అమితాబ్ సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యారు. పాక్‌లోని 9 ఉగ్ర స్థావరాలను మట్టుబెట్టేలా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సైనిక చర్య చేపట్టిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వాన్ని అమితాబ్ అభినందించారు. మనకు జరిగిన అన్యాయంపై పోరు కొనసాగించేలా భారత సేనలకు, భారతీయులకు స్ఫూర్తి నింపేందుకుగాను తన తండ్రి, హిందీకవి హరివంశ్‌రాయ్ బచ్చన్ రాసిన 'అగ్నిపథ్' కవితలోని పై వాక్యాలతో అమితాబ్ పోస్టు ముగించారు.



ఇవి జరిగితే.. తండ్రిగా మీరు గెలిచినట్టు!

మీరు తండ్రి అయినంత మాత్రాన గొప్పగా ఏదో సాధించినట్టు కాదు! మీ పిల్లలు పెద్దయ్యాక కూడా మిమ్మల్ని సలహాలు, సూచనలు అడుగుతూ ఉండాలి. మీతో కలిసి సెలవులను ఆస్వాదించేందుకు వారు ఆరాటపడాలి. తమ పిల్లలు మీతో సమయం గడపాలని వారు కోరుకోవాలి. ఇవన్నీ జరిగితే.. తండ్రిగా మీరు విజయం సాధించినట్టు లెక్క!

– హారిసన్ షెంక్, పేరెంటింగ్ కోచ్

జనాభా లెక్కింపులో కులగణన చేపట్టడానికి చట్ట సవరణ అవసరం లేదు

- అధికార వర్గాల వెల్లడి

దిల్లీ: జనాభా లెక్కింపులో పాల్గొనే గణన అధికారులు ప్రజల నుంచి కుల వివరాలను పొందేందుకు 1948 నాటి జనాభా లెక్కింపు చట్టం వీలు కల్పిస్తుందని, దానికి సవరణ చేయాల్సిన అవసరం లేదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. 1994లో చివరిగా సవరించిన ఈ చట్టం ఫారంలో పేర్కొన్న విధంగా ప్రజల నుంచి వివరాలను కోరడానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఇస్తుందని తెలిపాయి. మన దేశంలో 1881-1931 మధ్య బ్రిటిష్ పాలనలో నిర్వహించిన జనాభా లెక్కల సమయంలో అన్ని కులాల గణాంకాలు సేకరించారు. కానీ, 1951లో స్వతంత్ర భారతదేశ మొదటి జనాభా లెక్కల సమయంలో అప్పటి ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, తెగలను మినహాయించి ఇతర కులాల వివరాలు సేకరించకూడదని నిర్ణయించింది. తరువాత 1961లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను వాటి సొంత సర్వేలు నిర్వహించాలని, అవసరాన్ని బట్టి ఓబీసీల జాబితాలను సిద్ధం చేసుకోవచ్చని సూచించింది. ఆరు దశాబ్దాల తరువాత ప్రస్తుతం అనేక వర్గాలు, వివిధ పార్టీల నుంచి వచ్చిన డిమాండ్ల మేరకు ప్రభుత్వం గత నెలలో తదుపరి దేశవ్యాప్త జనాభా లెక్కింపులో కులగణనను చేర్చాలని నిర్ణయించింది. చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం జనాభా గణన అధికారి ప్రభుత్వం నిర్దేశించిన 'అన్ని ప్రశ్నలను అడగవచ్చు' అని అధికారులు చెబుతున్నారు.

పాక్‌కు కీలక సమాచారం చేరవేత..

పంజాబ్‌లో ఇద్దరి అరెస్టు

చండీగఢ్: దిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ కార్యాలయ అధికారికి దేశ కీలక సమాచారం అందించారనే ఆరోపణలతో పంజాబ్ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితుల్లో ఓ మహిళ కూడా ఉన్నారు. మన సైన్యానికి చెందిన సున్నిత సమాచారాన్ని పాక్ అధికారికి వీరు చేరవేసినట్లు తమ దృష్టికి వచ్చినట్లు డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. ఈ వ్యవహారంలో పంజాబ్‌లోని మలేర్‌కోట్లకు చెందిన గుజాలా, యమీన్ మహ్మద్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రహస్య సమాచారం చేరవేసినందుకు ప్రతిఫలంగా ఆన్‌లైన్ ద్వారా కొంత మొత్తాన్ని నిందితులు స్వీకరించినట్లు గుర్తించామని పోలీసులు వెల్లడించారు.

శాంతియుత చర్చలకు మార్గం చూడాలి

- భారత్‌తో అన్ని వివాదాలనూ చర్చించుకోవాలి: షెహబాజ్ షరీఫ్



ఇస్లామాబాద్: భారత్-పాక్ మధ్యనున్న దీర్ఘకాల వివాదాలకు శాంతియుత చర్చల మార్గాన్ని చూడాల్సిన అవసరం ఉందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి పొద్దుపోయాక పాక్ ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. నదీజలాల పంపకం, కశ్మీర్ అంశం సహా అన్నింటినీ చర్చించుకోవాలని చెప్పారు. ''ప్రాంతీయ శాంతిని పరిరక్షించే అంతర్జాతీయ దౌత్య యత్నాలకు సానుకూలంగా స్పందించాం. భారత్‌తో అవగాహనకు ఆమోదం తెలిపాం. కల్లోల సమయంలోనూ మన చిరకాల మిత్రదేశం చైనా ఎంతో అండగా నిలిచింది" అని చెప్పుకొచ్చారు. "భారత్ చర్యలకు దీటైన జవాబిచ్చాం. మన ఆపరేషన్ విజయవంతం అయింది. దీనికిగానూ యావద్దేశానికి, సైనిక బలగాలకు అభినందనలు. పాక్ ప్రజలు ధైర్యవంతులని, మనది వివేకవంతమైన దేశమని రుజువు చేసుకున్నాం. ఆదివారాన్ని 'యోమ్-ఏ-తషక్కుర్' (కృతజ్ఞత దినం)గా పాటిద్దాం. ఈ విజయాన్ని అందించినందుకు అల్లాకు కృతజ్ఞతలు. ఆయనే మనల్ని గెలిపించారు" అని వ్యాఖ్యానించారు.

పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడుతూ- కశ్మీర్, సింధు జలాల ఒప్పందం, ఉగ్రవాదం వంటివి భారత్‌తో ముడిపడిన ప్రధాన అంశాలని, భవిష్యత్తులో చర్చల్లో ఆ మూడింటిపై మాట్లాడుకుంటామని చెప్పారు. కాల్పుల విరమణ చర్య ద్వారా శాంతి నెలకొంటే అది ఆహ్వానించదగ్గ పరిణామమే అవుతుందన్నారు.

హైదరాబాద్ నుంచి కొల్హాపుర్‌కు నేరుగా విమానం



ముంబయి: కొల్హాపుర్ నుంచి హైదరాబాద్, ముంబయి, నాగ్‌పుర్‌లకు నేరుగా విమాన సర్వీసులను ఈనెల 15 నుంచి ప్రారంభిస్తామని ప్రాంతీయ విమానయాన సంస్థ స్టార్ ఎయిర్ ఆదివారం ప్రకటించింది. ప్రస్తుతం కొల్హాపుర్ నుంచి తిరుపతి, అహ్మదాబాద్, ముంబయిలకు ఈ సంస్థ విమాన సర్వీసులు నిర్వహిస్తోంది. జూన్ 3 నుంచి సేవలను మరింత విస్తరిస్తామని స్టార్ ఎయిర్ సీఈఓ సిమ్రాన్ సింగ్ తెలిపారు. కొల్హాపుర్ నుంచి హైదరాబాద్, తిరుపతి, అహ్మదాబాద్, ముంబయి, బెంగళూరు, నాగ్‌పుర్, కిషన్‌గఢ్ నగరాలకు సర్వీసులు అప్పటి నుంచి నిర్వహిస్తామని వివరించారు.



ఆప్షన్స్ ట్రేడింగ్‌లో.. చిన్న మదుపర్లు తగ్గేదే లే

గుర్తించిన సెబీ.. మరిన్ని చర్యలకు సిద్ధం!



ముంబయి: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ)లో ట్రేడింగ్ చేస్తున్న ప్రతి 10 మంది మదుపర్లలో 9 మంది (90%) నష్టపోతున్నారని.. ముఖ్యంగా చిన్న మదుపర్లు బాగా ఇబ్బంది పడుతున్నారని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గతంలోనే గుర్తించింది. ఈ ట్రేడింగ్‌కు చిన్న మదుపర్లను దూరంగా ఉంచేందుకు 2024 నవంబరులో కొన్ని చర్యలు తీసుకుంది. అయినా కూడా చిన్న మదుపర్లు డెరివేటివ్స్ విభాగంలో ఇండెక్స్ ఆప్షన్లలో ఎక్కువగానే ట్రేడింగ్ చేస్తున్నారని సెబీ గుర్తించింది. వీరిని రక్షించేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని భావిస్తోంది.

● 2024 డిసెంబరు నుంచి 2025 మార్చి వరకు ఇండెక్స్ ఆప్షన్స్ ట్రేడింగ్ కార్యకలాపాల గణాంకాలను సెబీ పరిశీలించింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే, ట్రేడింగ్ పరిమాణం కాస్త తగ్గినా.. రెండేళ్ల క్రితం ఇదే సమయంలో పోలిస్తే కార్యకలాపాలు ఎక్కువగానే ఉన్నాయని గుర్తించింది.

● 2024 డిసెంబరు-2025 మార్చి మధ్య గణాంకాలు పరిశీలిస్తే, ఈక్విటీ డెరివేటివ్స్‌లో ట్రేడింగ్ చేస్తున్న వ్యక్తుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 12% తగ్గింది. రెండేళ్ల క్రితం (2022 డిసెంబరు-2023 మార్చి)తో పోలిస్తే మాత్రం 77% ఎక్కువగానే ఉంది.

● ఇండెక్స్ ఆప్షన్లలో ఎక్స్‌పైరీ రోజుల్లో ఎక్కువగా స్పెక్యులేషన్ ఉండటంతో, రెండేళ్ల కిందటితో పోలిస్తే వ్యక్తుల ట్రేడ్‌లు అధికంగా ఉంటున్నాయి. వ్యక్తుల ఇండెక్స్ ఆప్షన్స్ పరిమాణం వార్షికంగా ప్రీమియం పరంగా 5%, నోషనల్‌గా 16% తగ్గాయి. అదే రెండేళ్ల కిందటితో పోలిస్తే ఇవి వరుసగా 34%, 99% పెరిగాయి.

● మదుపర్ల పెట్టుబడులకు రక్షణ కల్పించడం, మార్కెట్లలో స్థిరత్వం కల్పించాలనే దృక్పథంతో.. ఇండెక్స్ ఆప్షన్స్‌లో చిన్న మదుపర్ల ట్రేడింగ్ కార్యకలాపాలు తగ్గించేందుకు సెబీ మరోసారి చర్యలు తీసుకుంటుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్లకు ఆదరణ

ఏడాదిలో 3.5 లక్షల మంది కొత్త మదుపర్లు



దిల్లీ: స్టాక్ మార్కెట్లలో అధిక ఒడుదొడుకులు ఎదురవుతున్న నేపథ్యంలో, అగ్రెసివ్ హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్)లకు ఆదరణ పెరుగుతోంది. 2025 ఏప్రిల్‌లో ఈ విభాగం ఆస్తుల విలువ రూ.2.26 లక్షల కోట్లకు చేరడమే ఇందుకు నిదర్శనం. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే ఇది 12% ఎక్కువ. గత ఏడాది కాలంలో మదుపర్ల సంఖ్య 3.5 లక్షలు పెరిగి, దాదాపు 58 లక్షలకు చేరిందని భారత మ్యూచువల్ ఫండ్స్ సంఘం (యాంఫీ) గణాంకాలు చెబుతున్నాయి. వృద్ధి, స్థిరత్వం కలిగి ఉండే హైబ్రిడ్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టడంపై మదుపర్లు దృష్టి సారిస్తున్నారనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. ఈక్విటీ, డెట్ ఫండ్ల మిశ్రమంగా ఆవిర్భవించిన హైబ్రిడ్ ఫండ్లు గత ఏడాది కాలంలో 9%, రెండేళ్లలో 20%, మూడేళ్లలో 15%, అయిదేళ్లలో 21% చొప్పున ప్రతిఫలాలను అందించాయి. యాంఫీ గణాంకాల ప్రకారం..

● 2024 ఏప్రిల్‌లో రూ.2.02 లక్షల కోట్లుగా ఉన్న హైబ్రిడ్ ఫండ్ల ఆస్తుల విలువ, 2025 ఏప్రిల్‌లో రూ.2.26 లక్షల కోట్లకు చేరింది. సెబీ ఎఫ్ అండ్ ఓ నిబంధనలను కఠినతరం చేయడంతో బ్యాలెన్స్‌డ్, పన్ను మినహాయింపు కలిగిన ఫండ్లపై రిటైల్ మదుపర్ల ఆసక్తి పెరిగింది.

● డీఎస్‌పీ అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్, బంధన్ అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్, మహీంద్రా మనులైఫ్ అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్, ఇన్వెస్కో ఇండియా అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్, ఎస్‌బీఐ ఈక్విటీ హైబ్రిడ్ ఫండ్‌లు గత ఏడాది కాలంలో 12-18%, రెండేళ్లలో 19-24% లాభాలను ఇచ్చాయి. అయిదేళ్లలో చూస్తే 18.5-24% లాభాలను అందించాయి. మహీంద్రా మనులైఫ్ ఫండ్ అత్యధికంగా 23.62% ప్రతిఫలాన్ని ఇచ్చింది.

● మొత్తంగా హైబ్రిడ్ విభాగ ఆస్తుల విలువ 21% పెరిగి రూ.9.15 లక్షల కోట్లకు చేరింది. పోలియోలు 22 లక్షలు పెరిగి 1.58 కోట్లుగా ఉన్నాయి.

2025-26లో భారత్ వృద్ధి 6.5%: సీఐఐ


సంజీవ్ పురి

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జీడీపీ వృద్ధి 6.5 శాతంగా నమోదవుతుందని భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) అంచనా వేసింది. భౌగోళిక-రాజకీయ సమస్యలు స్వల్పకాలంలో ప్రభావం చూపినా, వాటిని అధిగమించే సత్తా దేశ ఆర్థిక వ్యవస్థకు ఉందని సీఐఐ అధ్యక్షుడు, ఐటీసీ ఎండీ సంజీవ్ పురి పేర్కొన్నారు. వాణిజ్య అవరోధాలు పెరుగుతున్న నేపథ్యంలో జాతీయ ప్రయోజనాలు కాపాడుకోవడానికి కీలక వాణిజ్య భాగస్వాములతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను మన దేశం కుదుర్చుకోవాలని తెలిపారు. ఇంధనం, రవాణా, లోహాలు, రసాయనాలు, ఆతిథ్యం వంటి రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులు పుంజుకుంటున్నాయని వెల్లడించారు. అయితే ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితుల వల్ల, పెట్టుబడుల్లో కొంతమేర జాగ్రత్త ధోరణి పెరిగే అవకాశం కనిపిస్తోందన్నారు. 'ఇటీవల వడ్డీ రేట్లు తగ్గాయి. ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తోంది. వ్యక్తిగత ఆదాయపు పన్ను తగ్గింపు ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చింది. గత ఏడాది రెండో అర్ధ భాగంలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు పెరిగాయి. ఇవన్నీ మన దేశ ఆర్థిక వ్యవస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో 6.5% వృద్ధి సాధించేందుకు దోహదపడే అంశాలే' అని సంజీవ్ పురి వివరించారు.

● **ప్రభుత్వ చర్యలు భేష్:** మన దేశంలో 26 మంది పర్యాటకులను చంపిన పాకిస్థాన్ ఉగ్రవాదులను శిక్షించడానికి భారత ప్రభుత్వం సరైన చర్యలే తీసుకుందని సంజీవ్ తెలిపారు. దేశ ఆర్థిక పురోగతి నిలకడగా ఉండేలా చూసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం వెనక పరిశ్రమ దృఢంగా నిలుస్తుందని ఆయన వెల్లడించారు. దేశాన్ని, మన ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు, ఉగ్రవాదులకు గట్టి హెచ్చరికలు పంపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పటికప్పుడు తగిన వ్యూహాలు పన్నుతున్నారని వివరించారు. మన ప్రభుత్వ చర్యలన్నింటికీ పరిశ్రమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

జాతీయ అత్యయిక స్థితిలో చమురు-గ్యాస్‌పై హక్కులు ప్రభుత్వానివే



దిల్లీ: దేశీయ క్షేత్రాల్లో ఉత్పత్తి చేస్తున్న చమురు-గ్యాస్‌పై, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వానికే అధికారం ఉండేలా ముసాయిదా మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. చమురు క్షేత్రాల చట్టానికి చేస్తున్న సవరణ ప్రకారం.. జాతీయ అత్యయిక స్థితిలో దేశంలో ఉత్పత్తి అయ్యే చమురు-గ్యాస్‌పై ప్రభుత్వమే ముందస్తు హక్కుల (ప్రీ-ఎమ్షన్ రైట్స్)ను కలిగి ఉంటుంది. ఒక ఉత్పత్తి, ఆస్తి లేదా వనరును ఇతరులకు అందించే ముందు, కొనుగోలు చేయడానికి లేదా క్లెయిమ్ చేయడానికి ఒక పార్టీకి అది ప్రభుత్వం గానీ ఇప్పటికే ఉన్న వాటాదారునికి గానీ ఉండే చట్టబద్ధమైన హక్కే ప్రీ-ఎమ్షన్ రైట్స్ లేదా ప్రీఎమ్టివ్ రైట్స్. భూగర్భం లేదా సముద్ర గర్భం నుంచి వెలికి తీసి.. పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలుగా శుద్ధి చేసిన ముడి చమురుపై అటువంటి హక్కులను చేర్చడం; విద్యుత్ ఉత్పత్తి, ఎరువుల ఉత్పత్తి, వాహనాలకు సీఎన్‌జీ, పైపుల ద్వారా వంట గ్యాస్ కోసం వినియోగించే సహజ వాయువును కూడా ఇందులో చేర్చడం జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడంగా చూడొచ్చు. అత్యవసర సమయాల్లో ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి సాయపడటానికే ఈ హక్కులను ప్రభుత్వం కలిగి ఉంటుంది. చమురు-గ్యాస్ ఉత్పత్తిదారునికి ముందస్తు కొనుగోలు సమయంలో ఉన్న సరసమైన మార్కెట్ ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని ముసాయిదా మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

కోడి గుడ్లు

12న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)



హైదరాబాద్	500	గోదావరి	500
వరంగల్	502	విశాఖపట్నం	505
విజయవాడ	500	చిత్తూరు	583

బ్రిటన్ వైన్‌పై సుంకాల కోత లేదు

బీర్లపైనా పరిమిత రాయితీలే



దిల్లీ: భారత్-బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కింద ఆ దేశ వైన్స్‌కు ఎటువంటి రాయితీలు ఇవ్వడం లేదని అధికార వర్గాలు తెలిపాయి. బ్రిటన్ బీర్లపైనా సుంకాల్లో పరిమిత రాయితీలే ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఈ నెల 6న ఎఫ్‌టీఏ కుదిరిన విషయం తెలిసిందే. బ్రిటన్‌కు సుంకాల పరంగా ఎటువంటి తగ్గింపు ఇవ్వని వ్యవసాయ ఉత్పత్తుల్లో పాలు-పాల పదార్థాలు, యాపిల్, వెన్న, ఓట్స్, వంట నూనెలతో పాటు జంతు మాంసం కూడా ఉంది. ఇటీవల కుదిరిన ఎఫ్‌టీఏతో భారత్‌లో బ్రిటన్ స్కాచ్ విస్కీ, కార్లు చౌక కానున్నాయి. ఇదే సమయంలో మన దుస్తులు, తోళ్ల ఉత్పత్తులపై బ్రిటన్ సుంకాలు తగ్గించింది. బ్రిటన్ విస్కీపై సుంకాలను 150 శాతం నుంచి 75 శాతానికి, 10 ఏళ్ల తర్వాత 40 శాతానికి తగ్గించనున్నారు. అయితే బ్రిటన్ విస్కీ దిగుమతులు తక్కువగా ఉన్నాయని, దేశీయ విపణిపై అవి ప్రభావం చూపక పోవచ్చని అంటున్నారు.

నేటి నుంచి భారత్-ఈయూ చర్చలు

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై తదుపరి దశ చర్చలు జరిపేందుకు భారత్, ఐరోపా సమాఖ్య (ఈయూ) ప్రతినిధులు సోమవారం సమావేశం కానున్నారు. సాధ్యమైనంత త్వరగా మొదటి దశ ఒప్పందం కుదుర్చుకోవడమే లక్ష్యమని అధికార వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో.. రెండు దశల్లో ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ఇరు వర్గాలు అంగీకరించాయి. 11వ విడత చర్చలు సోమవారం ప్రారంభమవుతాయని, ఈనెల 16 వరకు కొనసాగుతాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ఎఫ్‌టీఏ సానుకూల పరిణామం: మెర్సిడెస్, బీఎండబ్ల్యూ

భారత్-బ్రిటన్ ఎఫ్‌టీఏను విలాస కార్ల కంపెనీలు మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ ఆహ్వానించాయి. ఎఫ్‌టీఏను సానుకూల పరిణామంగా అభివర్ణించాయి. బహుళ జాతీయ కంపెనీగా స్వేచ్ఛా వాణిజ్యానికి మద్దతుగా ఉంటామని, స్వేచ్ఛా వాణిజ్యంతో మెరుగైన వృద్ధికి అవకాశం ఉంటుందని మెర్సిడెస్-బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ పేర్కొన్నారు. భారత్‌లో తాము విక్రయిస్తున్న కార్లలో 95% పూర్తిగా తయారై - దిగుమతి చేసుకున్నవే ఉంటున్నాయని, వీటిపై 15-16% సుంకం ఉందన్నారు. ఈ ఒప్పందంతో కార్ల ధరలు భారీగా తగ్గే అవకాశం లేదన్నారు. వాణిజ్య ప్రతిబంధకాలను తగ్గించి, ప్రతి మార్కెట్‌లో ప్రవేశించేలా అనుమతులు కోరుకుంటామని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా అధ్యక్షుడు, సీఈఓ విక్రమ్ పవాహ్ అన్నారు. ఎఫ్‌టీఏ నిబంధనలపై పూర్తి స్పష్టత వచ్చిన తర్వాతే, విలాస కార్ల ధరలపై ప్రభావం తెలుస్తుందని వివరించారు.

గోద్రేజ్ రూ.40,000 కోట్ల గృహ ప్రాజెక్టులు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో రూ.40,000 కోట్ల విలువైన గృహ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు గోద్రేజ్ ప్రాపర్టీస్ ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్ పిరోజ్‌షా గోద్రేజ్ తెలిపారు. ఈ విభాగంలో తమ మార్కెట్ వాటా పెంచుకోవడమే లక్ష్యమని అన్నారు. అమ్మకాల బుకింగ్స్ పరంగా అగ్రగామి నమోదిత స్థిరాస్తి సంస్థగా తమ స్థానాన్ని నిలబెట్టుకోవాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పటికీ.. దేశీయంగా ఇళ్లకు గిరాకీ బలంగానే ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.29,444 కోట్ల విక్రయ బుకింగ్స్ సాధించామని తెలిపారు. వ్యాపార విస్తరణ, మార్కెట్ వాటా పెంచుకునేందుకు భూమి కొనుగోళ్లు, ప్రాజెక్టుల అభివృద్ధిపై పెట్టుబడులు కొనసాగిస్తామని పిరోజ్‌షా స్పష్టం చేశారు. గత అక్టోబరులో క్యూఐపీ ద్వారా రూ.6,000 కోట్లు సమీకరించామని, కంపెనీ వద్ద రూ.7,500 కోట్ల నిర్వహణ నగదు ఉండటంతో పెట్టుబడులకు ఢోకా లేదన్నారు.

వెండి ముందుకే!


కమొడిటీస్ ఈ వారం

పసిడి




పసిడి జూన్ కాంట్రాక్టు ఈవారం ప్రతికూల ధోరణిలో చలిస్తే రూ.93,787 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.92,413; రూ.90,096 వరకు దిగిరావచ్చు. ఒకవేళ పైకి వెళితే రూ.98,421 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,00,307; రూ.1,03,055 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

వెండి



వెండి జులై కాంట్రాక్టు రూ.96,430 కంటే పైన నిలదొక్కుకుంటే మరింతగా రాణించే అవకాశం ఉంటుంది. అందువల్ల రూ.94,031 వద్ద స్టాప్‌లాస్ పరిగణిస్తూ, లాంగ్ పొజిషన్లను కొనసాగించడం మంచిదే.

ప్రాథమిక లోహాలు



● రాగి మే కాంట్రాక్టు రూ.841 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే సానుకూల ధోరణికి అవకాశం ఉంటుంది. ఒకవేళ ఈ స్థాయి కంటే కిందకు వస్తే రూ.832.15; రూ.824.55 వరకు దిగిరావచ్చు.

● సీసం మే కాంట్రాక్టు రూ.179.25 కంటే పైకి వెళితే రూ.180.60; రూ.182.80 వరకు పెరగొచ్చు. అదేవిధంగా రూ.176.10 కంటే కిందకు వస్తే రూ.173.90; రూ.172.75 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది.

● జింక్ మే కాంట్రాక్టుకు రూ.249 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, రూ.252.45 ఎగువన లాంగ్ పొజిషన్లు తీసుకోవడం మంచి వ్యూహమే అవుతుంది.

● అల్యూమినియం మే కాంట్రాక్టుకు రూ.229.65 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.225.65; రూ.222.85 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.236.45 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.239.45; రూ.243.25 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

ఇంధన రంగం



● ముడి చమురు మే కాంట్రాక్టు ఒడుదొడుకుల మధ్య ట్రేడ్ కావచ్చు. రూ.5,400 కంటే ఎగువన ట్రేడయితే రూ.5,593; రూ.5,931 వరకు రాణించే అవకాశం ఉంటుంది. కిందకు వస్తే రూ.4,869 వద్ద మద్దతు లభించొచ్చు.

● సహజవాయువు మే కాంట్రాక్టు రూ.310 కంటే దిగువన ట్రేడ్‌కాకుంటే మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.298.45 కంటే కిందకు వస్తే రూ.275.35; రూ.261.55 వరకు దిద్దుబాటు కావచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు మే కాంట్రాక్టు రూ.14,162 కంటే ఎగువన కదలాడకుంటే కొంత దిద్దుబాటుకు గురైనా, రూ.13,202 వద్ద మద్దతు లభించే అవకాశం ఉంది. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.14,407 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.14,969; రూ.15,611 వరకు పెరగొచ్చు.

● పత్తి క్యాండీ మే కాంట్రాక్టు రూ.53,673 కంటే దిగువకు వస్తే రూ.53,156; రూ.52,493 వరకు పడిపోవచ్చు. ఒకవేళ రూ.54,853 కంటే పైకి వెళితే రూ.55,516; రూ.56,033 వరకు రాణించొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/(క్షీణత)
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (జూన్)	93,249	96,535	3.52
వెండి (జులై)	92,830	96,748	4.22
రాగి (మే)	843.25	850.95	0.91
సీసం (మే)	176.30	178.30	1.13
జింక్ (మే)	246	251	2.03
అల్యూమినియం (మే)	231.75	233.55	0.78
ముడి చమురు (మే)	4,873	5,207	6.85
సహజ వాయువు (మే)	311.10	321.50	3.34
పసుపు (మే)	14,142	13,844	-2.11
పత్తి క్యాండీ (మే)	54,160	54,192	0.06

యుద్ధ అనిశ్చితులు కొనసాగొచ్చు



స్టాక్ మార్కెట్ ఈ వారం

☛ కాల్పుల విరమణపై నేటి చర్చలు కీలకం ☛ బ్యాంకింగ్, చమురు షేర్లు నష్టపోవచ్చు
☛ ఎఫ్ఎమ్‌సీజీ స్క్రిప్‌లకు సానుకూలతలు ☛ విశ్లేషకుల అంచనాలు

భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిణామాలే ఈవారం దేశీయ సూచీలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. కాల్పుల విరమణకు అంగీకరిస్తున్నట్లు శనివారం ఇరుదేశాలు ప్రకటించినా, మళ్లీ కొన్ని గంటల పాటు పాకిస్థాన్ కాల్పులు జరపడంతో అనిశ్చితి నెలకొంది. ఇరుదేశాల మధ్య సోమవారం జరగనున్న కీలక చర్చలను గమనించాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) రూ.14,167 కోట్ల పెట్టుబడులు పెట్టినా, గత శుక్రవారం అమ్మకాలు జరిపారు. నిఫ్టీ-50 సూచీకి 23,700- 23,800 పాయింట్ల శ్రేణిలో మద్దతు లభించొచ్చని, 24,500 పాయింట్ల దగ్గర నిరోధం ఎదురుకావొచ్చని సాంకేతిక నిపుణులు అంటున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● **బ్యాంకింగ్** షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఉండొచ్చు. బ్యాంక్ నిఫ్టీకి 53,000- 53,500 పాయింట్ల శ్రేణిలో మద్దతు, 55,000 పాయింట్ల దగ్గర నిరోధం ఎదురుకావొచ్చు. గత వారం యెస్ బ్యాంక్‌లో జపాన్ సంస్థ ఎస్ఎంబీసీ 20% వాటా కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించడంతో, షేరుపై నేడు ప్రభావం ఉంటుంది.

● అమెరికాలో జనరిక్ **ఔషధాలను** విక్రయిస్తున్న కంపెనీల షేర్లు ఒత్తిడి ఎదుర్కోవచ్చు. స్థానిక తయారీకి ఊతమిచ్చేలా ఎగ్జిక్యూటివ్ ఆదేశాలపై ట్రంప్ సంతకాలు చేయడమే ఇందుకు నేపథ్యం. డాక్టర్ రెడ్డీస్, సన్‌ఫార్మా, అరబిందో, సిప్లా వంటి కంపెనీలకు ఇది ప్రతికూలం కానుంది.

● **చమురు** కంపెనీల షేర్లు బలహీనంగా ట్రేడవ్వొచ్చు. నిఫ్టీ చమురు సూచీ 10,600 పాయింట్లను పరీక్షించే అవకాశం ఉంది.

● అమెరికా టారిఫ్ ఉద్రిక్తతల వల్ల, స్వల్పకాలంలో **ఐటీ** షేర్లు పరిమిత శ్రేణిలో కదలాడొచ్చు. భవిష్యత్తు వడ్డీ రేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ స్పష్టత ఇవ్వకపోవడం ప్రభావం చూపొచ్చు. భారత్-పాకిస్థాన్ పరిణామాలనూ గమనించాలి.

● **ఎఫ్ఎమ్‌సీజీ** షేర్లు సానుకూల ధోరణిలో, ఒడుదొడుకుల మధ్య చలించొచ్చు. అనిశ్చితుల వేళ మదుపర్లు రక్షణాత్మక రంగాలపై దృష్టి పెట్టడం ఈ షేర్లకు కలిసిరానుంది. మెరుగైన వర్షపాత అంచనాలు, గ్రామీణ గిరాకీ పుంజుకోవడం సానుకూలం కానుంది.

● **యంత్ర పరికరాల** రంగంలో రక్షణ సంబంధిత షేర్ల లాభాలు పరిమితం కావొచ్చు. ఇప్పటికే ఈ షేర్లు భారీగా పెరిగాయి. బుధవారం హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌తో పాటు కిర్లోస్కర్, వి-గార్డ్, టాటా పవర్, హిటాచీ ఫలితాలు విడుదల కానున్నాయి.

● ఉక్కు ధరలు పెరిగే అవకాశాలు తక్కువగా ఉండటంతో, **లోహ** కంపెనీల షేర్లు ఒక శ్రేణిలోనే కదలాడొచ్చు. సోమవారం టాటా స్టీల్ ఫలితాలు రానున్నాయి.

● భారత్-పాకిస్థాన్ యుద్ధ ఉద్రిక్తతలతో, **వాహన** షేర్లు నష్టాల్లో కదలాడే అవకాశం ఉంది. టాటా మోటార్స్, ఐషర్ మోటార్స్, హీరో మోటోకార్ప్ ఫలితాలపై దృష్టి పెట్టొచ్చు.

● భారత-పాకిస్థాన్ పరిణామాలకు తోడు, రంగానికి సంబంధించి ముఖ్యమైన వార్తలేమీ లేకపోవడంతో **టెలికాం** షేర్ల స్థిరీకరణ కొనసాగే అవకాశం ఉంది. 13న ఎయిర్‌టెల్ ఫలితాలు వెలువడనున్నాయి.

● వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో **సిమెంట్** కంపెనీల షేర్లు ఒత్తిడి ఎదుర్కోవచ్చు. ఈ సీజన్‌లో గిరాకీ తగ్గనుండటం, పలు కంపెనీల షేర్లు అధిక స్థాయులకు చేరడం ఇందుకు కారణమని అంటున్నారు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	221.62	225.70	214.10
బజాజ్ ఆటో	7682.50	7810.80	7547.80
ఐషర్ మోటార్స్	5324.00	5388.30	5228.30
హీరో మోటోకార్ప్	3853.90	3989.40	3667.20
ఎం అండ్ ఎం	2982.10	3100.20	2896.00
మారుతీ	12250.00	12486.70	11996.70
టాటా మోటార్స్	708.50	740.20	650.20
టీవీఎస్ మోటార్	2663.70	2709.40	2617.20

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అదానీ విల్మర్	280.25	289.80	269.80
బ్రిటానియా ఇండస్ట్రీస్	5436.00	5580.30	5282.30
కోల్గేట్ పామోలివ్	2550.50	2593.40	2473.20
డాబర్ ఇండియా	462.75	471.60	454.20
ఇమామీ	630.40	657.20	582.60
హిందుస్థాన్ యునిలీవర్	2332.90	2366.40	2285.60
ఐటీసీ	423.55	431.40	419.10
మారికో	723.30	733.10	707.10

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	216.63	221.50	209.70
సీజీ పవర్	609.60	630.70	576.80
ఎల్ అండ్ టీ	3443.90	3563.30	3271.30
సీమెన్స్	2857.20	2926.90	2753.50
థెర్మాక్స్	3239.10	3358.60	3026.00

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1164.40	1193.50	1111.50
బయోకాన్	329.90	345.70	320.10
సిప్లా	1480.00	1499.40	1454.00
డాక్టర్ రెడ్డీస్	1155.90	1182.30	1125.30
గ్లెన్‌మార్క్ ఫార్మా	1398.20	1429.70	1367.10
లుపిన్	2037.40	2092.70	1948.50

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,848.40	1886.60	1817.40
ఎమ్‌టీఎన్ఎల్	39.02	40.00	37.50
టాటా కమ్యూనికేషన్స్	1515.80	1554.10	1451.70
వొడాఫోన్ ఐడియా	6.70	6.90	6.40

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	627.15	647.00	593.90
హిందుస్థాన్ జింక్	408.35	417.90	393.20
ఎన్ఎమ్‌డీసీ	64.29	66.30	61.00
సెయిల్	109.01	111.30	105.10
టాటా స్టీల్	142.78	144.90	139.40
వేదాంతా	407.90	415.20	394.90

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1889.70	1930.70	1866.30
ఐసీఐసీఐ బ్యాంక్	1388.90	1431.50	1365.70
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	66.21	68.00	64.10
ఇండస్‌ఇండ్ బ్యాంక్	818.20	837.70	795.80
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2103.10	2144.40	2054.40
పీఎన్‌బీ	91.97	94.20	88.40
ఎస్‌బీఐ	779.25	798.40	746.00

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1377.20	1402.50	1361.90
బీపీసీఎల్	306.85	311.20	299.20
హెచ్‌పీసీఎల్	386.25	392.80	376.80
ఐఓసీఎల్	139.99	142.70	136.20
ఓఎన్‌జీసీ	234.96	239.80	226.10
ఆయిల్ ఇండియా	403.30	413.80	383.80

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1569.40	1588.50	1547.70
ఇన్ఫోసిస్	1507.60	1521.70	1487.10
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5443.00	5588.00	5243.00
టీసీఎస్	3440.30	3476.30	3380.10
టెక్ మహీంద్రా	1493.70	1514.20	1467.80
విప్రో	242.01	246.90	234.00

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1811.60	1841.90	1763.90
అంబుజా సిమెంట్స్	527.45	540.10	506.00
ఇండియా సిమెంట్స్	308.60	315.70	299.00
శ్రీ సిమెంట్	29230.00	30036.70	28316.70
అల్ట్రాటెక్ సిమెంట్	11364.00	11656.70	11166.70

ఛాంపియన్

16 నుంచి ఐపీఎల్?



దిల్లీ

భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా సస్పెండైన ఐపీఎల్ ఈ నెల 16 లేదా 17వ తేదీన ఆరంభమయ్యే అవకాశముంది. కాల్పుల విరమణ ప్రకటనతో ఐపీఎల్‌కు మార్గం సుగమం అయిన సంగతి తెలిసిందే. అయితే టోర్నీ తిరిగి ప్రారంభం కావడం అన్నది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది. టోర్నీ పునరుద్ధరణ గురించి ఐపీఎల్ పాలక వర్గ సభ్యులు, బీసీసీఐ అధికారులు ఆదివారం చర్చించారు. బీసీసీఐ ఇంకా షెడ్యూలును సిద్ధం చేసే పనిలో ఉందని బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా చెప్పాడు. "ఇప్పటివరకైతే ఐపీఎల్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బీసీసీఐ కార్యదర్శి, ఐపీఎల్ ఛైర్మన్ ఫ్రాంఛైజీలతో మాట్లాడతారు. త్వలోనే నిర్ణయం తీసుకుంటాం. టోర్నమెంట్‌ను త్వరగా ప్రారంభించడానికి కృషి జరుగుతోంది" అని చెప్పాడు. మే 16 లేదా 17న టోర్నీ తిరిగి ఆరంభం కానున్నందున ఆటగాళ్లను వెనక్కి పిలవాలని ఫ్రాంఛైజీలతో బీసీసీఐ చెప్పినట్లు తెలుస్తోంది. మిగిలిన లీగ్ మ్యాచ్‌లను డబుల్ హెడర్‌లతో ముగించనున్నారు. జూన్ 1న ఐపీఎల్ ఫైనల్ జరిగే అవకాశముంది. టోర్నీలో 16 మ్యాచ్‌లను కేవలం నాలుగు నగరాలు హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా, బెంగళూరులో నిర్వహించే అవకాశముంది. సీఎస్కే, రాజస్థాన్, సన్‌రైజర్స్ ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

ప్రభుత్వ అనుమతితోనే..: ఐపీఎల్‌ను తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అన్నాడు. "వచ్చే కొన్ని రోజుల్లో ఫ్రాంఛైజీలు, ప్రసారదారు, స్పాన్సర్లు, మిగతా మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వాల్సిన రాష్ట్ర సంఘాలతో సంప్రదింపులు మొదలుపెడతాం. ఆ తర్వాత ఐపీఎల్ పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటాం. అయితే లీగ్ తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి" అని చెప్పాడు.



రాజీవ్ శుక్లా

ఆ జట్లకు చెరో పాయింట్: భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, దిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ రద్దయిన సంగతి తెలిసిందే. మ్యాచ్ ఆగిపోయే సమయానికి పంజాబ్ 10.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 122 పరుగులు చేసింది. ఆ మ్యాచ్‌ను కొనసాగించడం, లేదా మొదటి నుంచి నిర్వహించడం ఉండకపోవచ్చు. రెండు జట్లకు చెరో పాయింట్ ఇచ్చే అవకాశం ఉంది.




గిల్

టైటాన్స్ సాధన షురూ..: భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణ తర్వాత తిరిగి సాధనను మొదలెట్టిన తొలి జట్టుగా గుజరాత్ టైటాన్స్ నిలిచింది. ప్రస్తుతం 16 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న ఆ జట్టు.. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ప్రాక్టీస్ చేసింది. "అవును.. మేం తిరిగి సాధన ప్రారంభించాం. కుర్రాళ్లు చాలా హుషారుగా ఉన్నారు" అని ఓ గుజరాత్ అధికారి చెప్పాడు. పూర్తి జట్టు ప్రాక్టీస్ సెషన్లో పాల్గొంది. జోస్ బట్లర్ (ఇంగ్లాండ్), కొయెట్జీ (దక్షిణాఫ్రికా) తప్ప విదేశీ ఆటగాళ్లంతా భారత్‌లోనే ఉన్నారు. స్వదేశానికి వెళ్లిన వాళ్లు.. అవసరమైతే వెనక్కి వస్తారని గుజరాత్ జట్టు వర్గాలు తెలిపాయి.

పాంటింగ్ చెప్పాడు.. విమానం దిగారు!

దిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రికత్త పరిస్థితుల నేపథ్యంలో ఐపీఎల్‌లోని విదేశీ ఆటగాళ్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్న దశలో.. పంజాబ్ కింగ్స్ చీఫ్ కోచ్ రికీ పాంటింగ్ గుండె ధైర్యం చూపించాడు. తాను భారత్‌లో ఉండిపోవడమే కాదు, పంజాబ్ జట్టులోని విదేశీ ఆటగాళ్లలోనూ ధైర్యం నింపి వారి మనసు కూడా మార్చేశాడు. వివరాల్లోకి వెళితే.. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చే సమయానికి పాంటింగ్ ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. దిల్లీలో విమానం కూడా ఎక్కేశాడు. కానీ కాల్పుల విరమణ నిర్ణయం వెలువడంతో ఆఖరి నిమిషంలో విమానం దిగిపోయాడు. పంజాబ్ జట్టులోని విదేశీ ఆటగాళ్లు కూడా భారత్‌లో ఉండేలా ధైర్యం నూరిపోశాడు. ధర్మశాలలో పంజాబ్, దిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ అర్ధంతరంగా రద్దవడంతో రెండు జట్లు రైలు, రోడ్డు మార్గం ద్వారా దిల్లీకి చేరుకున్నాయి. పంజాబ్ ఆటగాళ్లు మార్కస్ స్టాయినిస్, ఆరోన్ హార్డీ, జోష్ ఇంగ్లిస్, జేవియర్ బార్ట్‌లెట్ (ఆస్ట్రేలియా) స్వదేశం వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఈ సీజన్‌లో చక్కటి ప్రదర్శన చేసిన పంజాబ్.. 2014 తర్వాత మళ్లీ ప్లేఆఫ్ బెర్తుకు చేరువైంది. ఈ నేపథ్యంలో విదేశీ ఆటగాళ్లలో పాంటింగ్ ఉత్సాహం నింపి.. వాళ్లు భారత్‌లో ఉండేలా చేశాడు. మార్కో యాన్సెస్ (దక్షిణాఫ్రికా), అజ్మతుల్లా ఒమర్జాయ్ (అఫ్గానిస్తాన్) మాత్రమే భారత్‌ను వీడారు. కానీ వారు దుబాయ్‌లోనే ఉండటంతో అవసరాన్ని బట్టి అక్కడి నుంచి మళ్లీ భారత్‌కు బయల్దేరే అవకాశముంది. "పాంటింగ్ అంకితభావానికి ఇది నిదర్శనం. అతను మాత్రమే ఇలా చేయగలడు. పాంటింగ్ స్వచ్ఛందంగా ఉండిపోవడమే కాకుండా.. విదేశీ ఆటగాళ్లలో స్ఫూర్తి రగిలించాడు. ఇప్పుడు వాళ్లంతా తిరిగి జట్టులో చేరబోతున్నారు" అని పంజాబ్ కింగ్స్ సీఈఓ సతీశ్ మేనన్ తెలిపాడు. "యుద్ధం లాంటి పరిస్థితులు విదేశీ ఆటగాళ్లకు అలవాటు లేదు. కాబట్టి వాళ్లు ఆందోళన చెందడం సహజం. స్టాయినిస్‌తో సహా ఆటగాళ్లంతా వీలైనంత త్వరగా వెళ్లిపోవాలని కోరుకున్నారు. కానీ కాల్పుల విరమణ తర్వాత వారంతా ఇక్కడే ఉండేలా పాంటింగ్ ఒప్పించడం గొప్ప విషయం" అని పంజాబ్ జట్టు వర్గాలు పేర్కొన్నాయి.



పాంటింగ్

హేజిల్‌వుడ్ అనుమానమే..

ముంబయి: భారత, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదరడంతో ఐపీఎల్ పునరుద్ధరణకు బీసీసీఐ ఏర్పాట్లు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే టోర్నీ తిరిగి ఆరంభమైనా.. ఆర్సీబీ కీలక ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ ఆడడం అనుమానంగా మారింది. అతడు భుజం గాయంతో బాధపడుతున్నాడు. దీంతో అతను స్వదేశం నుంచి తిరిగి రావడం అనుమానమే. ఈ గాయం వల్లే హేజిల్‌వుడ్ మే 3న చెన్నైతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతను టోర్నీ మొత్తానికి దూరమవుతాడని అప్పుడే వార్తలు వచ్చాయి. మరోవైపు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాకు చెందిన పలువురు ఆటగాళ్లు తిరిగి భారత్‌కు రావడం ప్రశ్నార్థకంగా మారింది. ఈ రెండు జట్లు తలపడాల్సిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ జూన్ 11న ఆరంభం కానుండడమే అందుకు కారణం. ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, ట్రావిస్ హెడ్ కూడా భారత్‌కు రావడంపై నిర్ణయం తీసుకోవాల్సివుంది. కమిన్స్, హెడ్ సన్‌రైజర్స్ తరపున మూడే మ్యాచ్‌లు ఆడాల్సివుంది. ఆ జట్టు ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు దూరమైంది. కానీ స్టార్క్ ప్రాతినిధ్యం వహిస్తున్న దిల్లీ.. ఇంకా ప్లేఆఫ్స్ రేసులో ఉంది. దక్షిణాఫ్రికా ఆటగాళ్లు మళ్లీ ఐపీఎల్‌లో ఆడడంపై ఆ దేశ బోర్డు ఆదివారం నిర్ణయం తీసుకోనుంది.



హేజిల్‌వుడ్

సినర్ పునరాగమనం అదుర్స్

రోమ్: డోపింగ్ నిషేధంతో 100 రోజులకు పైగా ఆటకు దూరంగా ఉన్న యానిక్ సిన్నర్ (ఇటలీ).. పునరాగమనంలో అదరగొట్టాడు. ఇటాలియన్ ఓపెన్‌లో సొంత ప్రేక్షకుల సమక్షంలో అతను శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో టాప్ సీడ్ సినర్ 6-3, 6-4తో మరియానో నవోన్ (అర్జెంటీనా)పై విజయం సాధించాడు. తొలి రౌండ్లో సిన్నర్‌కు బై లభించింది. "అద్భుతమైన అనుభూతి. ఈ క్షణం కోసం చాలా కాలం వేచి ఉన్నా. తిరిగి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది" అని సినర్ వ్యాఖ్యానించాడు. మూడో రౌండ్లో డెస్పెన్ డి జాంగ్ (నెదర్లాండ్స్)తో సినర్ తలపడతాడు.



సినర్



ఈ ఏడాది మహిళల వన్డే ప్రపంచకప్ దిశగా భారత జట్టు తన సన్నాహాన్ని ఘనంగా ఆరంభించింది. శ్రీలంకలో ముక్కోణపు వన్డే సిరీస్‌లో జయకేతనం ఎగురవేసింది. ఆదివారం ఫైనల్లో హర్మన్‌ప్రీత్‌సేన.. ఆతిథ్య జట్టును అలవోకగా ఓడించింది. లీగ్ దశలో భారత్‌ను ఓ మ్యాచ్‌లో ఓడించిన లంక.. ఫైనల్లో మాత్రం నిలవలేకపోయింది.

స్మృతి మెరుపు సెంచరీ

- భారత మహిళలదే ముక్కోణపు సిరీస్
- ఫైనల్లో శ్రీలంక చిత్తు

కొలంబో

భారత మహిళల జట్టు అదరగొట్టింది. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ వన్డే ముక్కోణపు సిరీస్‌ను చేజిక్కించుకుంది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (116; 101 బంతుల్లో 15×4, 2×6) మెరుపు శతకం బాదిన వేళ.. ఆదివారం ఏకపక్షంగా సాగిన ఫైనల్లో భారత్ 97 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. స్మృతి జోరుతో మొదట భారత్ 7 వికెట్ల నష్టానికి 342 పరుగుల భారీ స్కోరు సాధించింది. హర్లీన్ డియోల్ (47; 56 బంతుల్లో 4×4), జెమీమా (44; 29 బంతుల్లో 4×4), హర్మన్‌ప్రీత్ కౌర్ (41; 30 బంతుల్లో 4×4, 1×6) సత్తా చాటారు. మల్కీ మదార, దేవ్మీ విహంగ, సుగంధిక కుమారి తలో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో స్నేహ్ రాణా (4/38), అమన్‌జ్యోత్ (3/54) ధాటికి శ్రీలంక 48.2 ఓవర్లలో 245 పరుగులకే ఆలౌటైంది. చమరి ఆటపట్టు (51; 66 బంతుల్లో 6×4, 1×6) టాప్ స్కోరర్. స్మృతికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. స్నేహ్ రాణా 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికైంది.

భారత్ ధనాధన్: భారత్ 342 పరుగులు చేయడం ఊహించనిదే. భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా.. తొలి వికెట్ పడడానికి చాలా సమయమే పట్టింది. కానీ పరుగులు వేగంగా కాలేదు. 12 ఓవర్లకు స్కోరు 53/0. స్మృతి కాస్త వేగంగానే ఆడినా.. ప్రతీక బాగా నెమ్మదిగా ఆడింది. స్మృతి జోరు పెంచుతుండగా 15వ ఓవర్లో ప్రతీక ఔటవడంతో తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత హర్లీన్ డియోల్‌తో కలిసి స్మృతి ఇన్నింగ్స్‌ను నడిపించింది. 24 ఓవర్లలో స్కోరు 109/1. కానీ ఆ తర్వాత స్మృతి గేర్ మార్చింది. వత్సల, విహంగ ఓవర్లలో రెండేసి ఫోర్లు కొట్టిన ఆమె.. జోరు కొనసాగించింది. చకచకా బౌండరీలు బాదేస్తూ 92 బంతుల్లో శతకం పూర్తి చేసింది. వన్డేల్లో స్మృతికి ఇది 11వ సెంచరీ. 33వ ఓవర్లో స్మృతి నిష్క్రమించడంతో 120 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అప్పటికి భారత్ స్కోరు 190. కాసేపటి తర్వాతి హర్లీన్ కూడా వెనుదిరిగినా.. హర్మన్‌ప్రీత్, జెమీమా బ్యాట్లు ఝళిపించడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. దీప్తి శర్మ (20; 14 బంతుల్లో 3×4), అమన్‌జ్యోత్ (18; 12 బంతుల్లో 2×4) కూడా ధాటిగా ఆడారు. భారత జట్టు ఆఖరి 13 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 121 పరుగులు రాబట్టింది. లక్ష్యఛేదనలో శ్రీలంక తడబడింది. ఎవరూ పెద్ద ఇన్నింగ్స్ ఆడలేదు. చమరి కాకుండా నీలాక్షిక (48), విష్మి (36) మాత్రమే రాణించారు. 72 పరుగుల వ్యవధిలో లంక చివరి ఏడు వికెట్లు కోల్పోయింది. దక్షిణాఫ్రికా టోర్నీలో పోటీ పడ్డ మూడో జట్టు.

సంక్షిప్త స్కోర్లు.. **భారత్:** 342/7 (స్మృతి 116, హర్లీన్ 47, జెమీమా 44, హర్మన్‌ప్రీత్ 41, దీప్తి శర్మ 20 నాటౌట్; మల్కీ మదార 2/74, విహంగ 2/69, సుగంధిక 2/59); **శ్రీలంక:** 245 (చమరి 15, నీలాక్షిక 48, విష్మి 36, అనుష్క 28; స్నేహ్ రాణా 4/38, అమన్‌జ్యోత్ 3/54)



స్మృతి మంధాన 116



అమన్‌జ్యోత్

దోహా డైమండ్ లీగ్ బరిలో నీరజ్

దోహా: స్వదేశంలో తన పేరిట నిర్వహించాల్సిన జావెలిన్ టోర్నీ వాయిదా పడడంతో.. స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా తర్వాతి ఈవెంట్ మీద దృష్టిసారించాడు. ఈ నెల 16న అతను దోహా డైమండ్ లీగ్‌లో పోటీ పడనున్నాడు. నీరజ్‌తో పాటు కిశోర్ జెనా (జావెలిన్ త్రో), గుల్వీర్ సింగ్ (5000 మీటర్ల పరుగు), పారుల్ చౌదరి (3000 మీటర్ల స్టీపుల్ చేజ్) కూడా ఈ పోటీల్లో బరిలోకి దిగుతున్నారు. డైమండ్ లీగ్‌లో భారత్ తరపున అత్యధిక సంఖ్యలో అథ్లెట్లు పోటీ పడుతున్న ఈవెంట్ ఇదే. నీరజ్‌కు అండర్సన్ పీటర్స్ (గ్రెనడా), జాకబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్), జులియన్ వెబర్ (జర్మనీ), జులియస్ యెగో (కెన్యా) లాంటి అగ్రశ్రేణి అథ్లెట్ల నుంచి గట్టి పోటీనే ఎదురు కానుంది.



నీరజ్



క్రైనన్

క్రైనన్, సబీరా జోడీకి కాంస్యం

షాట్ గన్ ప్రపంచకప్

నికోసియా (సైప్రస్): ఐఎస్ఎస్ఎఫ్ షాట్ గన్ ప్రపంచకప్‌లో క్రైనన్ చెనాయ్, సబీరా హారిస్ జోడీ మిక్స్‌డ్ ట్రాప్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో భారత ద్వయం 34-33తో టోల్గా టన్సర్-పెలిన్ కాయా (తుర్కియే) జంటను ఓడించింది. ఆదివారం మిగతా విభాగాల్లో భారత్‌కు నిరాశ తప్పలేదు. పురుషుల ట్రాప్ క్వాలిఫయర్స్‌లో క్రైనన్ షెనాయ్ (117) భారత్ తరపున అత్యుత్తమంగా ముగించి 17వ స్థానం సాధించాడు. శార్దూల్ విహాన్ 62, భౌనీష్ మెండిరట్ట 65వ స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో కృతి గుప్తా, రాజేశ్వరి కుమారి, సబీర హారిస్ కూడా ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు.



దీపిక

దీపిక, పార్థ్‌లకు పతకాలు

షాంఘై: ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి దీపిక కుమారి, పార్థ్ సాలుంఖే సత్తాచాటారు. ప్రతిష్టాత్మక టోర్నీలో దీపిక, పార్థ్ కాంస్య పతకాలతో మెరిశారు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో భారత్ మొత్తం 7 పతకాలతో సత్తాచాటింది. శనివారం భారత కాంపౌండ్ ఆర్చర్లు అయిదు పతకాలతో అదరగొట్టగా.. ఆఖరి రోజు రికర్వ్ క్రీడాకారులు దీపిక, పార్థ్ రాణించారు. మహిళల రికర్వ్‌లో కాంస్య పతకం కోసం జరిగిన పోరులో దీపిక 7-3తో కాంగ్ యంగ్ (కొరియా)పై విజయం సాధించింది. పురుషుల విభాగంలో పార్థ్ 6-4తో బాప్టిస్ట్ అడిస్ (ఫ్రాన్స్)ను ఓడించి కాంస్యం గెలిచాడు.

నిరాశపరిచిన భారత రిలే జట్లు

గ్వాంగ్‌జౌ: ప్రపంచ అథ్లెటిక్స్ రిలేస్ భారత పోరాటం ముగిసింది. భారత పురుషుల 4×400 మీటర్లు, మిక్స్‌డ్ 4×400 మీటర్ల రిలే జట్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ బెర్తులు సాధించలేకపోయాయి. సంతోష్‌కుమార్, రూపల్ చౌదరి, తెన్నరసు విశాల్, శుభ వెంకటేశన్‌లతో కూడిన భారత మిక్స్‌డ్ జట్టు రెండో హీట్స్‌లో 4×400 మీ. రేసును 3 నిమిషాల 14.81 సెకన్లలో పూర్తిచేసి నాలుగో స్థానంలో నిలిచింది. రెండు హీట్స్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధిస్తాయి. పురుషుల 4×400 మీ రిలే హీట్స్‌లో జై కుమార్, ధర్మవీర్ చౌదరి, తెక్కినలిల్ సాజిమను, రిన్స్ జోసెఫ్‌లతో కూడిన భారత జట్టు (3ని 04.49సె) ఏడో స్థానానికి పరిమితమైంది.



కోహ్లి

ఎటూ తేల్చని విరాట్

దిల్లీ: కెప్టెన్ రోహిత్ శర్మ బాటలోనే టెస్టు క్రికెట్ నుంచి రిటైరవ్వాలని భావించిన విరాట్ కోహ్లి.. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. తాను టెస్టుల నుంచి తప్పుకోవాలనుకుంటున్నానని, ఇంగ్లాండ్ పర్యటనకు తనను ఎంపిక చేయొద్దని తాజాగా బీసీసీఐకి విరాట్ సమాచారం ఇచ్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికే రోహిత్ కూడా దూరమైన నేపథ్యంలో విరాట్ కూడా తప్పుకొంటే ఇంగ్లాండ్ పర్యటనలో అనుభవ లేమి జట్టును దెబ్బ తీస్తుందని భావించిన బీసీసీఐ.. అతణ్ని వారించినట్లు వార్తలొచ్చాయి. దీనిపై కోహ్లి నుంచి ప్రతిస్పందన ఏమీ లేదని తెలుస్తోంది. రిటైర్మెంట్ ఆలోచనను వెనక్కి తీసుకోనని చెప్పడం లేదా కొనసాగుతాననడం.. ఇలా ప్రస్తుతానికి విరాట్ ఏదీ తేల్చి చెప్పలేదట. ఇటు అభిమానులు, అటు మాజీ ఆటగాళ్లు కోహ్లి టెస్టుల్లో మరి కొంత కాలం కొనసాగాలనే కోరుకుంటున్నారు. రిటైరవ్వాలని అనుకున్నా.. ఆ నిర్ణయం ఇంగ్లాండ్ పర్యటన తర్వాతే ఉండాలని అభిప్రాయపడుతున్నారు. ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్‌కు జట్టును ఎంపిక చేయడానికి కొన్ని రోజుల ముందే విరాట్ తుది నిర్ణయాన్ని చెప్పే అవకాశముంది.

కార్తికేయన్‌కు నాలుగో స్థానం

అల్ ఐన్ (యూఏఈ): ఆసియా వ్యక్తిగత బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ మురళీ కార్తికేయన్.. ఏడు పాయింట్లతో నాలుగో స్థానం సాధించాడు. మరో భారత క్రీడాకారుడు నీలాష్ సాహా ఏడు పాయింట్లతో సమంగా నిలిచినా.. అతనికి అయిదో స్థానం లభించింది. 9 రౌండ్లకు గాను 8 పాయింట్లు నెగ్గిన 15 ఏళ్ల ఇవాన్ జెమ్లియాన్కియా (రష్యా- ఫిడె) విజేతగా నిలిచాడు. మహిళల విభాగంలో భారత క్రీడాకారిణి పద్మిని రౌత్ నాలుగో స్థానం సాధించింది. యుషిన్ సాంగ్ (చైనా), పద్మిని సమంగా నిలిచినా.. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా చైనా క్రీడాకారిణి మూడో స్థానంలో నిలిచింది.



నది చెంత కొనసాగుతున్న పుష్కర ఘాట్, సరస్వతీ దేవి విగ్రహ పనులు

'అంతర్వాహిని'కి పుష్కర శోభ!

- ఈ నెల 15 నుంచి 26 వరకు సరస్వతి పుష్కరాలు
- దక్షిణాదిలో కాళేశ్వరంలోనే మహాక్రతువు

ఈనాడు, వరంగల్-న్యూస్‌టుడే, కాళేశ్వరం: తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు కొనసాగనున్న సరస్వతి పుష్కరాలకు అన్నీ సిద్ధమవుతున్నాయి. భక్తుల మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.35 కోట్లతో శాశ్వత నిర్మాణాలను చేపట్టింది. పుష్కరాల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతుండగా.. మంత్రి శ్రీధర్‌బాబు పనులను పర్యవేక్షిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో కేవలం కాళేశ్వరంలోనే సరస్వతి పుష్కరాలు జరుగుతున్నాయి. దీంతో తెలంగాణతో పాటు ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ లక్ష నుంచి లక్షన్నర వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్న ప్రభుత్వం అందుకు సరిపడా ఏర్పాట్లను చకచకా చేస్తోంది. ఘాట్‌ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణను చేపడుతూ టెంట్‌సిటీలను నెలకొల్పుతోంది. పుష్కరాలకు వచ్చే భక్తులు హెలికాప్టర్‌లో ఆహ్లాదంగా విహరించేందుకు జాయ్‌రైడ్‌లను ఏర్పాటు చేస్తోంది. నది ఒడ్డున 10 అడుగుల సరస్వతి విగ్రహం, చేతితో తాళపత్ర గ్రంథాలు ఉన్న నిర్మాణం ఈ పుష్కరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే పానవట్టంపై రెండు శివలింగాలు (కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి) ఉన్న పుణ్యక్షేత్రం కాళేశ్వరం ఒక్కటే. ఈ రెండు లింగాలకు నిత్యం అభిషేకించిన నీరు గోదావరి, ప్రాణహిత నదుల సంగమ స్థానంలో కలుస్తుండటంతో ఇక్కడి సరస్వతి నదిని అంతర్వాహినిగా పిలుస్తుంటారు.



గెలుపు దక్కాలంటే ఇలా చేయండి

విజయం సాధించాలని మీరు బలంగా కోరుకుంటున్నట్లయితే..
✦ ఇతరుల మాటల్ని కాకుండా, చేతల్ని విశ్వసించండి. ✦ ఎవరూ చూడని సమయంలోనూ మీ పని మీరు చేస్తూ ఉండండి. ✦ మీ శక్తిని అవసరమైనచోట మాత్రమే వినియోగించండి.
✦ కంఫర్ట్‌జోన్ ఆవల పని చేసేందుకు నిత్యం సంసిద్ధులుగా ఉండండి.
– బ్రాడ్ లీ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

సెలవుల్లో సరదాగా!

సాయంత్రం చీకటి పడ్డాక... అమ్మ, నాన్నతో కలిసి టెర్రస్‌పైకెళ్లి తలెత్తి చూస్తే... ఆకాశం అద్భుతంగా కనిపిస్తుంది కదూ... చిక్కటి చీకటి, అందులో మిలమిలా మెరిసే నక్షత్రాలు భలేగా ఉంటాయి... వాటి వెనక ఎన్నో రహస్యాలు... సెలవుల్లో వాటి గురించి తెలుసుకుందాం.

అంతరిక్షం అందుకుందాం!

అసలు అంతరిక్షం గురించి తెలుసుకోవడమే చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. సూర్యుడు, భూమి, మిగతా గ్రహాలు.. కోట్లకొద్దీ నక్షత్రాలు, గెలాక్సీలు ఉన్నాయి. అవన్నీ మనకు ఎంతో ఆశ్చర్యం కలిగిస్తాయి.



- నక్షత్రాలు ఎలా ఏర్పడ్డాయో తెలుసుకోండి. వాటి వెనుక సైన్స్‌ను అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి.
- అక్కడ కొన్ని గ్రహాలు కూడా ఉంటాయి. నక్షత్రాలతో పోల్చితే భిన్నంగా కనిపించే వాటి పరిమాణాన్ని గమనించండి. ఒకదానితో మరొకటి పోల్చి చూడండి.
- అంతరిక్షాన్ని గురించి వివరాలు తెలిపే పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. అమ్మ, నాన్నతో చెప్పి వాటిని కొనండి. అందులో ఉన్న వివరాలు నోట్ చేసుకోండి.
- మీకు దగ్గర్లో ఉన్న ప్లానెటోరియంను సందర్శించండి. మన దేశం నిర్వహించిన స్పేస్ మిషన్స్ గురించి తెలుసుకోండి.
- అన్నీ చేశాక మీకు అందులో నచ్చిన అంశం తాలూకా మోడల్ తయారుచేయండి. ఉదాహరణకు సూర్య కుటుంబం, భూమి వాతావరణం.. ఇలాంటివన్నమాట.

ఆ విశేషాలన్నీ స్కూల్‌కు వెళ్లాక మీ ఫ్రెండ్స్‌కి చెప్పండి. మీరు చేసిన ప్రాజెక్టును వాళ్లకు చూపించండి. వాళ్లు ఎంత ఆశ్చర్యపోతారో కదూ!

స్విమ్మింగ్‌కి వెళ్తుంటే..



ఈ సమ్మర్‌లో స్విమ్మింగ్‌కు వెళ్లడమంటే భలే హాయిగా ఉంటుంది కదా! పూల్‌లో ఫ్రెండ్స్‌తో కలిసి చక్కర్లు కొడుతుంటే ఆ మజానే వేరు. ఇలాంటప్పుడు కొన్ని పనులు చేస్తే మనం ఇంకా హ్యాపీగా ఉండొచ్చు. అవేంటంటే..

★ కిడ్స్‌కి సరిపోయేంత లోతు ఉన్న పూల్‌లోనే దిగాలి. అంతకంటే లోతుకి దిగకూడదు.
★ ఇన్‌స్ట్రక్టర్ లేదా అమ్మానాన్నల దగ్గరే ఉండాలి. పెద్దలకు అందుబాటులో లేని దూరానికి వెళ్లకూడదు.
★ శుభ్రత పాటించాలి. సన్‌స్క్రీన్ రాసుకోవాలి. స్విమ్మింగ్‌కు అనుకూలమైన దుస్తుల్లోనే నీటిలో దిగాలి.
★ నీళ్లలో దిగి బ్రీత్‌హోల్డింగ్ గేమ్స్ వంటివి ఆడకూడదు. స్నేహితులతో పందేలు కాయడం వంటివి అస్సలు చేయకూడదు.
★ నీళ్ల నుంచి బయటకు వచ్చాక స్నానం చేయాలి. క్లోరిన్ ఒంటి మీద నిలవకుండా శుభ్రంగా ఉండాలి.

ఇవన్నీ చేస్తూ జాగ్రత్తగా ఈతను ఎంజాయ్ చేసేయండి!

ఎక్కడ?

ఇళ్లు లేని ఊళ్లు, నీళ్లు లేని నదులు, బండ్లు లేని రోడ్లు.. ఎక్కడ ఉంటాయో తెలుసా?

ఎవరెవరు?

ఇక్కడ కొందరు స్నేహితులు మీరా, తృప్తి, అజయ్, సమర్, గీత, అక్షర్, జతిన్, కార్తీక్.. సమ్మర్ క్యాంప్‌కి వచ్చారు. వీరిలో మీరా ట్రీహౌస్‌లోపల ఉంది, తృప్తి పెయింటింగ్ వేయట్లేదు. అజయ్ చెట్టు మీద, జతిన్ టైరులో ఉన్నారు. తుమ్మెదలు పట్టేది సమర్, చెట్టు ఎక్కేది అక్షర్ అయితే పెయింటింగ్ వేసేది, పాట పాడేది ఎవరు?



స్నేహితులారా.. ఈ సెలవుల్లో కొత్త కొత్త పనులు చాలా ట్రై చేస్తున్నాం కదా.. ఇవాళ ఓ మంచి ప్రయత్నం చేద్దామా... అదేంటంటే తెలుగులో ఏదైనా బుజ్జి కథ రాసి అందరికీ చూపిద్దాం...

కథ రాద్దామా?

- అమ్మో.. కథే! అని భయపడకండి. గొప్పగొప్ప రచయితలంతా మనలా ముందు భయపడ్డవారే. అసలు మొదలుపెడితే కదా మనకు ఏం వచ్చో తెలిసేది.
- ఓ కాగితం, పెన్ తీసుకోండి. దేని గురించి రాయాలి అనుకుంటున్నారో ఆలోచించండి. కథ, అందులో ఉండాల్సిన పాత్రలు, అవి ఎలా ప్రవర్తిస్తాయి, అసలు దేని గురించి చెప్పాలి అనుకుంటున్నాం.. ఇలా అన్నీ అనుకుని మొదలుపెట్టండి.
- కథ ఎలా వస్తుందో అనే ఆలోచనే వద్దు. ముందు మీకు అనిపించిందంతా రాసేయండి. ఆ మొదటి కాపీని అలాగే భద్రంగా దాయండి. అమ్మానాన్నలకు చూపించి చదవమని చెప్పండి.
- కథలు రాస్తే మనకు కొత్త పదాలు తెలుస్తాయి. వాక్య నిర్మాణం బాగా అలవాటవుతుంది. దీనివల్ల మన ఆలోచనాశక్తి పెరుగుతుంది. సృజనాత్మకత అలవాటవుతుంది.
- ఇంతో కాదండోయ్.. మనం ఇలా రాసిన కథలను ఆన్‌లైన్‌లో పబ్లిష్ చేయడానికి కొన్ని ప్రత్యేకమైన వెబ్‌సైట్లు కూడా ఉన్నాయి!
- వారు మన కథను చదివి, నచ్చితే తీసుకుని ప్రచురిస్తారు. ఇందుకు మనకు కొంత డబ్బు కూడా చెల్లిస్తారు. మనం అలా సంపాదించిన డబ్బును ఎంచక్కా పాకెట్ మనీగా కూడా వాడుకోవచ్చు.



ఏమంటారు..? ప్రయత్నిద్దామా మరి..

ఉపాధ్యాయుల బదిలీలకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తారు. కాకపోతే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల అవసరం చాలా తక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఎస్జీటీలకు ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పిస్తారు. కొంతమంది సబ్జెక్టు టీచర్లకూ ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలుగా అవకాశం ఇస్తారు.

సిద్ధమైన సీనియారిటీ జాబితా

ఉమ్మడి జిల్లాల వారీగా ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను విద్యాశాఖ సిద్ధం చేసింది. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన జీఓ-117కు ప్రత్యామ్నాయంగా ఇప్పటికే పోస్టుల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తిచేశారు. బదిలీలను ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారు.

- మే 31 నాటికి 8 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులు, అయిదేళ్ల సర్వీసు పూర్తయిన హెచ్‌ఎంలకు తప్పనిసరిగా బదిలీ ఉంటుంది.
- రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- గరిష్ఠ సర్వీసు పూర్తయి.. ఐచ్ఛికాలు ఇవ్వకపోతే.. ప్రక్రియ పూర్తయిన తర్వాత మిగిలిన స్థానాలకు బదిలీ చేస్తారు. అవసరమైతే చర్యలు కూడా తీసుకుంటారు.
- ఆదర్శ పాఠశాలలకు ఈ చట్టం వర్తించదు.
- పాఠశాలల కేటగిరీల వారీగా పాయింట్లు ఇస్తారు. ఏడాదికి కేటగిరీ-1కు ఒకటి, కేటగిరీ-2కు రెండు, కేటగిరీ-3కు మూడు, కేటగిరీ-4లో ఉన్న వారికి అయిదు పాయింట్లు ఇస్తారు. హెచ్‌ఆర్‌ఏ, రోడ్డు రవాణా కారణంగా ఈ కేటగిరీల్లో మార్పులుంటే పాయింట్లలోనూ మార్పు చేస్తారు.
- ఏడాదికి ఒక 0.5 చొప్పున సర్వీసుకు పాయింట్లు ఇస్తారు. మే 31 నాటికి ఏడాదిగా పరిగణిస్తారు.
- స్పౌజ్, 40 ఏళ్లు దాటిన అవివాహిత, దివ్యాంగులు, గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, వితంతువు, క్యాన్సర్ తదితర వ్యాధులతో బాధపడేవారికి, ఉద్యోగిపై ఆధారపడి ఉన్నవారికి ప్రత్యేక పాయింట్లు ఇస్తారు.
- హేతుబద్ధీకరణలో పోస్టు కోల్పోయే టీచర్లు రేషనలైజేషన్ పాయింట్లు లేదా పాత స్టేషన్ పాయింట్లలో ఏదో ఒక దాన్ని తీసుకోవాల్సి ఉంటుంది.
- మే 31 నాటికి రెండేళ్ల సర్వీసు మాత్రమే ఉండే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. కావాలనుకుంటే వారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- బదిలీలపై గ్రీవెన్స్ తర్వాతే కోర్టుకు వెళ్లాలి. గ్రీవెన్స్‌కు వివిధ స్థాయిల్లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.
- ఇద్దరు ఉపాధ్యాయులకు ఒకే పాయింట్లు ఉంటే సీనియారిటీని ప్రామాణికంగా తీసుకుంటారు. ఆ తర్వాత వయసును పరిశీలిస్తారు.
- ఏవరైనా అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే నెలకు ఒకటి చొప్పున గరిష్ఠంగా 10 మైనస్ పాయింట్లు ఉంటాయి.

ప్రకృతిని ఆస్వాదించే చోటే ఆతిథ్యం!

(మొదటి పేజీ తరువాయి)

వంటమూరు, మగద, కురిడి, తాజంగి గ్రామాల్లో 48 ఇళ్లను గుర్తించారు. వీటిలో పర్యాటకులకు వసతులు కల్పించి అందుబాటులోకి తీసుకురానున్నారు.

- కోనసీమ అందాలు తిలకించే వారి కోసం దిండితోపాటు పాశర్లపూడి, మలికిపురం, తూర్పుపాలెం గ్రామాల్లో 20 ఇళ్లు గుర్తించారు. వీటిలో పది వరకు పాతకాలం నాటి హెరిటేజ్ గృహాలు ఉన్నాయి.
- తిరుపతి, విశాఖపట్నం, విజయవాడలో 90 ఇళ్లను గుర్తించారు. వీటిలో సగం ఇళ్లు పూర్తి సదుపాయాలతో అందుబాటులో ఉన్నాయి. మిగతా వాటిలో సదుపాయాలు కల్పించాలి. తిరుపతిలో 561 ఇళ్లు ఇప్పటికే ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో పర్యాటకుల అవసరాలకు అందిస్తున్నారు. వాటిని హోం స్టే పరిధిలోకి తీసుకురానున్నారు.

నవీకరణ పనులకు మెప్మా, సెర్ప్ నుంచి రుణాలు

- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గుర్తించిన ఇళ్ల నవీకరణకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ల నుంచి రుణాలు అందించనున్నారు. వీటితో ఇళ్లలో పర్యాటకులకు తగిన సదుపాయాలు కల్పించాలి.
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించినందున హోం స్టే పరిధిలోని ఇళ్లలో వినియోగించే విద్యుత్తు ఛార్జీలపైనా ప్రభుత్వం రాయితీ అందించనుంది.
- పూర్తి సదుపాయాలతో ఇళ్లు అందుబాటులోకి వచ్చాక వాటి యజమానులు, ఎయిర్‌బీఎన్‌బీ, ఓయో హోమ్స్, యాత్రధామ్, మాస్టర్ కార్డు వంటి ప్రఖ్యాత ఆతిథ్య సంస్థలతో ఒప్పందం జరగనుంది.
- పర్యాటకులు ఆతిథ్య సంస్థల పోర్టల్ ద్వారా హోం స్టేలో వసతి కోసం ముందుగా బుక్ చేసుకోవచ్చు.

ప్రత్యేక పాలసీ తీసుకొచ్చేందుకు సన్నాహాలు

రాష్ట్రంలో 'హోం స్టే'ను దశల వారీగా ముఖ్యమైన అన్ని ప్రాంతాలకూ విస్తరించాలన్న యోచనతో ప్రభుత్వం ఉంది. పర్యాటకుల తాకిడి దృష్ట్యా రాబోయే ఐదేళ్లలో 50 వేల అదనపు గదులు అవసరమని అంచనా వేస్తోంది. కొత్త హోటళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తూనే... మారుమూల గ్రామాల్లోనూ 'హోం స్టే'ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక పాలసీ తీసుకురావాలన్న సీఎం ఆదేశాలపై పర్యాటకాభివృద్ధి సంస్థ సన్నాహాలు చేస్తోంది. ఇతర రాష్ట్రాల్లో హోం స్టే ఎలా అమలవుతోంది, కల్పిస్తున్న రాయితీలు తదితర అంశాలపై పరిశీలన చేసి నెలాఖరులోగా పాలసీని సిద్ధం చేయాలని అధికారులు భావిస్తున్నారు.

తీరంలో పోటెత్తుతున్న పెట్టుబడులు!

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటుకు.. ఏపీ మారిటైం బోర్డు ఇటీవల ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన(ఈవోఐ) ఇచ్చింది. విదేశీ దిగ్గజ కంపెనీలతో పాటు.. దేశీయ సంస్థల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. రాష్ట్రంలో యూనిట్ల ఏర్పాటుకు 21 సంస్థల నుంచి ప్రతిపాదనలు అందాయి. వాటిలో కనీసం 10 సంస్థల నుంచి పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మారిటైం రంగంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

భూముల పరిశీలన పూర్తి

మారిటైం బోర్డు ఇచ్చిన ఈవోఐ ప్రకటనకు స్పందించిన కొన్ని సంస్థల ప్రతినిధులు యూనిట్ల ఏర్పాటుకు అనువైన భూములను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం పోర్టుల పరిసర ప్రాంతాలతో పాటు.. మరికొన్ని చోట్లా పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటుకు గోవా పోర్టు లిమిటెడ్ ఇప్పటికే ఆసక్తి చూపింది. పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ ప్రతినిధులు... అధికారులతో సాగిస్తున్న సంప్రదింపులు కొలిక్కి వచ్చాయి. స్థలం ఎంపిక కూడా దాదాపు పూర్తయినట్లు తెలిసింది. కొన్ని విదేశీ కంపెనీల ప్రతినిధులూ భూముల పరిశీలనకు వచ్చినట్లు అధికారులు చెప్పారు.

క్లస్టర్ల అభివృద్ధిపై దృష్టి...

బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ పరిధిలోని మోటుమర్రి దగ్గర పోర్టు ఆధారిత క్లస్టర్ అభివృద్ధికి కొన్ని సంస్థలు ఆసక్తి చూపాయి. అందుకు అనువైన ప్రాంతాన్ని అధికారులు గుర్తించారు. రాష్ట్రంలో పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా పోర్టు ప్రాక్సిమల్ ఏరియా అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న.. నిర్మాణంలో ఉన్న వాటితో కలిపి ఆరు పోర్టుల పరిధిలో 8 పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయాలని ఏపీ మారిటైం బోర్డు నిర్ణయించింది. వాటిలో గోదాములు, లాజిస్టిక్ సదుపాయాల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్‌ను మారిటైం బోర్డు తయారు చేయిస్తోంది. పోర్టు నుంచి 25 కి.మీ. పరిధిలో ప్రాక్సిమల్ నగరాలను అభివృద్ధి చేయాలని భావిస్తోంది. అందులో షిప్ బిల్డింగ్, షిప్ బ్రేకింగ్ యూనిట్లు, ఆధునిక షిప్‌యార్డులు, ఇండస్ట్రియల్ క్లస్టర్లు, లాజిస్టిక్ సెంటర్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. వాటి ఏర్పాటును ప్రోత్సహించడం ద్వారా మారిటైం రంగం అభివృద్ధికి అనువైన వాతావరణాన్ని తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచన.

సైనిక సత్తా చాటాం

(మొదటి పేజీ తరువాయి)

పోరులే లక్ష్యంగా మన దేశంపై దాడులు చేసింది. పౌర ప్రాంతాలు, ఆలయాలు సహా మతపరమైన ప్రదేశాలపైనా దాడులకు ప్రయత్నించింది. మన సైన్యం శౌర్య పరాక్రమాలను ప్రదర్శించడమే కాకుండా సంయమనాన్ని పాటించింది. భారత్‌లో ఉగ్రచర్యలకు పాల్పడితే పర్యవసానాలు ఎలా ఉంటాయనేది ప్రపంచమంతా చూసింది. ఇది సరికొత్త భారతదేశమని, ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు దీటైన జవాబును సరిహద్దుకు రెండువైపులా ఇస్తామని ప్రధాని మోదీ స్పష్టంచేశారు" అని రాజ్‌నాథ్ చెప్పారు. ఉగ్రవాదంపై మనం చర్యలు తీసుకునేటప్పుడు ఉగ్రవాదులు, వారి పోషకులు దేశం అవతల ఉన్నా కూడా వారికి రక్షణ ఉండదని రుజువు చేశామని చెప్పారు. బ్రహ్మోస్ కేవలం ఆయుధం మాత్రమే కాదని.. అది సైనిక దళాల బలాన్ని, దేశ సరిహద్దుల్ని కాపాడుకునే సంకల్పాన్ని చాటే సందేశమని చెప్పారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ క్షిపణులను భారత్ ఉపయోగించిందని వెల్లడించారు. ఈ క్షిపణుల కున్న శక్తి ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. దీని ప్రభావం గురించి తెలియని వారెవరైనాఉంటే.. పాకిస్థాన్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఉగ్రవాదం అనేది కుక్కతోక లాంటిదని.. దానిని సరిచేయాలంటే వారి సొంత భాషలోనే బదులివ్వాలని పేర్కొన్నారు.

కశ్మీర్‌పై కలిసి పనిచేద్దాం: అమెరికా

భారత్-పాకిస్థాన్ దేశాలతో కలిసి కశ్మీర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. సంఘర్షణతో మరణాలు, విధ్వంసం తప్ప ఏమీ ఉండదనేది రెండు దేశాల నాయకత్వాలు అర్థం చేసుకున్నందుకు గర్వంగా ఉందని 'ట్రూత్ సోషల్' మాధ్యమంలో ఆయన వ్యాఖ్యానించారు. 'ఘర్షణలు ఇంకా కొనసాగి ఉంటే లక్షలమంది అమాయక ప్రజలు చనిపోవచ్చు. కాల్పుల విరమణపై చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవడానికి అమెరికా సాయం చేసినందుకు నాకు గర్వంగా ఉంది. మీ రెండు దేశాల నాయకత్వాలకు దైవం ఆశీస్సులు ఉంటాయి. మనం కేవలం చర్చలు జరపడమే కాదు.. రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకుందాం. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న కశ్మీర్ విషయంలో పరిష్కారాన్ని అన్వేషించేందుకు మీతో కలిసి పనిచేస్తా' అంటూ పోస్ట్ చేశారు. ట్రంప్ తన తొలివిడత పాలనలో కూడా కశ్మీర్ విషయంలో జోక్యం చేసుకోవాలని అనుకున్నారు. అప్పటి భారత్, పాకిస్థాన్ ప్రధానుల వద్ద దానిగురించి ప్రస్తావించారు. తృతీయ పక్షం జోక్యాన్ని భారత్ తిరస్కరించింది. ఇప్పుడు మరోసారి ప్రతిపాదించారు. కశ్మీర్ వివాద పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ట్రంప్ చెప్పడాన్ని పాక్ ఆహ్వానించింది.



దిల్లీలో ఆదివారం అత్యున్నతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ. చిత్రంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్, త్రిదళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తదితరులు

డోభాల్‌తో మాట్లాడిన చైనా విదేశాంగ మంత్రి

విభేదాలన్నింటినీ భారత్-పాక్‌లు చర్చల ద్వారా పరిష్కరించుకుని, దీర్ఘకాలం పాటు కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటాయని చైనా ఆకాంక్షించింది. రెండు దేశాల ప్రాథమిక ప్రయోజనాల పరిరక్షణకు, అంతర్జాతీయ సమాజ ఆకాంక్షలు నెరవేరడానికి ఇది అవసరమని పేర్కొంది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ ఆదివారం భారత జాతీయ భద్రతా సలహాదారుడు అజీత్ డోభాల్‌తో మాట్లాడారు. రెండుదేశాలూ సంయమనంతో వ్యవహరిస్తూ చర్చలు, సంప్రదింపుల ద్వారా విభేదాలను పరిష్కరించుకుంటాయని వాంగ్‌యీ ఆశాభావం వ్యక్తంచేశారు. భారత్, పాక్‌లు రెండూ తమకు సరిహద్దు దేశాలేనని గుర్తుచేశారు. పహల్గాం ఘటన సహా అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని చైనా వ్యతిరేకిస్తుందన్నారు. యుద్ధం చేయడానికి తాము అనుకూలం కాదని, పహల్గాం దాడిలో వాటిల్లిన ప్రాణనష్టం తర్వాత ఉగ్రవాదులపై పోరాడాల్సి వచ్చిందని డోభాల్ ఈ సందర్భంగా చెప్పారు. పాక్ ప్రధాని షెహబాజ్‌తోనూ వాంగ్‌యీ మాట్లాడారు.

కాల్పుల విరమణ.. ఉద్రిక్తత తగ్గింపుపై భేటీ

కాల్పుల విరమణ, అనంతర పరిస్థితిపై ఇరు దేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల 'సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్' (డీజీఎంవో)లు పాల్గొంటారు. కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్తత తగ్గించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష

శనివారం రాత్రి పాక్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడిన తర్వాత తొలిసారిగా ప్రధాని మోదీ తర్వాత ఆదివారం తన నివాసంలో అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్, త్రివిధ దళాధిపతులతో సమీక్ష జరిపారు. సరిహద్దుల్లో తాజా పరిస్థితిని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజీత్ డోభాల్ వివరించారు.

విరమణకు కట్టుబడి ఉన్నాం: పాక్

భారత్‌తో కాల్పుల విరమణకు విశ్వాసపూర్వకంగా కట్టుబడి ఉన్నామని పాక్ తెలిపింది. తమ దళాలు బాధ్యత, సంయమనాలతో వ్యవహరిస్తున్నాయంది.

చావు దెబ్బకొట్టాం

"ఆపరేషన్ సిందూర్ ద్వారా సైనికంగా, రాజకీయంగా, మానసికంగా పాక్‌ను దెబ్బకొట్టాం. మన చేతిలో పాకిస్థాన్ ఓటమి పాలైంది. పాక్ వైమానిక స్థావరాలపై మనం దాడి చేయడంతో ఇక పోరాడలేమని దాయాది దేశం తెలుసుకుంది" అని భారత విదేశీ వ్యవహారాల శాఖ మీడియాకు వివరించింది. భారత్ జరిపిన దాడుల్లో రహిమ్యార్‌ఖాన్ వైమానిక స్థావర రన్‌వే ధ్వంసమైనట్లు తెలిపింది. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిలేదని స్పష్టం చేసింది. "బహావల్‌పుర్‌లోని జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రధాన కార్యాలయాన్ని నేలమట్టం చేశాం. బహావల్‌పుర్‌తోపాటు మురీద్కే, ముజఫర్‌బాద్ ఉగ్రవాద కేంద్రాలను నేలమట్టం చేశాం. ఈ నెల 10న పాకిస్థాన్ దాడికి ప్రతిస్పందనగా అగ్నివర్షం కురిపించాం. మొత్తం 8 స్థావరాలు లక్ష్యంగా దాడులు చేశాం" అని తెలిపింది. 'కశ్మీర్ విషయంలో మనకు స్పష్టమైన వైఖరి ఉంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను మన దేశానికి అప్పగించడం మినహా మరో విషయం లేదు. ఉగ్రవాదుల అప్పగింతపై వాళ్లు మాట్లాడితే మేమూ మాట్లాడతాం. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదు' అని తెలిపింది. అణుయుద్ధం వరకు ఏ దశలోనూ వెళ్లలేదని స్పష్టంచేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు తిరిగి అప్పగించడం గురించి తప్పిస్తే కశ్మీర్ అంశంలో పాక్‌తో ఎలాంటి చర్చలు ఉండవని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కశ్మీర్ అంశంలో ఎవరి మధ్యవర్తిత్వమూ అవసరం లేదని తేల్చిచెప్పాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం కొనసాగినన్నాళ్లూ సింధూ జలాల ఒప్పందం నిలిచిపోతుందని తెలిపాయి.

ఇస్లామాబాద్ వరకు స్థావరాలు నాశనం

ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించామని భారత సైన్యం తెలిపింది. అత్యాధునిక పాక్ యుద్ధ విమానాలను నేలకూల్చామని, ఇస్లామాబాద్ వరకు ఉన్న ఆ దేశ కీలక సైనిక స్థావరాలను నాశనం చేశామని పేర్కొంది. దాదాపు 100కు పైగా ఉగ్రవాదులను హతమార్చామని, ఇందులో పుల్వామా పేలుడుకు, ఐసీ 814 విమానం హైజాక్‌కు పాల్పడిన నిందితులూ ఉన్నారని వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌లో సైన్యం సాధించిన విజయాలను ఎయిర్ మార్షల్ ఎ.కె. భారతి, వైస్ అడ్మిరల్ ఎ.ఎన్. ప్రమోద్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ వివరించారు.

'రఫేల్'పై సమాధానం దాటవేత

పాక్ విమానాలను నేల కూల్చామని, అయితే ఆ సంఖ్య ఎంత అన్నది చెప్పడానికి ఎయిర్ మార్షల్ ఎ.కె.భారతి నిరాకరించారు. "మన సరిహద్దు లోపలికి పాక్ యుద్ధవిమానాలను రాకుండా నిరోధించాం. కాబట్టి వాటి శకలాలు మా దగ్గర లేవు. కాకపోతే కచ్చితంగా కొన్ని విమానాలను కూల్చాం" అని తెలిపారు. రఫేల్ యుద్ధ విమానాలేమైనా కూలాయా అని ప్రశ్నకు నేరుగా సమాధానం ఇవ్వలేదు. "సైనిక పోరాటంలో నష్టాలు సహజం. మేం యుద్ధక్షేత్రంలో ఉన్నాం. నష్టాలు సహజం. లక్ష్యాన్ని సాధించామా లేదా అన్నదే ప్రశ్న అయితే మేం సాధించామని గర్వంగా చెబుతా. మా పైలట్లందరూ సురక్షితంగా తిరిగి వచ్చారు" అని ఎయిర్ మార్షల్ చెప్పారు.

దాడులు ఆపమని డీజీఎంవో ప్రాధేయపడ్డారు

పాకిస్థాన్‌కు జరిగిన నష్టాలపై డీజీఎంవో రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ 35 నుంచి 40 మంది పాక్ సైనికులు చనిపోయారని తెలిపారు. రఫీక్, మురిద్, చక్లాలా, రహీం యార్ ఖాన్, సుక్కూర్, చునియన్ సైనిక స్థావరాలపై భీకర దాడుల తర్వాత పాకిస్థాన్ దారికి వచ్చిందని, ఆ దేశ డీజీఎంవో ఫోన్ చేసి దాడులు ఆపమని ప్రాధేయ పడ్డారని లెఫ్టినెంట్ జనరల్ ఘాయ్ తెలిపారు. మనవైపు నుంచి ఐదుగురు సైనికులు అమరులయ్యారని చెప్పారు. దాడులకు ముందు, దాడుల తర్వాత పాక్ సైనిక స్థావరాల ఉపగ్రహ చిత్రాలను విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు.

సంసిద్ధంగా నౌకాదళం

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నౌకాదళం కూడా ఆరేబియా సముద్రంలో పూర్తి సంసిద్ధతతో ఉందని వైస్ అడ్మిరల్ ప్రమోద్ తెలిపారు. పహల్గాం దాడి తర్వాత వెంటనే అప్రమత్తమయ్యామని, బలగాలతో పాటు జలాంతర్గాములను సముద్రంలో మోహరించామని తెలిపారు. అవసరమైతే కరాచీ పోర్టు కూడా తమ లక్ష్యాల్లో ఒకటని పేర్కొంది. తాత్కాలిక కాల్పుల విరమణ అవగాహన నేపథ్యంలో పాకిస్థాన్ నౌకాదళ, వైమానిక స్థావరాలపై నిఘా పెట్టామని.. ఈసారి పాక్ ఉల్లంఘనలకు పాల్పడితే భారత్ ఏం చేయనుందో వారికి తెలుసునని ప్రమోద్ పేర్కొన్నారు.

EENADU Vol: 51, Issue: 272 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

రాష్ట్రంలో నౌకల మరమ్మతు కేంద్రం!

- దుగరాజపట్నంలో ఏర్పాటుకు పరిశీలన
- రేపు రాష్ట్రానికి కేంద్ర బృందం రాక
- సీఎంతో సమావేశం.. ఆపై కీలక నిర్ణయం

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో సముద్రయాన రంగంలో భారీ ప్రాజెక్టు ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో షిప్ బ్రేకింగ్ యూనిట్ ఏర్పాటు ప్రతిపాదనకు కేంద్రం నుంచి సూచనప్రాయంగా అనుమతి లభించింది. దీనిపై కూటమి ప్రభుత్వంతో చర్చించేందుకు కేంద్ర నౌకాయాన, జల రవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఆధ్వర్యంలో ఓ బృందం మంగళవారం రాష్ట్రానికి రానుంది. సీఎం చంద్రబాబుతో సమావేశం కానుందని ఉన్నతాధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు సుమారు రూ.3 వేల కోట్లు అవుతుందని అంచనా.

మరమ్మతులకు పొరుగు రాష్ట్రాలే ఆధారం

రాష్ట్రంలో నౌకల మరమ్మతులు, నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ లేదు. ఈ సేవలకు కేరళలోని కొచ్చిన్, మహారాష్ట్రలోని ముంబయి షిప్ యార్డులతో పాటు.. గుజరాత్‌లో ప్రైవేటు షిప్ యార్డులపై ఆధారపడాల్సి వస్తోంది. దేశంలో ఏటా సుమారు 300 నౌకలు రీసైక్లింగ్ కోసం వస్తున్నాయని అంచనా. అందుకే ప్రపంచ స్థాయి ప్రమాణాలతో షిప్ మరమ్మతుల కేంద్రం, రీసైక్లింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదన పంపింది. తూర్పు తీరంలో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని భావిస్తోంది. రాష్ట్రంలో విశాఖపట్నం మేజర్ పోర్టుతో పాటు గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ డీప్ వాటర్, కాకినాడ యాంకరేజ్, రవ్వ పోర్టులు ఉన్నాయి. కొత్తగా మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ ఎస్ఈజడ్ పోర్టులు, 10 చేపల రేవులూ అందుబాటులోకి రానున్నాయి. వీటి నిర్వహణకు అవసరమైన వాతావరణం కల్పించాలన్నది ప్రభుత్వ ఆలోచన. పైగా.. విభజన చట్టం మేరకు దుగరాజపట్నంలో కేంద్రం ఓడరేవు నిర్మించాలి. ప్రస్తుతం అక్కడ పోర్టు అవసరం లేదు. దానికి ప్రత్యామ్నాయంగానే షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర అనుమతి కోరింది.

జల రవాణా పెంచే దిశగా

విశాఖ మేజర్ పోర్టుతో పాటు.. 5 నాన్ మేజర్ పోర్టుల ద్వారా ఏటా సుమారు 117.62 మిలియన్ టన్నుల సరకు రవాణా జరుగుతోంది. దేశంలో పోర్టుల ద్వారా జరిగే సరకు రవాణాలో రాబోయే 2 దశాబ్దాలలో రాష్ట్ర వాటా 25% సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనికోసం పోర్టుల మౌలిక సదుపాయాల కల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. కొత్త పోర్టులూ వస్తే కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది.

పర్యావరణానికి ఇబ్బంది లేకుండా..

దుగరాజపట్నంలో షిప్ బ్రేకింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల పర్యావరణ ఇబ్బందులు ఉండబోవని విశాఖ పోర్టు ఇచ్చిన ఫీజుబులిటి నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ప్రాంతంలో గతంలో ఓడరేవు నిర్వహించారని, అందువల్ల నౌకల రాకపోకలకు ఇబ్బందులు ఉండబోవని తెలిసింది. సమీపంలోని పులికాట్ సరస్సు, శ్రీహరికోట అంతరిక్ష కేంద్ర కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా నిర్మాణాలు చేయడానికి ఉన్న అవకాశాలనూ నివేదికలో ప్రస్తావించారు. ఈ నివేదిక ఆధారంగా మంగళవారం చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

18న రోదసిలోకి రీశాట్-1బి

శ్రీహరికోట, న్యూస్‌టుడే: షార్ నుంచి ఈ నెల 18న ప్రయోగించనున్న రీశాట్-1బి (ఈఓఎస్-09) ఉపగ్రహం రక్షణశాఖకు వెన్నుదన్నుగా నిలవనుంది. ఇప్పటికే ఇస్రో రీశాట్ సీరిస్‌లో ఆరు ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగా.. తాజాగా ఏడో ఉపగ్రహాన్ని పీఎస్ఎల్‌వీ-సి61 ఎక్స్ఎల్ వాహకనౌక అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది. దీనిని 529 కి.మీ. ఎత్తులో శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టనున్నారు. ముంబయి దాడుల తర్వాత సరిహద్దు భద్రత కోసం 2009 నుంచి రీశాట్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగిస్తోంది. ప్రస్తుతం కక్ష్యలో రీశాట్-1, రీశాట్-1ఎ, రీశాట్-2, రీశాట్-2బి, రీశాట్-2బీఆర్1, రీశాట్-2బీఆర్2 ఉన్నాయి. 1,710 కిలోల బరువున్న ఈవోఎస్-09 ఉపగ్రహం.. సీ-బ్యాండ్ సింథటిక్ ఎపర్చర్ రాడార్ సాయంతో భారత భూభాగాన్ని, సరిహద్దులను నిశితంగా పరిశీలిస్తుంది.





శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ ◆ శ్రీవారి ఆలయం ఎదుట ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దంపతులు

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తులకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం, తితిదే అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

సాంకేతిక ఫలాలు అందరికీ చేరితేనే సార్థకత

- జాతీయ సాంకేతిక విజ్ఞాన దినోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- పలువురికి ఏఎస్‌టీసీ అవార్డుల ప్రదానం



ఏఎస్‌టీసీ జీవిత సాఫల్య, ఎక్స్‌లెన్స్, సైన్స్ పాపులరైజేషన్ అవార్డు గ్రహీతలతో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఏఐజీ ఆసుపత్రుల ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి తదితరులు

ఈనాడు, హైదరాబాద్: పరిశోధనలు, సాంకేతికత ఫలితాలు అందరికీ చేరినప్పుడే వాటికి సార్థకత అని.. ఆ దిశగా కృషి చేయాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. ఐఐసీటీ, అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ (ఏఎస్‌టీసీ), నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా(ఎన్ఏఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో సాంకేతిక విజ్ఞాన దినోత్సవం, ఏఎస్‌టీసీ వార్షిక సమావేశం ఆదివారం ఐఐసీటీ ఆడిటోరియంలో జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన గవర్నర్ మాట్లాడుతూ... ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం శాస్త్ర, పరిశోధనలను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. సీఎస్ఐఆర్ వంటి పరిశోధన సంస్థలు సమాజసేవలో కొత్త పుంతలు తొక్కుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఎస్‌టీసీ ప్రచురించిన తాజా సంచికలను గవర్నర్ ఆవిష్కరించారు.

జీవనసాఫల్య పురస్కారాలు..

సాంకేతిక విజ్ఞాన దినోత్సవం సందర్భంగా డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, నైపర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ అహ్మద్ కమాల్, డీఆర్‌డీవో ఆర్ఏసీ మాజీ ఛైర్మన్ డాక్టర్ డి.ఎన్. రెడ్డి, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డి. రఘునాథరావులకు ఏఎస్‌టీసీ జీవన సాఫల్య పురస్కారాలను గవర్నర్ ప్రదానం చేశారు. ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, నీరి డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటమోహన్, ఎన్ఆర్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ చౌహాన్, మిధాని సీఎండీ డాక్టర్ ఎస్.వి.ఎస్.నారాయణ మూర్తి, సీసీఎంబీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.మంజులారెడ్డి, ఆచార్య కె.ఆర్.ఎస్.సాంబశివరావు, ఆచార్య జి.పి.రాజశేఖర్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎక్స్‌లెన్స్ అవార్డులను అందుకున్నారు.

'ఈనాడు' పాత్రికేయుడికి సైన్స్ పాపులరైజేషన్ అవార్డు

తెలుగు సైన్స్ జర్నలిస్టు, ఈనాడు చీఫ్ సబ్ ఎడిటర్ కంభంపాటి సురేష్‌తో పాటు ఎన్‌డీటీవీ సైన్స్ ఎడిటర్ పల్లవ బగ్లా, ఏఎస్‌టీసీ కమ్యూనికేషన్స్ రచయితలు డాక్టర్ టి.ఎం.బాబు, డాక్టర్ ఆర్.బి.ఎన్. ప్రసాద్, డాక్టర్ హరినారాయణ, హిందూ జర్నలిస్ట్ ఎం.సోమశేఖర్, ఉర్దూ జర్నలిస్ట్ రత్నా చోత్రాని, సైన్స్ రచయిత సర్వేశ్వర శర్మకు గవర్నర్ సైన్స్ పాపులరైజేషన్ అవార్డులను ప్రదానం చేశారు. ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కుమార్, ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్, ఎన్ఏఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు, ఏఎస్‌టీసీ అధ్యక్షులు మాణిక్యాంబ, కార్యదర్శి నరసింహారావు తదితరులు కార్యక్రమంలో మాట్లాడారు.

పేగుల్లో మంచి బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటే ఆరోగ్యం: డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి

మన పేగుల్లో మంచి బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, ఏఐజీ ఆసుపత్రుల ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆయన 'గట్ మైక్రోబయోమ్- ది సైన్స్ అండ్ అప్లికేషన్' అంశంపై ప్రసంగించారు. సహజ ప్రసవాలు, ఏడాది పాటు తల్లిపాలు పట్టడం ద్వారా పిల్లల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుందని చెప్పారు. సిజేరియన్, యాంటీబయోటిక్స్ వాడకంతో చెడు బ్యాక్టీరియా పెరుగుతుందని తెలిపారు. మంచి ఆహారంతో పాటు శారీరక వ్యాయామంతో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేసుకోవచ్చని వివరించారు. టూత్‌పేస్ట్‌లో టైటానియం డయాక్సైడ్ ఉంటుందని.. ఇది పేగుల్లో బ్యాక్టీరియాను పాడు చేస్తుందని.. ఇది లేని టూత్‌పేస్ట్ వాడాలని సూచించారు.





తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, సైన్స్ పాపులరైజేషన్ అవార్డు అందుకుంటున్న 'ఈనాడు' పాత్రికేయుడు కంభంపాటి సురేష్ (కుడి నుంచి ఎడమకు)

వేదికపై స్పృహ తప్పిన నటుడు విశాల్



విశాల్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న సహాయకులు


చెన్నై, న్యూస్‌టుడే: సినీ నటుడు విశాల్ ఓ కార్యక్రమంలో వేదికపై స్పృహ తప్పి పడిపోయారు. విల్లుపురం జిల్లా కూవాగంలోని కూత్తాండవర్ ఆలయంలో జరుగుతున్న చిత్తిరై వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి ట్రాన్స్‌జెండర్లకు నిర్వహించిన 'మిస్ కూవాగం 2025' పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఉన్నట్టుండి వేదికపై స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే ప్రథమ చికిత్స అందించడంతో కోలుకున్నారు. అక్కడే ఉన్న మాజీ మంత్రి పొన్ముడి ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళ్లారు.. ఇలాగే కొన్ని నెలల కిందట ఓ చిత్రం ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న విశాల్ చేయి వణుకుతూ కనిపించడంతో అప్పట్లో ఆయన ఆరోగ్య పరిస్థితిపై పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

'ఆకాశ్' లక్ష్యం.. ఇప్పుడు నెరవేరుతున్నట్లుంది!

- ఆ క్షిపణి ప్రాజెక్ట్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ప్రహ్లాద రామారావు

ఈనాడు, బెంగళూరు: డీఆర్‌డీవో శాస్త్రవేత్తగా తాను పాల్గొన్న ప్రాజెక్టుల్లో ఎంతో కీలకమైన 'ఆకాశ్' లక్ష్యం ఇప్పుడు నెరవేరుతున్నట్లు అనిపిస్తోందని ఈ ప్రాజెక్ట్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ప్రహ్లాద రామారావు అన్నారు. భారత్‌పై పాకిస్థాన్ ప్రయోగించిన డ్రోన్లను సమర్థంగా నిలువరించిన క్షిపణుల్లో ఆకాశ్ కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. సరిగ్గా 45 ఏళ్ల కిందట భారత మిసైల్ మ్యాన్, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేతృత్వంలో ఆకాశ్ క్షిపణి ప్రాజెక్టుకు యువ డైరెక్టర్‌గా నియమితులైన రామారావు.. ఆపై 15 ఏళ్ల పాటు భారత సైన్యానికి అవసరమైన యుద్ధ వ్యవస్థల తయారీలో పాల్గొన్నారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో ఆకాశ్ క్షిపణి కొనసాగిస్తున్న విజయ పరంపరపై ఆదివారం ఆయన బెంగళూరులో హర్షం వ్యక్తం చేస్తూ మాట్లాడారు.

కలాం లాంటి వారు అవసరం: అబ్దుల్ కలాం వంటివారు మరో పది మంది ఉంటే ఆర్‌అండ్‌డీలో విప్లవాత్మక మార్పులు తేగలమని రామారావు పేర్కొన్నారు. 'ప్రస్తుతం దేశంలో వ్యక్తిగతమైన ప్రతిభ ఉంది. భారత్ వంటి పెద్ద దేశానికి అవసరమైన వ్యూహాత్మక వ్యవస్థలు తయారు చేయాలంటే ప్రస్తుతం కలాం లాంటి వారు పది మంది అవసరం. ఆకాశ్ ప్రాజెక్టులో చేరే సమయంలో నా వయసు 34 ఏళ్లే. ఈ ప్రాజెక్టు మాకు అప్పగించినప్పుడు మేం దాన్ని సవాల్‌గా తీసుకున్నాం. స్వదేశీ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను ముందుగా తయారు చేసి, ఆపై ఆకృతులను పలు మార్లు మార్చాం. అలా 15 ఏళ్ల తర్వాత సైన్యానికి అప్పగించే పూర్తి స్థాయి డిజైన్ సిద్ధమైంది. ప్రస్తుతం యువ శాస్త్రవేత్తలు ఎంతో పరిణితి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ఇప్పటి క్షిపణులు కేవలం అయిదేళ్లలో సిద్ధమవుతున్నాయంటే అందుకు ఆకాశ్ వంటి గట్టి పునాదులే కారణం. గడిచిన 25 ఏళ్లలో మనం సాంకేతికతలో ఎంతో ప్రగతి సాధించాం. ప్రస్తుత తరం ఎన్నో లక్ష్యాలతో ఈ రంగంలో అడుగుపెడుతోంది. వారికి సరైన మార్గదర్శకత్వం అవసరం" అని తెలిపారు.



కాలం - పని

ముఖ్యాంశాలు

- A ఒక పనిని n రోజుల్లో పూర్తి చేస్తే, 1 రోజులో చేసే పని $\frac{1}{n}$
- A ఒకరోజు చేసే పని $\frac{1}{n}$ అయితే, A ఆ పనిని n రోజుల్లో పూర్తి చేస్తాడు.
- కాలం, పని విలోమానుపాతంలో ఉంటాయి. అంటే ఒక పనిని A 4 రోజుల్లో, B అదే పనిని 6 రోజుల్లో పూర్తి చేస్తే, A 6 యూనిట్ల పని, B 4 యూనిట్ల పని చేస్తారు.

MDTW Formula:

M_1 వ్యక్తులు W_1 పనిని T_1 కాలంలో D_1 రోజుల్లో పూర్తి చేశారు. M_2 వ్యక్తులు W_2 పనిని T_2 కాలంలో D_2 రోజుల్లో పూర్తి చేశారు. అయితే వీటి మధ్య సంబంధం..

$$M_1D_1T_1W_1 = M_2D_2T_2W_2$$

మాదిరి ప్రశ్నలు

1. A ఒక పనిని 10 రోజుల్లో, B అదే పనిని 15 రోజుల్లో పూర్తి చేస్తారు. అయితే ఇద్దరూ కలిసి ఆ పనిని ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారు?

1) 25 2) 1 3) 5 4) 6

సాధన: A ఒక రోజులో చేసే పని $= \frac{1}{10}$

B ఒక రోజులో చేసే పని $= \frac{1}{15}$

ఇద్దరూ కలిసి ఒక రోజులో చేసే పని

$$= \frac{1}{10} + \frac{1}{15} = \frac{3+2}{30} = \frac{5}{30} = 6$$

A, Bలు కలిసి పని పూర్తి చేసేందుకు పట్టే కాలం = 6 రోజులు

సంక్షిప్త పద్ధతి:

A ఒక పనిని X రోజుల్లో, B అదే పనిని Y రోజుల్లో పూర్తి చేస్తే, ఇద్దరూ కలిసి $\frac{X \times Y}{X+Y}$ రోజుల్లో పూర్తి చేస్తారు.

$$\therefore \frac{10 \times 15}{10+15} = \frac{10 \times 15}{25} = 6 \text{ రోజులు}$$

సమాధానం: 4

2. A ఒక పనిని 12 రోజుల్లో, B 15 రోజుల్లో, C 30 రోజుల్లో పూర్తి చేస్తారు. అయితే అదే పనిని ముగ్గురూ కలిసి ఎన్ని రోజుల్లో పూర్తి చేయగలరు?

1) 15 2) 19 3) $5\frac{5}{11}$ 4) 6

సాధన: A, B, C లు ఒక పనిని x, y, z రోజుల్లో పూర్తిచేస్తే, ముగ్గురూ కలిసి పూర్తి చేయడానికి పట్టే కాలం

$$= \frac{x \times y \times z}{xy + yz + zx} \Rightarrow \frac{12 \times 15 \times 30}{12 \times 15 + 15 \times 30 + 12 \times 30}$$

$$= \frac{12 \times 15 \times 30}{180 + 450 + 360} = 5\frac{5}{11}$$

సమాధానం: 3

3. వేణు, చందు కలిసి ఒక పనిని 8 రోజుల్లో పూర్తి చేస్తారు. ఆ పనిని వేణు ఒక్కడే 12 రోజుల్లో పూర్తిచేస్తే, చందు ఎన్ని రోజుల్లో పూర్తి చేయగలడు?

1) 36 2) 24 3) 34 4) 26

సాధన: ఒక రోజులో వేణు చేసే పని $= \frac{1}{12}$



రైల్వే, పోటీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

ఇద్దరూ కలిసి చేస్తే పని పూర్తయ్యే సమయం?

వేణు, చందు కలిసి ఒక రోజులో చేసే పని $= \frac{1}{8}$

చందు ఒక్కడే ఒక రోజులో చేసే పని $= \frac{1}{8} - \frac{1}{12} = \frac{3-2}{24} = \frac{1}{24}$

చందు పనిని పూర్తి చేసేందుకు పట్టే కాలం = 24 రోజులు

సమాధానం: 2

4. A ఒక పనిని 25 రోజుల్లో, B అదే పనిని 20 రోజుల్లో పూర్తి చేస్తారు. వారిద్దరూ కలిసి 5 రోజులు పని చేసిన తర్వాత A మానేస్తే, ఆ పనిని పూర్తి చేసేందుకు Bకి ఎన్ని రోజులు పడుతుంది?

1) 11 2) 16 3) 15 4) 8

సాధన: A, B కలిసి 5 రోజుల్లో చేసే పని $= 5\left(\frac{1}{25} + \frac{1}{20}\right)$

$$= 5\left(\frac{20+25}{25 \times 20}\right) = \frac{5 \times 45}{25 \times 20} = \frac{9}{20}$$

మిగిలిన పని $= 1 - \frac{9}{20} = \frac{11}{20}$

మిగిలిన పని చేసేందుకు Bకి పట్టే కాలం $= \frac{\frac{11}{20}}{\frac{1}{20}} = 11$ రోజులు

సమాధానం: 1

5. అయిదుగురు పెద్దవారు లేదా 10 మంది బాలురు ఒక పనిని 15 రోజుల్లో పూర్తి చేస్తారు. నలుగురు పెద్దవారు, 17 మంది బాలురు కలిసి అదే పనిని పూర్తి చేసేందుకు పట్టే సమయం?

1) 4 రోజులు 2) 8 రోజులు 3) 6 రోజులు 4) 10 రోజులు

సాధన: 5 గురు పెద్దవారు చేసే పని = 10 మంది బాలురు చేసే పని

4 గురు పెద్దలు చేసే పని $= \frac{10 \times 4}{5} = 8$ మంది బాలురు చేసే పని

నలుగురు పెద్దలు + 17 మంది బాలుర పని

8 మంది బాలురు + 17 మంది బాలురు చేసే పని

= 25 మంది బాలురు

10 మంది బాలురు ఒక పనిని పూర్తిచేసే కాలం = 15 రోజులు

ఒక బాలుడు 15 రోజుల్లో పూర్తి చేసే పని $= 15 \times 10$

25 మంది బాలురు పూర్తి చేయడానికి పట్టే కాలం

$$= \frac{10 \times 15}{25} = 6 \text{ రోజులు}$$

సమాధానం: 3

6. ఒక పనిని 20 మంది మహిళలు కలిసి 16 రోజుల్లో పూర్తి చేస్తే, అదే పనిని అన్నే రోజుల్లో 15 మంది పురుషులు పూర్తి చేస్తారు. అయితే స్త్రీ, పురుషుల పని రోజుల నిష్పత్తి ఎంత?

1) 3 : 4 2) 4 : 3 3) 2 : 3 4) 3 : 2

సాధన: ఒక మహిళ ఒక రోజులో చేసే పని

$$= \frac{1}{20 \times 16} = \frac{1}{320}$$

ఒక రోజులో ఒక పురుషుడు చేసే పని

$$= \frac{1}{16 \times 15} = \frac{1}{240}$$

నిష్పత్తి $= \frac{1}{240} : \frac{1}{320} = 320 : 240$

$= 4 : 3$

సమాధానం: 2



రచయిత
హెచ్. అరుణ శివప్రసాద్, విషయ నిపుణులు

647 Word of the Day

Breach

Telugu meaning: ఉల్లంఘన, మితిమీరు

English meaning: The word breach (బ్రీచ్) is a noun/verb that describes a violation or breaking of a law, rule, or agreement.

Synonyms: Violation, Infringement

Antonyms: Compliance, Obedience

Usage: **1. (As a Noun):** The company was fined heavily for a breach of safety regulations.

2. (As a Verb): Hackers managed to breach the security system and steal confidential data.

కరెంట్ అఫైర్స్



ప్రతిష్ఠాత్మక 72వ మిస్ వరల్డ్ 2025 పోటీలు హైదరాబాద్ వేదికగా మే 10, 2025న ప్రారంభమయ్యాయి. కిరీటం దక్కించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా 110 దేశాలకు చెందిన సుందరీమణులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. భారతదేశం తరఫున మిస్ ఇండియా నందిని గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఈ పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి.



జనగణన విభాగం తాజాగా విడుదల చేసిన 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం (సీఆర్ఎస్) నివేదిక -2021' ప్రకారం కరోనా సమయంలో దేశవ్యాప్తంగా జననాల రేటు స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. దేశంలో 2021 జననాల సంఖ్య 2.42 కోట్లుగా ఉండగా, ఇందులో మగపిల్లల వాటా 52.2%, ఆడపిల్లల వాటా 47.8గా ఉన్నట్లు ఈ నివేదిక రికార్డుల ప్రకారం తెలుస్తోంది. లింగనిష్పత్తి రేటు 2021లో దేశవ్యాప్తంగా 1000 : 901-925గా నమోదవగా, తెలంగాణలో 1000 : 922, ఆంధ్రప్రదేశ్‌లో 1000 : 976గా ఉంది.



జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ (నల్సా) కార్యనిర్వాహక ఛైర్మన్‌గా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ప్రధాన న్యాయమూర్తి తర్వాత సీనియర్ న్యాయమూర్తిని ఈ పదవిలో నియమిస్తారు. లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్ 1987లో సెక్షన్ 3(2), క్లాజ్ బీ కింద దఖలుపడిన అధికారాలను ఉపయోగించి రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఈ నియామకాన్ని చేపట్టినట్లు న్యాయశాఖ మే 10న జారీచేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

మే 12
చరిత్రలో ఈనాడు



వైద్య రంగంలో నర్సుల సహకారాన్ని గుర్తించే లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగా ఏటా మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని (International Nurses Day) నిర్వహిస్తారు. వైద్యులతో కలిసి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడంలో వారు చేస్తోన్న కృషి, అన్ని సమయాల్లో రోగికి తోడుగా ఉంటూ జబ్బును నయం చేయడంలో వారి పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

◆ భారతదేశంలో నర్సింగ్ విద్య, అభ్యాసాన్ని నియంత్రించే ఉద్దేశంతో ప్రభుత్వం 1947లో ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ)ను ఏర్పాటు చేసింది. ఇది కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేసే స్వయంప్రతిపత్తి సంస్థ. దేశమంతటా నర్సింగ్ విద్యలో ఏకరీతి ప్రమాణాలను నిర్వహించడంతోపాటు నర్సుల నమోదు, లైసెన్సింగ్‌కి ఇది బాధ్యత వహిస్తుంది.

◆ ఐఎన్‌సీ ప్రకారం, ప్రస్తుతం మనదేశంలో 33 లక్షల రిజిస్టర్డ్ నర్సులు ఉన్నారు. జనాభా నిష్పత్తి పరంగా ప్రతి 1000 మందికి ఇద్దరు ఉన్నారు. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రతి 1000 మందికి ముగ్గురు నర్సులు ఉండాలని సిఫార్సు చేసింది.

◆ డబ్ల్యూహెచ్‌ఓ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 2.9 మంది కోట్ల నర్సులు ఉన్నారు. 2020 నాటికి 45 లక్షల నర్సుల కొరత ఉంటుందని అంచనా.

చారిత్రక నేపథ్యం:


'మదర్ ఆఫ్ మోడ్రన్ నర్సింగ్'గా పేర్కొనే ఫ్లోరెన్స్ నైటింగేల్ 1812, మే 12న ఇటలీలో జన్మించారు. 1844లో ఆమె నర్స్ కావాలని భావించారు. 1854లో జరిగిన క్రిమియన్ యుద్ధంలో బ్రిటన్, ఫ్రాన్స్, టర్కీ ఏకమై రష్యాకు వ్యతిరేకంగా పోరాడాయి. ఇందులో గాయపడిన వారికి వైద్య సాయం అందించేందుకు ఫ్లోరెన్స్ అక్కడి సైనిక శిబిరాలకు వెళ్లారు. ఎంతో మందిని ప్రాణాపాయం నుంచి రక్షించారు. వ్యాధి నివారణకు ఔషధమే కాదు, నర్సులు అందించే సేవ కూడా ముఖ్యమే అనేది ఆమె సిద్ధాంతం. ఇదే భావనతో 1860లో ప్రపంచంలోనే మొట్టమొదటి నర్సింగ్ స్కూల్‌ను ప్రారంభించారు.

● ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ రంగానికి చేసిన సేవలకు గుర్తుగా ఆమె పుట్టిన రోజైన మే 12ను 'అంతర్జాతీయ నర్సుల దినోత్సవం'గా జరపాలని ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్ (ఐసీఎన్) 1965లో తీర్మానించింది.

☛ 2025 నినాదం: 'Our Nurses. Our Future. Caring for nurses strengthens economies'

జనరల్ స్టడీస్ - బయాలజీ

శరీరంలో జరిగే పలు విధులు, అంతర్గత, బాహ్య ఉద్దీపనలు, ప్రతిస్పందనలను నియంత్రించడం లేదా వాటిని సమన్వయపర్చడంలో నాడీ వ్యవస్థ పాత్ర కీలకం. ఇందులో నాడీ వ్యవస్థ నిర్మాణం, న్యూరాన్లు ముఖ్యమైన భాగాలు. కేంద్ర, పరిధీయ నాడీ వ్యవస్థలు, న్యూరాన్లు ఎప్పటికప్పుడు తమ విధులను నిర్వర్తిస్తూ శరీరంలోని వివిధ భాగాల నుంచి మెదడుకి, మెదడు నుంచి శరీర భాగాలకు సమాచారాన్ని ప్రసారం చేస్తుంటాయి.



శరీరధర్మ శాస్త్రం - నాడీ వ్యవస్థ

నాడీ వ్యవస్థ నిర్మాణం
- కేంద్ర నాడీ వ్యవస్థ
- పరిధీయ నాడీ వ్యవస్థ

న్యూరాన్లు – రకాలు
- సెన్సరీ న్యూరాన్లు (అఫెరెంట్)
- మోటార్ న్యూరాన్లు (ఎఫెరెంట్)
- ఇంటర్ న్యూరాన్‌లు

నాడీ ప్రచోదన వ్యాప్తి
- రెస్టింగ్ మెంబ్రేన్ పొటెన్షియల్
- యాక్షన్ పొటెన్షియల్
- డీపోలరైజేషన్
- రీపోలరైజేషన్
- ప్రచోదనాల ప్రసారం

న్యూరోట్రాన్స్‌మీటర్లు

న్యూరాన్‌ల మధ్య సినాప్స్‌ను అనుసంధానం చేసే రసాయన దూతలనే న్యూరోట్రాన్స్‌మీటర్లు అంటారు. ఉత్తేజకరమైన న్యూరోట్రాన్స్‌మీటర్లు (ఉదా: గ్లుటామేట్) పోస్ట్‌సినాప్టిక్ న్యూరాన్‌లో చర్య సామర్థ్యాలను ప్రోత్సహిస్తాయి.

న్యూరోప్లాస్టిసిటీ

అభ్యాస, అనుభవపూర్వకంగా లేదా గాయానికి ప్రతిస్పందనగా కొత్త అనుసంధానాలను పునర్‌వ్యవస్థీకరించడానికి, ఏర్పర్చడానికి అవసరమయ్యే నాడీ వ్యవస్థ సామర్థ్యమే న్యూరోప్లాస్టిసిటీ.

న్యూరాన్లు, న్యూరోప్లాస్టిసిటీ, రిఫ్లెక్స్ ఆర్క్, నాడీ వ్యవస్థలోని లోపాలు, మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Scientist Jobs

Bureau of Indian Standards (BIS) New Delhi is inviting applications for Scientist-B posts in various departments. There are 20 posts in total. The last date for online applications is 23 May 2025.

Diploma Courses

MSME Tool Room- Central Institute of Tool Design (CITD), Balanagar, Hyderabad, invites applications for admissions to the following Diploma Courses for the academic year 2025-26. The application fee is Rs.800. Eligible candidates can apply online before 22 May 2025.

National Aerospace Laboratories, Bengaluru

CSIR-National Aerospace Laboratories (CSIR-NAL) in Bengaluru is inviting applications for the posts of Junior Secretariat Assistant. The total number of posts is 26. Eligible candidates can apply online before 20th May 2025.

Did You Apply..?

Today (May 12) is the last date for the following jobs/ Admissions

☛ 400 Medical Officer posts in AFMS.

☛ 79 posts in MED, East Godavari District.
Qualification: Degree, BTech/BE.

☛ 18 Supervisory posts in UCSL.
Qualifications: ITI, Engineering Diploma, Degree.

☛ PhD Admissions at NIRDPR Hyderabad

For more information and other notifications - scan QR code

విశ్వం & భూమి

మెగా డీఎస్సీ 2025 ప్రత్యేకం
సోషల్ స్టడీస్ - జాగ్రఫీ

1. గ్రహశకలాలు ఏ రెండు గ్రహ కక్ష్యల మధ్య కనిపిస్తాయి?
1) బుధుడు - శుక్రుడు 2) శని - బృహస్పతి
3) భూమి - అంగారకుడు
4) అంగారకుడు - బృహస్పతి

2. సూర్యుడికి దగ్గరగా ఉన్న గ్రహం ఏది?
1) భూమి 2) అంగారకుడు
3) బుధుడు 4) శుక్రుడు

3. సూర్యుడి నుంచి భూమి ఎన్నో గ్రహం?
1) రెండు 2) మూడు 3) నాలుగు 4) ఒకటి

4. భూమికి కవల గ్రహం అని దేన్ని పిలుస్తారు?
1) అంగారకుడు 2) శుక్రుడు
3) శని 4) బుధుడు

5. నీలి గ్రహం అని ఏ గ్రహానికి పేరు?
1) భూమి 2) వరుణుడు
3) ఇంద్రుడు 4) అంగారకుడు

6. విశ్వం అనే పదానికి ఆధారమైన 'యూనివర్స్' ఏ భాషా పదం?
1) గ్రీకు 2) లాటిన్ 3) ఫ్రెంచ్ 4) రష్యన్

7. సౌర వ్యవస్థ ఏ గెలాక్సీలో ఉంది?
1) పాలపుంత 2) ఆంద్రోమెడా
3) ఆకాశగంగ 4) 1, 3

8. భూకేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
1) కోపర్నికస్ 2) లిమైటెర్
3) గెలీలియో 4) టాలెమీ

9. సౌర కుటుంబం ఆవిర్భవించిన కాలం?
1) 4.3 బిలియన్స్ 2) 4.6 బిలియన్స్
3) 4.6 ట్రిలియన్స్ 4) 3.5 బిలియన్స్

10. ప్రస్తుతం సౌర కుటుంబంలో గ్రహాల సంఖ్య?
1) 9 2) 8 3) 7 4) 6

11. ఖగోళ శాస్త్రాన్ని రష్యన్ భాషలో ఏమని పిలుస్తారు?
1) యూనివర్స్ 2) కాస్మాలజీ
3) ఆస్ట్రానమీ 4) ఫిజియాలజీ

12. భూమి - సూర్యుడికి మధ్య దూరం?
1) 10 కోట్ల కి.మీ. 2) 13 కోట్ల కి.మీ.
3) 18 కోట్ల కి.మీ. 4) 15 కోట్ల కి.మీ.

13. కాంతి సెకనుకు ఎన్ని కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది?
1) 2 లక్షల కి.మీ. 2) 3 లక్షల కి.మీ.
3) 2.5 లక్షల కి.మీ. 4) 7 లక్షల కి.మీ.

14. నిహారిక పరికల్పన సిద్ధాంతాన్ని ఎవరు ప్రతిపాదించారు?
1) ఇమాన్యుయల్ కాంట్ 2) లెమిటెయర్
3) వెజినర్ 4) ఏదీకాదు

15. సౌర వ్యవస్థలో జీవం కలిగిన ఏకైక గ్రహం ఏది?
1) బుధుడు 2) శుక్రుడు
3) భూమి 4) అంగారకుడు

16. హేలీ తోక చుక్క చివరిసారిగా ఏ సంవత్సరంలో కనిపించింది?
1) 1886 2) 1996
3) 1986 4) 2016

17. సూర్యుడి చుట్టూ తిరిగే చిన్నచిన్న రాళ్లను ఏమంటారు?
1) తోకచుక్కలు 2) ఉల్కలు
3) గ్రహశకలాలు 4) గెలాక్సీలు

18. చంద్రుడి ఉపరితలంపై మొట్టమొదటిసారిగా ఎవరు అడుగుపెట్టారు?
1) సతీష్‌ధావన్ 2) రాకేష్ శర్మ
3) నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ 4) సునీత విలియమ్స్

19. చంద్రునికి - భూమికి మధ్య దూరం ఎంత?.
1) 3,64,000 కి.మీ.
2) 3,84,000 కి.మీ.
3) 2,84,000 కి.మీ. 4) 4,82,000 కి.మీ.

20. ఉపగ్రహాలు లేని గ్రహాలు
1) బుధుడు - గురుడు
2) శుక్రుడు - అంగారకుడు
3) ఇంద్రుడు - వరుణుడు
4) బుధుడు - శుక్రుడు

21. సూర్యుని కాంతి భూమికి చేరటానికి పట్టే సమయం ఎంత?
1) 6 నిమిషాలు 2) 8 నిమిషాలు
3) 7 నిమిషాలు 4) 9 నిమిషాలు

22. జియోయిడ్‌గా ఏ గ్రహాన్ని అభివర్ణిస్తారు?
1) బుధుడు 2) శుక్రుడు
3) భూమి 4) అంగారకుడు

23. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
1) జులై 6 2) జూన్ 5
3) మార్చి 5 4) ఏప్రిల్ 17

24. అంతర గ్రహం కానిది?
1) శుక్రుడు 2) భూమి
3) బుధుడు 4) శని

25. సూర్యుడి నుంచి శుక్రుడికి మధ్య దూరం (మిలియన్ కిలోమీటర్లు)?
1) 85 2) 108 3) 150 4) 228

26. గెలీలియో ఏ దేశానికి చెందినవారు?
1) రష్యా 2) ఇటాలియన్
3) ఫ్రెంచ్ 4) గ్రీకు

27. పరిమాణంలో భూమి ఎన్నో పెద్ద గ్రహం?
1) 3 2) 4
3) 5 4) 6

సమాధానాల కోసం క్యూఆర్ స్కాన్ చేయండి

రచయిత: వి. కుమారస్వామి

ఈనాడు సినిమా


మోహన్‌లాల్

శివకార్తికేయన్ చిత్రంలో?

గతేడాది 'అమరన్' సినిమాతో ప్రేక్షకుల మనసుల్ని గెలుచుకున్నారు హీరో శివకార్తికేయన్. ప్రస్తుతం 'మదరాసి', 'పరాశక్తి' లాంటి సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్నారు. ఆయన 'గుడ్‌నైట్' ఫేమ్ వినాయక్ చంద్రశేఖర్‌తో ఓ సినిమా కోసం చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ సినిమాలో మలయాళ అగ్రకథానాయకుడు మోహన్‌లాల్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. "భావోద్వేగంతో కూడిన తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో శివ కార్తికేయన్ తండ్రి పాత్ర కోసం మోహన్‌లాల్‌ను ఎంపిక చేసే పనిలో ఉంది చిత్రబృందం. ప్రస్తుతం ఈ విషయమై ఆయనతో చర్చలు చేస్తున్నారు. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా ప్రకటించనున్నార"ని మోహన్‌లాల్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

'స్వయంభూ'.. టీజర్ సిద్ధం!


నిఖిల్

'కార్తికేయ 2' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు కథానాయకుడు నిఖిల్. ఇప్పుడాయన నుంచి రానున్న మరో పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్న ఈ సినిమాని బి.మధు సమర్పణలో భువన్, శ్రీకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంయుక్తా మేనన్, నభా నటేశ్ కథానాయికలు. ఈ సినిమా ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకుందని తెలిసింది. జూన్ 1న నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా టీజర్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. జులై లేదా ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చారిత్రక అంశాలతో ముడిపడి ఉన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రమిది. నిఖిల్ ఇందులో శక్తిమంతమైన యోధుడి పాత్రలో మునుపెన్నడూ చూడని విధంగా కనువిందు చేయనున్నారు. సంయుక్త యాక్షన్, నభా పాత్రలకు యాక్షన్ ప్రాధాన్యమున్నట్లు తెలుస్తోంది. ఇది రెండు భాగాలుగా తెరపైకి వచ్చే అవకాశముంది. దీనికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. మనోజ్ పరమహంస ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

సర్వైవల్ థ్రిల్లర్‌తో సుధీర్‌బాబు



కథానాయకుడు సుధీర్‌బాబు కొత్త కబురు వినిపించారు. ఆర్.ఎస్.నాయుడు దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై ఓ సినిమా చేయనున్నారు. ఆదివారం సుధీర్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఈ చిత్ర ప్రీలుక్‌ను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అందులో మెట్ల మీద కుప్పలు తెప్పలుగా శవాలు పడి ఉండగా.. వాటి మధ్య షర్ట్ లేకుండా ఓ ఆయుధం పట్టుకుని నడిచి వెళ్తూ సుధీర్ ఆసక్తికరంగా కనిపించారు. "బ్రోకెన్ సోల్.. ఆన్ ఏ బ్రూటల్ సెలబ్రేషన్" అంటూ ఆ పోస్టర్‌పై ఉన్న వ్యాఖ్య ఈ చిత్రం ఎంతటి హింస, రక్తపాతంతో నిండి ఉండనుందన్నది తెలియజేస్తోంది. "ఇదొక విభిన్నమైన సర్వైవల్ యాక్షన్ థ్రిల్లర్. సుధీర్ ఇందులో మునుపెన్నడూ చూడని విధంగా బీస్ట్ మోడ్‌లో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం తన శరీరాకృతిని మార్చుకున్నారు" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్ర నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.

అదే హార్ట్.. కానీ బీట్ వేరు



ఓటీటీ బొమ్మ

వైద్యుల జీవితాల చుట్టూ తిరిగే కథనంతో రూపొంది మంచి విజయాన్ని అందుకుంది తమిళ వెబ్‌సిరీస్ 'హార్ట్ బీట్'. ఇప్పుడీ హిట్ సిరీస్‌కు కొనసాగింపుగా సీజన్ 2 రాబోతున్న సంగతి తెలిసిందే. దీపా బాలు, అనుమోల్, చారుకేశ్, అమిత్ భార్గవ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. దీపక్ సుందర్ రాజన్, అబ్దుల్ కబీజ్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. "నా ప్రపంచం మారలేదు.. కానీ నా జీవితం మారిపోయింది.. అదే హార్ట్ కానీ బీట్ వేరు.." అంటూ ఈ సిరీస్‌ను నుంచి ఇటీవలే విడుదలైన ఓ వీడియో సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. తాజాగా ఇది ఈ నెల 22న ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో విడుదల కానున్నట్లు తెలుపుతూ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది సిరీస్ బృందం. ఓ హాస్పిటల్ ఇతివృత్తంగా తీర్చిదిద్దిన ఈ సిరీస్ ఆర్కే ఆసుపత్రి బాధ్యతలు స్వీకరించిన రతి అనే డాక్టర్ ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు.

15 ఏళ్లనాటి ప్రమాదం మళ్లీ ఎందుకు?



"ఆ రోజు సముద్రతీరంలో జరిగిన ప్రమాదంలో ఓ ప్రాణం పోయింది.." అంటోంది హాలీవుడ్ నటి యెరిన్ హా. మరి ఆమె ఎందుకు అలా అంటున్నారు? అసలు ఆరోజు అక్కడ ఏ ప్రమాదం జరిగింది? ఆ చనిపోయిన వ్యక్తి ఎవరు? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే 'ది సర్వైవర్స్' సిరీస్ చూడాల్సిందే. క్రైమ్, మిస్టరీ డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సిరీస్‌ను బెన్ సి.లూకాస్ రూపొందిస్తున్నారు. టోనీ అయర్స్, ఆండ్రూ వాకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది సిరీస్‌బృందం. "సముద్ర తీరంలో జరిగిన ప్రమాదంలో చనిపోయింది గాబీ. ఇక్కడ చనిపోయిన వారిని ఎవరూ పట్టించుకోరు, ఆమె ఎలా చనిపోయిందో ఎవరికీ తెలీదు.. కానీ నేను తెలుసుకుంటాను.." అంటూ 15ఏళ్ల క్రితం జరిగిన విధంగానే ఇప్పుడు సముద్ర తీరంలో ప్రాణాలు కోల్పోవడానికి కారణం ఏమిటి? అంటూ ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో సాగుతున్న ఈ ట్రైలర్ సినీ ప్రియులను ఆకట్టుకుంటోంది. సముద్ర తీరంలో వచ్చిన తుపానులో చనిపోయిన ఓ మహిళ చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందుతున్న సిరీస్ ఇది. చార్లీ విక్కర్స్, రాబిన్ మాల్కం, మార్టిన్ సాక్స్, డామియన్ గార్వే తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. జేన్ హార్పర్ రచించిన నవల ఆధారంగా రూపొందుతున్న ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా జూన్ 6నుంచి ప్రసారం కానుంది.

ఈ సినిమా నచ్చకుంటే టికెట్ డబ్బులు వెనక్కి అడగొచ్చు: నవీన్ చంద్ర


నవీన్ చంద్ర, అభిరామి, సందీప్ కిషన్

"నేను చేసే కథలు, పాత్రలు బాగుంటాయని ప్రేక్షకులు మొదటి నుంచి ప్రశంసిస్తున్నారు. ఆ గౌరవానికి బదులుగా ఈ 'లెవెన్' చిత్రాన్ని అందించనున్నా. ఇప్పటి వరకు ఏ థ్రిల్లర్‌లోనూ చూడని ఓ వినూత్నమైన కాన్సెప్ట్ ఈ సినిమాలో ఉంది" అన్నారు హీరో నవీన్ చంద్ర. ఆయన.. రియా జంటగా నటించిన ఈ తెలుగు, తమిళ ద్విభాషా చిత్రాన్ని లోకేశ్ అజ్ల్స్ తెరకెక్కించారు. ఇది రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా ఈనెల 16న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఇటీవల ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. హీరో సందీప్ కిషన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్ర బృందమంతా దేశం కోసం సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులకు సెల్యూట్ తెలిపింది. అనంతరం సందీప్ కిషన్ మాట్లాడుతూ.. "అదృష్టాన్ని కాకుండా కేవలం కష్టాన్ని మాత్రమే నమ్ముకున్న నటుడు నవీన్. ఈ చిత్రంతో తనకు మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నా. ట్రైలర్ చూశా. ఆద్యంతం ఆసక్తిరేకెత్తించేలా ఉంది. ఇది కథను నమ్ముకొని చేసిన చిత్రమనిపించింది" అన్నారు. "ఇది చాలా నిజాయతీతో తీసిన సినిమా. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది" అన్నారు దర్శకుడు లోకేశ్. హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ.. "ఇప్పటి వరకు ఈ సినిమా చూసిన వాళ్లంతా బాగుందని మెచ్చుకున్నారు. ఈనెల 15న పెయిడ్ ప్రీమియర్స్ వేయనున్నాం. అవి చూసి ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు నేను అక్కడే నిల్చొని ఉంటా. ఒకవేళ మీకు సినిమా నచ్చకపోయి ఉంటే మీ టికెట్ డబ్బులు వెనక్కి అడిగే హక్కు మీకుంది. ఈ సినిమాకి కథే బలం. దీంట్లో ఓ 30నిమిషాలు చాలా భావోద్వేగానికి గురవుతారు. ఇది తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో కరుణ కుమార్, రియా, అభిరామి, డి.ఇమాన్, అనిల్ విశ్వనాథ్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

బాలీవుడ్‌లో మరొకటి?


శ్రీలీల

తెరపై సహజమైన నటనతో.. అదిరిపోయే స్టెప్పులతో కుర్రకారుని ఉర్రూతలూగించే కథానాయిక శ్రీలీల.. బాలీవుడ్‌లో కార్తిక్ ఆర్యన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడామె మరో హిందీ ప్రాజెక్టుకు ఓకే చెప్పినట్లు సమాచారం. విక్రాంత్ మాస్సే, లక్ష్య ప్రధాన పాత్రల్లో 'దోస్తానా 2' రూపొందుతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. కరణ్ జోహార్ నిర్మాత. ఇప్పుడీ చిత్రంలో కథానాయికగా శ్రీలీలను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దీని గురించి ఆమెతో చర్చలు చేస్తున్నారని.. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం శ్రీలీల జాబితాలో 'మాస్ జాతర', 'పరాశక్తి' తదితర చిత్రాలు ఉన్నాయి.

అమ్మ ప్రేమను చాటేలా


శ్రీనివాస్, దివ్య, రోహిత్, ఈశ్వర్

దియా రాజ్, ఇనయ సుల్తానా, రిహానా, వికాస్ వశిష్ఠ, రోహిత్ బొడ్డపాటి నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'ఫ్రై డే'. ఈశ్వర్‌బాబు ధూళిపూడి తెరకెక్కించిన ఈ సినిమాని కేసనకుర్తి శ్రీనివాస్ నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా ఈ సినిమాలోని అమ్మ పాటను ఏపీ మంత్రి వంగలపూడి అనిత వైజాగ్‌లో విడుదల చేశారు. అమ్మ ప్రేమను చాటి చెప్పేలా ఎంతో అందంగా పాటను చిత్రీకరించారని చిత్ర బృందాన్ని అభినందించారు. అనంతరం చిత్ర వర్గాలు హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా దర్శకుడు ఈశ్వర్‌బాబు మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో అమ్మ సెంటిమెంట్ ఎక్కువగా ఉంటుంది. ఈ చిత్రం చూశాక ప్రతి తల్లి తన కొడుకును ఓ ఛత్రపతి శివాజీలా, మహారాణా ప్రతాప్ సింగ్‌లా పెంచుతారు. అలా పోరాడే శక్తిని అమ్మ మాత్రమే ఇస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో రోహిత్, దియా, రిహాన, కల్పిక, స్నిగ్ధ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌తరుణ్ రెండు భాషల్లో



ప్రముఖ ఛాయాగ్రాహకుడు విజయ్ మిల్టన్ దర్శకత్వం నుంచి వచ్చిన 'గోలీసోడా' సిరీస్ సినిమాలకు తమిళ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంది. ఇప్పుడీ ఫ్రాంచైజీలో భాగంగా రాజ్‌తరుణ్ హీరోగా తెలుగు, తమిళ భాషల్లో ఓ ద్విభాషా చిత్రం రూపొందించనున్నారు విజయ్. రఫ్ నోట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించనుంది. ఆదివారం రాజ్‌తరుణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాని అధికారికంగా ప్రకటించారు. "ఇది కొత్త కోణంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండనుంది. కథ, స్క్రీన్‌ప్లే చాలా విభిన్నంగా ఉంటుంది. రాజ్‌తరుణ్ ఇందులో ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే కొత్త లుక్‌లో కనిపించనున్నారు" అని చిత్రబృందం తెలిపింది. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తామంది.

నీ మాటే నచ్చే.. మది మరుమల్లె విచ్చే!


ఆకాంక్ష సింగ్, రూపేశ్

రూపేశ్ హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మించిన చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ తెరకెక్కించిన ఈ సినిమాలో రాజేంద్ర ప్రసాద్, అర్చన ప్రధాన పాత్రలు పోషించారు. ఆకాంక్ష సింగ్ కథానాయిక. ఈ చిత్రం ఈ నెల 30న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా ఈ చిత్ర మూడో గీతాన్ని ఆదివారం విడుదల చేశారు. "నీ మాటే నచ్చే - మది మరుమల్లె విచ్చే" అంటూ సాగిన రొమాంటిక్ గీతానికి ఇళయరాజా స్వరాలు సమకూర్చగా.. చైతన్య ప్రసాద్ సాహిత్యమందించారు. యువన్ శంకర్ రాజా, నిత్యశ్రీ సంయుక్తంగా ఆలపించారు. ఈ సందర్భంగా యువన్ శంకర్ రాజా మాట్లాడుతూ.. "మా నాన్న సంగీత దర్శకత్వంలో ఈ తెలుగు పాట పాడినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది తప్పకుండా అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నా" అన్నారు.

భోగి మంటల్లో వేసేద్దామా బాధలు!


సాయిశ్రీనివాస్, రోహిత్, మనోజ్

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రధారులుగా విజయ్ కనకమేడల తెరకెక్కించిన చిత్రం 'భైరవం'. కె.కె.రాధామోహన్ నిర్మించారు. అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్లై కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 30న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఈ చిత్రం నుంచి "భోగి మంటల్లో వేసేద్దామా బాధలు.. కష్టాలు - కన్నీళ్లు మోస్తూ ఇంకా ఎన్నాళ్లు" అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఈ సినిమాలోని ముగ్గురు హీరోల మధ్య ఉన్న స్నేహాన్ని ఆవిష్కరించే పండగ పాటిది. దీనికి శ్రీచరణ్ పాకాల స్వరాలు సమకూర్చగా.. భాస్కరభట్ల సాహిత్యమందించారు. రేవంత్, సాహితి చాగంటి ఆలపించారు. గణేశ్ మాస్టర్ నృత్యరీతులు అందించారు. ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఈ చిత్రానికి కూర్పు: ఛోటా కె.ప్రసాద్, ఛాయాగ్రహణం: హరి కె.వేదాంతం.

కన్నన్ కౌంట్‌డౌన్ షురూ


రుక్మిణీ వసంత్


పాత్ర ఏదైనా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా పెట్టుకునే కథానాయకుల్లో విలక్షణ నటుడు విజయ్ సేతుపతి ఒకరు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఏసీఈ'. రుక్మిణీ వసంత్ ఈ సినిమాతోనే తమిళంలోకి అడుగుపెట్టడం విశేషం. ఆరుముగ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఈనెల 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే "ఏసీఈ' కౌంట్‌డౌన్ మొదలు' అనే వ్యాఖ్యతో ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో బోల్డ్ కన్నన్ అనే పాత్రలో కనిపించనున్నారు విజయ్. యాక్షన్ సీక్వెన్స్, ఆకట్టుకునే సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్‌తో.. సినిమాని దోపిడీ, జూదం నేపథ్యంలో తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. యోగి బాబు కీలక పాత్ర పోషించారు. 7సీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ సినిమాను నిర్మించింది.

కల్ట్.. యాక్షన్ మొదలైంది


విష్వక్ సేన్, అల్లు అరవింద్

'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా ధమ్కీ' సినిమాలతో దర్శకుడిగానూ అలరించారు హీరో విష్వక్ సేన్. ఇప్పుడాయన 'కల్ట్' కోసం మరోసారి మెగాఫోన్ అందుకున్నారు. విష్వక్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందించనున్న ఈ చిత్రాన్ని కరాటే రాజు, సందీప్ కాకర్ల నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఎస్.రాధాకృష్ణ టైటిల్ లోగోని ఆవిష్కరించారు.

'పఠాన్ 2' చిత్రీకరణకు సన్నాహాలు


షారుక్ ఖాన్

బాలీవుడ్ కథానాయకుడు షారుక్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'పఠాన్'. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో సిద్ధార్థ్ ఆనంద్ రూపొందించిన ఈ చిత్రాన్ని ఆదిత్య చోప్రా నిర్మించారు. దీపిక పదుకొణె కథానాయిక. గతంలో విడుదలై హిట్ బొమ్మ అనిపించుకున్న ఈ చిత్రానికి సీక్వెల్ రాబోతున్న సంగతి తెలిసిందే. యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందనున్న 'పఠాన్ 2'ను చిలీలో చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు విషయమై ప్రస్తుతం చిలీ ప్రభుత్వంతో చిత్రబృందం చర్చలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాల సమాచారం.


ఎవరూ చేయని విభిన్నమైన ప్రేమకథ


సాత్విక్, ప్రీతి

సాత్విక్ వర్మ, ప్రీతి నేహా జంటగా భాను దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. పప్పుల కనకదుర్గారావు నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి 'ప్రేమిస్తున్నా' అనే పేరును ఖరారు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. "ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఓ విభిన్నమైన ప్రేమకథతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం. యువతరం మళ్లీ మళ్లీ చూడాలనుకునే అంశాలు దీంట్లో కొన్ని ఉన్నాయి. సంగీతానికి ఎంతో ప్రాధాన్యముంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సిద్ధార్థ్ సాలూరి, ఛాయాగ్రహణం: భాస్కర్ శ్యామల.

విద్యా దృక్పథాలకు ఎంత ప్రాధాన్యం?

విద్య, దాని లక్ష్యాలు, విధానాలు, వాటి ప్రభావం లాంటి అంశాలను విశ్లేషించే సబ్జెక్టు- విద్యా దృక్పథాలు. ఇది చదువును అర్థం చేసుకోవడానికీ, మెరుగుపర్చడానికీ సహాయపడుతుంది. విద్య అనేది వేద కాలం నుంచి నేటి వరకూ సమాజంలో మార్పునకూ, వ్యక్తిగత వికాసానికీ దోహదం చేసి జ్ఞానాన్ని పెంచడానికి సహకరిస్తోంది. ఉపాధ్యాయ నియామక పరీక్ష డీఎస్సీలో ఎస్జీటి, స్కూల్ అసిస్టెంట్స్ విభాగంలో పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్‌కు పెద్ద పీట వేశారు.



సెకండరీ గ్రేడ్ టీచర్స్ పరీక్ష రాసే అభ్యర్థులకు విద్యా దృక్పథాలపై 8 ప్రశ్నలు (4 మార్కులు), స్కూల్ అసిస్టెంట్స్ పరీక్ష రాసే అభ్యర్థులకు 10 ప్రశ్నలు (5 మార్కులు) ఉంటాయి. అభ్యర్థులు విద్యా దృక్పథాల సిలబస్‌కి అనుగుణంగా గత ప్రశ్నపత్రాలను విశ్లేషిస్తూ, ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయో అవగాహన ఏర్పరుచుకోవాలి. ఇలా చేస్తే ఈ విభాగంలో పూర్తి మార్కులు సాధించవచ్చు.

విద్యా దృక్పథాల విభాగంలో సిలబస్ ఎలా ఉంది, ఏ అంశాలను లోతుగా చదవాలి, వేటిపై ప్రశ్నలు రావడానికి అవకాశం ఉందో పరిశీలిద్దాం.

విద్యా చరిత్ర (హిస్టరీ ఆఫ్ ఎడ్యుకేషన్)

ప్రాచీన భారతదేశ విద్య - వేద ఉత్తర, వేదకాలం, మధ్యయుగ విధానాలు, బ్రిటిష్ కాలం నుంచి నేటివరకూ మార్పులు సూచించిన కమిషన్లు. ఉడ్స్ (1854), హంటర్ కమిషన్ (1882), సార్జంట్ (1944), మొదలియార్ (1952), కొఠారి (1964), నూతన విద్యా విధానం 1986, ఈశ్వరీబాయి పటేల్ కమిటీ (1977).

గతంలో అడిగిన ప్రశ్నలు

1. పూర్వ ప్రాథమిక విద్యను మొదట సూచించిన కమిటీ?
   1) హర్టాగ్ కమిటీ 2) సార్జంట్ కమిటీ
   3) ఉడ్స్ డిస్పాచ్ 4) సాడ్లర్ కమిటీ **జ:** 2
2. ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులకు తోడ్పడిన కమిటీ?
   1) సార్జంట్ కమిటీ 2) సాడ్లర్ కమిటీ
   3) హంటర్ కమిషన్ 4) ఉడ్స్ **జ:** 3

ప్రతి కమిషన్ గురించి చదివినప్పుడు ఎప్పుడు ఏ పరిస్థితిలో అది ప్రారంభమైందీ, దాని ముఖ్య సిఫార్సులూ, అప్పటి విద్యా విధానాన్ని ఎలా ప్రభావితం చేశాయి అనే అంశాలపై దృష్టి సారించాలి.

ఉపాధ్యాయ సాధికారత

- ఉపాధ్యాయుల ప్రొఫెషనల్ ఆచరణ నియమాలు
- శిక్షణ సంస్థల పాత్ర (ఎస్‌సీఈఆర్‌టీ, డైట్, ఎన్‌సీఈఆర్‌టీ).
- ఉపాధ్యాయ సంఘాల సమ్మేళనం

గత ప్రశ్నలు

1. వృత్తి నైతికత నిబంధన పత్రంలో ఉపాధ్యాయులు పాటించాల్సిన పద్ధతులను సూచించిన ఎన్‌సీఈఆర్‌టీ డాక్యుమెంట్‌లోని అధ్యాయం?
   1) నాలుగో అధ్యాయం 2) మూడో అధ్యాయం
   3) రెండో అధ్యాయం 4) ఒకటో అధ్యాయం
   జ: 3
2. కిందివాటిలో ఎన్‌సీటీఈ గుర్తించిన కార్యక్రమం?
   1) బాలల హక్కులు, ఎలిమెంటరీ విద్యలో బ్యాచిలర్ డిగ్రీ
   2) మానవ హక్కుల అధ్యయనంలో కొత్తరంగమయిన మానవ హక్కుల ఒడంబడికలో మాస్టర్ డిగ్రీ
   3) పూర్వ పాఠశాల విద్యలో డిప్లొమాకు దారితీసే బాల్యారంభ విద్యా కార్యక్రమం
   4) టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో డిప్లొమా
   జ: 3

ఈ విభాగం చదివేటప్పుడు ఉపాధ్యాయ విద్య కోసం వివిధ సంస్థలు చేస్తున్న ప్రగతిపై దృష్టి సారించే విధంగా చదవాలి. రాబోయే కాలంలో వచ్చే మార్పులను అధ్యయనం చెయ్యాలి.

సమకాలీన విద్యా సమస్యలు

- విద్యలో ప్రజాస్వామ్యం, సమానత్వం
- బాలల హక్కులు, నైతిక విలువలు
- ఏపీపీఈపీ, ఎన్‌పీఈపీ, ఎన్‌పీఈజీఈఎల్
- తరగతి గది నిర్వహణ

గత ప్రశ్నలు

1. రాష్ట్రంలో ఏ ఆరోగ్య సంస్థ నుంచి అయినా సేవను పొందే హక్కు అనేది?
   1) మనుగడ హక్కు 2) రక్షణ హక్కు 3) అభివృద్ధిచెందే హక్కు
   4) భాగస్వామ్య హక్కు **జ:** 1

ఈ విభాగంలో విలువల సిద్ధాంతాలు, బాలల హక్కులు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లాంటి అంశాలను క్షుణ్ణంగా చదవాలి.

చట్టాలు, హక్కులు

- ఆర్‌టీఈ- 09 (విద్యా హక్కు చట్టం)
- సమాచార హక్కు చట్టం
- మానవ హక్కులు

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆర్‌టీఈ - 2009 ప్రకారం 14 సంవత్సరాల్లోపు పేద కుటుంబాల పిల్లలకు, మంచి వసతులతో కూడిన ప్రైవేటు పాఠశాలలో చదవడానికి అవకాశం కల్పిస్తున్న ప్రాజెక్ట్?
   1) ఆర్ఎంఎస్ఏ 2) ఎన్‌పీఈజీఈఎల్
   3) ఏకలవ్య 4) ఆర్ఏఏ **జ:** 3
2. ఆర్‌టీఈ-09 కిందివాటిలో దేన్ని మినహాయించి మిగిలినవాటిని నిరోధించింది?
   1) భౌతిక దండన 2) మానసిక వేధింపు
   3) పాఠశాలల గుర్తింపు, నడపడం
   4) క్యాపిటేషన్ ఫీజు **జ:** 1

ఈ విభాగంలో విద్యాహక్కు చట్టాన్ని ఎలా రూపొందించారు, దానిలో అధ్యాయాలు, విభాగాలు, వాటిలోని అంశాల చర్చను పూర్తిగా చదవాలి. ప్రతి అధ్యాయంలోని అంశాలను సూక్ష్మ పద్ధతిలో గుర్తించుకోవడం తప్పనిసరి.

నేషనల్ కరిక్యులమ్

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఎన్‌సీఎఫ్-05 ప్రకారం అభ్యాసకులు సమూహాలుగా ఏర్పడి పని చేయడం, ఉపాధ్యాయుల సూచనలు, మార్గనిర్దేశనం ఏ రకమైన నిర్మాణాత్మక అభ్యసన సందర్భం?
   1) సందర్భీకరణ 2) పరస్పర సహకారం
   3) పరిశీలన 4) బహుళ వ్యాఖ్యానాలు **జ:** 2
2. జాతీయ విద్యావిధాన ఫ్రేమ్‌వర్క్‌లో విద్యా విధానం?
   1) 4+4+4+4 2) 5+3+3+4
   3) 5+2+3+5 4) 5+5++2+3 **జ:** 2

ఈ విభాగాల్లో ప్రశ్నలు స్టాండర్డ్‌గా ఉంటున్నాయి. ప్రస్తుత విద్యా విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయి. కాబట్టి చర్చా పద్ధతిని ఆచరిస్తూ ప్రాక్టీస్ బిట్స్ చేయడం మంచిది.

- విద్యా దృక్పథాలను అకాడమీ పుస్తకాల్లోని అంశాల వరుస క్రమంలో రాసుకుని పరీక్షలకు వెళ్లే ముందు సులభ పద్ధతిలో కోడ్స్ రూపంలో గుర్తుంచుకోవడం మంచిది.



– ఎ. దుర్గాప్రసాద్
పర్‌స్పెక్టివ్స్, మెథడాలజీ నిపుణులు

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ) జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఓ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 676 ఖాళీలున్నాయి. ఏదైనా డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష, ఇంటర్వ్యూతో నియామకాలుంటాయి. ఎంపికైన వారికి రూ.6.5 లక్షల వార్షిక వేతనం దక్కుతుంది.

676 పోస్టులతో.. ఆహ్వానిస్తోంది ఐడీబీఐ!

ముఖ్య వివరాలు

విద్యార్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదైనా డిగ్రీ. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 55 శాతం సరిపోతాయి.
వయసు: మే 1, 2025 నాటికి 20-25 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు గరిష్ఠ వయసులో మినహాయింపు వర్తిస్తుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20
దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.250. మిగిలిన అందరికీ రూ.1050.
ఆన్‌లైన్ పరీక్ష: జూన్ 8
వెబ్‌సైట్: https://www.idbibank.in/idbi-bank-careers-current-openings.aspx



నియామకాల కోసం ఆన్‌లైన్ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 200 ప్రశ్నలుంటాయి. ఇవన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి. తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. సెక్షన్ల వారీ సమయ నిబంధన ఉంది. అర్హత కోసం సెక్షన్ల వారీ, మొత్తం మీద కనీస మార్కులు పొందడం తప్పనిసరి.

విభాగం	ప్రశ్నలు /మార్కులు	వ్యవధి
లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్	60	40ని.
ఇంగ్లిష్ లాంగ్వేజ్	40	20ని.
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	40	35ని.
జనరల్/ ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్ / కంప్యూటర్/ ఐటీ	60	25ని.

ఇంటర్వ్యూ, తుది ఎంపిక

పరీక్షలో అర్హులైనవారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ ప్రకారం విభాగాల వారీ ఒక్కో ఖాళీకి కొంతమందిని చొప్పున ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు. ఈ సంఖ్యను ఐడీబీఐ నిర్ణయిస్తుంది. ఇంటర్వ్యూకి వంద మార్కులు. ఇందులో 50 మార్కులు పొందడం తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులైతే 45 మార్కులు రావాలి. ఇలా అర్హత మార్కులు పొందినవారి జాబితాకు ఆన్‌లైన్ పరీక్షలో సాధించిన మార్కులు కలుపుతారు. పరీక్షలో సాధించిన స్కోరులో 3/4 వంతు, ఇంటర్వ్యూ స్కోరులో 1/4 వంతు కలిపి కేటగిరీల వారీ మెరిట్ జాబితా రూపొందిస్తారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఈ సమయంలో వీరికి ఏడాదికి సుమారు రూ.6.5 లక్షల వేతనం అందుతుంది. దీంతో పాటు అలవెన్సులూ దక్కుతాయి. ప్రొబేషన్ వ్యవధి ఏడాది. ఆ తర్వాత శాశ్వత విధుల్లోకి తీసుకుంటారు.

సన్నద్ధత

- పరీక్ష రాయడానికి ఉన్న వ్యవధి 27 రోజులే. ఈ తక్కువ సమయాన్నే సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే బ్యాంకు ఉద్యోగాల సన్నద్ధతలో ఉన్నవారికిది మంచి అవకాశం.
- ఎక్కువ మార్కులున్నందున రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ విభాగాలను అధిక ప్రాధాన్యంతో చదవాలి.
- విభాగాల వారీ అన్ని అంశాలనూ 20 రోజుల్లో పూర్తిచేసుకోవాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించాలి. చివరి 7 రోజులు మాక్ టెస్టులకు కేటాయించాలి. ప్రతి పరీక్ష తర్వాతా ఫలితాలు సమీక్షించుకుంటే తప్పులు చాలావరకు పరిమితమవుతాయి. గత ఐబీపీఎస్ ప్రశ్నపత్రాలనూ బాగా సాధన చేయాలి.
- సెక్షన్ల వారీ సమయ నిబంధన ఉంది. రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలకు వ్యవధి సరిపోకపోవచ్చు. అందువల్ల తక్కువ సమయంలో సమాధానం ఇవ్వగలిగే ప్రశ్నలే ముందు ప్రయత్నించాలి. ఆ తర్వాత కాస్త వ్యవధి తీసుకున్నప్పటికీ కచ్చితంగా జవాబు గుర్తించగలిగేవాటిని చూడాలి. మిగిలినవి చివరలోనే ప్రయత్నించాలి.
- సమాధానాల విషయంలో సంఖ్య కంటే కచ్చితత్వానికే ప్రాధాన్యమివ్వాలి. వీలైనన్ని సరైన జవాబులు గుర్తించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. ప్రతి విభాగంలోనూ 60 శాతం ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు గుర్తిస్తే పోటీలో నిలుస్తారు.
- రుణాత్మక మార్కులున్నాయి కాబట్టి జవాబు తెలియకపోయినా అంచనాతో సమాధానం గుర్తిస్తే నష్టమే.

ఏఐలో ఏ కోర్సులు మేలు?


బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) 2020లో పూర్తిచేశాను. నాలుగున్నరేళ్లుగా సపోర్టివ్ ఎగ్జిక్యూటివ్‌గా టీసీఎస్‌లో పనిచేస్తున్నా. ఏఐ రంగంలో కెరియర్ సాగించాలంటే ఏ కోర్సులు నేర్చుకోవాలి? - ఎం. హేమశ్రీ

■ మీరు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో కెరియర్ సాగించాలనుకొంటే ఏఐ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, కంప్యూటర్ సైన్స్ లాంటి సబ్జెక్టుల్లో పీజీ/ డిగ్రీ/ డిప్లొమా/ సర్టిఫికెట్‌లను ఆన్‌లైన్ విధానంలో చదివి, ఆ తరువాత ఎంటెక్ (ఏఐ) కూడా పూర్తిచేసే ప్రయత్నం చేయొచ్చు. డిగ్రీతో సంబంధం లేకుండా ఏఐ రంగంలో రాణించాలంటే- ఎంఎస్ ఎక్సెల్, పైథాన్, ఆర్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, డేటా హ్యాండ్లింగ్ టూల్స్, టెన్సర్ ఫ్లో, పైటార్చ్ లాంటి కోర్సులు నేర్చుకోండి. ఇవి కోర్స్ ఎరా, యుడెమి, ఎడ్ ఎక్స్, గూగుల్ ఏఐ, ఫ్యూచర్ లెర్న్, అప్‌గ్రాడ్, సింప్లీ లెర్న్ లాంటి ఆన్‌లైన్ వేదికల్లోనూ అందుబాటులో ఉన్నాయి. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, బిట్స్ పిలానీలతో పాటు వివిధ ఐఐటీలు కూడా ఏఐలో ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఏఐ రంగంలో మెరుగైన భవిష్యత్తు కోసం ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు, మ్యాథ్స్/ స్టాటిస్టిక్స్‌పై మంచి పట్టు, ఇంకా కమ్యూనికేషన్ నైపుణ్యాలు కూడా చాలా అవసరం.



ఎమ్మెస్సీ సైకాలజీ ఎక్కడ?

బీఎస్సీ (బీటీజడ్‌సీ) చదివాను. ఆ అర్హతతో ఎమ్మెస్సీ (సైకాలజీ) చేయొచ్చా? ఏ యూనివర్సిటీల్లో ఉంది? - మీనా



■ సైకాలజీ సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలంటే డిగ్రీలో సైకాలజీ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలన్న నిబంధన ఉండేది. కానీ కొన్ని యూనివర్సిటీలు మాత్రం చాలాకాలంగా డిగ్రీలో ఏ సబ్జెక్ట్ చదివినప్పటికీ పీజీలో సైకాలజీ చదివే అవకాశం కల్పిస్తున్నాయి. ఉస్మానియా, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీల్లో డిగ్రీలో ఏ సబ్జెక్టులు చదివినవారైనా ఎంఏ సైకాలజీ చదివే అవకాశం ఉంది. కాకతీయ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ సైకాలజీ చదవాలంటే బీఏలో సైకాలజీ కానీ, బీఎస్సీ కానీ చదివివుండాలి. మీ విద్యార్హతతో ఆంధ్రా యూనివర్సిటీ, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, యోగివేమన యూనివర్సిటీ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, క్లస్టర్ యూనివర్సిటీల్లో ఎమ్మెస్సీ సైకాలజీ చదవడానికి అర్హత ఉంది. మీకు ఆసక్తి ఉంటే జాతీయ స్థాయిలో నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీ)లో ఉత్తీర్ణత సాధించి వివిధ సెంట్రల్ యూనివర్సిటీల్లో సైకాలజీలో పీజీ చేయొచ్చు. జాతీయ విద్యావిధానం- 2020 ప్రకారం డిగ్రీలో ఏ సబ్జెక్టులు చదివినా జాతీయ/ యూనివర్సిటీ స్థాయి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే, పీజీలో నచ్చిన సబ్జెక్టు చదివే వెసులుబాటు ఉంది. ఈ నిబంధన పూర్తి స్థాయిలో అమల్లోకి రావడానికి మరికొంత సమయం పట్టవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

కెరియర్‌కు ప్లానింగ్

కెరియర్‌ను ఎంచుకోవడం, దాని ప్రణాళిక, తీర్చిదిద్దుకోవడం విద్యార్థి జీవితంలో ముఖ్య ఘట్టం. దీనికి ఉపకరించే అంశాలు-

1. **స్వీయ అవగాహన:** మీ గురించి మీరు తెలుసుకోండి. అంటే మీకున్న ఆసక్తులూ, అభిరుచులను దృష్టిలో పెట్టుకోండి.
2. **ఆశయాలూ, పాటించే విలువలూ:** మీకున్న లక్ష్యాలు, వ్యక్తిగత ఎదుగుదల, ఆర్థిక స్థిరత్వం లాంటివి.
3. **నైపుణ్యాలు:** ప్రతి విద్యార్థికీ కొన్ని నైపుణ్యాలు బలంగా ఉంటాయి. వాటిని గ్రహించి వృద్ధి చేసుకోవడం ముఖ్యం.
4. **కెరియర్ అవకాశాల పరిశోధన:** అందుబాటులో ఉన్న విభిన్న కెరియర్ల గురించి పూర్తిగా తెలుసుకుని, అవి మీకెంతవరకూ సరిపోతాయో విశ్లేషించుకోవాలి.
5. **మెయిన్ సబ్జెక్టు (స్పెషలైజేషన్)కు కెరియర్ అనుసంధానం:** మీ సబ్జెక్టులో లోతైన పరిజ్ఞానం ఉంటుంది కాబట్టి డిగ్రీ తర్వాత దీనిలో కెరియర్ ఎంచుకునే మార్గం ఆలోచించండి.



నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

నేషనల్ మెటలర్జికల్ ల్యాబ్‌లో..

ఝార్ఖండ్‌లోని సీఎస్ఐఆర్- నేషనల్ మెటలర్జికల్ ల్యాబొరేటరీ.. 21 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- జూనియర్ స్టెనోగ్రాఫర్- 08
- జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ (జనరల్)- 05
- జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్)- 04
- జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ (స్టోర్ అండ్ పర్చేజ్)- 04

అర్హత: టెన్+2/ ఇంటర్మీడియట్, కంప్యూటర్ టైపింగ్ స్పీడ్, స్టెనోగ్రఫీ పరిజ్ఞానం.
వయసు: జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు 27 ఏళ్లు; జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు రూ.46,800; జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు రూ.35,000.
దరఖాస్తు ఫీజు: రూ 500; ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు ఫీజు ఉండదు.
ఎంపిక: రాత పరీక్ష, ప్రొఫిషియన్సీ టెస్టుల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30-05-2025.
వెబ్‌సైట్: https://nml.res.in/

ఏపీ ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీ

ఆంధ్రప్రదేశ్ హెల్త్, మెడికల్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు 128 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డీఎన్‌బీ/డీఎం/ఎంసీహెచ్‌తో పాటు పని అనుభవం.
వయసు: 42 - 52 ఏళ్లు. **వేతన శ్రేణి:** నెలకు రూ.68,900 - రూ.2,05,500. **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. **దరఖాస్తు ఫీజు:** ఓసీలకు రూ.1000, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.750.
ఎంపిక: ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీ:** 16.05.2025
వేదిక: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, పాత జీజీహెచ్ క్యాంపస్, హనుమాన్‌పేట, విజయవాడ. వెబ్‌సైట్: https://dme.ap.nic.in/

నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్‌లో..

నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో 15 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (ఫ్రైట్ లాజిస్టిక్స్): 01
- చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (ప్యాసింజర్ లాజిస్టిక్స్): 01
- రీజినల్ ఆఫీసర్ (వీపీ): 02
- వీపీ (డబ్ల్యూఎస్ఏ): 01
- వీపీ (ఫైనాన్స్ & అకౌంట్స్): 01
- ఏవీపీ (లాజిస్టిక్స్): 01
- ఏవీపీ (ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్): 01
- ఏవీపీ (ఇంటర్ మోడల్ స్టేషన్): 01
- ఏవీపీ (హెచ్ఆర్ & అడ్మిన్): 01
- చీఫ్ మేనేజర్ (ఎఫ్&ఏ): 01
- సీనియర్ మేనేజర్ (డబ్ల్యూఎస్ఏ): 01
- సీనియర్ మేనేజర్ (కన్‌స్ట్రక్షన్ సేఫ్టీ): 01
- సీనియర్ మేనేజర్ (ఎన్విరాన్‌మెంట్): 01
- డిప్యూటీ మేనేజర్ (అడ్మిన్): 01

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 30.05.2025
వెబ్‌సైట్: https://nhlml.org/current-openings

హెచ్‌పీసీఎల్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు

ముంబయిలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, మహారత్న సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజ్, రిఫైనరీస్ విభాగంలో 103 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

- మెకానికల్: 11
- ఎలక్ట్రికల్: 17
- ఇన్‌స్ట్రుమెంటేషన్: 6
- కెమికల్: 41
- ఫైర్ & సేఫ్టీ: 28

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత ఇంజినీరింగ్ విభాగాల్లో 3 ఏళ్ల డిప్లొమా, సైన్స్ విభాగంలో ఏదైనా డిగ్రీ.
వయసు: దరఖాస్తు చివరి తేదీ నాటికి 25 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీ ఎన్‌సీకి 3 ఏళ్లు; పీడబ్ల్యూబీడీకి 15 ఏళ్లు వయసులో సడలింపు ఉంటుంది.
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, గ్రూప్ డిస్కషన్/టాస్క్, స్కిల్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్ ద్వారా.
వేతనం: నెలకు రూ.30,000 - రూ.1,20,000.
దరఖాస్తు ఫీజు: రూ.1180; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు దరఖాస్తు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.05.2025.
వెబ్‌సైట్: https://hindustanpetroleum.com/

వాక్-ఇన్

ఐఏఆర్ఐ, కర్నాల్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

ఐకార్- ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హరియాణా, కర్నాల్... ఒప్పంద ప్రాతిపదికన 4 పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- యంగ్ ప్రొఫెషనల్-1: 03
- సెమీ స్కిల్డ్ ఫీల్డ్ అసిస్టెంట్: 01

అర్హత: పోస్టును అనుసరించి టెన్త్, అగ్రికల్చర్ లేదా అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ విభాగంలో డిప్లొమా, డిగ్రీతో పాటు, పని అనుభవం.
వేతనం: నెలకు యంగ్ ప్రొఫెషనల్-1కు రూ.30,000; సెమీ స్కిల్డ్ ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.15,000.
వయసు: ఇంటర్వ్యూ తేదీ నాటికి 21- 45 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీ: 27.05.2025.
వేదిక: ఐసీఏఆర్- ఐఏఆర్ఐ, రిజినల్ స్టేషన్, కర్నాల్.
వెబ్‌సైట్: https://www.iari.res.in/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

టెలికాలింగ్

సంస్థ: లీడ్ మైన్స్ మీడియా
నైపుణ్యాలు: ఇంగ్లిష్, హిందీ, పంజాబీ మాట్లాడటం, రాయడం, సేల్స్
స్టైపెండ్: రూ.8,000
☛ https://shorturl.at/cy1uj

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: జీటీఎంవీపీ ఇంక్ (యునైటెడ్ స్టేట్స్) నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కేన్వా, డిజైన్ థింకింగ్, ఫిగ్మా, గ్రాఫిక్ డిజైన్
స్టైపెండ్: రూ.8,000-10,000
☛ https://shorturl.at/wjMif

కాట్లిన్ డెవలపర్

సంస్థ: సెలబ్రెర్ నైపుణ్యాలు: ఫైర్‌బేస్, గిట్, కాట్లిన్, రెస్ట్ ఏపీఐ స్టైపెండ్: రూ.7,500
☛ https://shorturl.at/TQaPD

యానిమేషన్

సంస్థ: డ్యాష్‌టూన్ నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, యానిమేట్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, ఏఐ ఇమేజ్ జనరేషన్, ఏఐ వీడియో జనరేషన్, యానిమేషన్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, వీడియో ఎడిటింగ్ స్టైపెండ్: రూ.5,000-15,000 ☛ https://shorturl.at/ezQ4p

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: రిలయబుల్ ఫస్ట్ యాడ్‌కాన్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్
స్టైపెండ్: రూ.2,000-4,000
☛ https://shorturl.at/8DpEl

డీప్‌నెక్సస్ ఎస్‌లో

1. ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్

నైపుణ్యాలు: హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, పైథాన్ స్టైపెండ్: రూ.17,000-23,000 ☛ https://shorturl.at/santn

2. స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్ పార్టనర్

నైపుణ్యం: ఇంగ్లిష్ మాట్లాడటం స్టైపెండ్: రూ.2,000- 84,000 (ఇన్సెంటివ్స్‌తో కలిపి) ☛ https://shorturl.at/KQSk9

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: జూన్ 6



ఈనాడు ప్రతిభ

కరెంట్ అఫైర్స్



● భారతదేశ తొలి మహిళా న్యాయ కార్యదర్శిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?

జ: అంజూ రాఠీ రాణా (ఇండియన్ లీగల్ సర్వీస్ (ఐఎల్ఎస్) అధికారిణి అయిన ఈమె మహిళా న్యాయ కార్యదర్శిగా చట్టపరమైన, రాజ్యాంగ విషయాలపై కేంద్ర ప్రభుత్వానికి సలహా ఇస్తారు.)

మాదిరి ప్రశ్నలు

● ఏ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎలక్ట్రానిక్స్ సిటీకి రతన్ టాటా పేరు పెట్టాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది?

జ: అస్సాం

● ఏటా మార్చి 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవంతో ముడిపడి ఉన్న మూడు ప్రధాన రంగులు ఏవి? (ఈ రంగులు మహిళా సమానత్వం, వారి హక్కుల కోసం పోరాటాన్ని సూచిస్తాయి.)

జ: ఊదా(పర్పుల్), ఆకుపచ్చ, తెలుపు

మరింత సమాచారం

● ప్రపంచ సుస్థిర అభివృద్ధి సదస్సు (డబ్ల్యూఎస్‌డీఎస్ – వరల్డ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సమ్మిట్) ను 2025, మార్చిలో ఏ నగరంలో నిర్వహించారు?
(ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (టీఈఆర్ఐ) ఈ సదస్సును నిర్వహించింది.)

జ: న్యూదిల్లీ

విద్యావ్యవస్థకు మూలాధారం!

పాఠశాల విద్యాప్రణాళిక, వనరులు

విద్యా ప్రణాళిక భావన: విద్యాప్రణాళికను ఆంగ్లంలో 'కరికులం' అంటారు. కరికులం లాటిన్ భాషలోని 'కర్రెరె' పదం నుంచి వచ్చింది. కర్రెరె అంటే 'పరుగు పందెం బాట' అని అర్థం. అంటే 'ధావన పథం' లేదా వ్యక్తి గమ్యస్థానాన్ని చేరడానికి పరుగెత్తే మార్గం.

నిర్వచనాలు: **ఆల్బర్టీ–ఆల్బర్టీ:** పాఠశాల విద్యాలక్ష్యాలను సాధించడానికి విద్యార్థి నిర్వహించిన కార్యకలాపాల సమాహారమే విద్యాప్రణాళిక.

ముర్రే: శిశువుకు ఏయే అనుభవాలను పాఠశాల ఎలా వినియోగిస్తుందో అవన్నీ కలిపితే విద్యాప్రణాళిక.

క్రో అండ్ క్రో: విద్యార్థి శారీరకంగా, మానసికంగా, భావావేశపరంగా, నైతికంగా వికాసం చెందేలా చేసే పాఠశాల కార్యకలాపాల మొత్తం విద్యాప్రణాళిక.

సేలర్–అలెగ్జాండర్: విద్యాప్రణాళిక అంటే కేవలం పాఠశాలల్లో విద్యార్థులు నేర్చుకోవాల్సిన విషయ వస్తువు కాదు.



మెథడాలజీ
సోషల్ స్టడీస్

విద్యాప్రణాళిక ఆవశ్యకత-ప్రాముఖ్యత: మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యావిధానాలు, విద్యాప్రణాళిక ఉండాలి. విద్యార్థుల మానసిక స్థాయి, వైయక్తిక భేదాలను దృష్టిలో ఉంచుకుని విద్యాప్రణాళిక నిర్మితమవుతుంది. ★ జాకబ్సన్ విద్యాప్రణాళికను రూపొందించేటప్పుడు 1) విద్యార్థి స్వభావం 2) విషయ స్వభావం 3) సమాజ స్వభావం అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ★ విద్యావ్యవస్థలో విద్యాప్రణాళిక ముఖ్యమైంది. విద్యావ్యవస్థకు అదే మూలాధారం.

విద్యాప్రణాళిక నిర్మాణ సూత్రాలు: ★ శిశు కేంద్రీకృత సూత్రం ★ సమాజ కేంద్రీకృత సూత్రం ★ సృజనాత్మక సూత్రం ★ ఉపయోగితా సూత్రం ★ విరామకాల సద్వినియోగ సూత్రం ★ జీవిత కేంద్రీకృత సూత్రం ★ కృత్యాకేంద్రీకృత సూత్రం ★ సరళతా సూత్రం ★ పరిరక్షణ సూత్రం ★ సమైక్యతా సూత్రం ★ సమగ్ర వ్యక్తిత్వ వికాస సూత్రం ★ పరిణామక్రమ ఆధారిత సూత్రం

జాతీయ, రాష్ట్ర విధానంపై ఆధారపడిన సాంఘికశాస్త్ర విద్యాప్రణాళిక: 1986 జాతీయ విద్యావిధానం 10 మౌలికాంశాలను సూచించింది. అవి.. ★ భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర ★ రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, బాధ్యతలు ★ జాతీయ భావనా వికాసం ★ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పరంపర ★ ప్రజాస్వామ్యం, సామ్యవాదం, లౌకికత్వం ★ స్త్రీ, పురుష సమానత్వం ★ పర్యావరణ పరిరక్షణ ★ సాంఘిక అవరోధాల తొలగింపు ★ చిన్న కుటుంబ భావన ★ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం.

కేంద్ర ప్రభుత్వ కార్యాచరణ పథకం, NCF 2005, APSCF 2011, సాంఘికశాస్త్ర విద్యాప్రణాళిక గురించి అనేక సూచనలు ఇచ్చాయి.

విద్యాప్రణాళిక వ్యవస్థీకరణ ఉపగమాలు: ★ మనోవైజ్ఞానిక ఉపగమం ★ తార్కిక ఉపగమం ★ ఏకకేంద్ర ఉపగమం ★ వర్తులాకార ఉపగమం ★ సహసంబంధ ఉపగమం ★ యూనిట్ ఉపగమం ★ అంశరీతి ఉపగమం ★ కాలానుగుణ ఉపగమం.


మరిన్ని వివరాలు



రచయిత: ఎం.సురేష్

వలయంలో కదిలే ఆవేశాలు!

విద్యుత్తు ఆవేశం ప్రవహించే రేటే విద్యుత్తు ప్రవాహం. వలయం (సర్క్యూట్)లోని ఒక బిందువు వద్ద విద్యుత్తు ఆవేశాలు ఎంత వేగంగా ప్రయాణిస్తున్నాయో ఆ ప్రవాహం వల్ల తెలుస్తుంది. విద్యుత్తు ఆధారిత పరికరాలన్నీ దీని ఆధారంగానే పని చేస్తుంటాయి. విద్యుత్తు ప్రవాహ నియమాలు, కొలిచే పరికరాలు, ఈ ప్రవాహాన్ని ఆపే నిరోధం, దాన్ని ప్రభావితం చేసే అంశాలు, వివిధ లోహాల విద్యుత్తు వాహక, నిరోధ స్వభావాలు, విద్యుదాఘాతం, విద్యుత్తు సామర్థ్యం లాంటి ప్రాథమికాంశాలపై పోటీ పరీక్షార్థులకు శాస్త్రీయ అవగాహనతోపాటు సంబంధిత ఫార్ములాల పరిజ్ఞానం ఉండాలి. శ్రేణి సంధానం, సమాంతర సంధానం మధ్య ఉన్న వ్యత్యాసాలు, వాటికి సంబంధించిన నిజజీవిత అనువర్తనాలు, వాటిని సులువుగా వివరించే కిర్కాఫ్ నియమాలను తెలుసుకోవాలి.



2025 మెగా డీఎస్సీ
కంటెంట్ - జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

విద్యుత్తు ప్రవాహం

కదిలే ఎలక్ట్రాన్‌ల ప్రవాహాన్ని కరెంట్ (విద్యుత్తు) అంటారు. ఒక సెకను కాలంలో తీగ మధ్యచ్ఛేద వైశాల్యం ద్వారా వెళ్లే విద్యుదావేశ పరిమాణాన్ని కూడా 'కరెంట్' అంటారు.

$\therefore i = \frac{q}{t}$



i = కరెంట్

q = విద్యుదావేశం

t = కాలం

ఒక కూలూంబ్ ఆవేశం ఒక సెకను కాలంలో ఏదైనా వాహక మధ్యచ్ఛేదం ద్వారా ప్రవహిస్తే, దాన్ని ఒక ఆంపియర్ అంటారు. SI యూనిట్ - ఆంపియర్ లేదా కూలూంబ్/సెకను. ప్రవాహ విద్యుత్తును కొలిచే పరికరాన్ని 'అమ్మీటర్' అంటారు. అమ్మీటర్‌ను వలయంలో శ్రేణి సంధానంలో ఏర్పాటు చేస్తారు.

విద్యుత్తు పొటెన్షియల్: ప్రమాణ విద్యుదావేశాన్ని అనంత దూరం నుంచి విద్యుత్తు క్షేత్రంలోకి కదిలించడానికి చేసిన పనిని 'పొటెన్షియల్' అంటారు.

❑ ఒక కూలూంబ్ విద్యుదావేశాన్ని అనంత దూరం నుంచి విద్యుత్తు క్షేత్రంలోకి కదిలించడానికి చేసిన పని ఒక జౌల్ అయితే ఆ పొటెన్షియల్ ఒక ఓల్ట్ అవుతుంది.


∴ SI యూనిట్ - ఓల్ట్ లేదా జౌల్/కూలూంబ్

$\therefore V = \frac{W}{q}$



విద్యుత్తు పొటెన్షియల్‌ను కొలిచే పరికరాన్ని 'ఓల్ట్ మీటర్' అంటారు. ఓల్ట్ మీటర్‌ను వలయంలో సమాంతర సంధానంలో ఏర్పాటు చేస్తారు.

పొటెన్షియల్ తేడా: ఒక మూసిన వలయంలో ఎలక్ట్రాన్‌లను ఒక బిందువు నుంచి మరొక బిందువుకు కదిలించడానికి చేసిన పనిని 'పొటెన్షియల్ తేడా' అంటారు.



❑ వలయంలో ఎలక్ట్రాన్‌లు అధిక పొటెన్షియల్ నుంచి అల్ప పొటెన్షియల్ దిశగా ప్రవహిస్తాయి.

$\therefore V = \frac{W}{q}$

❑ SI యూనిట్ - ఓల్ట్. దీన్ని కొలిచే పరికరం ఓల్ట్ మీటర్.

ఇంటిలోకి మెయిన్ సప్లై నుంచి వచ్చే రెండు తీగల మధ్య పొటెన్షియల్ తేడా 220V - 240V ఉంటుంది.

విద్యుచ్ఛాలక బలం: ఒక మూసిన వలయంలో ఏకాంక రుణావేశం ఉన్న ఎలక్ట్రాన్‌లను ఘటం ధన ధ్రువం నుంచి రుణ ధ్రువం వైపునకు కదిలించడానికి చేసిన పనిని 'విద్యుచ్ఛాలక బలం' అంటారు.

$\therefore V = \frac{W}{q}$

❑ SI యూనిట్ - ఓల్ట్. కొలిచే పరికరం - పొటెన్షియో మీటర్

ఓమ్ నియమం: ఒక మూసిన వలయంలో స్థిర ఉష్ణోగ్రత వద్ద వాహకం రెండు చివరల మధ్య ఉన్న పొటెన్షియల్ భేదం (V), వాహకం ద్వారా ప్రవహించే విద్యుత్తు ప్రవాహానికి (i) అనులోమానుపాతంలో ఉంటుంది. $\therefore V \propto i$

$V = Ri$ ఓమ్ నియమం

$\frac{V}{i} = R$ (స్థిరాంకం)




❑ R = నిరోధం

❑ ఓమ్ నియమం ఆధారంగా పదార్థాలు రెండు రకాలు. 1) ఓమీయ వాహకాలు 2) అఓమీయ వాహకాలు.

1) ఓమీయ వాహకాలు: ఓమ్ నియమాన్ని పాటించే వాహకాలను ఓమీయ వాహకాలంటారు. **ఉదా:** అన్ని లోహాలు

❑ **V - i గ్రాఫ్:** పొటెన్షియల్ తేడాను X- అక్షం మీద, విద్యుత్తు ప్రవాహం (i) ని Y- అక్షం మీద గుర్తించి గ్రాఫ్ గీస్తే మూల బిందువు నుంచి సరళరేఖ ఏర్పడుతుంది.




ఓమీయ వాహకాలు



2) అఓమీయ వాహకాలు: ఓమ్ నియమాన్ని పాటించని వాహకాలను 'అఓమీయ వాహకాలు' అంటారు. **ఉదా:** సిలికాన్, జర్మేనియం, ట్రాన్సిస్టర్, ఎల్ఈడీ, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, విద్యుత్తు విశ్లేష్యాలు మొదలైనవి.

❑ **V - i గ్రాఫ్:** పొటెన్షియల్ తేడా(V)ను X-అక్షం మీద, విద్యుత్తు ప్రవాహం (i)ను Y-అక్షం మీద తీసుకుని గ్రాఫ్‌గీస్తే మూల బిందువు నుంచి వక్రరేఖ వస్తుంది.



అఓమీయ వాహకాలు

మరిన్ని వివరాలు

నిరోధం: ఒక వలయంలో ఎలక్ట్రాన్‌ల ప్రవాహాన్ని వ్యతిరేకించే ధర్మాన్ని 'నిరోధం' అంటారు.

$\therefore R = \frac{V}{i}$

SI యూనిట్ ఓల్ట్/ఆంపియర్ లేదా ఓమ్(Ω)

నిరోధాన్ని ప్రభావితం చేసే అంశాలు:

1) ఉష్ణోగ్రత 2) వాహకం పొడవు (l) 3) వాహక మధ్యచ్ఛేద వైశాల్యం 4) పదార్థ స్వభావం

ఉష్ణోగ్రత పెరిగితే నిరోధం పెరుగుతుంది. ఉష్ణోగ్రత పెరుగుదలతో నిరోధం పెరగని పదార్థాలు సిలికాన్, జర్మేనియం.

❑ వాహకం పొడవు పెరిగితే నిరోధం పెరుగుతుంది. $\therefore R \propto l$ ....(1)

❑ వాహక మధ్యచ్ఛేద వైశాల్యం పెరిగితే నిరోధం తగ్గుతుంది.

$\therefore R \propto \frac{1}{A}$ ....(2)

పదార్థ స్వభావాన్ని బట్టి నిరోధం విలువ మారుతూ ఉంటుంది. **ఉదా:** వెండిలో నిరోధం తక్కువ, వాహకత్వం ఎక్కువ.

❑ ఇనుములో నిరోధం ఎక్కువ, వాహకత్వం తక్కువ.



(1), (2) ల నుంచి

$R \propto \frac{l}{A}$

$R = \rho \frac{l}{A}$ .... ρ = విశిష్ట నిరోధం

విశిష్ట నిరోధం: ప్రమాణ పొడవు, ప్రమాణ మధ్యచ్ఛేద వైశాల్యం ఉన్న వాహకం నిరోధాన్ని 'విశిష్ట నిరోధం' అంటారు.

$\rho = R.\frac{A}{l}$

❑ SI యూనిట్ - ఓమ్ మీటర్ (Ω - m)

❑ విశిష్ట నిరోధాన్ని 'నిరోధకత' అని కూడా అంటారు. ❑ విశిష్ట నిరోధం అనేది ఉష్ణోగ్రత, పదార్థ స్వభావంపై ఆధారపడుతుంది. విశిష్ట నిరోధం తక్కువగా ఉన్న పదార్థాలు మంచి లోహాలుగా ఉంటాయి.

ఉదా: రాగి (Cu), అల్యూమినియం(Al)

విద్యుత్తు బల్బుల్లో వాడే ఫిలమెంట్ టంగ్స్టన్‌కు విశిష్ట నిరోధం, ద్రవీభవన స్థానం రెండూ ఎక్కువ ($3422^{\circ}C$).

❑ విద్యుత్తు బంధకాల విశిష్ట నిరోధం విలువలు $\rightarrow 10^{14} - 10^{16}$ (Ω - m)

❑ మిశ్రమ లోహాల విశిష్ట నిరోధం విలువలు లోహాల విశిష్ట నిరోధానికి → 30 - 100 రెట్లు ఎక్కువ.

ఉదా: నిక్రోమ్ (Ni + Cr + Fe)

మాంగనీస్ (Cu + Mn + Ni)


86% 12% 2%



రచయిత: చంటి రాజుపాలెం

అతడే రెండో దేశద్రోహి!

మధ్యయుగంలో భారతదేశాన్ని ఆక్రమించి మూడు శతాబ్దాలకు పైగా దిల్లీ కేంద్రంగా పాలించిన అయిదు వేర్వేరు వంశాల పాలకులే దిల్లీ సుల్తానులు. భారతదేశంలో ముస్లిం మతవ్యాప్తికి, పలు సాంస్కృతిక, ఆర్థిక మార్పులకు వీరు నాంది పలికారు. మధ్యభారతం వరకు రాజ్యాన్ని విస్తరించారు. బానిస, ఖిల్జీ, తుగ్లక్, సయ్యద్, లోడీ వంశాలుగా సాగిన వీరి పాలనా కాలం విశేషాలు, ఒక్కో వంశంలోని ప్రముఖులు, వారి ప్రత్యేకతలు, తెచ్చిన మార్పులు, సంస్కరణలు, సైనిక విధానాలు పోటీ పరీక్షార్థులకు తెలిసి ఉండాలి. సుల్తానుల గురించి తెలిపే చారిత్రక ఆధారాలు, నిర్మాణాలతోపాటు నాటి ముస్లిం పాలకులకు ఎదురు నిలిచిన స్వదేశీ రాజులు, రాజవంశాలపై అవగాహన పెంచుకోవాలి.



జయ చంద్రుడు

డీఎస్సీ - 2025: భారతదేశ చరిత్ర

దిల్లీ సుల్తానుల యుగం

1. కింది వాటిలో మధ్యయుగం నాటి రాజ్యాల్లో లేని ప్రాంతం?
   1) అమరావతి 2) కళింగ
   3) పాటలీపుత్రం 4) మాల్వా
2. కింది వర్గీకరణలో మధ్యయుగాన్ని గుర్తించండి.
   1) 1 నుంచి 8వ శతాబ్దం
   2) 7 నుంచి 18వ శతాబ్దం
   3) 8 నుంచి 17వ శతాబ్దం
   4) 8 నుంచి 18వ శతాబ్దం
3. ప్రాచీన కాలం నాటి సంఘటనల సమాహారాన్ని ..... అంటారు.
   1) పౌర శాస్త్రం 2) చరిత్ర
   3) భూగోళ శాస్త్రం 4) ఆర్థిక శాస్త్రం
4. చరిత్రను గురించి తెలుసుకోవడానికి ప్రధాన ఆధారాలు?
   1) పురావస్తు ఆధారాలు 2) లిఖిత ఆధారాలు
   3) 1, 2 4) దేవాలయాలు
5. కింది వాటిలో లిఖిత ఆధారం కానిది?
   1) విదేశీ సాహిత్యం 2) స్వదేశీ సాహిత్యం
   3) జనపద సాహిత్యం 4) శిలాశాసనాలు



కుతుబుద్దీన్ ఐబక్



ఇల్-టుట్-మిష్

6. కింది వాటిలో పురావస్తు ఆధారం కానిది?
   1) తిరుపతి 2) కొండపల్లి
   3) జనపద సాహిత్యం 4) తబాంగ్
7. కింది వాటిని వరుసలో అమర్చండి.
   ఎ) బానిస బి) ఖిల్జీ సి) సయ్యద్ డి) లోడీ
   1) ఎ, బి, సి, డి 2) సి, డి, ఎ, బి
   3) సి, బి, ఎ, డి 4) బి, ఎ, సి, డి
8. దిల్లీ లేదా దిల్లిక పురాన్ని నిర్మించిన రాజవంశం?
   1) చహమాన్ 2) చౌహాన్
   3) తోమార 4) దిల్లీ సుల్తానులు
9. దిల్లీ వాణిజ్య కేంద్రంగా వీరికాలంలో అభివృద్ధి చెందింది?
   1) చహమాన్ 2) తోమార
   3) దిల్లీ సుల్తానులు 4) 1, 3
10. కింది వారిలో దిల్లీని రాజధానిగా చేసుకుని పరిపాలించిన రాజవంశం?
    1) మొగల్ 2) దిల్లీ సుల్తానులు
    3) చౌహానులు 4) తోమార
11. ఖాసీమ్ భారతదేశంపై దాడి చేసిన సంవత్సరం
    1) 1190 2) 997
    3) 799 4) 712
12. 2వ తరైన్ యుద్ధంలో మరణించిన పృథ్వీరాజ్ చౌహాన్ సోదరుడు?
    1) రామరాజు 2) గోవిందరాజు
    3) భాగ్యరాజు 4) పైవారందరూ
13. 2వ తరైన్ యుద్ధం జరిగిన సంవత్సరం?
    1) 1190 2) 1192
    3) 1191 4) 1030
14. రెండో దేశద్రోహిగా ఎవరిని పిలుస్తారు?
    1) అంబి 2) జయ చంద్రుడు
    3) బహులాల్ లోడి 4) ఘోరి
15. ఇల్–టుట్–మిష్ రాజధానిని ఏ ప్రాంతం నుంచి ఏ ప్రాంతానికి మార్చాడు?
    1) దిల్లీ - లాహోర్ 2) లాహోర్ - దిల్లీ
    3) లాహోర్ - కాన్పుర్ 4) దిల్లీ - దేవగిరి
16. దేశంలో వాస్తవ దిల్లీ సుల్తాన్ సామ్రాజ్య స్థాపకుడు?
    1) ఘోరి 2) ఐబక్
    3) ఇల్-టుట్-మిష్ 4) అల్లావుద్దీన్ ఖిల్జీ
17. దిల్లీని పరిపాలించిన మహిళా పాలకురాలి వంశం?
    1) బానిస 2) ఖిల్జీ
    3) తుగ్లక్ 4) సయ్యద్
18. కింది వారిలో బానిస వంశ స్థాపకుడు?
    1) ఐబక్ 2) ఖిల్జీ
    3) ఇల్-టుట్-మిష్ 4) బాల్బన్
19. కింది వారిలో బానిస వంశంలో అగ్రగణ్యుడు?
    1) ఐబక్ 2) మిష్
    3) కైమూర్ 4) బాల్బన్
20. బానిస వంశంలో చివరివాడు?
    1) కైకుబాద్ 2) కైమూర్
    3) మహమ్మద్ 4) బాల్బన్
21. ఖిల్జీ వంశంలో గొప్పవాడు?
    1) జలాయిద్దీన్ 2) మాలిక్ కాఫర్
    3) అల్లావుద్దీన్ 4) మహ్మద్‌బీన్ తుగ్లక్
22. అల్లావుద్దీన్ ఖిల్జీ చిత్తోర్ ఆక్రమణ సమయంలో ఆ ప్రాంత రాజు?
    1) కర్ణదేవుడు 2) రతన్‌సింగ్
    3) దీవలదేవుడు 4) హరివీర దేవుడు
23. ఖిల్జీ వంశ ప్రారంభికుడు?
    1) అల్లావుద్దీన్ 2) బహులాల్
    3) ఖిజిర్‌ఖాన్ 4) జలాల్
24. దిల్లీ సుల్తానుల్లో చివరివాడు?
    1) కైమూర్ 2) బాల్బన్
    3) ఇబ్రహీం లోడి 4) బహులాల్ లోడి
25. రాగి నాణేలు ముద్రించి చెలామణి చేసిన రాజు?
    1) అల్లావుద్దీన్ 2) మహ్మద్‌బీన్ తుగ్లక్
    3) ఖిజిర్‌ఖాన్ 4) ఇబ్రహీం లోడి
26. అల్లావుద్దీన్ ఖిల్జీకి సంబంధించి సరికానిది?
    1) మార్కెట్ సంస్కరణలు
    2) సిద్ధి సైన్యం ఏర్పాటు
    3) బానిసల పోషణ 4) గూఢచారి వ్యవస్థ



కుతుబ్‌మినార్

27. అమీర్ ఖుస్రూ ఎవరి ఆస్థానంలో ఉన్నారు?
    1) జలాలుద్దీన్ 2) బాల్బన్
    3) అల్లావుద్దీన్ 4) రజియా
28. అల్లావుద్దీన్ ఖిల్జీ సైనిక అధికారులు..
    1) నస్రత్ ఖాన్ 2) మాలిక్ కాఫర్
    3) బాల్బన్ 4) 1, 2
29. సయ్యద్ వంశ స్థాపకుడు?
    1) ఖిజిర్ ఖాన్ 2) ఆలాంషా
    3) మహ్మద్‌షా 4) బహులాల్
30. లోడి వంశంలో చివరివాడు?
    1) బహులాల్ 2) ముబారక్ షా
    3) ఆలాంషా 4) ఇబ్రహీం
31. ప్రిన్స్ ఆఫ్ మనీయర్స్‌గా గుర్తింపు పొందిన రాజు?
    1) అల్లావుద్దీన్ 2) బాల్బన్
    3) ప్రిన్స్ జునాఖాన్ 4) కైకూబాద్
32. కింది వాటిలో తుగ్లక్ కాలం నాటి ప్రధాన ప్రాంతం కానిది?
    1) లాహోర్ 2) దేవగిరి
    3) మధుర 4) కళింగ
33. కిందివాటిని వరుసలో అమర్చండి.
    ఎ) బహులాల్ బి) బాల్బన్
    సి) అల్లావుద్దీన్ డి) ఇల్-టుట్-మిష్
    1) ఎ, బి, సి, డి 2) డి, సి, బి, ఎ
    3) ఎ, డి, సి, బి 4) డి, బి, సి, ఎ
34. దౌలతాబాద్‌కు మరొక పేరు?
    1) దేవగిరి 2) దిల్లీక పురం
    3) దిల్లీ 4) ఇంద్రప్రస్థం
35. దిల్లీ సుల్తానుల కాలం నాటి రాగి, వెండి నాణేలు వరుసగా..
    1) టంకా - జితాల్ 2) జితాల్ - టంకా
    3) జితాల్ - బిసాంత్ 4) బిసాంత్ - టంకా
36. బందిగానాను ఏర్పాటు చేసింది?
    1) బాల్బన్ 2) ఇల్-టుట్-మిష్
    3) రజియా 4) కైమూర్
37. దిల్లీ సుల్తానుల కాలంలో పన్ను శాతం?
    1) 1/3 2) 2/3 3) 1/6 4) 2/6
38. ఇక్తా పరిపాలన అధికారి?
    1) ముక్తి 2) షిక్‌దార్
    3) 1, 2 4) ఇనాందార్
39. దిల్లీ సుల్తానుల కాలంలో రాజ్యానికి సర్వాధికారి?
    1) సుల్తాన్ 2) అమీర్
    3) షిక్‌దార్ 4) ముక్తిదార్
40. దిల్లీ సుల్తానుల కాలంలో సమాజంలో అధిక పదవులు పొందిన వారు?
    1) స్థానిక ముస్లింలు 2) హిందువులు
    3) విదేశీ ముస్లింలు 4) విదేశీ హిందువులు
41. ఇక్తా పరిపాలన అధికారికి సంబంధించి సరికానిది.
    ఎ) ఈ పదవి వంశపారంపర్యం కాదు.
    బి) వీరు ఇక్తాలలో పన్ను వసూలు చేయరు.
    సి) వీరు రాజు సహాయార్థం సైన్యాన్ని పోషిస్తారు.
    డి) వీరు ఒకే ప్రాంతంలో స్థిరంగా ఉంటారు.
    1) ఎ 2) ఎ, సి
    3) బి, డి 4) సి, డి
42. దిల్లీ సుల్తానుల కాలంలో ప్రధాన ఎగుమతుల్లో లేనిది?
    1) వస్త్రాలు 2) ముత్యాలు
    3) నీలిమందు 4) బంగారం
43. కుతుబ్‌మినార్ సరాసరి ఎత్తు?
    1) 74.1 మీ. 2) 72.1 అడుగులు
    3) 225 మీ. 4) పైవన్నీ
44. అలై దర్వాజాను నిర్మించినవారు?
    1) అల్లావుద్దీన్ ఖిల్జీ 2) ఐబక్
    3) జలాలుద్దీన్ ఖిల్జీ 4) కైమూర్
45. దిల్లీ సుల్తానుల యుగంగా పిలిచే కాలం
    1) 1206-1526 2) 1206-1556
    3) 1192-1526 4) 1206-1726
46. కితాబ్ – ఉల్ – హింద్ / తహ్‌కికా – ఇ– హింద్ అనే గ్రంథాన్ని రాసిన అరబిక్ పండితుడు?
    1) ఆల్‌బెరూని 2) ఇసులిడ్
    3) ఇబన్ బటుట 4) మహ్మద్ గజనీ
47. పతంజలి వ్యాకరణాన్ని అరబిక్ భాషలోకి అనువదించినవారు?
    1) ఆల్‌బెరూని 2) అల్ మసూద్
    3) ఇబన్ బటుట 4) అబుల్ ఫజల్
48. గ్రీకు పండితుడు 'ఇసులిడ్' గణిత శాస్త్రాన్ని అరబిక్ భాషలోకి అనువదించింది ఎవరు?
    1) ఆల్‌బెరూని 2) అబుల్ ఫజల్
    3) ఇబన్ బటుట 4) అల్ మసూద్
49. ఆల్‌బెరూని ఏ రాజు ఆస్థానంలో ఉండేవారు?
    1) మహ్మద్ ఘోరి 2) మహ్మద్ గజనీ
    3) కుతుబుద్దీన్ ఐబక్ 4) ఇల్-టుట్-మిష్
50. 'రెహలా' గ్రంథ రచయిత?
    1) ఇబన్ బటుట 2) అబుల్ ఫజల్
    3) ఆల్‌బెరూని 4) ఐబక్
51. ఇబన్ – బటుట ఏ దేశానికి చెందినవాడు?
    1) ఇరాన్ 2) పర్షియా
    3) ఇరాక్ 4) మొరాకో
52. ఇబన్ – బటుట ఏ దిల్లీ సుల్తానుకు సమకాలీనుడు?
    1) మహ్మద్ ఘోరి
    2) మహ్మద్ గజనీ
    3) మహ్మద్ బీన్ తుగ్లక్
    4) ఇల్-టుట్-మిష్



రచయిత: గద్దె నరసింహారావు

సమాధానాలు

1-3; 2-4; 3-2; 4-3; 5-4; 6-3; 7-1; 8-3; 9-4; 10-4; 11-4; 12-2; 13-2; 14-2; 15-2; 16-3; 17-1; 18-1; 19-4; 20-2; 21-3; 22-2; 23-4; 24-3; 25-2; 26-3; 27-3; 28-4; 29-1; 30-4; 31-3; 32-4; 33-4; 34-1; 35-2; 36-2; 37-1; 38-3; 39-1; 40-3; 41-3; 42-4; 43-1; 44-1; 45-1; 46-1; 47-1; 48-1; 49-2; 50-1; 51-4; 52-3.

అమ్మ.. ప్రతి ఇంటి హృదయ స్పందన

• ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: "అమ్మ మొదటి గురువు మాత్రమే కాదు.. ప్రతి ఇంటి హృదయ స్పందన, తరాలుగా మార్గదర్శనం చేస్తున్న శక్తి" అని సీఎం చంద్రబాబు కొనియాడారు. మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం ఎక్స్ వేదికగా తల్లులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. "బిడ్డకు నైతిక విలువలు నేర్పడం మొదలు జాతి మౌలిక నిర్మాణాన్ని మలచడం వరకూ తల్లి పాత్ర అమూల్యమైంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఓడినా గెలిచినా వెంట నిలిచింది అమ్మే

• విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: "నన్ను ఈ లోకానికి పరిచయం చేసింది అమ్మ. నడిపించింది, నడక నేర్పింది అమ్మే. ఓడినా, గెలిచినా వెంట నిలిచింది అమ్మే" అని నారా భువనేశ్వరిని ఉద్దేశించి విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మదర్స్ డే సందర్భంగా ఆదివారం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

తల్లుల ప్రేమ, బలం, త్యాగం అనిర్వచనీయమైనది: జగన్

ఈనాడు డిజిటల్, అమరావతి: తల్లుల ప్రేమ, బలం, త్యాగం అనిర్వచనీయమైనదని వైకాపా అధినేత జగన్ కొనియాడారు. మాతృదినోత్సవం సందర్భంగా ఆదివారం ఎక్స్ వేదికగా విజయమ్మకు శుభాకాంక్షలు తెలిపారు.

నా భర్త విడుదలకు మమత జోక్యం చేసుకోవాలి

• జవాన్ పూర్ణం కుమార్ సాహు సతీమణి

కోల్‌కతా: పాకిస్థాన్ చెరలో ఉన్న తన భర్తను విడిపించే విషయంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జోక్యం చేసుకోవాలని బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పూర్ణం కుమార్ సాహు సతీమణి రజనీ సాహు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై త్వరలో బెంగాల్ సీఎంను కలుస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 23న పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు దాటిన కుమార్‌ను పాకిస్థాన్ రేంజర్లు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.



మీరు తాగే ప్రతి గ్లాసు మద్యంతో..

మద్యాన్ని శరీరం విషపదార్థంలా చూస్తుంది. మద్యం తాగిన ప్రతిసారీ మీ జీవక్రియలకు ఇబ్బందులు ఎదురవుతాయి. కొవ్వు కరగడం, కండరాల మరమ్మతు, జీర్ణక్రియ.. ఇవన్నీ మద్యం ప్రభావం తొలగిపోయేదాకా దాదాపు స్తంభించిపోతాయి. మరేం పర్లేదనుకుంటూ 2-3 రోజులకోసారి మీరు తాగే ప్రతి గ్లాసు మద్యం.. మీ పురోగతిని దెబ్బతీస్తూ ఉంటుంది.

– క్రిస్ బొయెచర్, వైద్యుడు

మందుల నాణ్యత పరీక్షలకూ కష్టాలే

• పరిమితంగా నమూనాల సేకరణ
• 3 కొత్త ప్రయోగశాలలను వినియోగంలోకి తెస్తే ప్రయోజనం

ఈనాడు, అమరావతి: ప్రజలకు అవసరమైన మందుల నాణ్యత గుర్తింపు రాష్ట్రంలో ఓ ప్రహసనంగా మారింది. వైద్య ఆరోగ్య శాఖ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు సేకరించే మందుల నమూనాలకు తగ్గట్లు ప్రయోగశాలలు (ల్యాబ్స్) లేకపోవడంతో పరిస్థితులు చేజారే అవకాశం ఉంది. ఒక మందు సురక్షితమా? కాదా.. అది పనిచేస్తుందా? లేదా? అన్న విషయాన్ని వినియోగదారులు (వాసన, స్పర్శ, దృష్టి ద్వారా) గుర్తించలేరు. కొన్ని మందుల పనితీరు వెంటనే తెలియదు. సంబంధిత కంపెనీల వారు బ్యాచ్‌లవారీగా తయారు చేసే మందుల నమూనాలను సేకరణ, పరీక్షలను లోతుగా, అత్యధిక సంఖ్యలో నిర్వహించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో అంతంత మాత్రంగానే జరుగుతోంది. విజయవాడలో రాష్ట్ర స్థాయి, విశాఖ, కర్నూలుల్లో ప్రాంతీయ ప్రయోగశాలలను వినియోగంలోకి తీసుకురావడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనివల్ల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నెలకు 15-20 బదులు ప్రస్తుతం 7-10 మధ్య మాత్రమే నమూనాలు సేకరిస్తున్నారు. అది కూడా మాత్రలకు పరిమితమవుతున్నాయి. సిరప్ పరీక్షలు లోతుగా చేసేందుకు కుదరడంలేదు. మెడికేటెడ్ సబ్బులు, పౌడర్లు, క్రీములు కూడా పరీక్షించడం లేదు. ప్రధానమైన ఇంజెక్షన్ల నాణ్యతా పరీక్షలు రాష్ట్రంలో జరగడంలేదు. ఇందుకు అవసరమైన మైక్రోబయాలజీ ల్యాబ్ రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో ఏర్పడలేదు. రాష్ట్రంలో 40వేల వరకు ప్రైవేట్ మందుల దుకాణాలు ఉన్నాయి.

2017 నుంచి నిర్మాణంలోనే..

• విజయవాడలోని నూతన జీజీహెచ్ ఆవరణలో ఉన్న ఏకైక రాష్ట్ర స్థాయి ల్యాబ్‌లో మాత్రం నాణ్యతను పరీక్షిస్తున్నారు. ఒక్కో నమూనా పరీక్ష ఫలితం వెలువడేందుకు 2 నెలల వరకు సమయం పడుతోంది. దీనివల్ల నమూనాలను తక్కువగా తీసుకున్నారు. దీని స్థానంలో పాత జీజీహెచ్ వద్ద ఆధునిక వసతులతో రాష్ట్ర స్థాయి ల్యాబ్ ఏర్పాటుకు అవసరమైన భవనాల నిర్మాణాలు 2017 నుంచి నత్తనడకన సాగుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వం దీనిని పూర్తిగా పక్కనపెట్టేసింది. వెంటనే నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉంది. ఇక్కడే ఇంజెక్షన్ల పరీక్షకు అవసరమైన మైక్రోబయాలజీ ల్యాబ్ ఏర్పాటుకు కూడా నిర్మాణాలు చేపట్టారు.

• కర్నూలు, విశాఖల్లో ప్రాంతీయ ప్రయోగశాలల నిర్మాణాలు పూర్తయ్యే దశకు వచ్చినప్పటికీ ఇంకా ముఖ్యమైన పరికరాలు కొనుగోలు చేయలేదు. ఈ రెండు చోట్ల కనీస స్థాయిలో పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు సిద్ధంగా ఉన్నాయి. ఒక్కో ల్యాబ్‌కు వివిధ హోదాల్లో కలిపి 8 మంది చొప్పున అవసరమవుతారు. ఈ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటే వినియోగంలోకి వస్తాయి.

• ఈ 3 ప్రయోగశాలల కోసం గతంలో కేంద్రం 60:40 నిష్పత్తిలో రూ.50 కోట్ల వరకు మంజూరుచేసింది. నిధులు కూడా పంపింది. ఈ నిధులు వైద్య ఆరోగ్యశాఖకు చేరడంలో జాప్యం జరుగుతోంది.

• ఈ మూడింట్లో పూర్తిస్థాయిలో పరికరాలు, మౌలిక సదుపాయాలు, నిర్మాణాలు పూర్తిచేసేందుకు తక్షణం రూ.19 కోట్ల వరకు అవసరం ఉందని అంచనా.

• కర్నూలు, విశాఖల్లోని ప్రాంతీయ ప్రయోగశాలలు వినియోగంలోకి వస్తే చుట్టుపక్కల జిల్లాల్లో మందుల దుకాణాల నుంచి సేకరించిన నమూనాలను త్వరగా పరీక్షించేందుకు వీలు ఏర్పడుతుంది. కర్ణాటక రాష్ట్రంలో కొంతకాలం కిందట నాణ్యతలేని ఇంజెక్షన్ల వాడకం వివాదాస్పదమైంది. ఆ కంపెనీ వారు రాష్ట్రానికి ఇంజెక్షన్లను సరఫరా చేస్తున్నారు. ఇక్కడ నమూనాలు సేకరించి, కోల్‌కతాలోని కేంద్ర ప్రభుత్వ టెస్టింగ్ సెంటర్‌కు పంపిస్తే రకరకాల సమస్యలు తలెత్తాయి. విలువైన సమయం వృథా అయింది. ఇలా అడపాదడపా జరుగుతూనే ఉంది.

సమయం ఆదా..

ప్రభుత్వాసుపత్రులకు పంపిణీ చేసే మందుల నమూనాల నాణ్యత నిర్ధారణ పరీక్షలను ముంబయి, పుణె, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ వంటిచోట్ల చేయిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఏటా రూ.కోటి వరకు ఖర్చుపెడుతోంది. కంపెనీల నుంచి ఆసుపత్రులకు వస్తున్న మందులను వాడేందుకు నమూనాల నాణ్యత పరీక్షల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఈ ప్రయోగశాలలు వినియోగంలోకి తెస్తే సమస్యలు పరిష్కారమవుతాయి.

• వైద్య ఆరోగ్య శాఖలో కీలకమైన డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి.. శాశ్వత డైరెక్టర్ జనరల్ అవసరం ఉంది. గత కొన్నేళ్ల నుంచి ఇన్‌ఛార్జులుగా నియమితులయ్యే వారు తరచూ మారుతున్నందున మందుల పరీక్షల్లో పర్యవేక్షణ అదుపు తప్పింది. ఉద్యోగుల పదోన్నతులు, సర్వీసు వివాదాలు సైతం ఉన్నాయి.

విద్యారంగ సమస్యలపై నేడు ధర్నాలు, నిరసనలు: యూటీఎఫ్

ఈనాడు, అమరావతి: పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సమస్యలపై పాఠశాల విద్యాశాఖ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సోమవారం అన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయాల వద్ద ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్ తెలిపారు. "గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో ప్రతి వారం అధికారులు సమావేశమై చర్చిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తున్న ప్రధాన సమస్యలపై విద్యాశాఖాధికారులు స్పందించడం లేదు. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి, పనిభారం పెంచింది. జీఓ-117 రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం దానికి విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణించడం విచారకరం. ఉన్నత పాఠశాలల్లో 54 మంది విద్యార్థులుంటేనే రెండో పోస్టు కేటాయిస్తామనే వైఖరి తీసుకోవడంతో వేల పోస్టులు మిగులుగా తేలుతున్నాయి. సమస్యలను పరిష్కరించకపోతే 15న వేల మంది ఉపాధ్యాయులతో విద్యాభవన్‌ను ముట్టడిస్తాం" అని హెచ్చరించారు.

హేతుబద్ధీకరణలో ఆ టీచర్లకు న్యాయం చేయండి: టీఎన్‌యూఎస్

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణకు రూపొందించిన నిబంధనల్లో కొన్ని అసంబద్ధంగా ఉన్నాయని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తెలిపారు. "గతంలో కొంతమంది టీచర్లు 8 ఏళ్ల సర్వీసు పూర్తి కాకుండానే రేషనలైజేషన్‌కు గురయ్యారు. వీరిలో కొందరు కొత్త పాఠశాలకు వచ్చి రెండేళ్లు కాకుండానే మళ్లీ ఆ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారికి రేషనలైజేషన్ పాయింట్లతోపాటు పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాలి. జూనియర్‌కి మాత్రమే ఐదు పాయింట్లు ఇస్తామనడం సమంజసం కాదు" అని కోరారు.

అణు కార్యక్రమంపై ఇరాన్-అమెరికా మధ్య ముగిసిన నాలుగో దశ చర్చలు

దుబాయ్: ఉద్ధృతంగా కొనసాగుతున్న టెహ్రాన్ అణు కార్యక్రమానికి సంబంధించి ఇరాన్-అమెరికా మధ్య నాలుగో దశ చర్చలు ఆదివారం ముగిశాయి. ఈ వారంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియా పర్యటనకు రావడానికి ముందు ఈ చర్చలు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఒమన్ రాజధాని మస్కట్‌లో మూడు గంటల పాటు ఈ చర్చలు కొనసాగినట్లు అమెరికాకు చెందిన ఓ అధికారి చెప్పారు. తదుపరి దశ చర్చలకు సంబంధించి ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. తాజా చర్చలు క్లిష్టంగానే కొనసాగినప్పటికీ ఫలప్రదంగా ముగిశాయని ఆయన అన్నారు. మరోవైపు అమెరికా ప్రతినిధులు కూడా తాజా దశ చర్చలపై సంతృప్తికరంగానే ఉన్నట్లు తెలుస్తోంది. "ఈ దఫా చర్చల ద్వారా సాధించిన పురోగతి మాలో ఉత్సాహం నింపింది. తదుపరి దశ చర్చల కోసం మేం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. సమీప భవిష్యత్తులోనే అవి జరగొచ్చు. ముమ్మందూ ఈ తరహాలోనే చర్చలు కొనసాగించాలని ఇరు పక్షాలూ అంగీకారానికి వచ్చాయి" అని అమెరికా అధికారి చెప్పారు. ప్రత్యక్ష, పరోక్ష విధానాల్లో ఈ చర్చలు జరిగినట్లు ఆయన చెప్పారు. అయితే ఇరాన్ మాత్రం అవి పరోక్ష విధానంలో మాత్రమే జరిగినట్లు నొక్కి చెప్పింది. అంతర్గత రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలోనే ఇరాన్ ఈ విధంగా స్పందించినట్లు తెలుస్తోంది. టెహ్రాన్ అణుకార్యక్రమంపై ప్రపంచ దేశాల్లో ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో, దాని కార్యకలాపాలను పరిమితం చేసేలా ఇరాన్‌ను ఒప్పించే లక్ష్యంతో అమెరికా ఈ చర్చలు జరుపుతోంది. అందుకు ప్రతిగా ఇరాన్‌పై విధించిన పలు ఆర్థిక ఆంక్షలను ఎత్తివేస్తామని అగ్రరాజ్యం ప్రతిపాదిస్తోంది. అయితే అణు కార్యక్రమంపై ఇరాన్ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. "అణు ఇంధన శుద్ధి కార్యక్రమం అనేది ఇరాన్ సాధించిన ఉత్తమ విజయాలు, గౌరవాల్లో ఒకటి. ఈ విషయంలో ఇరాన్ రాజీ పడదు. అది ఇరాన్ ప్రజల హక్కు" అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి టెహ్రాన్ నుంచి మస్కట్‌కు వెళ్లే ముందు పేర్కొనడం గమనార్హం.

తమిళనాడు ప్రజల మేలుకు జనసేన తోడ్పాటు

• ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



ఈనాడు డిజిటల్, అమరావతి: 'రాజకీయం బాధ్యత.. అధికారం అంటే ప్రజాక్షేమాన్ని ఆలోచించే మార్గమని నేను నమ్ముతా. అదే భావనతో జనసేన పార్టీని స్థాపించా. ఓట్లు, సీట్ల లెక్కలు వేసుకోకుండా ప్రజలకు మేలుచేసే దారిలో ముందుకెళ్లాం. ప్రజలు దాన్ని అర్థం చేసుకుని ఆశీర్వదించారు. తమిళనాడు ప్రజలకు మేలుచేసే విషయాల్లో అవసరమైన తోడ్పాటు అందిస్తాం' అని జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో తమిళనాడుకు చెందిన రచయిత, పర్యావరణ ఉద్యమకారుడు కేఎస్ రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో తమిళ రచయిత, పబ్లిషర్ మరవన్‌పులవు కె.సచ్చిదానందన్, ఎంజీఆర్ మనవడు సత్యరాజేంద్రన్, పలు ప్రజాసంఘాల నాయకులు, విద్యావంతులతో కూడిన బృందం శనివారం పవన్ కల్యాణ్‌తో సమావేశమైంది. తమిళనాడులోని వర్తమాన రాజకీయ, పాలనాపరమైన పరిస్థితులు, ఆ రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, సంస్కృతి, ధర్మ పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడారు.

బలమైన నాయకత్వంలోనే ప్రజలు భద్రం

'తమిళనాడులోని సమస్యలు నా దృష్టిలో ఉన్నాయి. వాటి పరిష్కారానికి జనసేన తన వంతు తోడ్పాటు అందిస్తుంది. ప్రజలకు మేలు చేకూరాలంటే బలమైన నాయకత్వం ఉండాలి. అప్పుడే భద్రంగా ఉన్నామనే భావన ప్రజల్లో కలుగుతుంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా మనం ఎంతటి శక్తిసామర్థ్యాలతో ఉన్నామో ప్రపంచం గుర్తించింది. అందుకు దేశానికి బలమైన నాయకత్వం ఉండటమే కారణం. సమాజంలో ఐక్యత ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యం' అని స్పష్టం చేశారు. 'మాజీ సీఎంలు ఎంజీఆర్, జయలలితలు శాంతిభద్రతలతోపాటు భిన్నత్వంలో ఏకత్వం, సామాజిక ఐక్యతకు ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆ స్ఫూర్తిని కొనసాగించాలి' అని సూచించారు. 'ఎన్నో విశిష్టతల సమాహారం ద్రవిడ భూమి. ఏ రాష్ట్రంలో అయినా స్థిరమైన నాయకత్వం కావాలంటే ఎన్నికల్లో ఓట్ల చీలికను అరికట్టడం ముఖ్యం. దేశాభివృద్ధికి భవిష్యత్తు రాజకీయాల్లో బలమైన పొత్తు అవసరం ఉందని నమ్ముతా. దానివల్ల ప్రజలకు మేలు కలుగుతుంది' అని వివరించారు.

మురళీనాయక్ సంకల్పం.. మాతృభూమిపై ప్రేమకు నిదర్శనం

• ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు డిజిటల్, అమరావతి: గిరిజన కుగ్రామం నుంచి అగ్నివీరునిగా దేశరక్షణలో మురళీనాయక్ సాగించిన ప్రయాణం, అతని సంకల్పం, మాతృభూమి పట్ల అపారమైన ప్రేమని తెలియజేస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కొనియాడారు. ఇతర ఉద్యోగావకాశాలు ఉన్నప్పటికీ ఆయన ఆర్మీని ఎంచుకున్నాడని, ఇది దేశానికి సేవ చేయాలనే అతని నిబద్ధతను ప్రతిబింబిస్తోందని ఆదివారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'సైనికుడికి కన్నీటి వీడ్కోలు పలికేందుకు తరలివచ్చిన అశేష జనసందోహం.. ఆయన కుటుంబం ఒంటరి కాదనడానికి నిదర్శనం' అని పేర్కొన్నారు.

కుటుంబానికి ధైర్యాన్నిచ్చే ప్రయత్నం చేశా: ఎక్స్‌లో మంత్రి లోకేశ్

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియల్లో పాల్గొని.. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిచ్చే ప్రయత్నం చేసినట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఎక్స్ వేదికగా మురళీ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మట్టిగోడలు.. వేపాకులు.. చెక్‌డ్యాములు

వేడి తీవ్రతల నివారణకు మళ్లీ మూలాల్లోకి మళ్లుతున్న గ్రామీణ భారతం

దిల్లీ: నానాటికీ పెరుగుతున్న భూతాపంతో ఏ ఏటికాయేడు ఉష్ణోగ్రతలు పెరుగుతూ పోతుండగా.. దేశంలో వేడిగాలులకు గురయ్యే రాష్ట్రాల్లోని గ్రామీణ సమాజాలు అధిక ఉష్ణోగ్రతల నుంచి తమను తాము రక్షించుకోడానికి తక్కువ ఖర్చుతో కూడిన సంప్రదాయ పరిష్కారాల వైపు మొగ్గు చూపుతున్నాయి. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, గుజరాత్, రాజస్థాన్ వంటి ఉత్తర, పశ్చిమ భారత రాష్ట్రాల్లో వేడిగాలులు వీచే రోజుల సంఖ్య ప్రతినెలా 7 - 8 రోజుల వరకు పెరిగే అవకాశముంది. దేశంలోకెల్లా అత్యంత ఉష్ణోగ్రత గల జిల్లాగా పరిగణించే మధ్యప్రదేశ్‌లోని బడవానీ జిల్లాలో గతేడాది ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్ దాటాయి.

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మండలా జిల్లాకు చెందిన బీజాడాండీ బ్లాకులో నివసించే మాలతీ యాదవ్ అనే మహిళ ఒకప్పుడు తమ చిన్నగ్రామంలో నీటిని విలాసవంతమైన వస్తువుగా భావించేవాళ్లమని గతాన్ని గుర్తు చేసుకున్నారు. "గ్రామంలో తీవ్రమైన నీటిసంక్షోభం ఉండేది. ఉదయాన్నే ఎవరు తొందరగా నిద్ర లేస్తే వాళ్లకే నీళ్లు.. మిగతావాళ్లకు కన్నీళ్లే" అన్నారు. బడవానీ జిల్లా రాజ్‌పుర్ బ్లాకులోని భాగ్‌సుర్ గ్రామంలో నివసించే సీమా నరాగ్వే మాట్లాడుతూ.. రాత్రి 9 – 10 గంటలైనా గోడల నుంచి మంటలు పుడుతున్నట్టుగా ఉండేదని చెప్పారు. మాలతి, సీమా మాత్రమే కాదు.. చాలా మంది గ్రామీణులు ఎదుర్కొన్న సమస్య ఇది. మళ్లీ మన మూలాల్లోకి తొంగి చూసి.. ఈ సంక్షోభానికి పరిష్కారం కూడా వారే వెదుక్కొన్నారు.

✦ నేడు.. మాలతి వంటి స్వయం సహాయక బృందానికి చెందిన స్థానిక మహిళలు నీటినిల్వకు చెక్‌డ్యాములు నిర్మించి, ఆరు గ్రామ చెరువులను పునరుద్ధరించారు. "ఇపుడు మేము వర్షపునీటిని నిల్వ చేసుకోగలుగుతున్నాం. తద్వారా గ్రామంలోని బోరుబావుల్లో భూగర్భజలాలు పెరిగాయి. వేసవిలోనూ నీటికి ఇబ్బంది లేదు" అని మాలతి సంతోషం వ్యక్తం చేశారు. అటు సీమా గ్రామస్థులు సైతం సంప్రదాయ గృహనిర్మాణ శైలికి మారి తమ సమస్యను అధిగమించారు. "మా ఇళ్ల మట్టిగోడలకు ఆవుపేడ పూశాం. ధారాళంగా వెలుతురు వచ్చేలా కంది కట్టెలతో కప్పిన చిన్న గదులను నిర్మించుకున్నాం. వేడి తీవ్రతకు గేదెలు పాలు ఇవ్వడం కూడా తగ్గిపోవడంతో వేపాకులు, నూలు వస్త్రాలతో పశువులకు చల్లదనం కల్పించాం" అని సీమా చెప్పారు.



✦ ఝార్ఖండ్‌లోని గఢవా జిల్లాలో కుంతీదేవి (40) లాంటి మహిళా రైతులు ఎండవేడి నుంచి రక్షణకు సూర్యోదయానికి ముందే లేచి పొలం పనులు ప్రారంభిస్తున్నారు. "పొలంలో ఉదయం పదింటికల్లా నాకు తల తిరుగుతుంది. ఎండ మరీ ఎక్కువైతే మజ్జిగ తాగి, చెట్ల నీడకు చేరి మితాహారం తీసుకొంటాం" అని కుంతీదేవి తెలిపారు.

✦ ఉత్తర్‌ప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతం తీవ్రమైన ఎండలకు, సాగు కష్టాలకు ప్రసిద్ధి. ఈ ప్రాంత రైతుల ఆలోచనా ధోరణి కూడా మారుతోంది. నీడనిచ్చేలా ఎత్తుగా పెరిగే రేగు, వేప, మామిడి వంటి చెట్ల పెంపకం వైపు వీరంతా మొగ్గు చూపుతున్నారు. కొంతమంది చిన్నాచితక రైతులకు ఈ మొక్కల కొనుగోలు కూడా భారమవుతోంది. ప్రభుత్వం రాయితీతో సరఫరా చేయాలని వీరు కోరుతున్నారు.

✦ మహారాష్ట్ర గ్రామీణులు ఇళ్లను చల్లగా ఉంచడానికి సత్తు రేకులపై మామిడి, మోదుగు చెట్ల ఆకులను పరుస్తున్నారు. వీరు అధికంగా పెంచే సీతాఫలం, మామిడిచెట్లతో వ్యాపార ప్రయోజనాలే కాకుండా నీడ కూడా పొందుతున్నారు. "అధిక జనాభా గల గ్రామాల్లోని ప్రజలు ఎక్కువగా ఆరుబయట మండుటెండల్లో పనిచేస్తుంటారు. వీరికి సరైన విశ్రాంతి వసతులు, విద్యుత్తు ఉండవు. వేడిగాలులతో అనారోగ్యం బారిన పడటమే కాకుండా ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల నివారణకు నీటి సంరక్షణను పెంచుకోవడం, సామాజిక భద్రత పథకాలకు ప్రాధాన్యం ఇవ్వడం పెరగాలి" అని 'ట్రాన్స్‌ఫామ్ రూరల్ ఇండియా' అసోసియేట్ డైరెక్టరు నీరజ అభిప్రాయపడ్డారు.



ఆదివారం ఐఐసీటీ, అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ (ఏఎస్‌టీసీ), నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా(ఎన్ఏఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ఐఐసీటీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఏఎస్‌టీసీ జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న నైపర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ అహ్మద్ కమాల్, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డి. రఘునాథరావు, డీఆర్‌డీవో ఆర్ఏసీ మాజీ ఛైర్మన్ డాక్టర్ డి.ఎన్.రెడ్డి (కుడి నుంచి ఎడమకు)

రాజపత్రం కోసం ఎదురుచూస్తున్నాం

• అవామీ లీగ్ పార్టీ రద్దు అంశంపై బంగ్లాదేశ్ ఈసీ

ఢాకా; దిల్లీ: బంగ్లాదేశ్‌లో మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీని రద్దు చేయడంపై ప్రభుత్వ నుంచి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నట్లు దేశ ఎన్నికల కమిషన్ (ఈసీ) ప్రకటించింది. ప్రభుత్వ ఉత్తర్వు వెలువడిన తర్వాత ఆ పార్టీ రిజిస్ట్రేషన్ రద్దుపై నిర్ణయం తీసుకుంటామని ఆదివారం వెల్లడించింది. "సోమవారం ప్రభుత్వ రాజపత్రం ప్రచురితం అయితే అవామీ లీగ్ రిజిస్ట్రేషన్ అంశంపై నిర్ణయానికి ముందు మేం చర్చ నిర్వహిస్తాం" అని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏఎంఎం నాసిర్ ఉద్దీన్ విలేకరులకు తెలిపారు. అవామీ లీగ్ రిజిస్ట్రేషన్‌ను ఈసీ రద్దు చేస్తే బంగ్లాదేశ్ చట్టం ప్రకారం డిసెంబరు 2025 - జూన్ 2026 మధ్య జరిగే అవకాశం ఉన్న సాధారణ ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేయడానికి అర్హత కోల్పోతుంది.

నిషేధాన్ని తిరస్కరించిన అవామీ లీగ్

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ తమ పార్టీని నిషేధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తిరస్కరిస్తున్నట్లు అవామీ లీగ్ ఆదివారం ప్రకటించింది. తమపై పరిమితులు విధించినప్పటికీ యథావిధిగా కార్యకలాపాలను కొనసాగిస్తామని స్పష్టం 'ఎక్స్'లో తెలిపింది. ప్రజల ఆమోదం లేకుండా దేశాన్ని పాలిస్తున్న ప్రభుత్వ నిర్ణయాన్ని అప్రజాస్వామిక నియంతృత్వ చర్యగా అభివర్ణించింది.

ఇజ్రాయెల్ దాడుల్లో 11 మంది మృతి

డెయిర్ అల్–బలా: గాజాలోని ఖాన్ యూనిస్ నగరంలో ఇజ్రాయెల్ నిర్వహించిన వైమానిక దాడుల్లో 11 మంది మృతి చెందారు. ఇందులో మహిళలు, చిన్నారులు ఉన్నారు. మరోవైపు 1982లో దక్షిణ లెబనాన్‌లో జరిగిన యుద్ధంలో చనిపోయిన తమ దేశ సైనికుడి మృతదేహాన్ని సిరియాలో కనుగొన్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మరోవైపు ఉక్రెయిన్, గాజాల్లో తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలని కొత్త పోప్ లియో-14 పేర్కొన్నారు.



శ్రీలంకలో బస్సు ప్రమాదం

• 21 మంది మృతి, 30 మందికి గాయాలు

కొలంబో: శ్రీలంకలోని కోట్మలేలో బస్సు లోయలో పడి 21 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 30 మంది గాయపడ్డారు. ప్రభుత్వ రవాణా సంస్థకి చెందిన బస్సు దక్షిణ యాత్రా స్థలం కటగరమ నుంచి వాయవ్య పట్టణం కురునెగలకు 75 మంది ప్రయాణికులను తీసుకెళ్తుండగా కొండచరియ నుంచి 100 మీటర్ల దూరంలో పడిపోయింది. సెంట్రల్ ప్రావిన్స్‌లోని కోట్మలే డ్రైవర్ ఎడమవైపునకు మలుపు తీసుకునే సమయంలో ఈ ప్రమాదం జరిగింది. శ్రీలంకలో నిర్లక్ష్యపు డ్రైవింగ్, అధ్వానంగా ఉన్న రహదారుల నిర్వహణ కారణంగా రోడ్డు ప్రమాదాలు సర్వ సాధారణంగా మారాయి.

భారత్ దాడి చేసింది.. లష్కరే పుట్టపైనే!

ఇంటర్నెట్‌డెస్క్: అమాయక ప్రజలు, ప్రార్థనామందిరాలపై భారత్ బాంబుల వర్షం కురిపించిందంటూ.. పాక్ ఎన్ని కబుర్లు చెప్పినా మురీద్కేలోని ఉగ్రపాములను దాచలేకపోతోంది. అక్కడి మర్కజ్ తయ్యిబా ప్రాంగణం వివిధ రకాల ఉగ్రమూకలను సాకే కేంద్రంగా నిలిచిందని పశ్చిమ దేశాల మీడియా సంస్థలు కోడై కూస్తున్నాయి. తాజాగా స్కైన్యూస్ బృందం వివిధ సోషల్ మీడియా వేదికల నుంచి సేకరించిన వీడియోలు, ఫొటోలు, కామెంట్లను విశ్లేషించి.. మురీద్కేలో భారత్ దాడి చేసింది లష్కరే ఉగ్రపుట్టపైనే అని తేల్చింది. దీనికి తోడు ఈ దాడి తర్వాత అల్‌ఖైదా ఉపఖండం శాఖ భారత్‌ను తప్పుపట్టడాన్ని కూడా చూపించింది. మురీద్కేలోని మర్కజ్ తయ్యిబాకు సంబంధించి టిక్‌టాక్, యూట్యూబ్, గూగుల్‌లలో పోస్టు చేసిన వీడియోలను స్కైన్యూస్ సేకరించింది. వాటిల్లో లష్కరే తయ్యిబాకు మద్దతుగా చాలా క్లిప్స్ ఉన్నాయి. అత్యధికంగా '313' అనే గ్రూపు పోస్టు చేసిన వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. ఈ వీడియోల జియోలొకేషన్లు చూడగా వాటిల్లో చాలా వరకు లష్కరే, 313 అనే క్యాప్షన్లు వచ్చాయి.

వీధుల్లో తుపాకులతో తిరుగుతున్న వ్యక్తులను ఓ వీడియోలో చూపించారు. దీనికి లష్కరే తయ్యిబా, ముజాహిద్ ఫోర్స్, 313, మర్కజ్ తయ్యిబా మురీద్కే అనే క్యాప్షన్లు ఉన్నాయి. మరో దానిలో పిల్లలు ఆయుధాలు వాడుతున్నట్లు చూపారు. అక్కడ కూడా '313 జిహాద్ అనే క్యాప్షన్ ఇచ్చారు. వీటిలో చాలా ఖాతాలకు పరస్పర సంబంధాలున్నాయి.

ఇక టెర్రరిజం రీసెర్చి అండ్ అనాలిసిస్ కన్సార్షియంకు చెందిన ముస్కాన్ సంగ్వాన్ స్పందిస్తూ.. 'బ్రిగేడ్ 313 అనేది పాక్‌లోని అల్ ఖైదా విభాగం. దీని ఛత్రం కింద తాలిబన్, లష్కరే జంగ్వీ, హర్కత్ ఉల్‌జిహాద్ అల్ ఇస్లామీ, జైషే మొహమ్మద్, లష్కరే తయ్యిబా, జుందుల్లా సంస్థలు ఉంటాయి. బ్యాటిల్ ఆఫ్ బద్ర్‌కు గుర్తుగా 313 పేరు పెట్టుకున్నారు. వీరిలో అత్యధిక మంది టిక్‌టాక్‌నే వినియోగిస్తారు' అని చెప్పారు. ఇక స్కైన్యూస్ భారత్ దాడికి ముందు, తర్వాత ఇక్కడ లొకేషన్లను విశ్లేషించగా.. యూజర్ పేరులో 313 అని ఉన్న ఒకరు భారత్ దాడి తర్వాత దెబ్బతిన్న భవనాల వీడియోను పోస్టు చేశారు. మురీద్కేలోని ఈ ఉగ్రవాదులు సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ.. రిక్రూట్‌మెంట్‌కు మరింత మందిని ఆకర్షిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ఈ అంశంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా మహమ్మద్ ఆసిఫ్‌ను స్కైన్యూస్ ప్రశ్నించగా.. ఈ టిక్‌టాక్ వీడియోలను నమ్మకమైన ఆధారాలుగా పరిగణిస్తానంటే అలాంటివి లక్షల్లో చూపిస్తానంటూ మాట్లాడారు.

1971 యుద్ధంలో ఇందిరాగాంధీ విఫలమయ్యారు

• అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ



గువాహటీ: మాజీ ప్రధాని ఇందిరాగాంధీపై అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తీవ్ర ఆరోపణలు చేశారు. 1971లో బంగ్లాదేశ్ ఏర్పడిన సమయంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయంగా సరిగా వ్యవహరించలేదని విమర్శించారు. అమెరికా జోక్యంతో భారత్-పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ శనివారం పేర్కొనడంతో ప్రధాని మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలోనే హిమంత బిశ్వ శర్మ ఆదివారం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ ఈ ఆరోపణలు చేశారు. "1971లో భారత సైన్యం వ్యూహాత్మకంగా పాకిస్థాన్‌ను ఓడించి ఘన విజయం సాధించింది. దాంతో పాకిస్థాన్ రెండుగా విడిపోయి బంగ్లాదేశ్ ఏర్పడింది. కానీ.. ఆ సమయంలో దీర్ఘకాలిక దేశ ప్రయోజనాలు సాధించడంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయంగా విఫలమయ్యారు. దాంతో ఓ చరిత్రాత్మక అవకాశం మనం కోల్పోయాం" అని పేర్కొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి రూ.20 వేలు చెల్లించండి

• మేధో సంపత్తి అథారిటీని ఆదేశించిన దిల్లీ హైకోర్టు

దిల్లీ: మేధో సంపత్తి హక్కు(ఐపీఆర్) కేసు విచారణను తరచుగా వాయిదా వేయాలని న్యాయవాది కోరడంతో సైనిక సంక్షేమ నిధికి రూ.20 వేలు చెల్లించాలని మేధో సంపత్తి అథారిటీ(పీటీఏ)ని దిల్లీ హైకోర్టు ఆదేశించింది. గతంలోనూ ప్రతివాది తరపు న్యాయవాది మూడు సార్లు వాయిదా కోరిన సందర్భాలు ఉన్నాయని అసహనం వ్యక్తం చేసిన జస్టిస్ సౌరభ్ బెనర్జీ రూ. 20 వేల మొత్తాన్ని నాలుగు వారాల్లోగా సైనిక సంక్షేమ నిధికి జమ చేయాలని ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. "ప్రతివాది తరపు న్యాయవాది గతంలో మూడు సార్లు విచారణ వాయిదా వేయాలని కోరారు. ఇలా చేయడం కోర్టు సమయాన్ని వృథా చేయడమే. కేసు తదుపరి విచారణను ఆగస్టు 6కు వాయిదా వేస్తున్నాం. దీనికిగానూ నాలుగు వారాల్లోగా సైనిక సంక్షేమ నిధికి రూ. 20 వేలు చెల్లించండి" అంటూ మేధో సంపత్తి అథారిటీని న్యాయస్థానం ఆదేశించింది.